
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 24
బుధవారం 16-4-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'



111తోనే పంజాబ్ పండుగ
తక్కువ లక్ష్యాన్ని కాపాడుకొని కోల్‌కతాపై నెగ్గిన పంజాబ్ కింగ్స్ -14లో



సెన్సెక్స్‌ప్రెస్
ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై ట్రంప్ సుంకాల మినహాయింపు ఫలితం.. -15లో




తమిళనాడుకు స్వయం ప్రతిపత్తి!
కేంద్రం పెత్తనాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడుకు స్వయంప్రతిపత్తి (అటానమీ) సాధించే దిశగా సీఎం స్టాలిన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు.
వివరాలు 6లో ▸



ఈసారి వానలే వానలు..
ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ ప్రకటించింది.
వివరాలు 6లో ▸



ట్రంప్‌కు కీలెరిగి వాత
అరుదైన ఖనిజాల ఎగుమతుల నిలిపివేత ద్వారా అమెరికాను చైనా నేరుగా కుంభస్థలం పైనే కొట్టిందని పరిశీలకులు అంటున్నారు.
వివరాలు 6లో ▸



పిల్లలు కిడ్నాపైతే..
ఏదైనా ఆస్పత్రి నుంచి పసికందు అపహరణకు గురైతే ఆ ఆస్పత్రి లైసెన్స్‌ను రద్దుచేయాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.
వివరాలు 6లో ▸

మన పథకాలతో
మోదీ ఉక్కిరిబిక్కిరి

కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

మన కులగణన రాజకీయంగా మోదీకి మరణశాసనం

- కులగణన గేమ్ ఛేంజర్ అయ్యింది..
- బిహార్ ఎన్నికల్లో కీలకపాత్ర పోషించబోతోంది
- కంచ గచ్చిబౌలి భూములపై అంతా కలిసి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు
- కిషన్‌రెడ్డికి కేటీఆర్ చెప్పాడు.. కిషన్‌రెడ్డి అమిత్ షాకు చెప్తే, ఆయన మోదీకి చెప్పాడు
- మోదీ బుల్డోజర్లు, జేసీబీలకు తేడా తెలియదన్నట్టు మాట్లాడుతున్నారు
- మంత్రివర్గ విస్తరణను అధిష్టానం ఫ్రీజ్ చేసిందన్న ముఖ్యమంత్రి
- ఐదు కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలని పిలుపు



సీఎల్పీ సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొంగులేటి, జూపల్లి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్

'మన ప్రభుత్వానికి మంచి పేరు, సాఫీగా నడిచే విధంగా ఆదాయం రావడం బీఆర్‌ఎస్, బీజేపీలకు ఇష్టం లేదు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ఆ రెండు పార్టీలు కలిసి చేసిన కుట్రలే ఇందుకు నిదర్శనం. మనం కోర్టులో గెలిచి ఆ భూములను తీసుకువచ్చాం. మొత్తం 2,200 ఎకరాల్లో మన ప్రభుత్వం క్లెయిమ్ చేస్తోంది 400 ఎకరాలే. మిగిలిన భూముల జోలికి వెళ్లడం లేదు. ఆ 400 ఎకరాల్లో ఐటీ టవర్స్ నిర్మించే ఆలోచనలో ఉన్నాం. అలా జరిగితే రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతుంది. ఉద్యోగాలు కూడా వస్తాయి. ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. ఈ విషయాన్ని కేటీఆర్ స్వయంగా కిషన్‌రెడ్డికి చెప్పాడు. కిషన్‌రెడ్డి అమిత్‌షాకు చెపితే అమిత్‌షా మోదీకి చెప్పాడు. మన పథకాలు ప్రధానిని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. దీంతో ఆయన రంగంలోకి దిగారు. బుల్డోజర్లు, జేసీబీలకు తేడా తెలియదన్నట్టు మాట్లాడుతున్నారు. అందరూ కలిసి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. దేశంలో గుజరాత్ మోడల్ పోయింది. తెలంగాణ మోడల్ ప్రచారంలోకి వస్తోంది. ముఖ్యంగా కులగణన గేమ్ ఛేంజర్ అయింది. రేపు జరిగే బిహార్ ఎన్నికల్లో ముఖ్యపాత్ర పోషించబోతోంది. ప్రధాని మోదీకి ఇది రాజకీయంగా మరణశాసనం కాబోతోంది..' అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో
మిగతా 2వ పేజీలో ▶

నేషనల్ హెరాల్డ్ కేసు...



సోనియా, రాహుల్‌పై చార్జిషీట్

- ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో దాఖలు చేసిన ఈడీ
- చార్జిషీట్‌పై 25న విచారణ
- రూ. 2,000 కోట్ల ఆస్తులను కాజేయడానికి కుట్ర జరిగిందన్న ఈడీ
- ప్రభుత్వానివి కక్ష సాధింపు చర్యలని కాంగ్రెస్ మండిపాటు..
- నేడు ఈడీ కార్యాలయాల ఎదుట నిరసనలకు పిలుపు

సంచలనం సృష్టించిన నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్ కేసులో కీలక పరిణామం.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు, ఎంపీలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతోపాటు ఇతర నిందితులపై ఈడీ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో సోనియా, రాహుల్‌ను ఈడీ గతంలో పలుమార్లు విచారించింది. వారిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడం మాత్రం ఇదే మొదటిసారి. ఇందులో నంబర్–1గా సోనియా, నంబర్–2గా రాహుల్ పేర్లను ప్రస్తావించింది. 6లో



ఈడీ విచారణకు రాబర్ట్ వాద్రా

- మనీ లాండరింగ్ కేసులో ప్రశ్నించిన అధికారులు
- పీఎంఎల్‌ఏ కింద వాద్రా స్టేట్‌మెంట్ రికార్డు
- తమను అణచివేయడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని వాద్రా మండిపాటు

6లో

న్యూస్‌రీల్

'కృష్ణా'లో ఏపీ వాడకం 72.2%



ప్రస్తుత నీటి సంవత్సరంలో ఏపీ, తెలంగాణ మొత్తం 990.38 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించుకోగా, అందులో ఏకంగా 72.2 శాతం (715.03 టీఎంసీలు) ఏపీ వాడుకుంది. తెలంగాణ 275.35 టీఎంసీల (27.8 %) ను మాత్రమే వినియోగించుకోగలిగింది.
- వివరాలు 3లో▶

'సీతారామ' పటిష్టత అధ్యయనానికి కమిటీ



సీతారామ–సీతమ్మసాగర్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్ని కట్టడాలపై సమగ్ర అధ్యయనం జరిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం సీడీఓ సీఈ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది.
- వివరాలు 3లో▶

ఇప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ చిత్తే



రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ చిత్తుచిత్తుగా ఓడిపోయే పరిస్థితులున్నాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రేవంత్ ప్రభుత్వం ఐదేళ్లూ కొనసాగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.
- వివరాలు 2లో▶

రైళ్లు..ఇలా మళ్లింపు..



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను దృష్టిలో ఉంచుకొని ప్లాట్‌ఫామ్‌ల మూసివేత, రైళ్ల మళ్లింపు చర్యలు చేపట్టనున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. 120 రోజులు రైళ్ల రాకపోకలపై ఆంక్షలు కొనసాగే అవకాశం ఉంది.
- వివరాలు 16లో▶

మన పోలీసింగ్
అదుర్స్..

దేశంలోనే మొదటిస్థానంలో తెలంగాణ

10కి 6.48 మార్కులతో టాప్‌లో..

రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్

- అట్టడుగున పశ్చిమ బెంగాల్ పోలీస్
- ఓవరాల్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలో రాష్ట్రం
- ఇండియన్ జస్టిస్ రిపోర్ట్–2025 వెల్లడి



సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో రాష్ట్ర పోలీసులు సత్తా చాటారు. అత్యుత్తమ పోలీసింగ్‌కు సంబంధించి ఇండియన్ జస్టిస్ రిపోర్ట్–2025 ర్యాంకింగ్‌లో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచింది. ఏపీ రెండో స్థానంలో ఉంది. అత్యుత్తమ పోలీసింగ్‌కు 10 మార్కుల ప్రాతిపదికన తెలంగాణ 6.48 మార్కులతో టాప్‌లో నిలవగా, 3.36 మార్కులతో పశ్చిమ బెంగాల్ అట్టడుగున నిలిచింది. పోలీస్, న్యాయవ్యవస్థ, జైళ్లశాఖ, లీగల్ ఎయిడ్ పనితీరుపై ఇండియన్ జస్టిస్ రిపోర్ట్ (ఐజేఆర్) 2019 నుంచి ప్రతి ఏటా నివేదిక విడుదల చేస్తోంది. ఈ క్రమంలో తాజా రిపోర్టు మంగళవారం విడుదలైంది. అత్యుత్తమ పోలీసింగ్‌లో తొలి స్థానాన్ని దక్కించుకున్న తెలంగాణ..పోలీస్, న్యాయవ్యవస్థ, జైళ్లశాఖ, లీగల్ ఎయిడ్
మిగతా 5వ పేజీలో ▶

మూడు నెలలుగా
జీతాల్లేవ్



సాక్షి, హైదరాబాద్

ఉపాధి హామీ సిబ్బంది, ఉద్యోగుల ఆవేదన

స్పర్శ్‌లో సాఫ్ట్‌వేర్ల అనుసంధానం అవ్వక అందని వేతనాలు

సాంకేతిక సమస్యలు అధిగమించడానికి అధికారుల తంటాలు

నెల జీతం నాలుగు రోజులు ఆలస్యమైనా బతుకు బండి గాడితప్పే ఈ రోజుల్లో.. ప్రభుత్వ సేవలో ఉన్న 14 వేలమంది మూడు నెలలుగా వేతనాలు లేక విలవిలలాడుతున్నారు. వేతనాలకు సంబంధించిన నిధులు అందుబాటులో ఉన్నా.. సాంకేతిక సమస్య కారణంగా జీతాలు ఇవ్వలేని పరిస్థితి తలెత్తింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది, ఉద్యోగులకు గత మూడు నెలలుగా జీతాలు రావటం లేదు. వీరిలో 3,800 మంది ఫిక్స్‌డ్ టెన్యూర్ ఉద్యోగులు (టీఏలు, ఏపీవోలు, ఈసీలు, సీవోలు), 2,000 మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, 7,600 మంది ఫీల్డ్ అసిస్టెంట్లతోపాటు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో (డీఆర్‌డీవోలు, అదనపు పీడీలు, ఏపీడీలు, హెడ్ ఆఫీస్‌లో పనిచేసే సీఎఫ్‌వోలు,
మిగతా 2వ పేజీలో ▶

పెండింగ్ వేతనాలివ్వాలి

వెంటనే మూడునెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలి. మా వేతనం పెంచుతామని, ఉద్యోగభద్రత కల్పిస్తామన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీని ప్రభుత్వం నెరవేర్చాలి. నిబంధనలకు విరుద్ధంగా ప్రతి గ్రామపంచాయతీలో పది మందికి తగ్గకుండా కూలీలను తీసుకురావాలంటూ రాష్ట్రస్థాయి అధికారులు టార్గెట్ పెడుతున్నారు. ఈ పని చేయకపోతే విధుల్లోంచి తొలగించాలని కలెక్టర్లకు ఆర్డర్లు వేస్తున్నారు. మాకు హక్కులు లేకుండా పోయాయి.

నారాయణ గౌడ్
ఫీల్డ్ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి



కోటి మంది మహిళల్ని కోటీశ్వరుల్ని చేస్తాం

మా ప్రభుత్వం ఆ లక్ష్యంతోనే పనిచేస్తోంది

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

స్త్రీ సమ్మిట్ 2.0కి ముఖ్యఅతిథిగా హాజరు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కోటి మంది మహిళల్ని కోటీశ్వరులుగా చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఈ దిశలో ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. నగరంలో మహిళల భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్‌తో (హెచ్‌సీఎస్‌సీ) కలిసి నగర పోలీసులు మంగళవారం నిర్వహించిన 'స్త్రీ'(షీ ట్రంప్స్ త్రూ రెస్పెక్ట్, ఈక్వాలిటీ అండ్ ఎంపవర్‌మెంట్) సమ్మిట్ 2.0కు భట్టి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బంజారాహిల్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, నీతి ఆయోగ్ సీనియర్ స్పెషలిస్ట్ డాక్టర్ భానుశ్రీ వెల్పాండియన్, ప్రముఖ క్రీడాకారిణి నైనా జైశ్వాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. 'స్త్రీలకు సమాన హక్కులు కల్పించిన, రాజ్యాంగానికి రూపమిచ్చిన బీఆర్ అంబేడ్కర్ జయంతి మరుసటి రోజే ఈ సదస్సు నిర్వహించుకుంటున్నాం. తెలంగాణలో ఉన్న ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు అన్ని రకాలైన సాధికారత కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. మహిళా సంఘాలకు ప్రభుత్వం ఏటా రూ.20 వేల కోట్ల
మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ప్రతి దరఖాస్తుకు ఒక డెడ్‌లైన్

భూమి రిజిస్ట్రేషన్‌తోపాటే రికార్డుల మార్పిడి, పాసుపుస్తకం

తహసీల్దార్లకు సుమోటోగా పాసుపుస్తకాలు జారీచేసే అధికారం

భూభారతి మార్గదర్శకాలు జారీచేసిన ప్రభుత్వం

సాదా బైనామాల పరిష్కారానికి గడువు..	90 రోజులు
రికార్డుల్లో తప్పొప్పుల పరిష్కారానికి...	60 రోజులు
వారసత్వ భూములపై నిర్ణయానికి..	30 రోజులు

9 లక్షల సాదాబైనామా దరఖాస్తులకు మోక్షం





సాక్షి, హైదరాబాద్

ధరణి స్థానంలో కొత్తగా అమల్లోకి వచ్చిన భూభారతి పోర్టల్‌లో వచ్చే ప్రతి దరఖాస్తు పరిష్కారానికి ప్రభుత్వం నిర్ణీత గడువు విధించింది. ఈ పోర్టల్‌లో భూమి రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే ఆ భూమికి సంబంధించిన పాసుబుక్కు జారీ, భూమి క్రయవిక్రయ వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో మార్చటం వంటి అనేక వివరాలతో భూ భారతి చట్టం మార్గదర్శకాలను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. మార్గదర్శకాలతో పాటు చట్టం అమలును గెజిట్ చేస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ జీవో నం: 36, 39లను విడివిడిగా జారీ చేశారు. జీవో 36 ప్రకారం భూభారతి చట్టం ఏప్రిల్ 14, 2025 నుంచి రాష్ట్రంలో అమల్లోకి వచ్చింది. జీవో 39 ప్రకారం చట్టం మార్గదర్శకాలను విడుదల చేశారు. వీటిని తెలంగాణ భూభారతి నిబంధనలు (రికార్డ్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్)– 2025గా పిలుస్తారు. చట్టం అమల్లో ఉన్న అన్ని ప్రాంతాల్లో ఈ నిబంధనలు వర్తిస్తాయి.

రికార్డుల తయారీ

ఈ చట్టం కింద ప్రతి గ్రామంలో ఉన్న అన్ని రకాల భూములకు సంబంధించిన రికార్డుల తయారీ, మార్పు చేర్పులు, నిర్వహణ జరుగుతుంది. ఎప్పటికప్పుడు ఈ రికార్డులను భూభారతి పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతారు. ఆబాదీతో పాటు వ్యవసాయేతర భూములను సర్వే చేయడం ద్వారా ఆయా భూముల హద్దులను అక్షాంశాలు, రేఖాంశాలు ఆధారంగా నిర్ధారించి మ్యాపులు రూపొందించాల్సి ఉంటుంది. వ్యవసాయ, ఆబాదీ, వ్యవసాయేతర భూముల రికార్డుల తయారీ, నిర్వహణ కోసం ప్రభుత్వం ఎప్పుడైనా నోటిఫికేషన్ జారీచేసి మార్పులు, చేర్పులు చేయవచ్చు.

దరఖాస్తు చేసిన 60 రోజుల్లో పరిష్కారం

తమ భూ రికార్డుల్లో తప్పులు నమోదైనా, హక్కుల రికార్డులో వివరాలు లేకపోయినా సంబంధిత వ్యక్తి ఈ చట్టం అమల్లోకి వచ్చిన సంవత్సరంలోపు నిర్దేశిత ఫీజు చెల్లించి భూభారతి పోర్టల్ ద్వారా
మిగతా 12వ పేజీలో ▶



ఈసీ తీరు అనుమానాస్పదం

- ఓటర్ల డేటా ఎందుకివ్వరు?
- మండిపడ్డ పార్టీలు, సంస్థలు
- ఈసీ ప్రతినిధులతో సమావేశం
- ఈవీఎంలపై అన్నీ అనుమానాలే
- ట్యాంపరింగ్ జరుగుతున్నట్టు ఆరోపణలు.. పోలింగ్ శాతాల్లోనూ అనూహ్య తేడాలు
- రాత్రికల్లా భారీగా పెరుగుతున్నాయి
- ఈసీ విశ్వసనీయతకే పెనుసవాలు
- ఏ ప్రశ్నకూ భేటీలో బదుల్లేదు: సీనియర్ అడ్వొకేట్ ప్రశాంత్ భూషణ్
- సుప్రీంకోర్టుకు నివేదిస్తామని వెల్లడి

16లో

జపాన్ పర్యటనకు సీఎం రేవంత్‌రెడ్డి

16–22 వరకు జపాన్‌లో విస్తృత పర్యటన

పెట్టుబడులు, సాంకేతిక సహకారంపై పలు కంపెనీలతో సమావేశాలు

నేడు ఒసాకా వరల్డ్ ఎక్స్‌పో–2025లో తెలంగాణ పెవిలియన్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో పెట్టుబడులను ఆహ్వానించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటనకు వెళ్లారు. ఆయన నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం రాత్రి బెంగళూరు నుంచి జపాన్‌కు బయలుదేరి వెళ్లింది. ఈ బృందంలో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఉన్నారు. ఈ నెల 16 నుంచి 22 వరకు జపాన్‌లోని టోక్యో, మౌంట్ ఫుజి, ఒసాకా, హిరోషిమాలో ఆ బృందం పర్యటించనుంది. ఒసాకా వరల్డ్ ఎక్స్‌పో–2025లో తెలంగాణ పెవిలియన్‌ను సీఎం ప్రారంభిస్తారు. ఆ దేశానికి చెందిన ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక వేత్తలు, పలువురు ప్రతినిధులతో ముఖ్యమంత్రి బృందం సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులు, పారిశ్రామిక సాంకేతిక సహకారంపై చర్చించనున్నారు. 16న టోక్యో చేరుకుని అక్కడి భారత రాయబారి ఇచ్చే ఆతిథ్య సమావేశంలో రేవంత్ పాల్గొననున్నారు. 17న ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సోనీ గ్రూప్, జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ, జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ కార్పొరేషన్, జపాన్ బయో ఇండస్ట్రీ అసోసియేషన్ తదితర సంస్థలతో సమావేశంకానున్నారు. సాయంత్రం తోషిబా ఫ్యాక్టరీని సందర్శిస్తారు.

18న టొయోటా, తోషిబా సీఈవోలతో భేటీ

సీఎం రేవంత్‌రెడ్డి 18న టోక్యోలో గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తారు. టోక్యో గవర్నర్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమవుతారు. అనంతరం ఇండియన్ ఎంబసీ ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్తలతో నిర్వహించే భేటీలో సమావేశమవు తారు. టొయోటా, తోషిబా, ఐసిన్, ఎన్టీటీ వంటి ప్రఖ్యాత కంపెనీల సీఈవోలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహిస్తా రు. జపాన్ ఓవర్సీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొ రేషన్ ఫర్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రతినిధులతో చర్చలు జరుపుతారు. అనంతరం సుమిదా రివర్ ఫ్రంట్‌ను సందర్శిస్తారు. 19న టోక్యో నుంచి బయలుదేరి మౌంట్ ఫుజి, అరకురయామా పార్క్‌ను సందర్శిస్తారు. 20న కిటాక్యూషు సిటీకి చేరుకుని అక్కడి మేయర్‌తో సమావేశమై ఎకో టౌన్ ప్రాజెక్టుకు సంబంధించి చర్చిస్తారు. మురసాకి రివర్ మ్యూజియం, ఎన్విరాన్‌మెంట్ మ్యూజియం, ఎకో టౌన్ సెంటర్‌ను సందర్శిస్తారు. 21న ఒసాకా చేరుకుని యుమెషిమాలో వరల్డ్ ఎక్స్‌పోలో తెలంగాణ పెవిలియన్‌ను ప్రారంభించి బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం ఒసాకా రివర్ ఫ్రంట్‌ను సందర్శిస్తారు. 22న ఒసాకా నుంచి హిరోషిమా చేరుకుని అక్కడి పీస్ మెమోరియల్‌ను సందర్శించి గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తారు. హిరోషిమా వైస్ గవర్నర్, అసెంబ్లీ చైర్మన్‌తో సమావేశాలు జరుపుతారు. హిరోషిమా జపాన్–ఇండియా చాప్టర్‌తో బిజినెస్ లంచ్‌లో పాల్గొంటారు. హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మజ్దా మోటార్స్ ఫ్యాక్టరీని సందర్శిస్తారు. అనంతరం ఒసాకా నుంచి బయలుదేరి 23న ఉదయం హైదరాబాద్‌కు చేరుకుంటారు.

మన పథకాలతో మోదీ ఉక్కిరిబిక్కిరి



మంగళవారం సీఎల్పీ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి శ్రీధర్‌బాబు

భారత్ సమ్మిట్‌కు రాహుల్, ప్రియాంక

'మంత్రివర్గ విస్తరణను రిజర్వుడ్ ఫర్ జడ్జిమెంట్ తరహాలో అధిష్టానం ఫ్రీజ్ చేసింది. ఎవరేం చెప్పుకోవాలన్నా హైకమాండ్‌కు చెప్పుకోవాలి. భువనగిరి ఎంపీ కిరణ్‌రెడ్డి తను వెళ్లిన చోటల్లా ఒక మంత్రిని ప్రకటిస్తున్నాడు. అది సరైంది కాదు. అద్దంకి దయాకర్ చాలా ఓపికగా వెయిట్ చేశాడు. పార్టీ లైన్‌లో పనిచేశాడు. అవకాశం వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెలలో నిర్వహించే భారత్ సమ్మిట్‌కు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీలు వస్తున్నారు. అంతర్జాతీయ ప్రతినిధులు కూడా వస్తారు. పీసీసీ అధ్యక్షుడు ఈ కార్యక్రమాన్ని నిర్వహించే బాధ్యతను మంత్రులకివ్వాలి..' అని సీఎం చెప్పారు.

▶ మొదటి పేజీ తరువాయి

జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్షం (సీఎల్పీ) సమావేశంలో ఆయన మాట్లాడారు.

కళ్లు కుడుతున్న ప్రతిపక్షాలను కట్టడి చేయాలి

'సన్న బియ్యం, ఎస్సీల వర్గీకరణ, కులగణన, భూభారతి, ఇందిరమ్మ ఇళ్లు లాంటి అద్భుత కార్యక్రమాలతో ముందుకెళుతున్న రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయి. కళ్లు కుడుతున్న ప్రతిపక్షాలను కట్టడి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

మీరు మళ్లీ గెలవాలంటే ఏం కావాలో అడగండి

ఎవరైనా సరే పార్టీ లైన్‌కు కట్టుబడి ఉండాలి. నేనైనా, డిప్యూటీ సీఎం భట్టి అయినా పార్టీ చెప్పిన మేరకే పనిచేస్తాం. ప్రభుత్వంతో పాటు పార్టీ బలంగా ఉంటేనే మరోసారి గెలుస్తాం. మీరు రెండోసారి గెలవాలంటే మీ నియోజకవర్గంలో ఏం కావాలో నివేదిక తయారు చేసుకోండి. అవసరమైతే కన్సల్టెంట్‌ను పెట్టుకోండి. మే 1 నుంచి మీకు అందుబాటులో ఉంటా. మీ నివేదికలు నాకివ్వండి. నేను కూడా వెరిఫై చేసుకుని నిధులు కేటాయిస్తా. మీ నియోజకవర్గాలకు వస్తా. పాదయాత్రలా, కార్నర్ మీటింగ్‌లా, బహిరంగ సభలా.. ఏం పెడతారో మీ ఇష్టం. ఈ విషయంలో డిప్యూటీ సీఎం, పీసీసీ అధ్యక్షుడు కార్యాచరణ ఇస్తారు.

జూన్ 2 నుంచి జనాల్లోకి వస్తా..

నేను కూడా జూన్ 2 నుంచి జనాల్లోకి వస్తా. మన ప్రభుత్వం ఏం చేస్తోందో ప్రజలకు వివరిద్దాం. సన్న బియ్యం పథకంతో ప్రభుత్వానికి ప్రజల్లో మంచి పేరు వస్తోంది. సన్నబియ్యం కాంగ్రెస్ పార్టీ పథకం. ఇది పేటెంట్, మన బ్రాండ్. సన్న బియ్యంతో పాటు ఎస్సీల వర్గీకరణ, కులగణన, భూభారతి, ఇందిరమ్మ ఇళ్లు కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఈ విషయంలో ఇన్‌చార్జి మంత్రులు కీలక పాత్ర పోషించాలి. పార్టీ ప్రతిష్టను ఎవరూ దెబ్బతీయొద్దు..' అని రేవంత్ అన్నారు.

అవి వారి అస్తిత్వానికే ప్రమాదం: డిప్యూటీ సీఎం భట్టి

రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. సంక్షేమం ఒక ఎత్తయితే ఎస్సీల వర్గీకరణ, బీసీల కులగణన కార్యక్రమాలను గొప్ప గొప్ప నాయకులే చేయలేకపోయినా, తెలంగాణ ప్రభుత్వం ధీరోదాత్తంగా చేసిందని అన్నారు. ఇవి బీఆర్‌ఎస్, బీజేపీలను కట్టి మూలన పడేస్తాయని, వారి అస్తిత్వానికే ప్రమాదంగా మారనున్నాయని వ్యాఖ్యానించారు. సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు సీఎం చెక్కులు అందజేశారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలు విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్‌లను అభినందించారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావులతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులు కూడా హాజరయ్యారు.

బెంబేలెత్తించిన లిఫ్ట్

సీఎల్పీ సమావేశం జరిగే రెండో అంతస్తుకు వెళ్లేందుకు గాను సీఎంతో పాటు పలువురు నేతలు లిఫ్ట్ ఎక్కారు. రెండో అంతస్తుకు వెళ్లిన ఆ లిఫ్ట్ అకస్మాత్తుగా మళ్లీ వేగంగా కిందకు వచ్చింది. దీంతో గాభరాపడిన వారంతా మరో లిఫ్ట్‌లో సమావేశ హాలుకు వెళ్లారు.

మొదట మీ ఇల్లు చక్కదిద్దుకోండి

మీ మంత్రులు, ఎమ్మెల్యేలే మీ కంట్రోల్‌లో లేరు

రేవంత్ సర్కార్‌పై కొత్త ప్రభాకర్‌రెడ్డి హాట్ కామెంట్స్



దుబ్బాక: 'మీ ఎమ్మెల్యేలను కొనాల్సిన అగత్యం మాకు పట్టలేదు.. మీకు మీ ఎమ్మెల్యేల మీద నమ్మకం లేకనే మా (బీఆర్‌ఎస్) పార్టీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలను గుంజుకుండ్రు.. ముందు మీ మంత్రులు, ఎమ్మెల్యేలను కంట్రోల్‌లో ఉంచుకొని మీ ఇల్లు చక్కదిద్దుకోవాలి' అని కాంగ్రెస్ ప్రభుత్వంపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ బుల్డోజర్ ప్రభుత్వాన్ని సామాన్య ప్రజల నుంచి దేశ ప్రధాని వరకు ఈసడించుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ కుంటుపడిపోయిందని, ఆపదొస్తే నాలుగు గుంటలు అమ్ముకుందామంటే ఎవరూ కొంటలేరని చెప్పారు. అనుకున్న పనులు కావడం లేవని ఈ ప్రభుత్వం పోతే బాగుండు అని సామాన్య ప్రజలతో పాటు పారిశ్రామిక వేత్తలు, రియల్టర్లు, రైతులు కోరుకుంటున్నారని అన్నారు. నాతో పాటు మీ మంత్రులు, ఎమ్మెల్యేలకు కూడా నార్కో ఎనాలసిస్ పరీక్షలు నిర్వహించాలన్నారు. కేసీఆర్ రుబాబుగా పాలన చేసిండు... మీలాగా డైవర్షన్ రాజకీయాలు చేయలేదన్నారు. కేసీఆర్ మాకు సంస్కారం నేర్పిండు, మంచి చేస్తే శభాష్ అంటాం.. చెడు చేస్తే విమర్శిస్తామన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చిన బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని ప్రభాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

కూలుస్తామంటే చేతులు కట్టుకుని కూర్చోం

ప్రభుత్వాన్ని కూలుస్తామని చెప్పిన వ్యక్తి కేసీఆర్ ఆత్మ

- కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలపై మంత్రులు, పీసీసీ చీఫ్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్‌: ఎమ్మెల్యేలను కొనుక్కునైనా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాలని తమపై ఒత్తిడులు వస్తున్నాయంటూ దుబ్బాక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రులు, కాంగ్రెస్ నేతలు ధ్వజమెత్తారు. కూలుస్తామంటే తాము చేతులు కట్టుకుని కూర్చోమని ప్రశ్నించారు. మంగళవారం నోవాటెల్ హోటల్‌లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఐదేళ్లే కాదని.. రానున్న మరో ఐదేళ్లు కూడా కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని చెప్పారు. భూభారతి అమల్లోకి తేవడంతో వారికి భయం పట్టుకుందని, వారి అక్రమాలు ఎక్కడ బయటకు వస్తాయోననే భయం బీఆర్‌ఎస్ నేతల్లో కనిపిస్తోందని చెప్పారు. ఈ వ్యాఖ్యలు చేసిన ప్రభాకర్‌రెడ్డి కేసీఆర్ ఆత్మ అని, ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలో భాగంగానే ఈ వ్యాఖ్యలు చేశారని దుయ్యబట్టారు. బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభాకర్‌రెడ్డిది ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం అనుకున్నానని, ఆయన ఈ మధ్య జ్యోతిషం కూడా చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వమంటే బీఆర్‌ఎస్‌లోని ఆ నలుగురు నాయకులకు కళ్లమంట అని అన్నారు. అందుకే పిల్లి శాపాలు పెడుతున్నారని, ఆ శాపనార్థాలకు ప్రభుత్వం పడిపోదని అన్నారు.

ప్రభుత్వ పెద్దలతో చర్చించి నిర్ణయం: పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

చోటా మోటా కాంట్రాక్టర్లు కూల్చే ప్రభుత్వం తమది కాదని, అయినా వారు ప్రభుత్వాన్ని కూలిస్తే తాము ఊరుకుంటామా అని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. తమ ప్రభుత్వానికి ఎమ్మెల్యేల సంపూర్ణ మద్దతు ఉందని, ఇలాంటి చోటా బ్యాచ్‌కు తాము భయపడేది లేదన్నారు. బీఆర్‌ఎస్ నేతలకు ఎమ్మెల్యేలంటే కనీస గౌరవం లేదని, సంతలో వస్తువులుగా ఎమ్మెల్యేలను చూస్తున్నారని కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలే నిరూపిస్తున్నాయన్నారు. ప్రభుత్వ పెద్దలతో చర్చించి ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలపై తగు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రభాకర్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలంటూ టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ తదితరులు బేగంబజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ చిత్తే

రాష్ట్ర ప్రభుత్వాన్ని కూలగొడితే బీజేపీకేం లాభం?

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు అసదుద్దీన్ ఒవైసీనే బిగ్‌బాస్
- ఆ పార్టీలతో బీజేపీకి దోస్తీ ఉందన్నవాళ్లను చెప్పుతో కొట్టండి
- మీడియా చిట్‌చాట్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ చిత్తుచిత్తుగా ఓడిపోయే విధంగా క్షేత్రస్థాయి పరిస్థితులున్నాయని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. 'తొందరపడి తెలంగాణలో ప్రభుత్వాన్ని కూలగొట్టం. సర్కార్‌కు ఇంకా మూడున్నరేళ్లకు పైగా గడువు ఉంది. ఇక్కడ ప్రభుత్వాన్ని కూలగొడితే బీజేపీకి లాభం ఎంటి? ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని అందరికీ తెలుసు'అని వ్యాఖ్యానించారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ... భూముల విక్రయం, అప్పులు చేయడం, మద్యం అమ్మడం ద్వారానే ఆదాయం సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన పనే ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ చేస్తోందని మండిపడ్డారు.

కేసులు ఎదుర్కొనేందుకూ సిద్ధం

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చెట్ల కూల్చివేత, భూమి చదునుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పలు ఉల్లంఘనలకు పాల్పడిందని కిషన్‌రెడ్డి విమర్శించారు. అర్ధరాత్రి ఫ్లడ్‌లైట్లు పెట్టి చెట్లు నరికిన పరిస్థితి గతంలో ఎక్కడా జరగలేదని, ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తూ ప్రధాని మోదీ విమర్శిస్తారా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ అంశంలో ఎవరో ఏఐతో చేసిన నకిలీ ఫొటోలు సోషల్‌మీడియాలో పెట్టారని మాట్లాడడం సిగ్గుచేటని మండిపడ్డారు. హెచ్‌సీయూ అంశంపై గతంలో తాను ట్విట్టర్‌లో పెట్టిన పోస్ట్‌కు కట్టుబడి ఉన్నానని, ఈ విషయంలో కేసులు ఎదుర్కొనేందుకు కూడా సిద్ధమేనని ప్రకటించారు. ఈ భూముల విక్రయం వెనక బీజేపీ ఎంపీ ఉంటే, అతడి పేరు బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు అసదుద్దీన్ బిగ్‌బాస్

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ బిగ్‌బాస్ అని, ఆయనే ఈ రెండు పార్టీలను నియంత్రిస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఈ నెల 19న వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో భూబకాసురులు నిరసనలు నిర్వహిస్తున్నారని ఎంఐఎం సభను ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. ముస్లింల ప్రార్థనా మందిరాలకు వక్ఫ్ బోర్డుకు సంబంధం లేదని పేర్కొన్నారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీనే గెలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఇతర కార్పొరేటర్లను కూడా కలిసి ఓట్లు అడుగుతామని తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో జనసేన, టీడీపీతో కలిసి పోటీచేసే ఆలోచనే లేదని స్పష్టంచేశారు. ఒంటరిగానే పోటీచేసి మేయర్ స్థానాన్ని కైవసం చేసుకుంటామని తెలిపారు. ఇకపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లతో బీజేపీకి దోస్తీ ఉందని ఎవరైనా అంటే చెప్పుతో కొట్టాలని ప్రజలకు సూచించారు.

3 నెలలుగా జీతాల్లేవ్

▶ మొదటి పేజీ తరువాయి

ఇతర ఉద్యోగులు, సిబ్బంది) పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు.

ఇదీ సమస్య..: వివిధ పథకాల కింద కేంద్రం ఇచ్చే నిధులను ఒకే గొడుగు కిందికి తెచ్చేందుకు కేంద్రం స్పర్శ్ అనే ఏజెన్సీని తీసుకొచ్చింది. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఓ ప్రాసెసింగ్ ఏజెన్సీ. నిజానికి రాష్ట్ర ప్రభుత్వంలో ఆన్‌లైన్ విధానం కోసం ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఐఎఫ్‌ఎంఐఎస్), కేంద్ర ప్రభుత్వం వద్ద పబ్లిక్ ఫండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పీఎఫ్‌ఎంఎస్) ఉంటాయి. ఉపాధి హామీకి సంబంధించి ఎన్‌ఐసీ సాఫ్ట్ విధానం, ఆర్‌బీఐకి ఈ–కుబేర్ సిస్టమ్ ఉన్నాయి. స్పర్శ్‌లో భాగంగా ఈ నాలుగు సాఫ్ట్‌వేర్లను అనుసంధానించాలని కేంద్రం ఆదేశించింది. ఇక్కడే సమస్య వచ్చింది. ఈ నాలుగు సాఫ్ట్‌వేర్ల అనుసంధానంలో సమస్యలు తలెత్తాయి. దీంతో ఉపాధి హామీ ఉద్యోగులకు 3నెలలుగా వేతనాలు పెండింగ్‌లో పడినట్టు అధికారులు తెలిపారు. ఈ ఉద్యోగుల వేతనాల కోసం నెలకు రూ. 22 కోట్ల దాకా బడ్జెట్ అవసరం. నిధులు అందుబాటులో ఉన్నా సాంకేతిక సమస్యల వల్ల సకాలంలో జీతాలు చెల్లించలేక పోతున్నామని అధికారులు చెబుతున్నారు.

జనవరి నుంచి జీతాలు లేవు

మా జిల్లాలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు జనవరి నుంచి వేతనాలు రావడం లేదు. బడ్జెట్ కేటాయింపులు లేవనే సాకుతో ప్రభుత్వం వేతనాలు పెండింగ్‌లో పెట్టింది. మూడు నెలలుగా వేతనాలు లేకపోవటంతో కుటుంబం గడవక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం తక్షణం పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి.

– బాల్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు, జనగామ జిల్లా

క్లుప్తంగా...

రైతులను ఓదార్చే తీరిక మంత్రులకు లేదు

మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్



సాక్షి, హైదరాబాద్‌: పంటలు ఎండి కొందరు, అకాల వర్షాలతో నష్టపోయి మరికొందరు రైతులు పుట్టెడు దుఃఖంలో ఉన్నారని.. అయినప్పటికీ రైతులను ఓదార్చే తీరిక మంత్రులకు లేదని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాన్ని బద్నాం చేయడం, అంతర్గత కుమ్ములాటలకే కాంగ్రెస్ నేతలు ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో కలిసి మంగళవారం తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ అంశంపైనా ముందు చూపులేదని, తాగునీటిపై ముందస్తు కార్యాచరణ లేకపోవడంతో హైదరాబాద్‌కు తాగునీటి సమస్య కూడా వచ్చే ప్రమాదం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టే ఆలోచన బీఆర్‌ఎస్‌కు లేదని అనేక మార్లు తమ అధినేత కేసీఆర్ స్పష్టం చేశారన్నారు. అయితే ఐదేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భరించడం కష్టంగా ఉందని ప్రజల్లో చర్చ జరుగుతోందని ఆయన అన్నారు. రైతులను మోసగించిన ఈ ప్రభుత్వం వైదొలగాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు.

అసంతృప్తి వాస్తవమే..

పార్టీ మారతానన్న ప్రచారం తప్పు: మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



జగిత్యాల టౌన్‌: నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు పనిచేశానని, పదేళ్ల బీఆర్‌ఎస్ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా.. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఒంటరి పోరాటం చేసినప్పటికీ ప్రస్తుతం అదే కాంగ్రెస్‌లో తన స్థానం ఏంటో తెలియని పరిస్థితి ఉందని మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పార్టీలో వీహెచ్ తర్వాత తానే సీనియర్ అని తెలిపారు. తాను పార్టీ మారతానన్న ప్రచారం అవాస్తమని తేల్చిచెప్పారు. తన సేవలకు, సీనియారిటీకి దక్కిన గౌరవం ఏంటన్న ప్రశ్నే తనను వేధిస్తోందని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క ఎంతబలంగా పోరాడారో.. ఎమ్మెల్యేగా.. మండలి నాయకుడిగా తానూ అంతే బలంగా పోరాటం చేశానని జీవన్‌రెడ్డి గుర్తు చేశారు.

నేడు ఎమ్మెల్సీగా దాసోజు ప్రమాణ స్వీకారం



సాక్షి, హైదరాబాద్‌: శాసనసభ్యుల కోటాలో శాసనమండలి సభ్యునిగా ఎన్నికైన బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేస్తారు. మండలి చైర్మన్ చాంబర్‌లో బుధవారం ఉదయం 12.30 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు.. అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కులోని తెలంగాణ అమర వీరుల స్తూపానికి పుష్పాంజలి ఘటిస్తారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు, శాసనమండలిలో ప్రతిపక్ష నేత ఎస్.మధుసూదనాచారితో పాటు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొంటారు.

రేపు ఈడీ కార్యాలయం ముందు కాంగ్రెస్ నిరసన

సాక్షి, హైదరాబాద్‌: కాంగ్రెస్ అగ్ర నేతలపై బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ రాజకీయ కక్ష సాధింపు చర్యలను నిరసిస్తూ.. ఈనెల 17న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ ఈడీ కార్యాలయం ముందు భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ హెరాల్డ్ పత్రిక కేసులో.. ఏఐసీసీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను కక్ష పూరితంగా చార్జిషీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ టీపీసీసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు ఒడిశాలో బొగ్గు బ్లాక్ ప్రారంభం

నైనీ గనిని ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్‌: సింగరేణి సంస్థ తన 13 దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రంలో బొగ్గు గనుల తవ్వకాన్ని ప్రారంభించనుంది. ఒడిశా రాష్ట్రం అంగూల్ జిల్లాలో సింగరేణి సంస్థకు కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్‌లో బొగ్గు తవ్వకాలను ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క బుధవారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. రాష్ట్రం వరకే పరిమితమైన సింగరేణి సంస్థ ఇప్పుడు ఇతర రాష్ట్రాల్లోకి అడుగు పెట్టడం చరిత్రాత్మక సందర్భమని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

2016లో కేటాయింపు..

సాక్షి ప్లస్ ఈ–పేపర్‌లో..

నేను కొంచెం రౌడీ టైప్

బీఆర్‌ఎస్ కార్యకర్తలను బెదిరించిన వారి పేర్లు పింక్ డైరీలో రాసుకుంటా

బాన్సువాడలో పార్టీ రజతోత్సవ సభ సన్నాహక భేటీలో ఎమ్మెల్సీ కవిత



బాన్సువాడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కవిత

బాన్సువాడ: కేసీఆర్ మంచోడే కావచ్చు.. కానీ నేను మాత్రం కొంచెం రౌడీ టైప్ అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని భారత్ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశానికి ఆమె హాజరయ్యారు. సభకు వెళ్లవద్దని తమ కార్యకర్తలను బాన్సువాడలో కొంత మంది ఫోన్లు చేసి బెదిరిస్తున్నట్లు తెలిసిందని, ఎవరెవరు బెదిరిస్తున్నారో వాళ్ల పేర్లను బరాబర్ పింక్ బుక్కులో రాసుకుంటానన్నారు. బెదిరింపులకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టేదే లేదని, కేసులు పెట్టించి పోలీస్ స్టేషన్లకు ఈడ్చుకెళ్లిన వాళ్లను క్షమించే ప్రసక్తే లేదని చెప్పారు. కాంగ్రెస్ నాయకుల తాటాకు చప్పుళ్లకు భయపడేదే లేదన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సంతకాలు పెట్టిన గ్యారంటీ కార్డులను కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి పంచి ఓట్లేయించుకున్నారని, ఇప్పుడు గ్యారంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. వందలాది మంది తెలంగాణ బిడ్డల ఆత్మబలిదానాలకు కారణం కాంగ్రెస్ పార్టీ అని, ఏడాదిన్నర పాలనలోనే ఇంత వ్యతిరేకత మూట గట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నోబెల్ ప్రైజ్ ఇవ్వాలని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమల్లో కాంగ్రెస్ విఫలం

ప్రజలను మోసగించడంలో సీఎం, మంత్రులది ఒకే దారి: మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్‌: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో ఘోరంగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, అలవోకగా అబద్ధాలు చెప్పడాన్ని రాచమార్గంగా ఎంచుకుందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు విమర్శించారు. అబద్ధాలతో ప్రజలను నమ్మించడంలో సీఎం రేవంత్, మంత్రులు, కాంగ్రెస్ నాయకులు ఒకే బాటలో నడుస్తున్నారని మండిపడ్డారు. మహిళలకు రూ.21వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన ప్రకటనపై హరీశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'మహిళా సంఘాలకు కేవలం బ్యాంకు లింకేజీ కల్పించి రూ.21 వేలు వడ్డీ లేని రుణాలు అని ప్రచారం చేసుకోవడం విడ్డూరం. మహిళా సంఘాలకు రూ.20 లక్షల రుణం ఇచ్చి కేవలం రూ.5 లక్షల వరకు మాత్రమే వడ్డీ లేని రుణంగా పరిగణిస్తున్నారు. మిగతా రూ.15 లక్షలకు మహిళలు వడ్డీ చెల్లిస్తున్నారు. ఒక వేళ రూ.20 లక్షలు వడ్డీ లేని రుణమే అయితే దానికి సంబంధించిన జీవోను బయటపెట్టాలి. లేని పక్షంలో మహిళా లోకానికి క్షమాపణలు చెప్పాలి' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

కుట్టుకూలీపైనా తప్పుడు ప్రచారం

'స్కూల్ విద్యార్థులకు ఇచ్చే యూనిఫారాల కుట్టుకూలీ రూ.50 మాత్రమే చెల్లించి, రూ.75 ఇస్తున్నట్లుగా ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. బీఆర్‌ఎస్ ప్రశ్నించిన తర్వాత రూ.25 విడుదల చేసినా మహిళలకు చేరలేదు. స్వయం సహాయక బృందాలకు రుణాలు ఇచ్చే 'శ్రీనిధి' నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ప్రచార యావ పక్కన పెట్టి రేవంత్ ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలి' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

'ఇందిరమ్మ' తొలి విడత సాయం జమ

మంత్రి పొంగులేటి వెల్లడి

సాక్షి, హైదరాబాద్‌: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి బేస్‌మెంట్ వరకు పనులు పూర్తి చేసుకున్న 2,019 మంది లబ్ధిదారుల ఖాతాల్లో తొలి విడత ఆర్థిక సాయం రూ.20.19 కోట్లు జమ చేసినట్టు గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి నుంచి నేరుగా 12 మంది చెక్కులు అందుకోగా, మిగతా వారికి వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు మంజూరు చేసిన 70,122 ఇళ్లకుగాను తొలి విడత రూ.లక్ష సాయం కింద ఈ మొత్తాన్ని అందజేసినట్టు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 13,500 ఇళ్ల నిర్మాణం మొదలైందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే డబ్బులు జమ చేస్తున్నామని మంత్రి వివరించారు.

ఫొటోలు అప్‌లోడ్ చేస్తే చాలు

బేస్‌మెంట్, గోడలు, పైకప్పు.. ఇలా దశలవారీగా పనులు పూర్తి చేసుకునే లబ్ధిదారులు, వివరాల నమోదుకు అధికారుల కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేకుండా వారే నిర్మాణం ఫొటోలు తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించారు. కాగా మిగతా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను కూడా వేగవంతం చేస్తున్నామని, అధికారులు, ప్రజాప్రతినిధులకు మధ్య సమన్వయం కోసం ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నామని పొంగులేటి తెలిపారు.

'వడగాడ్పులకూ' విపత్తు సాయం

మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.4 లక్షలు పరిహారం

సాక్షి, హైదరాబాద్‌: వడగా డ్పులను రాష్ట్ర ప్రత్యేక విప త్తుగా ప్రభుత్వం పరిగణన లోకి తీసుకుంది. వడగా డ్పు ల ప్రభావంతో లేదా వడదెబ్బకు గురై మరణిస్తే... బాధిత కుటుంబానికి రూ.4 లక్షలు పరిహారం ఇవ్వనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మే రకు విపత్తుల నిర్వహణ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కు మార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వడదెబ్బకు గురై మరణించి న వ్యక్తి కుటుంబానికి ఇప్పటివరకు ఆపద్బంధు పథకం కింద పరిగణన లోకి తీసుకుని ఆ కుటుంబానికి ప్రభుత్వం రూ.50వేల వరకు ఆర్థిక సా యం అందించేది. ఇప్పుడు ప్రత్యేక విపత్తుగా పరిగణించడంతో బాధిత కు టుంబానికి మరికొంత ఉపశమనం దక్కనుంది. వడదెబ్బకు గురై వ్యక్తి మ రణిస్తే... ఆ మరణాన్ని నిర్ధారించేందుకు మండల స్థాయిలో ప్రత్యేకంగా కమిటీ ఉంటుంది. మండల తహసీల్దారు, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, మండల వైద్యాధికారి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ నిర్ధారణ తర్వాత పోలీసు కేసు, పోస్టుమార్టం తర్వాత ఈ పథకం కింద పరిహారం అందించేందుకు అర్హత వస్తుంది. జిల్లా కలెక్టర్ ఆమోదంతో పరిహారం అందిస్తారు.

..కోటీశ్వరుల్ని చేస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

మేర వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా.. లక్ష్యాన్ని మించి రూ.21 వేల కోట్లు అందించాం. గ్రీన్ ఎనర్జీలో మహిళల్ని భాగస్వాముల్ని చేస్తున్నాం. సోలార్ రంగంలో 1,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి మహిళా సంఘాలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాం. మహిళల కోసం ప్రత్యేక చట్టాలు చేయడంతో పాటు వాటిని అమలు చేస్తేనే మహిళ సాధికారత సాధ్యం. తెలంగాణ ప్రభుత్వం దీనికి కట్టుబడి ఉంది' అని అన్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. 'మహిళల కోసం ఎన్ని చట్టాలు వచ్చినా ఇప్పటికీ నేరాలు జరుగుతున్నాయి. గత ఏడాది నగరంలో 250 అత్యాచారం కేసులు, 713 పోక్సో కేసులు నమోదయ్యాయి. మహిళలకు న్యాయం చేయడానికి షీ–టీమ్స్‌తో పాటు భరోసా కేంద్రం పనిచేస్తోంది. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో 19 డీసీపీ పోస్టులు ఉండగా... వీటిలో ఎనిమిది మంది మహిళా అధికారులు ఉన్నారు' అని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని నీతి ఆయోగ్ సీనియర్ స్పెషలిస్ట్ డాక్టర్ భానుశ్రీ వెల్పాండియన్ అన్నారు. ఈ కోణంలో దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో ఉత్తమ విధానాలు అమలవుతున్నాయని కితాబిచ్చారు.

కృష్ణా జలాల్లో ఏపీ వాడకం 72.2%

తెలంగాణ వాడకం 27.8 శాతమే

- 66:34 నిష్పత్తిలో పంపిణీ జరిపినా తెలంగాణకు 68 టీఎంసీల నష్టం
- 50:50 నిష్పత్తిలో పంపిణీ చేస్తే 235 టీఎంసీల నష్టం
- కృష్ణా బోర్డు గణాంకాలతో నీటిపారుదల శాఖ నివేదిక

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత నీటి సంవత్సరం (2024–25)లో ఏపీ, తెలంగాణ మొత్తం 990.38 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించుకోగా, అందులో ఏకంగా 72.2 శాతం (715.03 టీఎంసీలు) ఏపీ వాడుకుంది. తెలంగాణ 275.35 టీఎంసీల (27.8 శాతం)ను మాత్రమే వినియోగించుకోగలిగింది. రెండు రాష్ట్రాల వాడకంపోగా, ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో కనీస నిల్వ మట్టానికి(ఎండీడీఎల్) ఎగువన 9.17 టీఎంసీలతోపాటు ఇతర జలాశయాల్లో మరో 43.94 టీఎంసీలు కలిపి మొత్తం 53.12 టీఎంసీలే మిగిలి ఉన్నాయి. ఈ లెక్కన ప్రస్తుత నీటి సంవత్సరంలో మొత్తం 1043.5 టీఎంసీల జలాల లభ్యత ఉందని కృష్ణా బోర్డు తేల్చింది. గత సోమవారం నాటికి రెండు రాష్ట్రాలు వాడిన కృష్ణా జలాలకు సంబంధించి కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) రూపొందించిన గణాంకాలతో రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈమేరకు ఓ నివేదిక తయారుచేసింది.

50:50 నిష్పత్తిలో అయితే..

ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపిణీ అంశం కృష్ణా ట్రిబ్యునల్‌–2లో పెండింగ్‌లో ఉంది. ట్రిబ్యునల్‌ తీర్పు వచ్చే వరకు తాత్కాలిక సర్దుబాటు ప్రకారం ఏపీ, తెలంగాణ మధ్య 66:34 నిష్పత్తిలో నీటి పంపకాలు జరుగుతుండగా, 50:50 నిష్పత్తిలో పంపకాలు జరపాలని తెలంగాణ డిమాండ్‌ చేస్తోంది. అలా అయితే, 1043.5 టీఎంసీల్లో ఏపీ, తెలంగాణకు చెరో 521.75 టీఎంసీల హక్కులుంటాయి. దీంతో కృష్ణా జలాల్లో తెలంగాణకు ఇంకా 246.4 టీఎంసీల వాటా మిగిలి ఉంటుంది. ఏపీ వాటికి మించి 235.01 టీఎంసీలను వాడుకోవడంతో ఆ మేరకు నీటి వాటాను తెలంగాణ నష్టపోయింది.

66:34 నిష్పత్తిలో తెలంగాణకి 68 టీఎంసీల నష్టం

తాత్కాలిక సర్దుబాటు ప్రకారం 66:34 నిష్పత్తిలో పంపకాలు జరిపినా 1043.5 టీఎంసీల్లో ఏపీకి 688.714 టీఎంసీలు, తెలంగాణకి 354.79 టీఎంసీల వాటా లభించాలి. ఈ లెక్కన తెలంగాణ ఈ ఏడాది వాడుకున్న జలాలు పోగా ఇంకా 77.22 టీఎంసీలను వాడుకోవడానికి హక్కు కలిగి ఉంది.



డనుంది. ఏపీ వాటాకి మించి 68.05 టీఎంసీలను వాడుకోవడంతో తెలంగాణ ఆ మేరకు నీటి వాటాను కోల్పోయింది. ఉమ్మడి జలాశయాల్లో మిగిలి ఉన్న మొత్తం 9.17 టీఎంసీలను తెలంగాణకే కేటాయించినా హక్కుగా లభించాల్సిన వాటాల్లో మరో 68.05 టీఎంసీల లోటును రాష్ట్రం ఎదుర్కోనుంది.

పోతిరెడ్డిపాడు నుంచి 208 టీఎంసీల మళ్లింపు

శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌ ద్వారా 208.64 టీఎంసీలు, మల్యాల లిఫ్టు ద్వారా 28.36 టీఎంసీలు, మల్యాల నుంచి కేసీ కాల్వకి 1.19 టీఎంసీలు, ముచ్చుమర్రి లిఫ్టు ద్వారా 3.49 టీఎంసీలు, చెన్నైకి నీటి సరఫరాకి 1.88 టీఎంసీలు కలిపి ఏపీ మొత్తం 243.58 టీఎంసీలను వాడుకుంది. ఇక నాగార్జునసాగర్‌ నుంచి ఎడమ కాల్వ ద్వారా 29.45 టీఎంసీలు, కుడి కాల్వ ద్వారా 188.16 టీఎంసీలు కలిపి మరో 217.62 టీఎంసీలను ఏపీ వాడుకుంది. ఇలా ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు ఏపీ మొత్తం 715.03 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకున్నట్టు బోర్డు లెక్క గట్టింది.

అరకొరగానే తెలంగాణ వాడకం

శ్రీశైలం నుంచి కల్వకుర్తి లిఫ్టు ద్వారా 46.75 టీఎంసీలు, చెన్నైకి నీటి సరఫరాకి 0.94 టీఎంసీలు కలిపి మొత్తం 47.69 టీఎంసీలను మాత్రమే తెలంగాణ వాడుకుంది. సాగర్‌ నుంచి ఏఎమ్మార్పీ ప్రాజెక్టు అవసరాలకు 41.42 టీఎంసీలు, ఎడమ కాల్వ ద్వారా 115.48 టీఎంసీలు, తాగునీటి అవసరాలకు 14.37 టీఎంసీలు కలిపి మొత్తం 171.28 టీఎంసీలను రాష్ట్రం వాడుకుంది. జూరాల ప్రాజెక్టు నుంచి మరో 42.25 టీఎంసీలు, ఇతర ప్రాజెక్టుల నుంచి మరో 8.42 టీఎంసీలు కలిపి ఈ ఏడాది తెలంగాణ మొత్తం 275.35 టీఎంసీలను మాత్రమే వాడుకోగలిగింది.

క్లుప్తంగా...

నేడు కంచ భూములపై సుప్రీంలో విచారణ

- విచారించనున్న జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జి మసీల ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరగనుంది. కేసును జస్టిస్‌ బీఆర్‌ గవాయి, జస్టిస్‌ అగస్టీన్‌ జార్జి మసీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించనుంది. ఇప్పటికే ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్‌ దాఖలు చేసింది. తక్షణం పనులన్నీ ఆపేయాలని, తాము చెప్పిన ఆదేశాలు పాటించకపోతే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని జైలుకు పంపుతామని ధర్మాసనం హెచ్చరించింది. ఈనేపథ్యంలో శని, ఆదివారాల్లో సీఎస్‌ ఢిల్లీలో మకాం వేసి న్యాయ నిపుణులతో భేటీ అయ్యారు. సుప్రీంకోర్టు సంధించిన ఐదు ప్రశ్నలకు రాష్ట్ర ప్రభుత్వం సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. అది ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భూమేనని, ఆ వివరాలన్నీ రెవెన్యూ రికార్డుల్లో ఉన్నాయని పేర్కొంది. రికార్డుల్లోని సర్వే నంబర్లను సైతం ఆధారాలతో సహా సుప్రీంకు నివేదించింది. అయితే, జంతువులు, వృక్షాల విషయంలో ప్రభుత్వం ఏం సమాధానం ఇచ్చిందనేది మాత్రం ప్రశ్నార్థకంగానే ఉంది. బుధవారం జరగనున్న విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఎలా స్పందిస్తుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ఐఎల్‌ఏకు పీఆర్ ఆర్‌డీ ఆమోదం

సాక్షి, హైదరాబాద్: ఇండస్ట్రియల్‌ ఏరియా డెవలప్‌మెంట్‌ అథారిటీ (ఐఎల్‌ఏ) ఫైల్‌కు పంచాయతీరాజ్‌ గ్రామీణాభివృద్ధి శాఖ ఆమోదం తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇండస్ట్రియల్‌ పార్కులను ఏర్పాటు చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఇండస్ట్రియల్‌ పార్కుల ఏర్పాటు వేగవంతానికి.. ఐఎల్‌ఏను పరిశ్రమల శాఖ, టీజీఐఐసీ ఏర్పాటు చేస్తున్నాయి. భూసేకరణ మొదలు ఏర్పడబోయే పరిశ్రమలకు అనుగుణంగా రోడ్ల వంటి మౌలిక వసతుల కల్పన వరకు అన్ని బాధ్యతలను ఐఎల్‌ఏకు అప్పగించనున్నట్టు ప్రభుత్వవర్గాల సమాచారం. ఈ పరిశ్రమల ఏర్పాటు తర్వాత.. వాటినుంచి వసూలయ్యే పన్నుల్లో 30 శాతం గ్రామ పంచాయతీలకు వాటా కల్పించనున్నారు. ఐఎల్‌ఏ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనతో పాటు గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్టు తెలుస్తోంది.

30 వరకు లాసెట్‌-2025 దరఖాస్తుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీ లాసెట్‌–2025, పీజీఎల్‌సెట్‌–2025 దరఖాస్తులను ఈ నెల 30 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా స్వీకరించనున్నట్లు కన్వీనర్‌ ప్రొఫెసర్‌ విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్‌ కోరారు. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడాలని సూచించారు.

ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు చార్జిమెమో?

- అవినీతి, అక్రమాలపై విచారణ కమిటీ నివేదిక!

సాక్షి, హైదరాబాద్: రెడ్‌హిల్స్‌లో ఉన్న ప్రముఖ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ప్రభుత్వం చార్జిమెమో జారీ చేసినట్టు తెలిసింది. కొన్ని రోజులుగా ఆయనపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో.. ప్రభుత్వం అంతర్గత కమిటీ ద్వారా విచారణ జరిపింది. ఈ విచారణలో ఆసుపత్రి పరికరాల కొనుగోళ్లలో అక్రమాలు, ఇతర అంశాల్లో కూడా అవకతవకలు జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించి మెమో జారీ చేసింది. ఈ విషయాన్ని ఒక అధికారి కూడా ధ్రువీకరించారు. సదరు అధికారికి గతంలో కూడా ఓసారి చార్జిమెమో ఇచ్చారని తెలిసింది. క్లినికల్‌ ట్రయల్స్‌ విషయంలో నిర్లక్ష్యం, అక్రమాల ఆరోపణలతో పాటు రక్తనిధిలో అవినీతిపై సూపరింటెండెంట్‌ నిర్లక్ష్యం వహించారని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ గుర్తించినట్లు సమాచారం. యంత్రాల కొనుగోలులో గోల్‌మాల్‌ జరిగినట్లు కూడా వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు గుర్తించి చార్జిమెమో ఇచ్చినట్లు ఉన్నతాధికార వర్గాలు తెలిపాయి.

‘సీతారామ’ పటిష్టత అధ్యయనానికి కమిటీ

- ముగ్గురు సీఈలు, ఓ ఎస్‌ఈతో ఏర్పాటు
- సూపర్ పాసేజ్ పిల్లర్ కూలిన నేపథ్యంలో సర్కార్ చర్యలు
- ప్రాజెక్టులోని అన్ని కట్టడాల దృఢత్వం పరిశీలించనున్న కమిటీ
- 15 రోజుల్లోగా సర్కారుకు నివేదిక!

సాక్షి, హైదరాబాద్: సీతారామ–సీతమ్మసాగర్‌ బహుళార్ధ సాధక ప్రాజెక్టులో భాగంగా ప్రధాన కాలువపై నిర్మించిన సూపర్‌ పాసేజ్‌ (బ్రిడ్జి)కి సంబంధించిన పిల్లర్‌ కూలిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్ని రకాల కట్టడాల పటిష్టతతో పాటు ఇతర సాంకేతికపరమైన అంశాలపై సమగ్ర అధ్యయనం జరిపించాలని నిర్ణయించింది. ఇందుకోసం సెంట్రల్‌ డిజైన్స్‌ ఆర్గనైజేషన్‌ (సీడీఓ) సీఈ నేతృత్వంలో క్వాలిటీ కంట్రోల్‌, మైనర్‌ ఇరిగేషన్‌ విభాగాల చీఫ్‌ ఇంజనీర్లు, ఎస్‌ఈ టెక్నికల్‌తో ఉన్నతస్థాయి కమిటీని మంగళవారం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని నిర్మాణాలు, కట్టడాలను సందర్శించి వాటి పటిష్టత, మన్నికపై అధ్యయనం జరపనుంది. అనంతరం 15 రోజుల్లోగా నీటిపారుదల శాఖకు నివేదిక సమర్పించనుంది.

నివేదిక కోరిన నీటిపారుదల శాఖ

సీతారామ ప్రాజెక్టులో భాగంగా ప్యాకేజీ–4 కింద ప్రధాన కాలువపై ములకలపల్లి వద్ద నిర్మించిన సూపర్‌ పాసేజ్‌ పిల్లర్‌ కూలిపోయిన ఘటనపై సోమవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీంతో నీటిపారుదలశాఖ స్పందించింది. ఈ ఘటనపై నివేదిక సమర్పించాలని క్షేత్ర స్థాయిలోని ఇంజనీర్లను ఆదేశించింది. ప్యాకేజీ–4 కింద రూ.290.07 కోట్ల అంచనా వ్యయంతో కోయగట్టు (39.92 కి.మీ) నుంచి వీకే రామవరం (43.72కి.మీ) వరకు, పుసుగూడెం (44.65 కి.మీ) నుంచి కమలాపురం (57.07 కి.మీ)వరకు ప్రధాన కాలువ నిర్మాణ పనులను ఎస్‌వీఈసీ–ఎస్‌ఎస్‌ఎల్‌సీసీ (జేవీ) అనే నిర్మాణ సంస్థకు 2017లో అప్పగించారు. ఇందులో భాగంగా 2019లో ములకలపల్లి వద్ద సూపర్‌ పాసేజ్‌ నిర్మాణాన్ని ప్రారంభించిన సంస్థ అదే ఏడాది పూర్తి చేసింది. అయితే ఇటీవల కాలువకు నీళ్లను విడుదల చేయడంతో పాసేజ్‌ పిల్లర్‌కింద మట్టి కొట్టుకుపోవడంతో కూలిపోయింది. వాస్తవానికి సూపర్‌ పాసేజ్‌కు సంబంధించిన డిజైన్లలో కేవలం 3 పిల్లర్లను నిర్మించాలని సీడీఓ విభాగం సూచించగా, 4 పిల్లర్లను నిర్మించినట్టు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. కాగా ఈ ఘటనపై సీఎం స్పందించిన నేపథ్యంలో పిల్లర్‌ పునర్నిర్మాణం పనులను నిర్మాణ సంస్థే నిర్వహించనుందంటూ క్షేత్రస్థాయి అధికారులు ప్రభుత్వానికి వివరణ ఇచ్చారు.

శ్రీశైలం డ్యామ్‌కు ఎన్డీఎస్‌ఏ చైర్మన్

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ప్రాజెక్టు భద్రత ప్రమాదంలో ఉందని, తక్షణమే జోక్యం చేసుకోవాలని తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్‌) జి.అనిల్‌కుమార్‌ రాసిన లేఖకు నేషనల్‌ డ్యామ్‌ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) స్పందించింది. ఎన్డీఎస్‌ఏ చైర్మన్‌ అనిల్‌ జైన్‌ ఈ నెల 28 నుంచి 30 వరకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో పర్యటించి డ్యామ్‌ల భద్రతపై సమీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 28న ఆయన విజయవాడకు చేరుకుని ఏపీ రాష్ట్ర ఆనకట్టల భద్రత విభాగం (ఎస్డీఎస్‌ఓ)తో సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం ఏపీ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో సమావేశమై శ్రీశైలం జలాశయానికి మరమ్మతులపై చర్చించనున్నారు. 29న శ్రీశైలం జలాశయాన్ని సందర్శించనున్నారు. శ్రీశైలం జలాశయానికి 2009లో వచ్చిన భీకర వరదలతో స్పిల్‌ వే దిగువన నీళ్లుపడే ప్రాంతంలో భారీ గుంత (ప్లంజ్‌ పూల్‌) ఏర్పడింది. ఇప్పటివరకు మరమ్మతులు చేయకపోవడంతో.. క్రమంగా ప్లంజ్‌ పూల్‌ విస్తరిస్తూ, జలాశయానికి ముప్పుగా మారినట్టు ఆందోళన వ్యక్తమవుతోంది. 2009లో 25 లక్షల క్యూసెక్కుల వరద రావడంతో స్పిల్‌ వేకు దిగువన భూమి కోతకు గురై భారీ గుంత ఏర్పడింది. ఈ గుంతను పూడ్చకపోతే జలాశయం పునాదులను బలహీనపరిచి, డ్యామ్‌కు ప్రమాదకరంగా మారుతుందని నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఓషియానోగ్రఫీ వంటి సంస్థలు అధ్యయనంలో తేల్చాయి. ఈ నేపథ్యంలో తక్షణమే తాత్కాలిక మరమ్మతులు నిర్వహించాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో ఎన్డీఎస్‌ఏ ఆదేశించింది. ఈ పనులకు సంబంధించిన పురోగతిని అనిల్‌ జైన్‌ అడిగి తెలుసుకోనున్నారు. 30న ఆయన హైదరాబాద్‌కు చేరుకుంటారు.

దేశంలో వరి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రగామి

ఫిలిప్పీన్స్‌కు ఎగుమతి ద్వారా మిగులు ధాన్యానికి పరిష్కారం: మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్/ఏజీవర్సిటీ: దేశంలోనే ధాన్యం ఉత్పత్తిలో ఈ ఏడాది తెలంగాణ అగ్రగామిగా నిలిచిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌ రెడ్డి అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో సుమారు 280 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయిందని, ఇది ఒక రికార్డు అని చెప్పారు. తెలంగాణ నుంచి తొలిసారి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి అవుతున్న నేపథ్యంలో మంగళవారం ప్రొఫెసర్‌ జయశంకర్‌ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ‘బియ్యం ఎగుమతి విధానం’ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఉత్తమ్‌కుమార్‌ మాట్లాడారు. రాష్ట్ర అవసరాలు, ఎఫ్‌సీఐ సెంట్రల్‌ పూల్‌, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్నబియ్యం పంపిణీ తదితరాలకు పోగా ఏటా 50 నుంచి 60 లక్షల మెట్రిక్‌ టన్నుల బియ్యం మిగులు ఉంటుందన్నారు. మిగులు ధాన్యం మార్కెట్‌ చేయడానికి ఫిలిప్పీన్స్‌ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. ఈ ఒప్పందంలో భాగంగా ఏడాదికి 10 లక్షల మెట్రిక్‌ టన్నుల దొడ్డు బియ్యాన్ని ఎగుమతి చేసే అవకాశం ఉంటుందన్నారు. ఇటీవల వరి సాగు విధానంలో కూడా మార్పు వచ్చిందని, దాన్ని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. వరి నేరుగా విత్తే పద్ధతి (డీఎస్‌ఆర్‌), రోజు విడిచి రోజు నీరు పెట్టే విధానం (ఏడబ్ల్యూడీ), తక్కువ రసాయనాలు కలిగిన వరి


మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

రకాలను ఉత్పత్తి చేయడంపై రైతులను ప్రోత్సహించాలని శాస్త్రవేత్తలకు మంత్రి సూచించారు. ఎగుమతికి అనుకూలమైన రకాలను ఉత్పత్తి చేసే రైతులకు, ఎగుమతిదారులకు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఉపకులపతి ప్రొఫెసర్‌ అల్దాస్‌ జానయ్య మాట్లాడుతూ ఫిలిప్పీన్స్‌ దేశం ఎప్పటికీ దిగుమతి చేసుకునే దేశమేనని, ఆ దేశాన్ని తెలంగాణ బియ్యానికి అనుకూలమైన మార్కెట్‌గా గుర్తించి ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. తద్వారా తెలంగాణలో పండుతున్న బియ్యం నిల్వలకు శాశ్వత పరిష్కారం దొరికినట్లవుతుందని చెప్పారు. కార్యక్రమంలో అఖిలభారత రైస్‌ మిల్లర్ల అసోసియేషన్‌ అధ్యక్షుడు బి.కృష్ణారావు, విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకుడు డాక్టర్‌ బలరాం, వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌ దామోదర్‌ రాజు పాల్గొన్నారు.

పెట్టుబడులు రాకుండా దుష్ప్రచారం

- అయినా ప్రభుత్వాన్ని నమ్మి వస్తున్న పెట్టుబడిదారులు
- వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి శ్రీధర్‌బాబు
- నానక్‌రాంగూడలో సిటిజన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి పెట్టుబడులు సాధించి యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుంటే, కొందరు పెట్టుబడులు రాకుండా దుష్ప్రచారం చేస్తున్నారని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు విమర్శించారు. ఎంత దుష్ప్రచారం చేసినా తమ ప్రభుత్వంపై నమ్మకంతో పెట్టుబడులతో వస్తున్న పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నానక్‌రాంగూడలో అమెరికాకు చెందిన సిటిజన్స్‌ ఫైనాన్షియల్‌ గ్రూప్‌, కాగ్నిజెంట్‌ టెక్నాలజీస్‌ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ‘సిటిజన్స్‌ గ్లోబల్‌ కేపబిలిటీ సెంటర్‌’ను మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2030 నాటికి హైదరాబాద్‌లో 200 మిలియన్‌ చదరపు అడుగుల విస్తీర్ణంతో ‘గ్రేడ్‌ ఏ’వాణిజ్య స్థలాన్ని (కమర్షియల్‌ స్పేస్‌) అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. హైదరాబాద్‌ ‘గ్లోబల్‌ బిజినెస్‌ హబ్‌’గా మారడంతో అందుకు అనుగుణంగా కమర్షియల్‌ స్పేస్‌కు డిమాండ్‌ పెరిగిందని తెలిపారు. ఢిల్లీ, చెన్నై లాంటి


కేపబిలిటీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్

మెట్రో నగరాల్లో కమర్షియల్‌ స్పేస్‌కు డిమాండ్‌ తగ్గుతుండగా, హైదరాబాద్‌లో గత ఏడాది దేశంలోనే అత్యధికంగా 56 శాతం వార్షిక వృద్ధిరేటు నమోదైనట్లు వెల్లడించారు. గతేడాది హైదరాబాద్‌లో 1.8 మిలియన్‌ చదరపు అడుగుల కమర్షియల్‌ స్పేస్‌ను వివిధ సంస్థలు లీజుకు తీసుకున్నాయని చెప్పారు. హైదరాబాద్‌లో ఆమ్జెన్‌, గ్లోబల్‌ లాజిక్‌, ఎలీలిల్లీ, మారియంట్‌, సిగ్నా లాంటి అంతర్జాతీయ సంస్థలకు చెందిన 355 జీసీసీలు మూడు 3 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నాయని వెల్లడించారు. కొత్తగా ప్రారంభించిన ‘సిటిజన్స్‌ గ్లోబల్‌ కేపబిలిటీ సెంటర్‌’లో ప్రస్తుతం వేయిమంది ఐటీ, డేటా నిపుణులకు ఉపాధి లభిస్తుందని.. వచ్చే రెండుమూడేళ్లలో ఈ సంఖ్య రెట్టింపు అవుతుందని మంత్రి ప్రకటించారు. కార్యక్రమంలో ఐటీ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్‌ రంజన్‌, కాగ్నిజెంట్‌ ప్రెసిడెంట్‌– అమెరికా సూర్య గుమ్మాడి తదితరులు పాల్గొన్నారు.



ఒక బహుమతినీ, దాని గ్రహీతనూ ఎలా ఎంపిక చేసుకోవాలంటే – ఇచ్చేముందుగానీ, ఇస్తున్నప్పుడుగానీ, ఇచ్చిన తర్వాతగానీ తృప్తి, సంతోషం ఉండాలి.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 16 ఏప్రిల్ 2025

చోక్సీ కథ కంచికేనా!

ప్రపంచంలో మనుషుల్ని అమెరికన్ వ్యంగ్య రచయిత జార్జి ప్రెంటిస్ మూడు రకాలుగా విభజించాడు – కలవారు, లేనివారు, అప్పులు చెల్లించనివారు. కానీ ఆయన గమనించి వుండకపోవచ్చుగానీ... మన దేశంలో ఇంకోరకం ఘరానా మనుషులున్నారు– కేవలం ఎగ్గొట్టడానికే అప్పులు చేసేవారు! పైగా అందుకోసం ప్రభుత్వరంగ బ్యాంకుల్ని మాత్రమే ఎంచుకునేవారు!! ఆ బాపతు మోసగాళ్లలో అగ్రభాగానవున్న మెహుల్ చోక్సీ ఏడేళ్ల తర్వాత బెల్జియంలో పట్టుబడ్డాడు. ఆయనగారు దొరకడం ఇది మొదటిసారేమీ కాదు. 2021 మే నెలలో వెస్టిండీస్‌కు దగ్గర్లో కరీబియన్ సముద్ర ప్రాంత ద్వీప దేశమైన యాంటీగాలో మన సీబీఐ బృందం అరెస్టు చేసింది. అప్పటికే చోక్సీ ఆ దేశ పౌరసత్వం తీసుకోవటం, యాంటీగాతో మనకు నేరస్తుల మార్పిడి ఒప్పందం లేకపోవటం పర్యవసానంగా విడుదల చేయక తప్పలేదు. తనకొచ్చిన ప్రాణాంతక వ్యాధికి చికిత్స కోసం బెల్జియం రావటంవల్లా, ఆ దేశంతో మనకు నేరస్తుల మార్పిడి ఒప్పందం ఉండటంవల్లా ఎట్టకేలకు అరెస్టయ్యాడు.

మన బ్యాంకులు సాధారణ రైతులు, మధ్యతరగతి ప్రజానీకం అప్పుకోసం వస్తే సవాలక్ష యక్ష ప్రశ్నలతో వేధిస్తాయి. అనుమానాస్పద వ్యక్తుల్ని చూసినట్టు చూస్తాయి. కానీ మెహుల్ చోక్సీ, నీరవ్ మోదీ, విజయ్ మాల్యావంటి మోసగాళ్లకు రెడ్‌కార్పెట్ పరుస్తాయి. అడిగిందే తడవు ఉన్నదంతా ఊడ్చిపెట్టి ఇవ్వడానికి సిద్ధపడిపోతాయి. మెహుల్ చోక్సీ, నీరవ్ మోదీ ఇద్దరూ బంధువులు మాత్రమే కాదు... జంట కేటుగాళ్లు. వీరిద్దరూ ఎంత లాఘవంగా పంజాబ్ నేషనల్ బ్యాంకును దోచారంటే– 2011లో మోసాలు మొదలెడితే దాన్ని ఆనవాలు కట్టడం 2018 వరకూ బ్యాంకు సిబ్బందికి సాధ్యమే కాలేదు. ఇది బ్యాంకుల చేతగానితనం అనుకోవాలా, ఉన్నతస్థాయిలో పనిచేసే వారి చేతివాటం అనుకోవాలా? లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్ (ఎల్‌ఓయూ)ల్ని బ్యాంకునుంచి అపహరించి రూ. 13,500 కోట్లు కొట్టేశారంటే బ్యాంకు ఉన్నతాధికారగణం నిద్రపోయినట్టా, నిద్ర నటించినట్టా? ఈ ఎల్‌ఓయూలతో ఇద్దరూ విదేశీ ప్రైవేటు, ప్రభుత్వ రంగ బ్యాంకులనుంచి వేల కోట్ల రూపాయలు కొట్టేశారు. ఎల్‌ఓయూలను ఆమోదించేముందు వాటిని జారీచేసిన ప్రధాన బ్యాంకును సంప్రదించటం తప్పనిసరి. అదేం జరగలేదు సరిగదా బ్యాంకు అంతర్గత ఆడిట్‌లో సైతం ఇది లెక్కకు రాకుండా చూసుకోవటం వీరిద్దరి ప్రత్యేకత! మోసం బయటపడినప్పుడు పంజాబ్ నేషనల్ బ్యాంకుకు పోయిన సొమ్మెంత అన్న స్పృహ కూడా లేదు. మొదట రూ. 11,000 కోట్లని నిర్ధారణ చేయగా, తవ్వినకొద్దీ బయటపడుతూ అది పాపం పెరిగినట్టు పెరిగి చివరకు రూ. 13,500 కోట్ల దగ్గర ఆగింది. కనీసం అప్పనంగా కొట్టేసిన డబ్బుతో 'అధికారికంగా' ఉన్న బాకీలో కాస్తయినా తీర్చుదామని వారనుకోలేదు. ఎల్‌ఓయూ ద్వారా తీసుకునే అప్పును మూణ్ణెల్లలో తీర్చేయాలి. కొనసాగించదల్చుకుంటే దానిపై వడ్డీ ఉంటుంది. కానీ అప్పిచ్చిన బ్యాంకులు కనీసం వడ్డీ వసూలుకు కూడా ప్రయత్నించలేదు.

అయినా బ్యాంకులు మేల్కొన్నాయా? నిరర్థక ఆస్తుల(ఎన్‌పీఏ) చిట్టా గమనిస్తే పెద్దగా సంతోషించాల్సింది కనబడదు. 2019లో రూ. 7.3 లక్షల కోట్ల మేర ఉన్న ప్రభుత్వ బ్యాంకుల ఎన్‌పీఏలు నిరుడు రూ. 3.4 లక్షల కోట్లకు తగ్గాయి. కానీ ఇంకా మొండి బకాయిలు రూ. 3.9 లక్షల కోట్లున్నాయి. ఎగవేతదారులకు రాజకీయ ప్రాపకం దొరకటం, అది బ్యాంకులకు సమస్యగా మారటం ఇందుకు కారణం కావొచ్చు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక తెలుగు దేశం నుంచి ఆ పంచన చేరిన ఇద్దరు నాయకులు ఎగవేతదారులే. అందులో ఒకరు కేంద్రమంత్రి పదవి కూడా వెలగబెట్టారు. ఇప్పుడు ఎమ్మెల్యే అయ్యారు. మరొకరు ఎంపీ. నిజంగా బ్యాంకులు తమ బకాయిలు రాబట్టుకోవటానికి ప్రయత్నించినా పెద్దగా ఫలితం వుండదు. చోక్సీ సంగతే తీసుకుంటే పరారయ్యాక అతగాడి దుకాణాన్ని సీజ్ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అక్కడ రూ. 5,000 కోట్ల కిమ్మత్తు చేసే వజ్రాలున్నాయని ప్రకటించింది. తీరా వాటిని లెబోరేటరీల్లో పరీక్షిస్తే అన్నీ నకిలీవని తేలింది. ఇతరేతర స్థిరాస్తులు రూ. 2,500 కోట్లుగా తేల్చారు. కానీ కొట్టేసిన సొమ్ముతో పోలిస్తే, దానికి ఇప్పటివరకూ అయిన వడ్డీ కూడా జతచేస్తే అది ఏ మూలకు? థాయ్‌లాండ్, దుబాయ్, జపాన్, అమెరికాల్లో చోక్సీకున్న ఆస్తుల విలువ దాదాపు వంద కోట్లని చెబుతున్నారు.

చోక్సీ అరెస్టు మన ప్రభుత్వ దౌత్య విజయమని, దేశం గర్వించదగ్గదని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ చెబుతున్నారుగానీ అంతగా సంతోషించదగ్గదేమీ లేదు. ఎందుకంటే, చోక్సీ తోడుదొంగ నీరవ్ మోదీ 2019లో లండన్‌లో అరెస్టుకాగా ఇప్పటికీ అక్కడి న్యాయస్థానాల్లో తనను భారత్‌కు అప్పగించొద్దంటూ పిటిషన్ల మీద పిటిషన్లు వేస్తున్నాడు. ఈ వరస ఎన్నాళ్లు కొనసాగుతుందో తెలియదు. బెల్జియం న్యాయస్థానాలు సైతం చోక్సీ అప్పగింతపై ఓ పట్టాన నిర్ణయం తీసుకోవు. మానవ హక్కుల ఉల్లంఘన, నిర్బంధంలో చిత్రహింసలు వగైరా కారణాలు చూపుతూ ఏళ్ల తరబడి కాలక్షేపం చేయగలడు. బ్యాంకులకు రూ. 9,000 కోట్లు ఎగ్గొట్టి పరారైన విజయ్ మాల్యా కేసు గతీ అంతే. 2017లో అరెస్టయ్యాక బెయిల్‌పై విడుదలై ఇప్పటికీ తనను భారత్ పంపకుండా న్యాయస్థానాల్లో అడ్డుకుంటున్నాడు. వీరందరినీ వెనక్కి తీసుకొచ్చి శిక్షపడేలా చూస్తే పోగొట్టుకున్న డబ్బు రాకపోయినా కనీసం అలాంటి మోసగాళ్లకు అదొక హెచ్చరికగా ఉంటుంది. కానీ అది కూడా అత్యాశేనని జరుగుతున్న పరిణామాలు చెబుతున్నాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: బ.తదియ ఉ.10.23 వరకు, తదుపరి చవితి, నక్షత్రం: అనూరాధ రా.3.11 వరకు, తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.11.35 నుండి 12.25 వరకు, అమృతఘడియలు: ప.3.41 నుండి 5.26 వరకు, సంకటహర చతుర్థి.

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.11
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

కష్టం వేరొకరిది! కాసులు ఏఐవి!!

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

డిజిటల్ ప్రపంచంలో మరో కొత్త అంశం చక్కర్లు కొడుతోంది. ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలు కాస్తా ప్రఖ్యాత జపనీస్ యానిమేటర్ హయావో మియజాకీ శైలిలో గీసిన ఫ్యామిలీ, వ్యక్తిగత చిత్రాలతో నిండిపోతున్నాయి. గిబ్లీ ఆర్ట్ పేరు పెట్టుకున్న ఈ చిత్రాల ధోరణి నాలుగు దశాబ్దాల పాటు యానిమేషన్ రంగంలో ఎన్నో ప్రఖ్యాత క్యారెక్టర్లను సృష్టించిన గిబ్లీ స్టూడియో నకలు అన్నది మీకు తెలిసే ఉంటుంది. తేలిక పాటి పేస్టల్ షేడ్స్‌లో క్యారెక్టర్ల చిత్రీకరణ దీని హైలైట్. ప్రస్తుతానికి ఈ గిబ్లీ ఆర్ట్ అన్నది ఏఐ ప్లాట్‌ఫామ్స్ కొన్నింటిలో ఉచితంగా లభిస్తోంది. కొన్ని క్లిక్‌ల సాయంతో ఏ చిత్రాన్నైనా గిబ్లీ ఆర్ట్‌గా మార్చేయవచ్చు. సెలబ్రిటీలు, రాజకీయ నేతలు, ఫ్యాషన్, స్పోర్ట్స్ ఇన్‌ఫ్లుయెన్సర్లతో పాటు కొన్ని కోట్ల మంది ఇప్పటికే ఈ గిబ్లీ ఆర్ట్‌ను వాడేశారు.



గిబ్లీ ఇమేజ్: ఏఐ మోడళ్లకు శిక్షణ ఇచ్చేందుకు ఏ కంపెనీ కూడా గిబ్లీ స్టూడియో చిత్రాలను వాడుకునే హక్కులు తీసుకోలేదు.

- జనరేటివ్ ఏఐ మోడళ్లు ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా సృజనాత్మక రంగాల్లో పని చేస్తున్నవారి జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయి.
- కొన్ని లక్షల మంది కళాకారులపై ఆధారపడి అభివృద్ధి అవుతున్న ప్రతి ఏఐ జనరేటివ్ మోడల్ కంపెనీ విలువ వందల కోట్ల డాలర్లు ఉంటోంది. కానీ, అసలు కళాకారులకు ఇందులో నుంచి ఏమీ దక్కడం లేదు.

సరదాగా కనబడుతున్నా...

కంటెంట్‌ను సృష్టించేందుకు ఉపయోగించే జనరేటివ్ ఏఐ టూల్స్ అందుబాటులోకి వచ్చి కొంత కాలం అయినప్పటికీ, 'ఓపెన్ ఏఐ' అభివృద్ధి చేసిన సరికొత్త ఏఐ టూల్ ఈ గిబ్లీ ఆర్ట్ ట్రెండ్‌కు కారణమైంది. ఛాట్‌జీపీటీ వంటి లార్జ్ లాంగ్వేజ్ మోడళ్లు మనం అందించే సమాచారం (టెక్స్ట్) ఆధారంగా మనకు కావాల్సిన సమాచారాన్ని వివిధ రూపాల్లో (ఆర్టికల్స్, సోషల్ మీడియా పోస్టులు వంటివి) తయారు చేస్తాయి. అదే గిబ్లీ ఆర్ట్ వంటివి మల్టీమీడియా జనరేటివ్ ఏఐ టూల్స్! టెక్స్ట్‌తో పాటు వీడియోలు, వాయిస్, ఫొటోలు, మ్యూజిక్ వంటి వాటినన్నింటినీ అది తీసుకోగలదు. 'మిడ్ జర్నీ', 'స్టేబుల్ డిఫ్యూషన్', 'డాల్–ఈ' వంటివి టెక్స్ట్‌ను తీసుకుని ఇమేజెస్ ఇవ్వగలవన్నది తెలిసిందే. డాల్–ఈతో ఢిల్లీ వీధుల చిత్రాలను ఎం.ఎఫ్.హుస్సేన్ లేదా జామినీ రాయ్ శైలిలో కొన్ని సెకన్ల సమయంలోనే తయారు చేయవచ్చు. ఇక 'లెన్సా' వంటివి ఇచ్చిన ఇమేజ్‌కు ప్రత్యామ్నాయాలను సృష్టిస్తాయి.

వీటితో పోలిస్తే గిబ్లీ ఆర్ట్‌కు ఎక్కువ ఆదరణ ఎందుకు లభించిందంటే... ఇవి ముద్దుగా, హాస్యస్ఫోరకంగా ఉండటమని చెప్పాలి. చూసేందుకు హాస్యస్ఫోరకంగానే ఉండవచ్చు కానీ, దీని వెనుక ఒక సీరియస్ సమస్య ఉంది. ఏదైనా ఏఐ వ్యవస్థ వాస్తవ ప్రపంచం నుంచి వచ్చే సమాచారం ఆధారంగానే పనిచేస్తుంది. ఈ సమాచారం ద్వారా ఏఐ వ్యవస్థలకు శిక్షణ అందుతుంది. రకరకాల మార్గాల ద్వారా ఏఐ వ్యవస్థలకు డేటా (టెక్స్ట్, ఇమేజెస్, సంగీతం) అందుతూంటుంది. రస్కిన్ బాండ్ లేదా అమితవ్ ఘోష్ శైలిలో ఒక చిన్న కథ రాయమని మనం ఏదైనా లార్జ్ లాంగ్వేజ్ మోడల్‌ను అడిగామనుకోండి... వీరిద్దరి రచనల తాలూకూ సమాచారం మొత్తాన్ని వెతికేస్తుంది ఏఐ! చివరకు కాపీరైట్ హక్కులున్న సమాచారం కూడా. కానీ ఏఐ కంపెనీలు ఈ కాపీరైట్ హక్కులు పొందకపోవడం గమనార్హం. గిబ్లీ ఆర్ట్ విషయంలోనూ ఇదే జరుగుతోంది. ఏఐ మోడళ్లకు శిక్షణ ఇచ్చేందుకు ఏ కంపెనీ కూడా గిబ్లీ స్టూడియో తాలూకూ చిత్రాలను వాడుకునే హక్కులు తీసుకోలేదు.

బహిరంగంగా అందుబాటులో ఉన్న సమాచారాన్నే తాము వాడుకుంటున్నట్లు ఏఐ కంపెనీలు చెబుతున్నా... రచయితలు, కళాకారుల స్పందన వేరుగా ఉంది. కాపీరైట్ చట్టాల్లోని 'ఫెయిర్ యూజ్' సిద్ధాంతం గురించి ఏఐ కంపెనీలు చదివితే మేలని వీరు అంటున్నారు. అప్పుడే అమెరికా, యూరప్‌లలో న్యాయపోరాటాలైతే మొదలయ్యాయి.

సృజనకారులకు దక్కేదేమిటి?

గిబ్లీ ఆర్ట్ వంటి ఏఐ టూల్స్ అసలు సృజనాత్మకత అన్న అంశం పైనే సవాళ్లను లేవనెత్తుతున్నాయి. ఓ అందమైన పెయింటింగ్, కార్టూన్ క్యారెక్టర్, సంగీతం... ఇవన్నీ మనిషి సృజనకు మచ్చుతునకలు. ఇవన్నీ ఆ యా వ్యక్తుల సొంత అనుభవాలు, సందర్భాల నుంచి పుట్టుకొచ్చినవి. గిబ్లీ ఆర్ట్‌నే ఉదాహరణకు తీసుకుందాం. జపాన్ సమాజం, సంస్కృతులకు అది అద్దం పడుతుంది, అమెరికన్ సంస్కృతికి వాల్ట్ డిస్నీ స్టూడియో అద్దం పట్టినట్లు!

ఇలాంటి సృజనాత్మక కళాకృతులను యంత్ర సృష్టిగా మార్చడం లేదా ఒక ఏఐ సిస్టమ్ మానవ సృజనాత్మకత, అభినివేశాలకు విరుద్ధంగా వెళ్లడం మేలైన ఆలోచనైతే కాదు. ఒక పెయింటింగ్‌ను పూర్తి చేసేందుకు కళాకారుడికి కొన్ని నెలల సమయం పట్టవచ్చు. అలాగే పుస్తకం రాయడానికి ఏళ్లు పడుతుంది. ఒక కార్టూన్ లేదా యానిమేషన్ స్ట్రిప్ తయారు చేసేందుకు ఆర్టిస్టులు వందల గంటలు కష్టపడాల్సి రావచ్చు. వీటన్నింటి ఆధారంగా పనిచేసే ఏఐ సృష్టించే ఆర్ట్‌కు పేరు, డబ్బు... రెండూ అసలు కళాకారులకే దక్కాలి. అందుకే ఏఐ కంపెనీలు డేటా లాండరింగ్‌కు పాల్పడుతున్నాయనీ, కళాకారులకు దక్కాల్సిన డబ్బు, క్రెడిట్ రెండింటినీ ఎగ్గొడుతున్నాయనీ విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు. కొన్ని లక్షల మంది కళాకారులపై ఆధారపడి అభివృద్ధి అవుతున్న ప్రతి ఏఐ జనరేటివ్ మోడల్ కంపెనీ విలువ వందల కోట్ల డాలర్లుగా ఉండటం ప్రస్తావనార్హం. ఇవి వినియోగదారుల నుంచి వేల డాలర్ల రుసుము వసూలు చేస్తూంటాయి. అయితే, అసలు కళాకారులకు ఇందులోంచి ఏమీ దక్కడం లేదు.

ఇమేజ్ జనరేటర్లు కళాకారులు కాదు కానీ... కళాకారులకు సవాలు విసురుతున్నాయి. జనరేటివ్ ఏఐ మోడళ్లు ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా సృజనాత్మకత కలిగిన వారి జీవనోపాధిని దెబ్బ తీస్తున్నాయి. యానిమేషన్ రంగంలోని కళాకారులు, ఇల్లస్ట్రేటర్లు, డిజైనర్లపై ప్రభావం ఎక్కువే ఉంది. పైగా మానవ కళాకారులతో పోలిస్తే ఏఐ తయారు చేసే బొమ్మల్లో డెప్త్, భావ ప్రకటన తక్కువ. ఏఐ ఆకృతులు ఓ మోస్తరువి మాత్రమే!

ఒప్పందాలు మేలా?

ఇప్పుడు డిజిటల్ ప్రపంచం మొత్తం గిబ్లీ వంటి ఉచిత ఏఐ టూల్స్ ఉత్పత్తులతో నిండిపోయింది. సినిమా స్టుడియోలు, నెట్‌వర్క్‌లు ఇప్పటికే ఈ ఏఐ టూల్స్‌ను శ్రమ, ఖర్చులు రెండూ తగ్గించేవిగా చూస్తున్నాయి. పదుల కొలదీ యానిమేటర్ల బృందాలను నియమించుకునే బదులు, కొందరు ఏఐ టెక్నికల్ డైరెక్టర్లను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఈ ధోరణి మనదేశంలో ఆందోళనకు కారణం అవుతోంది. వేల మంది భారతీయ టెకీలు హాలీవుడ్ స్టూడియోలు ఔట్‌సోర్స్ చేసే యానిమేషన్ వర్క్‌పై ఆధారపడి ఉన్నారు. వాళ్లు కంప్యూటర్ గ్రాఫిక్స్, ఇతర టూల్స్‌ను వాడుతున్నారు. కానీ ఏఐ టూల్స్‌తో ఆటోమేషన్ మరో స్థాయికి వెళ్తుంది.

ఈ సమస్యకు సులభ పరిష్కారం లేదు. కాపీరైట్ల విషయంలో న్యాయ స్థానాలకు వెళ్లడం ఒక మార్గం. డేటా ప్రొటెక్షన్ చట్టాలు, ఏఐ నియంత్రణలు ఇప్పుడిప్పుడే ఏఐ టూల్స్ తాలూకూ సైడ్ ఎఫెక్ట్స్‌పై దృష్టి పెడుతున్నాయి. కొంతమంది పబ్లిషర్లు, పుస్తక, సంగీత కంపెనీలు ఆదాయాన్ని పంచుకునే విషయంలో ఏఐ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. తద్వారా తమ పుస్తకాలు, సంగీతం లేదా ఇతర కళలను ఏఐల శిక్షణకు ఉపయోగించుకునే వీలు ఏర్పడుతోంది. డేటా ట్రెయినింగ్ కోసం ఎటూ టెక్ కంపెనీలు తమ కళను వాడుకుంటున్నట్లు వీరు భావిస్తున్నారు. బదులుగా ఒప్పందం కుదుర్చుకోవడం మేలని వీరి ఆలోచన. అనుమతులు తీసుకుని కళలు, సమాచారాన్ని ఏఐ ట్రెయినింగ్ కోసం వాడుకోవడం ఇంకొక మార్గం. సోషల్ మీడియా వేదికలు కూడా ఏఐ ఆధారిత ఇమేజెస్, వీడియోలు, యానిమేషన్లను అనుమతించే విషయంలో ఆచితూచి వ్యవహరించాలి. ప్రస్తుత గిబ్లీ ఆర్ట్ ట్రెండ్ ముప్పు లేదని అనిపించవచ్చు. కానీ... వాస్తవానికి ఇది మనకు మేలుకొలుపు లాంటిది!

వ్యాసకర్త సైన్స్ వ్యవహారాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

ప్రచార బహుమతి



తెలివిగా ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతిగా పిలిచే 'ద నోబెల్ మెమోరియల్ ప్రైజ్ ఇన్ ఎకనామిక్ సైన్సెస్' అనేది అత్యంత గొప్ప ప్రాపగాండా సాధనం. నవ్య సంప్రదాయ 'ఫ్రీ-మార్కెట్' ఆర్థికశాస్త్రానికి అది సైన్సు హోదా కల్పించడమే కాకుండా, అత్యంత సాధారణ ఆలోచనలకు ప్రశ్నించలేని అధికారాన్ని కట్టబెట్టింది.

– అనింద్యో చక్రవర్తి, ఆర్థికాంశాల వ్యాఖ్యాత

రానున్న సంక్షోభం



చైనాను ఇంతకాలంగా కమ్యూనిస్టులు పాలిస్తుండటానికి ఏకైక కారణం... డెంగ్ హయాంలో వచ్చిన సంస్కరణలు. అవి దేశాన్ని ఆర్థికంగా వృద్ధి చేయడమే కాకుండా, సాధారణ జనాన్ని సంతృప్తిపరిచాయి. అదే సోవియట్ యూనియన్‌లో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. అలాగే కమ్యూనిస్టులు! నేపాల్‌లోనూ అదే జరగనుంది.

– మోనికా వర్మ, పరిశోధకురాలు

దైవ క్షణాలు



దేవుడితో మీ సంబంధం మీరు ఎన్నిసార్లు ప్రార్థనాలయానికి వెళ్తారు అన్నదానితో రుజువు కాదు. అది మీరు ఎలా జీవిస్తారు? ఇతరులతో ఎలా ప్రవర్తిస్తారు? మీరు బాగా చేయగలిగేవాటిల్లో ఎంత బాధ్యతగా ఉంటారు? మీ ఆత్మ ఎంత తేలిగ్గా ఉంది అన్నదానిలో వ్యక్తమవుతుంది.

– నికా సోలే, హీలర్

నగదులోనూ చెల్లించేలా...



ప్రతి ఒక్కరికీ నగదు రూపంలో చెల్లించే హక్కు ఉందని హంగరీలోని రైట్ వింగ్ ప్రభుత్వం చట్టం చేసింది. వాళ్లు నగదు రహిత ఎజెండాను తిరస్కరిస్తున్నారు. ఇది పెద్ద వార్తే.

– పీటర్ స్వీడన్, జర్నలిస్ట్

ఎప్పుడు మారుతాం?



గత 8 నెలల్లో నేను 9 దేశాలకు వెళ్లొచ్చాను. నేను గమనించినవి: 1. హారన్ కొట్టడం ఒక్క ఇండియాలోనే జరుగుతుంది. 2. వరుస మారడం ఇండియాలోనే జరుగుతుంది. 3. రోడ్ల మీద కొట్లాటలు ఇండియాలోనే జరుగుతాయి. 4. ఓవర్ టేకింగ్ ఇండియాలోనే జరుగుతుంది. 5. బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన ఇండియాలోనే జరుగుతుంది. ఇండియా ఎప్పుడు మారుతుంది?

– షాజన్ సామ్యూల్, అల్ట్రా రన్నర్

చెత్తబుట్టా?



కోడి కాళ్లను ఇండియా దిగుమతి చేసుకోవాల్సిన అవసరం లేదు. అవి అమెరికాకు పనికిరాని ఉత్పత్తి. అమెరికా ఆహార వృథాకు ఇండియా చెత్తబుట్ట కాదని మనం తెలుసుకోవాలి.

– దేవీందర్ శర్మ, కాలమిస్ట్

ఎలా చూస్తున్నారు?



ఐపీఎల్ చూస్తుంటే మీకు బోర్ కొట్టట్లేదా? అరిగిపోయి, ఆగిపోయిన రికార్డులాగా అదే శబ్దం ఎడతెరిపి లేకుండా మళ్లీ మళ్లీ!

– ప్రదీప్ మ్యాగజీన్, రచయిత

ఇన్ బాక్స్

'ఫూలే' సినిమాపై అభ్యంతరాలా?

మూడు వేల ఏళ్ల కులవ్యవస్థ బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడిన మానవతావాది మహాత్మా ఫూలే. ఆయనపై అనంత్ మహాదేవన్ దర్శకత్వంలో ప్రముఖ నటులు ప్రతీక్ గాంధీ, పత్రలేఖ ప్రధాన పాత్రలలో... 'ఫూలే' సినిమా తయారయింది. ఈ చిత్రం 2025 ఏప్రిల్ 11న విడుదల కావాల్సి ఉంది. కానీ ఈ సినిమా బ్రాహ్మణ సమాజాన్ని తప్పుగా చూపిస్తుందనీ... కులవాదాన్ని ప్రోత్సహిస్తుందనీ బ్రాహ్మణ ఫెడరేషన్ అధ్యక్షుడు ఆనంద్ దవేతో పాటు పలు బ్రాహ్మణ సంఘాలు ఆరోపించడంతో సినిమా విడుదల వాయిదా పడింది. వారి అభ్యంతరాల కారణంగా... సెన్సార్ బోర్డు కూడా కుల సంబంధిత పదాలను తొలగించాలని సూచించింది. అయితే స్వయంగా బ్రాహ్మణుడైన ఈ చిత్ర దర్శకుడు అనంత్ మహాదేవన్ ఈ ఆరోపణలను ఖండిస్తూ, సినిమా చారిత్రక వాస్తవాల ఆధారంగా రూపొందిందనీ, ఎటు వంటి అజెండా లేదనీ చెప్పారు.



మూడు వేల ఏళ్ల పాటు ఈ దేశంలోని మెజారిటీ వర్గాల ప్రజలకు క్షుద్రులు, శూద్రులు, మ్లేచ్ఛులు, ఛండాలురు అనే పేర్లు తగిలించి... బానిసలుగా చూసిన అమానుష కులవ్యవస్థ ఈ దేశంలో రాజ్యమేలింది. తమ స్వార్థం కోసం మతాన్ని, సమాజాన్ని భ్రష్టు పట్టించిన ఆ మనువాదుల దౌర్జన్యాలను ఒంటరిగా ఎదిరించిన ధీశాలి ఫూలే. 'మనుషులందరినీ పుట్టించినవాడు దేవుడే అయినప్పుడు... ఒక తండ్రి తన బిడ్డలలో కొందరు ఎక్కువ కొందరు తక్కువ... కొందరు ద్విజులు, కొందరు పంచములు అంటూ ఎలా శాసిస్తాడు? ఇవన్నీ మీరు రాసిన అబద్ధపు రాతలు! ఇక ఈ అకృత్యాలను కట్టిపెట్టండి!' అంటూ గర్జించి, స్వార్థపర వర్గాల దౌర్జన్యాలపై సమర శంఖం పూరించాడు మహాత్మా ఫూలే.

శూద్ర బిడ్డలకూ, స్త్రీలకూ చదువు చెప్పడానికి పుణే వీధుల్లో సావిత్రిబాయి ఫూలే వెళుతుంటే... అగ్రవర్ణాలు రాళ్లు వేసే దృశ్యాన్ని తొలగించాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. ఫూలే జీవిత చరిత్రలో ఆయన ఎదుర్కొన్న అవరోధాల ప్రస్తావన ఉండకపోతే... మరేమి ఉంటుంది? జరిగిన చరిత్రను చూపెడితే... మనోభావాలు దెబ్బతిన్నాయంటూ బుకాయిస్తే ఎలా?

– ఆర్. రాజేశమ్, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్

తెలుగు సంస్కృతీరాజం రామరాజీయం

సందర్భం



ఆర్వీయస్ సుందరం

ఆచార్య బిరుదురాజు రామరాజు గురించిన ఆలోచన రాగానే సంస్కృతి, సంప్రదాయం, సాధన, విద్వత్తు మూర్తీభవించిన వ్యక్తిని మనో నేత్రంతో చూస్తాం. 55 ఏళ్ళనాడు పరిచయమైన రామరాజుగారు కీర్తిశేషులయ్యేవరకు నా మీద చూపిన వాత్సల్యం ఎప్పటికీ గుర్తుంటుంది. వయసులో చిన్నవాళ్ళయినా ప్రేమతోబాటు గౌరవం చూపే సౌజన్యం ఆయనది. దీన్ని ఎన్నో సందర్భాలలో నేను చవిచూచాను. 24 సంవత్సరాల వయస్సులోనే నన్ను ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖకు పిలిపించి తెలుగు ఎం.ఎ. విద్యార్థులకు జానపద సాహిత్యం మీద ఉపన్యాసం ఇప్పించారాయన. 26 ఏళ్ళ వయస్సులోనే పిహెచ్.డి. పరీక్షకునిగా చేశారు. 27 ఏళ్ళ వయసులో ఆంధ్రప్రదేశ్ జానపద సాహిత్య పరిషత్తు ప్రాదుర్భావ సందర్భంగా నాచేత ప్రధానోపన్యాసం ఇప్పించారు. 'గుణాః పూజాస్థానం గుణిషు నచ లింగం నచ వయః' అనే వాక్యానికి నిలువెత్తు ఉదాహరణ రామరాజుగారు.

హైదరాబాదుకు ఎప్పుడైనా వెళ్ళానంటే చిక్కడపల్లిలో రామరాజుగారి నివాసానికి వెళ్ళి గంటల తరబడి మాట్లాడవలసిందే. జానపద విజ్ఞానంలో జరుగుతున్న కొత్త పరిశోధనలను గురించి అడిగి తెలుసుకొనే ఆయన ఆసక్తి ఆశ్చర్యపరిచేది. 'నేను చెప్పిందే చివరి వాక్యం. చేసేదేదో చేసేశాను. ఇక చేయవలసింది ఏదీ లేదు' అనే మనస్తత్వం కాదు రామరాజుగారిది. ఆయన చేసిన పరి శోధన, జానపద సాహిత్యంలో ఆయన కృషి తక్కువదేమీ కాదు. 'జానపద సాహిత్యంలో పరిశోధన చేయడానికి ఏముంది?' అని భావించే రోజుల్లో పట్టుబట్టి జానపదగేయ సాహిత్యాన్ని పరిశోధనాంశంగా తీసుకున్న సందర్భం తెలుగులో జానపద పరిశోధనకు నాందీ వాక్యం పలికింది. తెలుగులో విస్తృతంగా జానపద విజ్ఞాన పరిశోధన జరగడానికి మూలకారణం రామరాజుగారే. జానపద సాహిత్య సేకరణ, వర్గీకరణ, వివేచన విషయంలో ఆయనదే ఒరవడి.

సంస్కృతి, సంప్రదాయాలు అంటే రామరాజుగారికి విపరీతమైన అభిమానం. అందువల్లనే మనకు తరతరాల వారసత్వంగా సంక్రమించిన జానపద సాహిత్యాన్ని ఆయన అంతగా అభిమానించారు. కాని అభిమానించడంతో ఆగిపోలేదాయన. జానపద సాహిత్య పరిశోధనపైన దృష్టి సారించారు. పరిశోధనతో ఆగిపోకపోవడం ఆయన ముందుచూపునకు నిదర్శనం. ఆయన పరిశోధన గ్రంథాన్ని రెండోసారి ప్రచురించేటప్పుడు 1976లో నేను ప్రచురించిన 'జానప సాహిత్య స్వరూపం' పుస్తకాన్ని చూచినట్లుగా అందులో ఉటంకించారు. ఇది వారి హృదయ వైశాల్యాన్ని తెలుపుతుంది. జానపద విజ్ఞాన అధ్యయనాన్ని గురించి శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేయడం ఈ విషయంలో ఆయన ఆసక్తిని తెలుపుతుంది.



ఆచార్య బిరుదురాజు రామరాజు

బిరుదురాజు రామరాజుగారు జానపద సాహిత్య పరిశోధనతోనే ఆగిపోలేదు. వారి సమకాలికులైన దిగ్గంతులవంటి పండితులతో సమానంగా వ్యవహరించాలని సంస్కృతంలో కూడా ఎం.ఎ. చేశారు. ప్రాచీన తెలుగు కావ్యాలవైపు దృష్టి సారించారు. ప్రాచీన రచనలను పరిచయం చేయడమే కాకుండా 'చరిత్రకెక్కని చరితార్థులు' పేరుతో విస్మృత కవులను గురించి ప్రచురించారు. ప్రాచీన తెలుగు కావ్యాలనే కాకుండా కొన్ని సంస్కృత గ్రంథాల్ని సేకరించి ప్రచురించారు. తెలుగు, సంస్కృతం మాత్రమే కాక ఆంగ్లంలో కూడా రామరాజు గారు ప్రావీణ్యం గడించారు. ఆంగ్ల గ్రంథాలను తెలుగులోకి అనువదించడమే కాకుండా 'ఫోక్లోర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' పేరుతో ఆంగ్ల గ్రంథాన్ని ప్రచురించారు. 'జానపద సాహిత్య బ్రహ్మ' అనిపించుకోవడమే కాకుండా ప్రాచీన సాహిత్య పరిశోధన, నిఘంటు రచన, చారిత్రక నవలారచన, అముద్రిత గ్రంథాల పరిష్కరణ వంటి రంగాలలో కృషి చేసిన బిరుదురాజు రామరాజుగారు చిరస్మరణీయులు.

వ్యాసకర్త సాహితీ విమర్శకులు
(నేడు హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళామందిరంలో బిరుదురాజు రామరాజు శత జయంతి సదస్సు)

శాంతం – సౌఖ్యం

'శాంతము లేక సౌఖ్యము లేదు...' అన్న త్యాగరాజ కీర్తన సంగీత కచేరీలలో ఎక్కువగా కనిపించదు. పాత రోజులలో నాగయ్య, భానుమతి వంటివారు సినిమాలలో ఈ పాట పాడటం వల్ల, ఆ పాటకూ, మాటకూ బాగా ప్రాచుర్యం ఉండేది.

ఎవరికయినా అకస్మాత్తుగా కోపం బుస్సుమని పొంగివస్తే, చనువున్న సన్నిహితులు, 'నాయనా! కోపం తగ్గించు. శాంతము లేక సౌఖ్యము లేదు!' అని త్యాగరాజు గారి పల్లవిని సామెతగా, సుభాషితంగా వాడటం శిష్ట సమాజంలో ఇప్పటికీ అప్పుడప్పుడూ వినిపిస్తుంది.



'తన కోపమె తన శత్రువు, తన శాంతమె తనకు రక్ష!' అన్న విషయం అందరికీ అనుభవవైకవేద్యమే. కోపాన్ని దూరంగా ఉంచేవాడికి, సుఖ సంతోషాలు దగ్గరగా ఉంటాయి. కాబట్టి,

దార, సుతులు, ధన, ధాన్యములుండిన, / సారెకు జప, తప సంపదలుండిన, / ఆగమ, శాస్త్రములన్నియు చదివిన,.../ భాగవతులనుచు బాగుగ పేరైన, / శాంతము లేక సౌఖ్యము లేదు! అన్న అయ్యవారి మాట వరహాల మూటే. అయితే, ఇక్కడ 'శాంతం' అంటే, క్రోధ రాహిత్యమనీ, కోపం లేకుండా వ్యవహరించటమనీ మాత్రమే అర్థం చెప్తే, అదీ మంచి మాటే! కానీ అది కొంచెం పరిమితమైన అర్థం. వాస్తవానికి, చివరి దాకా చూస్తే, త్యాగయ్య గారంటున్నది, '**... త్యాగరాజ నుత! సాధురక్షిత! తనకు 'ఉప/శాంతము' లేక సౌఖ్యము లేదు!'** అని.

ఉపశాంతం అంటే ఉపశమనం, శమింపజేయటం, నియంత్రించటం! కామ క్రోధ లోభాది ఆరు అంతశ్శత్రువులనూ అదుపులో ఉంచటం. క్షణికోద్రేకం కట్టలు తెగకుండా చూడటం. ఇంద్రియ కాంక్షల విజృంభణను నిగ్రహించటం. ఒత్తిళ్ళ వల్ల ఓర్పు కోల్పోకుండా, సంయమనంతో స్పందించటం. అటు లౌకిక విషయాలలో గానీ, ఇటు ఆధ్యాత్మిక సాధనలలో గానీ పురోగతి కోరేవాడికి, ఇది అత్యావశ్యకమైన గుణం అనడంలో సందేహానికి ఆస్కారం లేదు!

– మారుతి శాస్త్రి

సరస్వతి పుష్కరాలకు ఘనంగా ఏర్పాట్లు

- మే 15 నుంచి 26 వరకు కాళేశ్వరంలో పుష్కరాలు
- వెబ్ పోర్టల్, మొబైల్ యాప్‌ను ప్రారంభించిన మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా

సాక్షి, హైదరాబాద్/కాళేశ్వరం: సరస్వతి నది పుష్కరాలను కాళేశ్వరంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. పుష్కరాల వివరాలను భక్తులు సులభంగా తెలుసుకునేలా వెబ్ పోర్టల్‌ను, మొబైల్ యాప్‌ను సచివాలయంలో మంత్రి కొండా సురేఖతో కలిసి ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సరస్వతి నది అంతర్వాహినిగా ప్రవహిస్తోందన్న నమ్మకంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరం త్రివేణీ సంగమం వద్ద పుష్కరాలు నిర్వహిస్తూ వస్తున్నారు. 2013 తర్వాత మళ్లీ ఇప్పుడు మే 15 నుంచి 26 వరకు 12 రోజుల పాటు పుష్కరాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. మే 15న గురుమదనానంద సరస్వతీ పీఠానికి చెందిన మాధవానంద సరస్వతి స్వామి పుష్కర స్నానం చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారు. 17న తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి, 18న పుష్పగిరి పీఠాధిపతి విద్యా శంకర భారతీ స్వామి, 19న నాసిక్ త్రయంబకేశ్వర్‌కు చెందిన సంవిదానంద సరస్వతి మహరాజ్, 23న హంపి విరూపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి పుష్కరాల్లో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

ఇకపై గ్రామీణ ఉద్యోగులకు సకాలంలో జీతాలు: సీతక్క

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో పనిచేస్తున్న వివిధ విభాగాల గ్రామీణ ఉద్యోగులకు మే నెల నుంచి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే సకాలంలో జీతాలు అందనున్నాయి. పీఆర్ ఆర్‌డీ శాఖ పంపించిన ప్రతిపాదనకు తాజాగా ఆర్థిక శాఖ ఆమోదం లభించింది. దీంతో దాదాపు 93 వేల మందికి ఇకపై సకాలంలో జీతాలు అందనున్నట్టుగా ప్రభుత్వవర్గాల సమాచారం. ఈ మొత్తం 93 వేల ఉద్యోగులు, సిబ్బందికి ప్రతినెల రూ. 117 కో ట్లు జీతాలకు ఖర్చుకానున్నాయి. దీనికి సంబంధించి పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క చొరవతో నూతన విధానం అమల్లోకి రానుంది. సీతక్క ఆదేశాల తో ఆన్‌లైన్ వ్యవస్థను పీ ఆర్ ఆర్డీ సెక్రటరీ లోకేశ్ కుమార్, డైరెక్టర్ సృజన ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ప్రతినెలా 25న ఆన్‌లైన్‌లో ఉద్యోగుల హాజరు తెప్పించుకుని, 26న బిల్ జనరేట్ చేసి ఏకకాలంలో ప్రభుత్వం జీతాలు చెల్లించనుంది.

దుబాయ్‌లో తెలంగాణవాసుల హత్య

మృతుల్లో ఒకరిది నిర్మల్ జిల్లా, మరొకరిది జగిత్యాల జిల్లా

- విద్వేషంతో నరికి చంపిన పాకిస్తానీ
- విదేశాంగ అధికారులతో మాట్లాడిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్
- మృతదేహాలను త్వరగా భారత్‌కు తీసుకురావాలని వినతి

సోన్/నిర్మల్/ధర్మపురి/ఆర్మూర్ టౌన్: పొట్టకూటి కోసం దుబాయ్ వలస వెళ్లిన ఇద్దరు తెలంగాణ వ్యక్తులు దారుణ హత్యకు గురయ్యారు. వీరు దుబాయ్‌లోని అల్‌క్యూజ్ ప్రాంతంలో మోడర్న్ బేకరీలో పనిచేస్తున్నారు. వీరితోపాటు అక్కడే పనిచేస్తున్న పాకిస్తాన్‌కు చెందిన వ్యక్తి వీరిని కత్తితో విచక్షణారహితంగా నరికి చంపారు. మతవిద్వేషంతోనే వారిని చంపినట్లు అక్కడ ఉంటున్న తెలంగాణవాసులు చెప్పారు. బేకరీలో శుక్రవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాకిస్తానీ దాడిలో నిర్మల్ జిల్లాకు చెందిన అష్టపు ప్రేమ్‌సాగర్ (40), జగిత్యాల జిల్లాకు చెందిన శ్రీనివాస్ మరణించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన దేగాం సాగర్‌కు గాయాలయ్యాయి. సాగర్‌ను సహోద్యోగులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దాడి ఘటనకు సంబంధించిన సమాచారాన్ని బయటకు చేరవేస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని యాజమాన్యం హెచ్చరించినట్లు వారి బంధువులు చెప్పారు.



ప్రేమ్‌సాగర్(ఫైల్)   శ్రీనివాస్   దేగాం సాగర్

చిన్న బిడ్డను చూడకుండానే..

నిర్మల్ జిల్లా సోన్ మండలానికి చెందిన ప్రేమ్‌సాగర్ (40) ఇరవై ఏళ్లుగా గల్ఫ్‌లో పనిచేస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం దుబాయ్‌లోని మోడర్న్ బేకరీలో యంత్రం ఆపరేట్ చేసే పనిలో చేరాడు. ప్రేమ్‌సాగర్‌కు తల్లి లక్ష్మి, భార్య ప్రమీల (35), కూతుళ్లు విజ్ఞశ్రీ (9), సహస్ర(2) ఉన్నారు. పదిరోజుల క్రితమే ప్రేమ్‌సాగర్ నాన్నమ్మ ముత్తమ్మ (90) చనిపోయారు. ఆమె పెద్దకర్మ చేసిన శుక్రవారం రోజే ప్రేమ్‌సాగర్ హత్యకు గురయ్యాడు. ప్రేమ్‌సాగర్ మృతి వార్తను ఆయన కుటుంబసభ్యులకు చెప్పలేదు. ప్రేమ్‌సాగర్ తన చిన్నకూతురు సహస్ర తల్లి కడుపులో ఉన్నప్పుడే దుబాయ్ వెళ్లాడు. తను పుట్టినప్పటి నుంచి గ్రామానికి రాలేదు. బిడ్డను చూడకుండానే ఆయన తనువు చాలించడం స్థానికులను కలచివేస్తోంది. కాగా, దుబాయ్‌లో మరణించిన జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన స్వర్గం శ్రీనివాస్ (42)కు భార్య మంజుల, ఇద్దరు కుమారులు, తల్లి ఉన్నారు. శ్రీనివాస్ మృతి విషయం ఆయన తల్లి రాజవ్వకు ఇంకా చెప్పలేదు. ప్రేమ్‌సాగర్ కుటుంబానికి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అండగా నిలిచారు. మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి తీసుకురావడంతోపాటు నిందితులపై కఠినచర్యలు తీసుకునేలా చూడాలని విదేశాంగ శాఖను కోరారు.

విదేశాంగ శాఖ మంత్రికి కిషన్‌రెడ్డి లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: ఇద్దరు తెలంగాణ వ్యక్తులను ఓ పాకిస్తానీ హత్య చేసిన ఘటనపై కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు లేఖ రాశారు. ఈ విషయంలో చొరవతీసుకుని వీలైనంత త్వరగా మృతదేహాలను స్వదేశానికి తీసుకురావడంలో సహకరించాలని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన విదేశాంగ మంత్రి జైశంకర్ ఆదేశాలకు అనుగుణంగా దుబాయ్‌లోని భారత కాన్సులేట్ అధికారులు.. బుర్ దుబాయ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కేసు వివరాలను తెలుసుకున్నారు. ఉద్దేశపూర్వక హత్యకేసుగా నమోదు చేశామని పోలీసులు వారికి చెప్పారు. కాగా, ఇద్దరు తెలంగాణ కార్మికులు మరణించడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విచారం వ్యక్తం చేశారు. భారత కాన్సులేట్ ద్వారా దుబాయ్ పోలీసులు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఆయన ప్రేమ్ సాగర్ సోదరుడు అష్టపు సందీప్‌తోనూ మాట్లాడారు.

అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వండి



- భారత్ రావడానికి సిద్ధమే
- ట్యాపింగ్ కేసులో హైకోర్టుకు ప్రభాకర్‌రావు విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో తనను అరెస్టు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని, భారత్‌కు రావడానికి సిద్ధంగా ఉన్నానని నిందితుడు ప్రభాకర్‌రావు (ఏ–1) హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రధాన పిటిషన్‌లో మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం ముందు మంగళ వారం వాదోపవాదాలు జరిగాయి. తనను అన్యా యంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇరికించారని, అరెస్టు కాకుండా ముందస్తు బెయిల్ ఉత్తర్వులు జారీ చేయాలంటూ ప్రభాకర్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 65 ఏళ్ల సీనియర్ సిటి జన్‌నని, తన వైద్య, ఆరోగ్య పరిస్థితులు, వైద్యం చేయించుకునే అంశాలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు మంగళవారం మరోసారి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రభాకర్‌రావు వారంలో భారత్ రావడానికి సిద్ధంగా ఉన్నారని, పోలీసులు వెంటనే అదుపు లోకి తీసుకునే అవకాశం ఉన్నందున అరెస్టు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సుప్రీంకోర్టు ఏ–6 శ్రవణ్‌కుమార్‌ను అరెస్టు చేయకుండా తాత్కాలిక ఆదేశాలు ఇచ్చిందని, అదే ఉత్తర్వులను ప్రభాకర్‌రావుకూ వర్తింపజేయాలన్నారు. ఈ మేరకు సుప్రీంకోర్టు ఉత్తర్వు ప్రతిని అందజేశారు. నిరంజన్‌రెడ్డి వాదనలను.. ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా తోసిపుచ్చారు. ప్రభాకర్‌రావు పాస్‌పోర్టు రద్దయిందని, రెడ్ కార్నర్ నోటీసులు కూడా జారీ చేశారని గుర్తు చేశారు. ఆయన తనంతట తానుగా వారంలో భారత్‌కు వస్తున్నారని చెప్పడం అసత్యమని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణను ఈ నెల 25కు వాయిదా వేశారు. ప్రభుత్వం తరఫున లూథ్రాతో పాటు పీపీ పల్లె నాగేశ్వర్‌రావు విచారణకు హాజరయ్యారు.

మన పోలీసింగ్ అదుర్స్..

▶ మొదటి పేజీ తరువాయి

తదితర అంశాలన్నీ కలిపి జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. అన్ని విభాగాల్లో కలిపి గత నివేదికలో 11 స్థానంలో నిలిచిన తెలంగాణ ఈ ఏడాది మూడో స్థానానికి ఎగబాకడం గమనార్హం. కాగా అన్ని అంశాల్లో కలిపి 2025లో కర్ణాటక మొదటి స్థానంలో ఉండగా, ఏపీ రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో తెలంగాణ, కేరళ, తమిళనాడు నిలిచినట్టు నివేదిక వెల్లడించింది.

50 శాతం పెరిగిన ఖైదీల సంఖ్య

జాతీయ స్థాయిలో పోలీస్–పౌరుల నిష్పత్తి పరిశీలిస్తే.. ప్రతి లక్ష మంది పౌరులకు 155 మంది పోలీసులు ఉన్నట్టు నివేదిక తెలిపింది. బిహార్‌లో అతి తక్కువగా ప్రతి లక్షమంది పౌరులకు 81 మంది మాత్రమే పోలీసులు ఉన్నట్టు పేర్కొంది. కాగా గత దశాబ్దకాలంగా దేశవ్యాప్తంగా జైళ్లలో ఖైదీల సంఖ్య 50 శాతం పెరిగినట్టు నివేదిక వెల్లడించింది. ఇందులో అండర్ ట్రయల్ ఖైదీల సంఖ్య గతంతో పోలిస్తే 66 శాతం నుంచి 76 శాతానికి చేరినట్టు తెలిపింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల బడ్జెట్‌లలో క్రిమినల్ జస్టిస్ సిస్టంకు ఇస్తున్న కేటాయింపులలో అత్యధిక భాగం జీతభత్యాలకే ఖర్చవుతుండగా, అతికొద్ది మొత్తం మాత్రమే మౌలిక వసతుల కేటాయింపునకు ఖర్చు చేస్తున్నట్టు నివేదిక వెల్లడించింది. అదేవిధంగా పోలీస్‌శాఖలో మహిళల సంఖ్య 8 శాతం మాత్ర మే ఉన్నట్టు తెలిపింది. మహిళా అధికారుల సంఖ్య 10 శాతానికే పరిమితం అయినట్టు వివరించింది. తెలంగాణ పోలీస్‌శాఖలో మహిళా సి బ్బంది సంఖ్య 8.7 శాతం కాగా, మహిళా అధికారుల సంఖ్య 7.6 శాతంగా ఉందని ఐజేఆర్ తెలిపింది.

ఉత్తమ పోలీసింగ్‌లో టాప్ ఐదు రాష్ట్రాలు ఇవే..

రాష్ట్రం	స్థానం
తెలంగాణ	1
ఆంధ్రప్రదేశ్	2
కర్ణాటక	3
ఛత్తీస్‌గఢ్	4
మహారాష్ట్ర	5

38 మంది జిల్లా జడ్జీల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 38 మంది జిల్లా, సెషన్స్ జడ్జీలను బదిలీ చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ చైర్మన్‌గా డి.రమేశ్‌బాబు, వరంగల్‌లోని కో–ఆపరేటివ్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా పి.నారాయణబాబుతో పాటు పలువురు జడ్జీలకు కొత్త ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు.

ట్రంప్‌కు కీలెరిగి వాత

చైనా ఖనిజ ఎగుమతుల నిషేధంపై నిపుణులు • అమెరికా రక్షణ వ్యవస్థపై పెను ప్రభావం

అరుదైన ఖనిజాల ఎగుమతుల నిలిపివేత ద్వారా అమెరికాను చైనా నేరుగా కుంభస్థలంపైనే కొట్టిందని పరిశీలకులు అంటున్నారు. దీని ప్రభావం అమెరికా రక్షణ శాఖపై భారీగా ఉండనుందని చెబుతున్నారు. ముఖ్యంగా ఫైటర్ జెట్లు తదితరాల తయారీని ఇది తీవ్రంగా ప్రభావితం చేయడం ఖాయంగా కన్పిస్తోంది. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తవుతున్న మొత్తం అరుదైన ఖనిజాల్లో ఏకంగా 70 శాతం వాటా చైనాదే! అమెరికా వాటా 11.4 శాతం. కానీ దేశీయ, ముఖ్యంగా రక్షణ అవసరాలను తీర్చేందుకు ఆ నిల్వలు ఏ మూలకూ చాలవు. మలేసియా, జపాన్ సహా పలు దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నా అవి 30 శాతం అవసరాలనే తీర్చగలుగుతున్నాయి. దాంతో మరో దారిలేక అగ్ర రాజ్యం ఇంతకాలంగా చైనా దిగుమతులపైనే ప్రధానంగా ఆధారపడుతూ వస్తోంది. తన అరుదైన ఖనిజ అవసరాల్లో 70 శాతం అక్కడినుంచే దిగుమతి చేసుకుంటోంది. చైనా ఇప్పుడు సరిగ్గా గురి చూసి ఆ కీలకమైన సరఫరా లింకును మొత్తానికే తెగ్గొట్టింది. 17 రకాల అరుదైన ఖనిజాల్లో సమారియం, గాడోలినియం, టెర్బియం, డైస్ప్రోరియం, లుటేటియం, స్కాండియం, ఇత్రియం రూపంలో ప్రస్తుతానికి ఏడింటికి ఎగుమతుల నిషేధాన్ని వర్తింపజేసింది. వీటితో పాటు పలు కీలక లోహాలు, అయస్కాంత వస్తువులను కూడా ఈ జాబితాలో చేర్చింది. ఇకపై చైనా కంపెనీలు వీటిని ఎగుమతి చేయాలంటే ప్రత్యేక లైసెన్సులు తీసుకోవాల్సిందే. చైనా నిర్ణయం పలు అమెరికానే గాక చాలా దేశాలనూ ప్రభావితం చేయనుంది. ముఖ్యంగా యూరప్ దేశాలకైతే పిడుగుపాటే. వాటి అరుదైన ఖనిజాల అవసరాల్లో సగటున 46 శాతం దాకా చైనా దిగుమతులపైనే ఆధారపడుతున్నాయి.

అన్నింట్లోనూ అవే కీలకం

ఫైటర్ జెట్లు మొదలుకుని కీలకమైన రక్షణ వ్యవస్థలన్నింట్లోనూ అరుదైన ఖనిజాలది కీలక పాత్ర. ఎఫ్‌-35 యుద్ధ విమానాలు, వర్జీనియా-కొలంబియా శ్రేణి జలాంతర్గాములు, తోమహాక్ క్షిపణులు, రాడార్ వ్యవస్థలు, ప్రిడేటర్ శ్రేణి మానవరహిత వైమానిక వాహనాలు, మ్యునిషన్ సిరీస్ స్మార్ట్ బాంబులు... ఇలా దేని తయారీకైనా అవి కావాల్సిందేనని సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ వివరించింది.

- ఒక ఎఫ్‌-35 యుద్ధ విమానం తయారీకి 900 పౌండ్ల (400 కిలోల) మేరకు అరుదైన ఖనిజాలు కావాలి.
- అర్లే బ్రూక్ శ్రేణి డీడీజీ-51 డిస్ట్రాయర్ యుద్ధనౌక తయారీకి ఏకంగా 5,200 పౌండ్లు (2,300 కిలోలు) అవసరం.
- అదే వర్జీనియా శ్రేణి జలాంతర్గామి నిర్మాణానికి 9,200 పౌండ్ల (4,173 కిలోల) అరుదైన ఖనిజాలు అవసరం.

అనుమానమే నిజమైంది

అత్యంత కీలకమైన ఖనిజ అవసరాల కోసం చైనాపై ఆధారపడటం ఎప్పటికైనా ప్రమాదమేనని అమెరికా రక్షణ శాఖ ముందునుంచీ మొత్తుకుంటూనే ఉంది. ఇది జాతీయ భద్రతకే ముప్పని 2024 మార్చి 11న అధ్యక్షునికి పంపిన ఓ నోట్‌లో స్పష్టంగా పేర్కొంది కూడా. ఈ విషయంలో అమెరికాతో పాటు ప్రపంచ దేశాల్లో చాలావరకు చైనామీదే ఆధారపడాల్సి రావడంపై తీవ్ర ఆందోళన వెలిబుచ్చింది. ఆ భయాలే ఇప్పుడు నిజమయ్యాయి. రక్షణ పాటవం పెంచుకోవడంలో అమెరికా, చైనా కొన్నేళ్లుగా నువ్వా, నేనా అన్నట్టుగా పోటీ పడుతున్నాయి. కీలక ఖనిజాలపై ఆంక్షలతో ఈ పోటీలో అగ్ర రాజ్యాన్ని దాటి చైనా దూసుకెళ్లేలా కన్పిస్తోంది. ఈ సమస్యను అధిగమించే మార్గాలపై అమెరికా రక్షణ శాఖ కొంతకాలంగా గట్టిగా దృష్టి సారించింది. దేశీయంగా అరుదైన ఖనిజాల ఉత్పత్తి సామర్థ్యాన్ని ఇతోధికంగా పెంచుకునేలా 'మైన్ టు మాగ్నెట్' పేరిట ఐదేళ్ల ప్రణాళికను సిద్ధం చేసింది. కానీ ఆలోగా జరిగే అపార నష్టాన్ని భర్తీ చేసుకునే మార్గాంతరాలు కన్పించక ట్రంప్ సర్కారు తలపట్టుకుంటోంది.



2024లో దేశాలవారీగా అరుదైన ఖనిజాల ఉత్పత్తి

దేశం	ఉత్పత్తి (టన్నుల్లో)
చైనా	2.7 లక్షలు
అమెరికా	45,000
మయన్మార్	31,000
ఆస్ట్రేలియా	13,000
థాయ్‌లాండ్	13,000
నైజీరియా	13,000
భారత్	2,900
రష్యా	2,500

– సాక్షి, నేషనల్ డెస్క్

ఆందోళనకరమే

- ఖనిజాలపై చైనాతో చర్చిస్తాం
- ట్రంప్ ఆర్థిక సలహాదారు

వాషింగ్టన్: అరుదైన ఖనిజాలు, కీలక లోహాలు, అయస్కాంత పదార్థాల ఎగుమతులను నిలిపేస్తూ చైనా తీసుకున్న నిర్ణయం అమెరికాను తీవ్ర ఆందోళనకు గురిచేసే అంశమేనని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆర్థిక సలహాదారు కెవిన్ హసెట్ అంగీకరించారు. సోమవారం ఆయన వైట్‌హౌస్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. "ఆ అరుదైన ఖనిజాల అవసరం రక్షణ, టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్ తదితర రంగాలకు చాలా ఉంటుంది. చైనా నిర్ణయాన్ని లోతుగా అధ్యయనం చేస్తున్నాం. ఈ విషయమై మాకు అందుబాటులో ఉన్న అన్ని ఇతర అవకాశాలనూ పరిశీలిస్తాం" అని చెప్పుకొచ్చారు. బహుశా డ్రాగన్ దేశంతో తాము చర్చలు జరిపే అవకాశాలు లేకపోలేదన్నారు. చైనా నిర్ణయంతో పలు యూరప్ దేశాల్లో కూడా ఆటోమొబైల్స్, సెమీ కండక్టర్లు తదితర కంపెనీలు తీవ్రంగా ప్రభావితమవుతాయని అభిప్రాయపడ్డారు. ట్రంప్ ప్రతీకార సుంకాల వల్ల అమెరికా ఆర్థిక మాంద్యం కోరల్లో చిక్కుతుందన్న వాదనను హసెట్ తోసిపుచ్చారు. అమెరికా, చైనా మధ్య తీవ్రస్థాయి టారిఫ్‌ల పోరు సాగుతున్న విషయం తెలిసిందే.

ఈడీ విచారణకు రాబర్ట్ వాద్రా

మనీ లాండరింగ్ కేసులో ప్రశ్నించిన అధికారులు

న్యూఢిల్లీ: హరియాణాలో భూ ఒప్పందానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా మంగళవారం ఢిల్లీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణకు హాజరయ్యారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ) కింద అధికారులు ఆయన స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. దాదాపు 2 గంటలపాటు ప్రశ్నించారు. 56 ఏళ్ల రాబర్ట్ వాద్రా సెంట్రల్ ఢిల్లీలోని సుజన్‌సింగ్ పార్కు సమీపంలో ఉన్న తన నివాసం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని ఈడీ ప్రధాన కార్యాలయానికి నడుచుకుంటూ వచ్చారు. ఉదయం 11 గంటలకు ఈడీ ఆఫీసులోకి అడుగుపెట్టారు. ఆయన తరఫు లాయర్లు, భద్రతా సిబ్బందిని ఈడీ అధికారులు లోపలికి అనుమతించలేదు. ఈడీ ఆఫీసుకు వెళ్తూ వాద్రా మీడియాతో మాట్లాడారు. ఇది రాజకీయ ప్రేరేపితమైన కేసు తప్ప మరొకటి కాదన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం మాట్లాడినప్పుడల్లా తమ నోరు నొక్కడానికి, అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పార్లమెంట్‌లో మాట్లాడకుండా రాహుల్‌ని సైతం అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు.

హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌పై చార్జిషీట్

ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో దాఖలు చేసిన ఈడీ

- చార్జిషీట్‌పై ఈ నెల 25న న్యాయస్థానంలో విచారణ
- రూ. 2,000 కోట్ల ఆస్తులను కాజేయడానికి కుట్ర జరిగిందన్న ఈడీ
- ఆ ఆస్తుల విలువ ప్రస్తుతం రూ.5,000 కోట్లు ఉంటుందని వెల్లడి
- ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని కాంగ్రెస్ మండిపాటు
- నేడు ఈడీ కార్యాలయాల ఎదుట నిరసనలకు ఏఐసీసీ పిలుపు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు, ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు ఇతర నిందితులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శామ్ పిత్రోడా, సుమన్ దూబే, సునీల్ భండారీతోపాటు యంగ్ ఇండియా, డాటెక్స్ మెర్కండైజ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలను చార్జిషీట్‌లో నిందితులుగా చేర్చింది. రూ.2,000 కోట్ల విలువైన నేషనల్ హెరాల్డ్ ఆస్తులను దోచుకోవడానికి కుట్ర జరిగిందని, ప్రస్తుతం వాటి విలువ రూ.5,000 కోట్లు ఉంటుందని ఈడీ స్పష్టంచేసినట్లు సమాచారం. ఈ కేసులో సోనియా, రాహుల్ గాంధీలను ఈడీ గతంలో పలుమార్లు విచారించింది. వారిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడం మాత్రం ఇదే మొదటిసారి. మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ)లోని వేర్వేరు సెక్షన్ల కింద ఈ నెల 9వ తేదీన ఈ చార్జిషీట్‌ను ఈడీ దాఖలు చేసింది. ఇందులో నంబర్‌-1గా సోనియా గాంధీ, నెంబర్‌-2గా రాహుల్ గాంధీ పేర్లను ప్రస్తావించింది. ఈడీ చార్జిషీట్‌ను పరిశీలించిన ప్రత్యేక జడ్జి విశాల్ గాగ్నే దీనిపై తదుపరి విచారణను ఈ నెల 25వ తేదీకి వాయిదా వేశారు. మరోవైపు ఇదంతా రాజకీయ కక్ష సాధింపు అని కాంగ్రెస్ ఆరోపించింది.

సుబ్రమణ్య స్వామి ఫిర్యాదుతో..

నేషనల్ హెరాల్డ్ కేసుకు సంబంధించి రూ.661 కోట్ల విలువైన స్థిరాస్తులను ఈడీ ఇప్పటికే అటాచ్ చేసింది. వాటిని స్వాధీనం చేసుకుంటామని చెబుతూ ఆయా ఆస్తుల్లో ఉంటున్నవారికి నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో 2021లో ఈడీ విచారణ ప్రారంభమైంది. 2014 జూన్ 26న బీజేపీ నాయకుడు సుబ్రమణ్య స్వామి దాఖలు చేసిన ప్రైవేట్ ఫిర్యాదును ఢిల్లీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ పరిగణనలోకి తీసుకున్నారు. మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఈడీ దర్యాప్తు చేపట్టింది. సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్ తదితరులు నేరపూరిత కుట్రకు పాల్పడ్డారని ఈడీ ఆరోపిస్తోంది. నిందితులపై దర్యాప్తు చేపట్టడాన్ని సవాలు చేస్తూ ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయని పేర్కొంది. కోర్టులు ఆ పిటిషన్లను కొట్టివేశాయని, దర్యాప్తునకు అనుమతించాయని గుర్తుచేసింది.

సత్యమేవ జయతే: జైరామ్ రమేశ్

ఈడీ చార్జిషీట్‌పై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ వేధింపులపై తాము మౌనంగా ఉండే ప్రసక్తే లేదని, కచ్చితంగా పోరాడుతామని స్పష్టంచేశారు. సత్యమేవ జయతే అంటూ మంగళవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. హెరాల్డ్ ఆస్తులను స్వాధీనం చేసు కోవడం ప్రభుత్వ ప్రాయోజిత నేరమని విమర్శించారు. ప్రధాని, హోంమంత్రి బెదిరించాలని చూస్తే బెదిరిపోయే వారు ఎవరూ లేరని తేల్చిచెప్పారు. మరోవైపు సోనియా, రాహుల్‌పై చార్జిషీట్‌కు వ్యతిరేకంగా బుధవారం ఈడీ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఏఐసీసీ పిలుపునిచ్చింది.

ఏమిటీ నేషనల్ హెరాల్డ్ కేసు?

నేషనల్ హెరాల్డ్ వార్తా పత్రికను 1938లో జవహర్‌లాల్ నెహ్రూ స్థాపించారు. ఈ పత్రికను అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్(ఏజేఎల్) ప్రచురించింది. 2008లో ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో పత్రిక మూతపడింది. నేషనల్ హెరాల్డ్‌కు దేశ రాజధాని ఢిల్లీతోపాటు ప్రధాన నగరాల్లో విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. 2010లో యంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ఏర్పాటైంది. ఇందులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు 38 శాతం చొప్పున వాటాలు ఉన్నాయి. రూ.2,000 కోట్లకుపైగా విలువైన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ ఆస్తులను 2012లో యంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కేవలం రూ.50 లక్షలకు కొట్టేసిందని బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి ఆరోపించారు. దీనిపై దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. న్యాయస్థానంలో ఫిర్యాదు చేశారు.



బోయింగ్‌పై నిషేధం!

అమెరికాకు చైనా మరో షాక్ • వైమానిక కొనుగోళ్లన్నీ బంద్



బీజింగ్/బ్యాంకాక్: ప్రతీకార సుంకాల బాట పట్టిన ట్రంప్‌కు చైనా చుక్కలు చూపిస్తోంది. ఆయనకు దిమ్మతిరిగేలా రోజుకో నిర్ణయం తీసుకుంటోంది. ఆ క్రమంలో అమెరికా వైమానిక దిగ్గజం బోయింగ్‌ను చైనా అనధికారికంగా బ్లాక్ లిస్ట్‌లో పెట్టేసింది. ఆ సంస్థ నుంచి విమానాల డెలివరీలు తీసుకోవద్దని, కొత్తగా ఎలాంటి ఆర్డర్లూ ఇవ్వొద్దని దేశీయ విమానయాన సంస్థలకు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. అంతేగాక అమెరికా కంపెనీల నుంచి ఎలాంటి వైమానిక పరికరాలు, విడిభాగాలనూ కొనుగోలు చేయొద్దని కూడా పేర్కొంది. ఈ నిర్ణయంతో బోయింగ్ విమానాల నిర్వహణ భారంగా మారకుండా దేశీయ ఆపరేటర్లను ఆదుకుంటామని హామీ ఇచ్చింది. బ్లూంబర్గ్ కథనం ఈ మేరకు వెల్లడించింది. ఇప్పటికే తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిన బోయింగ్ పరిస్థితి చైనా నిర్ణయంతో పెనం నుంచి పొయ్యిలో పడింది. ఆ సంస్థకు అతి పెద్ద మార్కెట్ చైనాయే. అయితే అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో కొన్నేళ్లుగా బోయింగ్‌కు చైనా కొత్త ఆర్డర్లేవీ ఇవ్వడం లేదు. బోయింగ్ నుంచి చివరిసారిగా 2018లో విమానాలు కొనుగోలు చేసింది.

హజ్ పోర్టల్ పునఃప్రారంభం

ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా 10 వేల మందికి దరఖాస్తు చేసుకొనే అవకాశం

న్యూఢిల్లీ: హజ్ యాత్రికులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కంబైన్డ్ హజ్ గ్రూప్ ఆపరేటర్ల(సీహెచ్‌జీఓ) కోసం హజ్ పోర్టల్‌ను పునఃప్రారంభించేందుకు సౌదీ అరేబియా ప్రభుత్వం అంగీకరించినట్లు మంగళవారం తెలియజేసింది. హజ్ యాత్రలో పాల్గొనడానికి ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా 10 వేల మంది యాత్రికులకు దరఖాస్తు చేసుకొనే అవకాశం దక్కినట్లు పేర్కొంది. ఈ ఏడాది భారతదేశ ప్రైవేట్ హజ్ కోటాలో సౌదీ అరేబియా ప్రభుత్వం కోత విధించిన సంగతి తెలిసిందే. హజ్ పోర్టల్‌ను సైతం మూసివేసింది. ప్రైవేట్ ఆపరేటర్లు తగిన నిబంధనలు పాటించకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తినట్లు కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ పేర్కొంది. సౌదీ అరేబియా ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపామని, పోర్టల్‌ను పునఃప్రారంభించేలా ఒప్పించామని వెల్లడించింది. ప్రస్తుతం మీనా నగరంలో వసతులను బట్టి ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా 10 వేల మందికి మాత్రమే అవకాశం కల్పించగలమని సౌదీ అరేబియా ప్రభుత్వం తేల్చిచెప్పినట్లు పేర్కొంది.

ఈసారి సాధారణం కంటే అధిక వర్షపాతం

- ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో విస్తారంగా..
- భారత వాతావరణ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ: రైతన్నలకు శుభవార్త. ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) మంగళవారం ప్రకటించింది. వర్షపాతం 96 శాతం నుంచి 104 శాతం నమోదైతే సాధారణ వర్షపాతంగా పరిగణిస్తారు. ఈసారి దేశంలో మొత్తం దీర్ఘకాల సగటు వర్షపాతం 105 శాతంగా ఉంటుందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మోహపాత్ర తెలియజేశారు. సాధారణ వర్షపాతానికి 30 శాతం, సాధారణం కంటే అధిక వర్షపాతానికి 33 శాతం, సాధారణం కంటే అత్యధిక వర్షపాతానికి 26 శాతం అవకాశాలు ఉన్నట్లు వెల్లడించారు. రుతుపవనాల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు ఐఎండీ స్పష్టంచేసింది. తమిళనాడుతోపాటు ఈశాన్య రాష్ట్రాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని వెల్లడించింది. మొత్తం సీజన్‌లో ఎల్‌నినో పరిస్థితులు నెలకొనే అవకాశం లేదని తేల్చిచెప్పింది. 1971 నుంచి 2020 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా సీజన్ వర్షపాతం దీర్ఘకాల సగటు 87 సెంటీమీటర్లుగా నమోదైందని ఐఎండీ తెలియజేసింది. నైరుతి రుతుపవనాలు ప్రతిఏటా జూన్ 1వ తేదీకల్లా కేరళలో ప్రవేశిస్తుంటాయి. సెప్టెంబర్ రెండో వారం కల్లా రుతుపవనాల సీజన్ ముగుస్తుంది.

తమిళనాడుకు స్వయంప్రతిపత్తి!

- జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీ
- కేంద్ర–రాష్ట్ర సంబంధాలపై సమగ్ర అధ్యయనానికే...
- అసెంబ్లీలో సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై: రాష్ట్రాల హక్కులను కేంద్ర ప్రభుత్వం బలవంతంగా లాక్కొంటోందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఆరోపించారు. రాష్ట్రాలకు అధికారాలు, హక్కులు కావాల్సిందేనని తేల్చిచెప్పారు. కేంద్రం పెత్తనాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడుకు స్వయంప్రతిపత్తి(అటానమీ) సాధించే దిశగా ఆయన సంచలన నిర్ణయం తీసుకున్నారు. స్వయంప్రతిపత్తిపై అధ్యయనం చేసి, ప్రభుత్వానికి సిఫార్సులు చేయడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. స్టాలిన్ మంగళవారం రాష్ట్ర అసెంబ్లీలో మాట్లాడారు. రాష్ట్రాల చట్టబద్ధమైన హక్కులకు పరిరక్షించుకోవడానికి, కేంద్ర–రాష్ట్రాల మధ్య సంబంధాలను మరింత మెరుగుపర్చుకోవడానికే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టంచేశారు. రాష్ట్రాల హక్కులను హరిస్తున్న పరిస్థితులు దాపురించాయని, దీనికి సంబంధించి రాజ్యాంగంలోని నిబంధనలను పునఃసమీక్షించాలని చెప్పారు. కేంద్ర–రాష్ట్ర సంబంధాలపై అమల్లో ఉన్న విధానాలు, చట్టాలు, సహకార సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగం ప్రకారం కేంద్రం, రాష్ట్రాలను సమానంగా సృష్టించినట్లు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చెప్పారని గుర్తుచేశారు. పరస్పరం సహకరించుకోవాలి తప్ప ఒకదానిపై మరొకటి ఆధిపత్యం చెలాయించడానికి వీల్లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులు, అధికారాలను క్రమంగా నీరుగారుస్తూ పెత్తనం సాగిస్తోందని, రాజ్యాంగం సూచించిన సున్నితమైన సమతూకాన్ని దెబ్బతీస్తోందని ఆక్షేపించారు. బలహీనమైన రాష్ట్రాలతో బలమైన కేంద్రాన్ని నిర్మించడం సాధ్యం కాదన్నారు. సరిగ్గా 50 ఏళ్ల క్రితం తమిళనాడుకు స్వయంప్రతిపత్తి కోరుతూ అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ చరిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకొని స్వయంప్రతిపత్తిపై స్టాలిన్ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.



మంగళవారం తమిళనాడు అసెంబ్లీలో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్

రెండేళ్లలోగా పూర్తిస్థాయి నివేదిక

ఉన్నత స్థాయి కమిటీలో అశోక్‌వర్ధన్ షెట్టీ, ఎం.నాగనాథన్‌ను సభ్యులుగా నియమిస్తున్నట్లు స్టాలిన్ వెల్లడించారు. కేంద్ర–రాష్ట్ర సంబంధాలపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేసి, స్వయంప్రతిపత్తి సాధనపై సిఫార్సులు చేస్తుందని అన్నారు. 2026 జనవరి నాటికి మధ్యంతర నివేదిక, రెండేళ్లలోగా పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తుందని చెప్పారు. స్టాలిన్ ప్రకటనను విపక్ష అన్నాడీఎంకే నేతలు తప్పుపట్టారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంలో చేరి అధికారం పంచుకున్నప్పుడు స్వయంప్రతిపత్తి గురించి ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు.

పిల్లలు కిడ్నాపైతే ఆస్పత్రి లైసెన్స్ రద్దు: సుప్రీం

సాక్షి, న్యూఢిల్లీ: ఏదైనా ఆస్పత్రి నుంచి పసికందు అపహరణకు గురైతే నిర్లక్ష్యానికి శిక్షగా ఆ ఆస్పత్రి లైసెన్స్‌ను రద్దుచేయాలని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అంతర్రాష్ట్ర నవజాత శిశువుల కిడ్నాప్ రాకెట్‌లో సూత్రధారులైన 13 మంది నిందితులకు అలహాబాద్ హైకోర్టు గతంలో ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేస్తూ జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం మంగళవారం అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు, హైకోర్టులకు కీలక ఉత్తర్వులిచ్చింది. "దేశవ్యాప్తంగా అన్ని హైకోర్టులు, జిల్లా కోర్టులు పెండింగ్‌లో ఉన్న పిల్లల కిడ్నాప్‌లు, అక్రమ రవాణా కేసులపై తక్షణం దృష్టిపెట్టాలి. ట్రయల్ కోర్టుల్లోని కిడ్నాప్‌ల కేసుల వివరాలు తెప్పించుకోవాలి. ఈ మేరకు మేం సర్క్యులర్ జారీ చేసిన ఆరు నెలల్లోపు ట్రయల్ కోర్టుల్లో ఈ కేసుల విచారణ కచ్చితంగా పూర్తవ్వాలి. అవసరమైతే కేసులను ప్రతిరోజూ విచారించండి. విచారణ పూర్తవగానే హైకోర్టులు మాకు నివేదించాలి" అని ధర్మాసనం సూచించింది.

సిఫార్సులను రాష్ట్రాలు అమలుచేయాలి

"మానవుల అక్రమ రవాణా ముఖ్యంగా ఆస్పత్రుల్లో నవజాత శిశువులు, బహిరంగ ప్రదేశాల్లో చిన్నారుల కిడ్నాప్ ఉదంతాల నివారణలో రాష్ట్రాలు అవలంబిస్తున్న విధానాల్లో తీవ్ర లోపాలున్నట్లు భారతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(బర్డ్) గుర్తించింది. 2023 ఏప్రిల్ 12వ తేదీన బర్డ్ ఇచ్చిన నివేదికను రాష్ట్రాలు కూలంకషంగా పరిశీలించాలి. నివేదికలోని ప్రతి అంశాన్ని, చేసిన ప్రతి సిఫార్సును రాష్ట్రాలు తప్పక పాటించాలి. మా ఆదేశాలను తూ.చ.తప్పకుండా అమలుచేయండి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉండొద్దు" అని సుప్రీంకోర్టు ఆదేశించింది.

తీవ్రమవుతున్న కిడ్నాప్‌లు

"కిడ్నాపర్ల చెర నుంచి విముక్తి పొందిన చిన్నారులను బాలల ఉచిత, నిర్బంధ విద్య,2009 చట్టం ప్రకారం స్కూళ్లలో చేర్పించండి. వాళ్ల విద్యావసరాలు తీర్చండి" అని సుప్రీంకోర్టు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. "కిడ్నాపర్ల పంథా మారింది. వినూత్న మార్గాల్లో అపహరణ నేరాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి నిందితులకు అలహాబాద్ హైకోర్టు అత్యంత నిర్లక్ష్యంగా బెయిల్ మంజూరుచేయడం నిజంగా బాధపడాల్సిన విషయం. ఈ నిర్లక్ష్య ధోరణి కారణంగా ఇలాంటి మరెందరో నిందితులు బయటికొచ్చి పత్తాలేకుండా పారిపోతున్నారు. దీంతో కేసుల్లో పురోగతి ప్రశ్నార్థకంగా మారుతోంది. కనీసం ఆ నిందితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వారానికి ఒకసారైనా హాజరయ్యే హైకోర్టు షరతును విధిస్తే బాగుండేది. ఈ కేసుల్లో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ వైఖరి సైతం విస్మయం కల్గిస్తోంది. హైకోర్టు ఈ కేసులో బెయిల్ ఇస్తే ఇంతకాలమైనా యూపీ సర్కార్ ఎందుకు బెయిల్‌ను సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించలేదు?. ఈ కేసు తీవ్రతను రాష్ట్రప్రభుత్వం ఏమాత్రం అర్థంచేసుకోలేదు" అని సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. బాధితులు, వారి కుటుంబాలకు రక్షణ కల్పించాలని యోగి సర్కార్‌ను ఆదేశించింది. నిందితులను రెండు నెలల్లోపు పట్టుకోవాలని ఆదేశించింది.

పాక్ 'వక్ఫ్' వ్యాఖ్యలపై మండిపడ్డ భారత్

న్యూఢిల్లీ: వక్ఫ్ (సవరణ) చట్టం ముస్లింల మత, ఆర్థికపరమైన హక్కులకు విఘాతమంటూ పాక్ వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. మైనారిటీల గురించి మాట్లాడేందుకు పాక్‌కు నైతిక హక్కే లేదంటూ కేంద్రం మండిపడింది. పాక్‌వి పూర్తిగా దురుద్దేశపూరిత వ్యాఖ్యలని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ దుయ్యబట్టారు.

లా ప్యానెల్ చైర్‌పర్సన్‌గా జస్టిస్ మహేశ్వరి

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దినేశ్ మహేశ్వరి లా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. హితేశ్ జైన్, ప్రొఫెసర్ డి.పి.వర్మ పూర్తిస్థాయి సభ్యులుగా ఉంటారు. కేంద్ర న్యాయ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో ఈ మేరకు తెలిపింది. ఆయన నియామకానికి ప్రధాని నరేంద్ర మోదీ ఆమోదముద్ర వేసినట్టు ఎక్స్‌లో పేర్కొంది. 23వ లా కమిషన్ గత సెప్టెంబర్లో ఏర్పాటైంది.

హార్వర్డ్‌కు ట్రంప్ షాక్

230 కోట్ల డాలర్ల కోత • మాట విననందుకు చర్యలు


వాషింగ్టన్: ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ షాకిచ్చారు. వర్సిటీకి ఏకంగా 230 కోట్ల డాలర్ల మేరకు నిధులను నిలిపేశారు! క్యాంపస్‌లో నిరసనల నియంత్రణ, సంస్కరణల విషయంలో తన ఆదేశాలను పాటించనందుకు ఆగ్రహించి ఈ నిర్ణయం తీసుకున్నారు. హార్వర్డ్‌కు 2.2 బిలియన్ డాలర్ల ఫెడరల్ ఫండింగ్‌తో పాటు 6 కోట్ల డాలర్ల బహుళ సంవత్సరాల కాంట్రాక్టులను నిలిపేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. బ్రౌన్, కొలంబియా, ప్రిన్స్‌టన్, పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయాలకు ఇప్పటికే బిలియన్ల కొద్దీ నిధులను ట్రంప్ తగ్గించడం తెలిసిందే.

ట్రంప్ డిమాండ్లను తిరస్కరించిన హార్వర్డ్

క్యాంపస్‌లో నిరసనలు, ఇతర కార్యక్రమాలను పరిమితం చేయాలని హార్వర్డ్‌ను వైట్‌హౌస్ ఆదేశించింది. అంతేగాక, "డీఈఐ (డైవర్సిటీ, ఈక్వాలిటీ, ఇంక్లూజన్) కార్యక్రమాలను నిలిపేయండి. అడ్మిషన్ల విధానాలను మార్చండి. వర్సిటీ పాలన, నాయకత్వంలో సమూల సంస్కరణలు తెండి. పలు స్టూడెంట్ క్లబ్‌ల గుర్తింపును నిలిపేయండి" అని పేర్కొంది. ఈ మేరకు హార్వర్డ్‌కు ట్రంప్ శుక్రవారం లేఖ రాశారు. లేదంటే వర్సిటీకి అందుతున్న ఏకంగా 900 కోట్ల డాలర్ల గ్రాంట్లు, కాంట్రాక్టులు ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. కానీ ప్రభుత్వ డిమాండ్లను హార్వర్డ్ అధ్యక్షుడు అలన్ గార్బర్ తిరస్కరించారు. "వర్సిటీ స్వతంత్ర ప్రతిపత్తి విషయంలో రాజీ పడే సమస్యే లేదు. మా రాజ్యాంగ హక్కులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోం" అంటూ కుండబద్దలు కొట్టారు. దీనిపై ట్రంప్ సర్కారు మండిపడింది. అధ్యక్షుని డిమాండ్లను తిరస్కరించడం ద్వారా గీత దాటారంటూ వర్సిటీకి విద్యా శాఖ లేఖ పంపింది. తర్వాత కొద్ది గంటలకే నిధుల కోత ప్రకటన చేసింది.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 16 ఏప్రిల్ । 2025



వ్యాపారం కోసం యువతుల ఎర

వ్యాపారాన్ని పెంచుకునేందుకు కస్టమర్లకు యువతులను ఎరవేస్తూ..అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఓ పబ్‌పై చైతన్యపురి పోలీసులు దాడి చేశారు. -8లో



మొక్కలతో వనజీవికి నివాళి..

జీవితాంతం హరిత విప్లవానికి కృషి చేసిన 'వనజీవి' దరిపల్లి రామయ్య స్మరణార్థం నగర శివారులో ఓ కంపెనీ 600 మొక్కలు నాటి.. వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
39.0/25.0

నగరంలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 37, కనిష్ఠంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



సోమాజిగూడలో..

నగరంలో వడగళ్ల వాన



బేగంపేటలోని ప్రజాభవన్ సమీపంలో జలమయమైన రహదారి

నగరంలో మంగళవారం మధ్యాహ్నం పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన కురిసింది. మీర్‌పేట్, బాలాపూర్ , బేగంబజార్, నాంపల్లి, అమీర్‌పేట్, సైదాబాద్, ఎల్‌బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, ముషీరాబాద్ తదితర ప్రాంతాల్లో అకస్మాత్తుగా వర్షం కురవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సోమాజిగూడ, బేగంపేట ఏరియాలతో పాటు కొన్ని శివారు ప్రాంతాల్లో వడగండ్లు పడ్డాయి. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండగా..వర్షం కురిసిన తరువాత నగరం చల్లబడింది.
– సాక్షి, సిటీబ్యూరో



మీర్‌పేటలో వడగళ్ల దృశ్యం



క్రేజీ ఫ్రూట్స్!



గ్రేటర్‌లోకి విదేశాల నుంచి పండ్ల దిగుమతి

- న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, చిలీ, ఆస్ట్రేలియా, ఇరాన్, సౌదీ వంటి దేశాల నుంచే ఎక్కువగా..
- కివీ, చెర్రీ, ప్లమ్, పియర్, డ్రాగన్ వంటి ఖరీదైన పండ్లకు గిరాకీ ఫుల్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ నగరానికి విదేశాల నుంచి పండ్లు దిగుమతి అవుతున్నాయి. న్యూజిలాండ్, ఇరాన్, స్పెయిన్, అమెరికా, దక్షిణాఫ్రికా, చిలీ, ఆస్ట్రేలియా, చైనా, ఇటలీ, ఫ్రాన్స్, ఇరాన్, సౌదీ వంటి దేశాల నుంచి పెద్ద ఎత్తున ఫలాలు వస్తున్నాయి. ప్రధానంగా యాపిల్, కివీ, ప్లమ్, పియర్, డ్రాగన్, ఖర్జూర, చెర్రీ వంటి ఖరీదైన పండ్లు విదేశాల నుంచి హైదరాబాద్‌కు వస్తున్నాయి. విదేశాలతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, ఢిల్లీ, హర్యానా, పంజాబ్, ఒడిశా వంటి రాష్ట్రాల నుంచి కూడా కొన్ని వెరైటీల పండ్లు సరఫరా అవుతున్నాయి. కొన్ని ఫ్రూట్స్ ఏడాది పొడవునా..మరికొన్ని సీజన్ వారీగా విపణిలో అందుబాటులో ఉంటున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి ఎక్కువగా అరటి, నారింజ, దానిమ్మ, నల్ల ద్రాక్ష, పైనాపిల్, జాక్ ఫ్రూట్ వంటివి దిగుమతి అవుతున్నాయి. మోసంబీ, సీతాఫలం, బొప్పాయి, మామిడి, జామ, పుచ్చకాయ వంటి పండ్లు రంగారెడ్డి, వికారాబాద్‌లతో పాటు మహబూబ్‌నగర్, నల్లగొండ, మెదక్, నిజామాబాద్, నాగర్ కర్నూల్, గద్వాల్, వరంగల్, ఖమ్మం జిల్లాలలో సాగవుతున్నాయి.

హైదరాబాద్‌లో ప్రధానంగా బాటసింగారం, మోజంజాహీ, గుడిమల్కాపూర్, బోయిన్‌పల్లి పండ్ల మార్కెట్లు ముఖ్యమైనవి. పోషక అవసరాలను తీర్చడంలో ఉద్యానవన ఉత్పత్తులు కీలక పాత్ర పోషిస్తాయి. కరోనా తర్వాతి నుంచి ప్రజల ఆహార అలవాట్లలో స్పష్టమైన మార్పులు వచ్చాయి. ఒత్తిడి, బిజీ పనుల కారణంగా ఆరోగ్యకరమైన జీవనశైలి తప్పనిసరి. దీంతో పండ్లు, కూరగాయల వినియోగం పెరిగింది. దీంతో రైతులు కూడా వైవిధ్యమైన తోటలను సాగు చేస్తున్నారు. మరోవైపు ఉద్యానవన సాగుతో కార్మిక శక్తికి ఉపాధి అవకాశాలను అందించినట్లవుతుంది. బాటసింగారం మార్కెట్‌లోకే 2023–24లో 4,65,633 టన్నుల పండ్లు దిగుమతి అయ్యాయని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ విభాగం తెలిపింది.

రంగారెడ్డిలో 94 వేల ఎకరాల్లో సాగు..

గ్రేటర్‌లో అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో ఉద్యానవన పంటలు సాగవుతున్నాయి. ఉష్ణమండలం, సహజ వనరులు, అనువైన నేలలతో పాటు విస్తారమైన భూమి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. రంగారెడ్డి జిల్లాలో ప్రస్తుతం 94,139 ఎకరాల విస్తీర్ణంలో ఉద్యానవన పంటలు సాగవుతున్నాయి. జిల్లాలోని మొత్తం పంట విస్తీర్ణంలో ఉద్యానాల సాగు విస్తీర్ణం వాటా 30–40 శాతం వరకు ఉంటుంది. ఈ జిల్లాలో ప్రధానంగా మామిడి, జామ, తీపి నారింజ, దానిమ్మ, ఆమ్ల నిమ్మ, పుచ్చకాయ ప్రధానంగా సాగు అవుతున్నాయి. గత దశాబ్ద కాలంలో ఉద్యానవన పంటలు లాభదాయకమైన రాబడిని అందిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను సృష్టించడం, ప్రాసెసింగ్ పరిశ్రమకు ముడి పదార్థాలను అందించడం, ఎగుమతుల ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడం వంటి కారణాలతో గణనీయమైన ప్రాముఖ్యతను పొందుతుంది.

ఖరీదు ఎక్కువే..

విదేశాల నుంచి దిగుమతి అయ్యే పండ్లు ఖరీదైనవే ఉంటున్నాయి. డ్రాగన్, కివీ, ఖర్జూర, చెర్రీ వంటి పండ్లు ఎక్కువ ధర పలుకుతుండగా.. సాగు, సీజన్‌ను బట్టి మామిడి, యాపిల్, దానిమ్మ ధరలు కూడా అధికంగానే పలుకుతున్నాయి. నగరంలో డ్రాగన్ ఫ్రూట్ ధర క్వింటాల్‌కు రూ.1,13,610లుగా ఉండగా.. పియర్ రూ.30 వేలు, కివీ రూ.18,471, చెర్రీ రూ.24,975, నల్ల ద్రాక్ష రూ.17,344, ఖర్జూర రూ.16,100, మామిడి రూ.13,338, యాపిల్ రూ.15,927, దానిమ్మ రూ.14,225లుగా ఉన్నాయి. ఇక సపోటా, మోసంబీ, బొప్పాయి, నారింజ, అరటి వంటి లోకల్ ఫలాలు ధరలు కాస్త తక్కువగానే ఉన్నాయి. వీటి ధరలు రూ.2 వేల నుంచి రూ.6 వేల మధ్య ఉన్నాయి.

విదేశాల నుంచి పండ్ల దిగుమతి రకం ఇలా..

నారింజ: దక్షిణాఫ్రికా, చిలీ
యాపిల్: న్యూజిలాండ్, అమెరికా, ఇరాన్, దక్షిణాఫ్రికా, చిలీ
తెల్ల ద్రాక్ష: ఆస్ట్రేలియా, చైనా
కివీ: న్యూజిలాండ్, ఇటలీ, ఫ్రాన్స్, ఇరాన్
ప్లమ్: స్పెయిన్, అమెరికా, దక్షిణాఫ్రికా
పియర్: దక్షిణాఫ్రికా, అమెరికా, చైనా
డ్రాగన్: న్యూజిలాండ్, ఇటలీ, ఫ్రాన్స్, ఇరాన్
ఖర్జూర: ఇరాన్, సౌదీ
చెర్రీ: చిలీ



ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అయ్యే ప్రధానమైన పండ్లు..

రకం	రాష్ట్రం
నారింజ	మహారాష్ట్ర
యాపిల్	ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, కశ్మీర్
దానిమ్మ, నల్ల, తెల్ల ద్రాక్ష	కర్నాటక, మహారాష్ట్ర
పైనాపిల్	కేరళ
అరటి, సపోట, నేరేడు	మహారాష్ట్ర, ఏపీ
ప్లమ్, పియర్	ఢిల్లీ
స్ట్రాబెర్రీ	ఒడిశా, మహారాష్ట్ర
బేర్	ఏపీ, కర్నాటక, మహారాష్ట్ర
కిన్నో	పంజాబ్, హర్యానా, లక్నో
ఫిగ్ (అత్తిపండు)	కర్నాటక
జాక్‌ఫ్రూట్	ఏపీ, కర్నాటక
లిచీ	బిహార్

- 84 మంది కనెక్షన్‌దారులకు జరిమానా
- క్షేత్ర స్థాయిలో మేనేజింగ్ డైరెక్టర్ తనిఖీలు
- జలమండలి 'మోటార్ ఫ్రీ ట్యాప్' వాటర్ స్పెషల్ డ్రైవ్ ఆరంభం

'నల్లా' మోటార్లపై కొరడా!

తొలి రోజు 64 మోటార్లు సీజ్

సాక్షి, సిటీబ్యూరో:

మహానగరంలో తాగునీటి నల్లాలకు అక్రమంగా విద్యుత్ మోటార్ల వినియోగంపై జలమండలి కొరడా ఝుళిపిస్తోంది. తాగు నీటి సరఫరాలో లో–ప్రెషర్ సమస్యను తగ్గించేందుకు మంగళవారం నుంచి 'మోటార్ ఫ్రీ ట్యాప్' వాటర్ పేరిట స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టింది. ప్రధానంగా లో ప్రెషర్ ఫిర్యాదులు అధికంగా గల ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జలమండలి ఎండీ అశోక్ రెడ్డి రంగంలోకి దిగారు. క్షేత్ర స్థాయిలో సిబ్బందితో కలిసి నల్లా నీటి సరఫరాను పరిశీలించారు. మరోవైపు అన్ని డివిజన్లలో జనరల్ మేనేజర్ నుంచి లైన్‌మెన్ల వరకు స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొని పలుచోట్ల నల్లాలకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడడాన్ని గుర్తించారు. నల్లాకు విద్యుత్ మోటార్లను వినియోగిస్తున్న 84 మంది కనెక్షన్‌దారులకు జరిమానా విధించి 64 మోటార్లను సీజ్ చేశారు. అత్యధికంగా ఓఅండ్ఎమ్ డివిజన్‌లోని ఎస్‌ఆర్ నగర్ పరిధిలో 25 మోటార్లు సీజ్ చేసి పెనాల్టీ వేశారు. అక్రమ మోటార్ల వినియోగాన్ని ప్రత్యేకంగా రూపొందించిన పానీ యాప్‌లో అప్‌లోడ్ చేస్తుండటంతో ఆటోమేటిక్‌గా వినియోగదారుడి క్యాన్ నెంబర్ ఖాతాలో పెనాల్టీ జనరేట్ అవుతోంది. ఇదీ మరో 45 రోజుల పాటు నిరంతం ప్రక్రియగా స్పెషల్ డ్రైవ్ కొనసాగనుంది.

రంగంలోకి ఎండీ..

నల్లా నీటి సరఫరాలో లో–ప్రెషర్ సమస్యను జలమండలి సీరియస్‌గా తీసుకున్నట్లు కనిపిస్తోంది. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తొలిరోజు మాదాపూర్‌లోని కాకతీయ హిల్స్‌లో నీటి సరఫరా సమయంలో సాక్షాత్తు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి విజిలెన్స్ డీఎస్పీ జ్ఞానేందర్ రెడ్డి, స్థానిక అధికారులు, సిబ్బందిలతో కలిసి పర్యటించి తనిఖీలు నిర్వహించారు. అక్కడి అపార్ట్‌మెంట్ వాసులతో ముచ్చటించారు. ఒక అపార్ట్‌మెంట్‌లో నీటి సరఫరాలో ప్రెషర్ బాగున్నప్పటికి పక్షం రోజుల్లో 16 ట్యాంకులు బుక్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ క్యాన్ నెంబర్‌ను నెల రోజులు పాటు ట్యాంకర్ల బుకింగ్‌కు బ్లాక్ చేయాలని ఆదేశించారు.



అపార్ట్‌మెంట్‌లో తనిఖీ నిర్వహిస్తున్న జలమండలి ఎండీ

అందరికీ సమపాళ్లలో పంపిణీ

ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి సుదూర ప్రాంతాల నుంచి తరలించి సరఫరా చేస్తున్న తాగు నీరు వృథా కాకుండా అందరికి సమపాళ్లలో సర్దుబాటు చేయాలన్నదే తమ లక్ష్యమని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ప్రకటించారు. నల్లా నీటి సరఫరా సమయంలో మోటార్లు వినియోగిస్తే కొందరికి తాగునీరు అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. దాదాపు 150 కిలో మీటర్ల నుంచి భారీ పైపుల ద్వారా తరలించి సరఫరా చేస్తున్నామని, ప్రతి వెయ్యి లీటర్లకు శుద్ధి చెయ్యడానికి రూ.50 వరకు ఖర్చు అవుతుందన్నారు. అలాంటి విలువైన నీటిని మొక్కలకు, ఫ్లోర్, వాహనాలను కడగడానికి వినియోగించ కూడదని అన్నారు. నల్లాలకు మోటార్లు బిగించడం చట్టరీత్యా నేరమన్నారు.



సీజ్ చేసిన మోటార్లు

సిటీలో సేఫ్ నైబర్‌హుడ్ అవార్డ్స్

ఉత్తమ సేవలు అందించిన ఠాణాలకు అందజేత

- జోన్ నుంచి ఒక పోలీసుస్టేషన్ చొప్పున ఎంపిక
- స్త్రీ సమ్మిట్ 2.0 నుంచి ప్రారంభించిన కొత్వాల్
- ఏడుగురు ఇన్‌స్పెక్టర్లకు పురస్కారాలు అందజేత
- షీ–టీమ్స్, భరోసా సిబ్బంది, ఎన్జీఓలకు ప్రశంస



అవార్డు అందుకుంటున్న అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ రవి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మహిళలు, చిన్నారుల భద్రతను మరింత పెంచడానికి నగర పోలీసు విభాగం కీలక నిర్ణయం తీసుకుంది. వీరిపై జరిగే నేరాలను కట్టడి చేయడంతో పాటు ఈ కేసుల దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన పోలీసుస్టేషన్లకు నేతృత్వం వహిస్తున్న స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు (ఎస్‌హెచ్‌ఓ) సేఫ్ నైబర్‌హుడ్ వాచ్ అవార్డులు ఇస్తున్నారు. ఏడాది కాలంలో ఆ ఠాణా పరిధిలో నమోదైన కేసులు, పడిన శిక్షలు తదితరాలను పరిగణలోకి తీసుకుని విజేతలను ఎంపిక చేస్తున్నారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్‌తో (హెచ్‌సీఎస్‌సీ) కలిసి సిటీ పోలీసులు మంగళవారం 'స్త్రీ' (షీ ట్రంప్స్ ఫ్రూ రెస్పెక్ట్, ఈక్వాలిటీ అండ్ ఎంపవర్‌మెంట్) సమ్మిట్ 2.0ను నిర్వహించారు. ఈ సందర్భంగా సేఫ్ నైబర్‌హుడ్ అవార్డుల ప్రదానాన్ని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ప్రారంభించారు.

కేసుల నమోదు ప్రామాణికంగా...

నేరాలు నిరోధించడం (ప్రివెన్షన్), కేసుల్ని కొలిక్కి తీసుకురావడం (డిటెక్షన్), నిందితుల్ని దోషులుగా నిరూపించి శిక్షపడేలా చేయడం (కన్విక్షన్) ఈ మూడూ పోలీసుల ప్రాథమిక విధులు. పోలీసులు నమోదు చేసిన ఏదైనా ఓ కేసులో దర్యాప్తు పక్కాగా జరిగి, కోర్టులో నేరం నిరూపితమై, దోషులకు శిక్ష పడితే ఆ తరహా కేసుల సంఖ్య తగ్గే అవకాశం ఉంది. దీన్ని ప్రామాణికంగా తీసుకున్న ఉన్నతాధికారులు ఈ అవార్డులు పొందడానికి ప్రమాణాలను నిర్దేశించారు. ప్రస్తుతం నగర కమిషనరేట్ పరిధిలో ఏడు జోన్లు ఉన్నాయి. ఒక్కో జోన్ నుంచి ఒక్కో ఠాణాను చొప్పున ఎంపిక చేస్తున్నారు. గడిచిన ఏడాది కాలంలో ఏ పోలీసు స్టేషన్‌లో మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నమోదు తక్కువగా ఉంటుందనేది గమనిస్తున్నారు. దీని ఆధారంగా చేసుకుని ఆ ఠాణా ఇన్‌స్పెక్టర్‌కు సేఫ్ నైబర్‌హుడ్ అవార్డు అందిస్తున్నారు.

తిరస్కరించడానికి ఆస్కారం లేదు...

ఈ రెండు కేటగిరీలకు చెందిన కేసుల సంఖ్య తక్కువగా చూపించడంలో భాగంగా ఫిర్యాదులను తిరస్కరించడానికి ఆస్కారం లేదు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన ప్రతి ఫిర్యాదునూ కేసుగా నమోదు చేయాల్సిందే. ఇది అమలవుతోందా? లేదా? అనేది తనిఖీ చేయడానికి, ప్రజలతో పోలీసులకు ఉన్న సత్సంబంధాలు తెలుసుకోవడానికి ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఉంచుతున్నారు. అయితే పటిష్టమైన విధానాలతో కేసు దర్యాప్తు చేసి, పక్కా సాక్ష్యాధారాలతో అభియోగపత్రాలు దాఖలు చేసి, నిందితుల్ని కోర్టుల్లో దోషులుగా నిరూపించి, చట్ట ప్రకారం కఠిన శిక్షలు పడేలా చేయాలి. ఈ విధానాలు అవలంబిస్తూ మహిళలు, చిన్నారులపై నేరాలు తగ్గేలా ప్రయత్నించాల్సి ఉంటుంది. మంగళవారం స్త్రీ సమ్మిట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఏడుగురు ఇన్‌స్పెక్టర్లకు ఈ అవార్డులు అందించారు. అఫ్జల్‌గంజ్, సెక్రటేరియేట్, రామ్‌గోపాల్‌పేట, హుస్సేనిఆలం, కంచన్‌బాగ్, లంగర్‌హౌస్, మాసబ్‌ట్యాంక్ ఎస్‌హెచ్‌ఓలు ఎస్.రవి, బి.చిట్టి, టి.నర్సింగ్‌రావు, ఎస్.సుధీర్, జి.శేఖర్‌రెడ్డి, కె.రఘుకుమార్, సీహెచ్.పరశురామ్ వీటిని అందుకున్నారు.

ప్రత్యేక విభాగాలు, ఎన్జీఓలు....

స్త్రీ సమ్మిట్ నేపథ్యంలో నగర పోలీసు విభాగం, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ) మహిళల భద్రత కోసం కృషి చేస్తున్న ప్రత్యేక విభాగాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల్నీ సత్కరించింది. షీ–టీమ్స్, భరోసా కేంద్రంలో విధులు నిర్వర్తిస్తూ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందితో పాటు ప్రజ్వల, మనోజాగృతి, యశోద ఫౌండేషన్, విషెస్ ఫౌండేషన్, మైండ్ ఛాయిస్, కాం ఫర్ యు సంస్థల నిర్వాహకులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను ఉప ముఖ్యమంత్రి చేతల మీదుగా అందించింది.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో

రూ.20 లక్షలు టోకరా..

బంజారాహిల్స్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తామని రూ.20 లక్షలు వసూలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులు మంగళవారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే..యూసుఫ్‌గూడ వెంకటగిరి శ్రీకృష్ణానగర్‌కు చెందిన 11 మంది ప్రసాద్ ల్యాబ్స్‌లో పని చేస్తున్న సమయంలో అక్కడ ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్న ఆవుల నాగరాజారెడ్డితో పరిచయం ఏర్పడింది. తనకు ఎంతోమంది అధికారులతో పరిచయం ఉందని, జీహెచ్ఎంసీలో పని చేసే ఉన్నతాధికారితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెప్పాడు. అతడి సిఫారసుతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల చొప్పున రూ. 20 లక్షలు వసూలు చేశాడు. అనంతరం ఆర్డీఓ ఫోర్జరీ సంతకాలతో వీరికి పట్టాలు కూడా ఇప్పించాడు. అయితే సదరు పట్టాలు నకిలీవిగా గుర్తించిన బాధితులు నాగరాజారెడ్డిని ప్రశ్నించేందుకు యత్నించగా పత్తాలేకుండా పోయాడు. మేడ్చల్ ఆర్డీఓ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించిన తాము అక్కడ కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నిందితుడికి సహకరించిన ప్రదీప్‌రెడ్డిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



కిరాతకానికి పాల్పడిన మైనర్

- వృద్ధురాలి దారుణ హత్య
- ఆపై డ్యాన్సులు చేస్తూ సెల్‌ఫోన్‌లో చిత్రీకరణ..
- బెంగుళూరులోని మిత్రుడికి వీడియో షేర్ చేసిన వైనం..
- హత్యపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న స్థానికులు

దారుణం.. భయానకం!



కమలాదేవి (ఫైల్)

కుషాయిగూడ: తన స్వీయ రక్షణ కోసం పెట్టుకున్న ఆయుధమే ఆమె పాలిట యమపాశమైంది. ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలిని ఓ మైనర్ అతికిరాతకంగా చంపేశాడు. అంతటితో ఆగకుండా వృద్ధురాలి శవంపై నిలబడి డ్యాన్సులు చేసుకుంటూ తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. హత్య జరిగిన మూడు రోజుల తర్వాత తాను ఓ ఘనకార్యం చేశానంటూ మిత్రుడికి ఫోన్ చేసి హత్య చేసిన వీడియోను షేర్ చేశాడు. అలా వీడియో కాస్తా వైరల్ కావడంతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఈ నెల 11న చోటు చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు..రాజస్తాన్‌కు చెందిన పుక్‌రాజ్ చౌదరి, కమలాదేవి (70) దంపతులు చాలా ఏళ్ల క్రితం నగరానికి వచ్చి మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, కృష్ణానగర్ కాలనీ రోడ్డు నెంబరు–5లో ఉంటున్నారు. వారికి సంతానం లేదు. పదేళ్ల క్రితం భర్త చనిపోవడంతో కమలాదేవి ఒంటరిగానే ఉంటుంది. మొదటి అంతస్తులో ఆమె నివాసముంటూ గ్రౌండ్‌ఫ్లోర్‌లో షాపులను తన బంధువులకు అద్దెకిచ్చింది. అద్దె షాపుల్లో ప్రకాశ్ చౌదరి అనే వ్యక్తి హార్డ్‌వేర్ షాపు నిర్వహిస్తున్నాడు. 8 నెలల క్రితం రాజస్తాన్‌కు చెందిన ఓ బాలుడిని (17) షాపులో పనికి పెట్టుకున్నాడు. ఈ క్రమంలో కమలాదేవికి బాలుడితో పరిచమైంది. కొన్ని విషయాల్లో కమలాదేవి ఆ బాలుడిని మందలించింది. దీన్ని మనసులో పెట్టుకున్న బాలుడు ఆమెను హత్య చేయాలని నిర్ణయిచుకున్నాడు. ఈ నెల 11న రాత్రి 10:15 గంటల సమయంలో కమలాదేవి ఇంట్లోకి వెళ్లి తనకు ఆకలిగా ఉందని చెప్పాడు. ఆమె రొట్టె చేసి ఇస్తానని చెప్పి పిండి సిద్ధం చేస్తుండగా..అక్కడే ఉన్న ఓ ఇనుప రాడ్‌ను తీసుకుని వెనుకనుంచి ఆమె తలపై బలంగా మోదాడు. కమలాదేవి రక్షణ కోసం పెట్టుకున్న రాడ్‌తోనే ఆమెపై దాడి చేశాడు. అప్పటికీ చనిపోకపోవడంతో రాడ్‌తో బలంగా గొంతులో పొడిచి ఆమె చీర కొంగుతో ఊపిరాడకుండా చేసి దారుణంగా హత్య చేశాడు. చనిపోయిన వృద్ధురాలి గొంతు, చాతిపై నిలబడి డ్యాన్సులు చేస్తూ తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. రాత్రి 12:30 గంటల సమయంలో ఇంట్లోంచి ఓ కవరుతో బయటకు వచ్చి తాను ఉంటున్న ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు, ఆ తర్వాతి రోజు కూడా ఏం తెలియనట్లు షాపునకు వచ్చాడు. హత్య చేసిన మరుసటి రోజు పైకి వెళ్లి విగతజీవిగా పడి ఉన్న కమలాదేవిని చూసి వచ్చిన దృశ్యాలన్నీ సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. అంతటితో ఆగకుండా ఈ నెల 14న బెంగుళూరులో ఉంటున్న మిత్రుడు సురేందర్‌కు ఫోన్ చేసి తాను ఓ ఘనకార్యం చేశానంటూ గొప్పగా చెప్పాడు. కమలాదేవిని హత్య చేసిన విషయాన్ని మిత్రుడికి చెప్పాడు. సరదాగా అంటున్నాడనుకొని మొదట నమ్మలేదు. దీంతో తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించిన వీడియోను మిత్రుడికి షేర్ చేశాడు. కంగుతిన్న సురేందర్ వెంటనే కిషన్‌సింగ్ పనిచేస్తున్న షాపు యజమానికి విషయం తెలియపరిచాడు. స్థానిక పెద్దల సాయంతో విషయాన్ని పోలీసులకు తెలపడంతో రంగంలోకి దిగిన పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటుగా నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.



కమలాదేవి నివాసం గ్రౌండ్‌ఫ్లోర్‌లో షట్టర్ షాపులు

స్థానికంగా పలు అనుమానాలు..

కాగా ఒంటరిగా జీవిస్తున్న కమలాదేవి హత్యపై స్థానికంగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్తి కోసమే ఎవరో ఈ హత్య చేయించి ఉంటారన్న చర్చ కొనసాగుతుంది. కింద షటర్లలో అద్దెకు ఉంటున్న వారు గత 10 నెలలుగా అద్దె చెల్లించడం లేదని, ఈ విషయంలో కూడా తరచుగా గొడవలు జరుగుతున్నాయంటూ చర్చించుకుంటున్నారు. కాగా తమ సోదరి హత్యపై విచారణ జరపాలని గుజరాత్ నుంచి వచ్చిన ఆమె సోదరుడు డిమాండ్ చేశారు.

అక్కా చెల్లెళ్ల ఆత్మహత్య

ఆలస్యంగా వెలుగులోకి..

రసూల్‌పురా: మానసిక స్థితి సరిగా లేని ఇద్దరు అక్కచెల్లెళ్లు విషం తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కార్ఖాన పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ నరేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక మనోవికాస్ నగర్ శ్రీనిధి అపార్ట్‌మెంట్‌లో మీనా చంద్రన్ (59), వీణా చంద్రన్ (60) అనే అక్కా చెల్లెళ్లు నివాసం ఉంటున్నారు. వీరు చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటమేగాక మానసిక స్థితి సరిగా లేదు. ఈనెల 11న ఇంట్లో తలుపులు వేసుకుని విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గది నుంచి దుర్వాసన వస్తుండటాన్ని గుర్తించిన స్థానికులు 13 సాయంత్రం కార్ఖాన పోలీసులకు, మారేడుపల్లిలో ఉంటున్న మరో సోదరి సాధనకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారి మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. వీరి తండ్రి చంద్రన్ రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి కాగా అతను మృతి చెందడంతో గత కొన్నేళ్లుగా అతని పెన్షన్ డబ్బులతో వీరు జీవనం సాగిస్తున్నారని వీరి సోదరుడు దుబాయ్‌లో ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా మానసిక స్థితి సరిగా లేని వీరు వింతగా ప్రవర్తిస్తూ అపార్ట్‌మెంట్ వాసులను ఇబ్బందులకు గురిచేసే వారని పలుమార్లు వీరిపై పోలీసులకు ఫిర్యాదులు చేయడంతో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు. సీఐ రామకృష్ణ నేతృత్వంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రియుడు మరొకరిని పెళ్లి చేసుకున్నాడని..

మనస్తాపంతో యువతి ఆత్మహత్య


మల్లీశ్వరి (ఫైల్)

చైతన్యపురి: ప్రేమించిన యువకుడు మరో యువతిని వివాహం చేసుకోవడంతో మనస్తాపానికి లోనైన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మిర్యాలగూడ, బొక్కనుంతలపాడు గ్రామానికి చెందిన మల్లీశ్వరి నిమ్స్ ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తూ మధురపురి కాలనీలోని హాస్టల్‌లో ఉంటుంది. గత కొన్నేళ్లుగా ఆమె అదే గ్రామానికి చెందిన జానారెడ్డిని ప్రేమిస్తోంది. అయితే మల్లీశ్వరి కులం వేరే కావటంతో జానా రెడ్డి కుటుంబ సభ్యులు పెళ్లికి అంగీకరించలేదు. ఇటీవల జానారెడ్డికి మరో యువతితో వివాహం జరిగింది. ఈ విషయం తెలియడంతో మల్లీశ్వరి ఆదివారం రాత్రి హాస్టల్‌లో మత్తు ఇంజెక్షన్ తీసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం నిందితుడు జానారెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

డబ్బులు చెల్లించమని అడిగినందుకు..

టోల్ గేట్ సిబ్బందిపై ప్రభుత్వ ఉద్యోగి దాడి


టోల్ సిబ్బందిపై దాడికి పాల్పడుతున్న సిద్ధిఖీ తదితరులు

రాజేంద్రనగర్: టోల్ గేట్ డబ్బులు చెల్లించమని అడిగినందుకు ఓ ప్రభుత్వ ఉద్యోగి తనకు మినహాయింపు ఇవ్వరా అంటూ టోల్ గేట్ సిబ్బందిపై దాడికి పాల్పడిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పాతబస్తీ తాడ్‌బన్ ప్రాంతానికి చెందిన హుస్సేన్ సిద్ధిఖీ (49) రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సర్వే అండ్ రికార్డు సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో రాజేంద్రనగర్ ఓఆర్ఆర్ ఎగ్జిట్ 17 నుంచి రాజేంద్రనగర్ వైపు వచ్చాడు. టోల్ గేట్ వద్ద సిబ్బంది వాహనాన్ని ఆపి డబ్బులు చెల్లించాలని కోరారు. తాను ప్రభుత్వ ఉద్యోగినని... కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్నానంటూ ఐడీ కార్డు చూపించాడు. సిబ్బంది మాత్రం కార్డు చెల్లదని డబ్బులు చెల్లించాలని సూచించారు. అయినా అతను వాహనాన్ని ముందుకు తీసుకెళ్లడంతో మేనేజర్ డేవిడ్ రాజు కారును అడ్డుకుని డబ్బులు చెల్లించాలని కోరాడు. దీంతో ఆగ్రహానికి లోనైన సిద్ధిఖీతో పాటు కుటుంబ సభ్యులు సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో డేవిడ్ రాజుతో పాటు మరో ఉద్యోగికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువతిపై లైంగికదాడి

నిందితుడి అరెస్ట్


నిందితుడు ఏసుదాసు డేవిడ్

నిజాంపేట్: కుమార్తె వయస్సున్న ఓ యువతిని ప్రలోభపెట్టి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడి గర్భవతిని చేసిన వ్యక్తిని బాచుపల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాచుపల్లికి చెందిన ఓ రాజకీయ పార్టీ నాయకుడి వద్ద గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓ యువతి(21) బొల్లం ఏసుదాసు డేవిడ్(43)పని చేశారు. సదరు యువతిపై కన్నేసిన ఏసుదాసు డేవిడ్ ఆమెను ప్రలోభపెట్టి పలు మార్లు స్థానికంగా ఉన్న ఓయో హోటళ్లకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. కొన్నాళ్ల క్రితం గర్భం దాల్చిన సదరు యువతి తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నా కాలయాపన చేస్తున్నాడు. ఇటీవల అతడికి భార్య, పిల్లలు ఉన్నట్లు తెలియడంతో బాధితురాలి తల్లి దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన పోలీసులు సోమవారం కేసును బాచుపల్లి పీఎస్‌కు బదిలీ చేశారు. నిందితుడు డేవిడ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇద్దరు పాత నేరస్తులకు రిమాండ్

రూ.17.5 లక్షల సొత్తు స్వాధీనం

మీర్‌పేట: తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్తులను మీర్‌పేట పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి రూ.17.5 లక్షల సొత్తును రికవరీ చేశారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన ప్రకారం.. నాగోల్ డివిజన్ జైపురి కాలనీలో నివాసం ఉండే కారు డ్రైవర్ కట్టెల అనూప్ కుమార్(35), అంబర్‌పేటకు చెందిన వెల్డింగ్ కార్మికుడు మహ్మద్ అఫ్రోజ్‌ఖాన్(26) స్నేహితులు. వీరిద్దరిపై రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధి లోని సంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని అంకోలా ఠాణాల్లో కేసులున్నాయి. అనూప్‌కుమార్ 80 కేసులు, అఫ్రోజ్‌ఖాన్ 52 కేసుల్లో జైలు జీవితం గడిపి 2024లో బయటకు వచ్చిన వీరు తమ ప్రవర్తన మార్చుకోకుండా మరో నిందితుడు భరత్‌కుమార్ శర్మతో కలిసి చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల రాచకొండ పరిధిలోని మీర్‌పేట, ఆదిబట్ల, హయత్‌నగర్, చర్లపల్లి, మేడిపల్లి, కీసర, ఘట్‌కేసర్, భువన గిరి, ఆర్మూర్, బాసర, కోదాడ టౌన్ పీఎస్ పరిధిలో 23 చోరీలు చేశారు. దర్యాప్తు చేపట్టిన మీర్‌పేట క్రైం బృందం ఇద్దరు నిందితులను మంగళవారం రిమాండ్ తరలించారు. వారి వద్ద నుంచి 170 గ్రాముల బంగారు ఆభరణాలు, 250 గ్రాముల వెండి వస్తువులు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

లంచం తీసుకుంటూ చిక్కాడు..

ఏసీబీకి పట్టుబడిన యూబీడీ డిప్యూటీ డైరెక్టర్


పట్టుబడిన యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ విప్పెర్ల శ్రీనివాస్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి వెస్ట్‌జోనల్ అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ విప్పెర్ల శ్రీనివాస్ రూ.70 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ సిటీ రేంజ్ యూనిట్-2 డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు 20 మంది సిబ్బందితో రైడ్ చేశారు. శేరిలింపల్లి జోన్ యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ చార్మినార్ జోన్ ఇన్‌చార్జిగా కూడా వ్యవహరిస్తున్నారు. చార్మినార్ జోనల్ పరిధిలో మొక్కలు నాటిన ఓ కాంట్రాక్టర్ వద్ద నుంచి రూ.70 వేలు తీసుకొని టేబుల్ డ్రాలో పెట్టగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మొక్కలు నాటిన పనులకు గాను ఓ కాంట్రాక్టర్‌కు రూ.44 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. ఈ బిల్స్ క్లియర్ చేసేందుకు శ్రీనివాస్ కాంట్రాక్టర్ నుంచి రూ.2.20 లక్షలు డిమాండ్ చేశారన్నారు. ఇప్పటికే పలు దఫాలుగా రూ.1.50 లక్షలు ఇచ్చినట్లు విచారణలో తేలిందన్నారు. వేరే కాంట్రాక్టర్ యూపీఐ ద్వారా రూ.50 వేలు వేయించుకున్నాడని, మరో సారి రూ.50 వేలు నగదుగా తీసుకున్నారని ఆయన వివరించారు. శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలోని లిఫ్ట్‌లో కాంట్రాక్టర్ నుంచి రూ.50 వేలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం కాంట్రాక్టర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరుస్తామని పేర్కొన్నారు. అర్బన్ బయోడైవర్సిటీ డైరెక్టర్ సునంద నుంచి మరిన్ని వివరాలు సేకరిస్తున్నామని పేర్కొన్నారు. శేరిలింగంపల్లి యూబీడీ విభాగంలో తనిఖీలు చేస్తున్నామని, సిబ్బందిని ప్రశ్నిస్తున్నట్లు తెలిపారు. అధికారులకు లంచం ఇవ్వవద్దని, ఎవరైనా లంచం అడిగితే 1064లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

పత్తాలేని అధికారులు
శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్‌లో అర్బన్ బయోడైవర్సిటీ విభాగంలో ఏసీబీ అధికారులు సోదాలు చేయడంతో మిగతా విభాగాల అధికారులు పత్తా లేకుండా పోయారు. ఆయా విభాగాల అధికారుల కోసం వచ్చిన ప్రజలకు ఫీల్డ్ విజిట్ హెడ్ ఆఫీస్‌లో మీటింగ్‌కు వెళ్లారంటూ సిబ్బంది నుంచి సమాధానం వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు దాడులు చేసిన ఏసీబీ అధికారులు యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌ను అంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ విషయం తెలిసి సంబంధిత శాఖల అధికారులు పత్తా లేకుండా పోయారు.

వ్యాపారం కోసం యువతుల ఎర


కొత్తపేటలోని వైల్డ్ హార్ట్ పబ్

- పబ్ యాజమాన్యం నిర్వాకం
- డీజే సాంగ్స్, అసభ్య నృత్యాలు
- వైల్డ్ హార్ట్ పబ్‌పై చైతన్యపురి పోలీసుల దాడి
- 16 మంది యువతుల అరెస్ట్,
- పరారీలో పబ్ నిర్వాహకులు

చైతన్యపురి: వ్యాపారాన్ని పెంచుకునేందుకు కస్టమర్లకు యువతులను ఎరవేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఓ పబ్‌పై చైతన్యపురి పోలీసులు దాడి చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.కొత్తపేట కిలా మైసమ్మ దేవాలయ సమీపంలోని వైల్డ్ హార్ట్ పబ్‌లో యువతులతో అసభ్య నృత్యాలు చేయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సోమవారం రాత్రి దాడి చేశారు. ఈ సందర్భంగా డీజే సౌండ్‌లో యువతులతో అర్ధనగ్న నృత్యాలు చేయిస్తుండటమేగాక, నిబంధనలకు విరుద్ధంగా అధిక సమయం పబ్ తెరిచి ఉంచుతున్నట్లు గుర్తించారు. 16 మంది యువతులను డీజే ఆపరేటర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరి యువకులే టార్గెట్..
పబ్‌కు వెళ్లాంటే కస్టమర్ల నుంచి ఎంట్రీ ఫీజు వసూలు చేస్తారు. జంటలుగా వచ్చిన వారిని కాకుండా మద్యం సేవించేందుకు ఒంటరిగా వచ్చిన యువకుల వద్దకు యువతులు వచ్చి వారికి కంపెనీ ఇస్తారు. అసభ్యంగా డాన్సులు చేస్తూ తాము సేవించే మద్యం, ఆహారం కూడా సదరు యువకుల బిల్‌లోనే వేస్తారు. వ్యాపారం పెంచుకునేందుకు మోసపూరితంగా పబ్ నిర్వాహకులే యువతులకు ఫ్రీ పాస్ ఇచ్చి లోపలికి పంపిస్తారు. తద్వారా బిల్లు ఎక్కువ అయ్యేలా చేసి వ్యాపారాన్ని పెంచుకుంటారు. ఇందుకు గాను ముంబై నుంచే కాక నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి యవతులను పబ్ నిర్వాహకలు ఎంగేజ్ చేసుకుంటున్నట్లు తెలిపారు. బ్యూటీషియన్స్, జూనియర్ ఆర్టిస్టులను ఎంచుకుని ఈ వ్యవహారాన్ని నడుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పట్టుపడిన యువతులను వనస్థలిపురం, సికింద్రాబాద్, ఉప్పల్ తదితర ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించామన్నారు. 16 మంది యువతులతో పాటు డీజే ఆపరేటర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, పబ్ యజమాని రాము, మేనేజర్ సంతోష్ పరారీలో ఉన్నట్లు ఆయన వివరించారు.

ఇంజక్షన్ వికటించి వ్యక్తి మృతి


మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు


గడువు తీరిన ఇంజక్షన్

లంగర్‌హౌస్: వైద్యులు నిర్లక్ష్యం కారణంగా ఇంజక్షన్ వికటించి వ్యక్తి మృతి చెందిన సంఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి కార్వాన్ బాంజవాడికి చెందిన ఐలయ్య(53) మంగళవారం మధ్యాహ్నం ఆయాసంతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు అతడిని రింగ్ రోడ్డు సమీపంలోని హై కేర్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అతడిని పరీక్షించిన వైద్యులు ఇంజక్షన్ ఇచ్చారు. ఆ తర్వాత కొద్దిసేపటికి అతడి ఆరోగ్యం క్షీణించిందని తమ ఆస్పత్రిలో గుండె సంబంధిత వైద్యులు లేరని, వెంటనే మరో ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే ఐలయ్య మృతి చెంది ఉన్నాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడికి ఇచ్చిన ఇంజక్షన్‌ను పరిశీలించగా అవి మార్చి నెలలోనే ఎక్స్పైరీ అయినట్లుగా గుర్తించారు. గడువు ముగిని ఇంజక్షన్ ఇచ్చినందునే అతను మృతి చెందాడని ఆరోపిస్తూ మృత దేహంతో ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులు మందలించారని..

యువకుడి ఆత్మహత్య


భాను ప్రకాశ్ (ఫైల్)

శామీర్‌పేట్: తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి లోనైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం రాత్రి శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా, మూడుచింతలపల్లికి చెందిన భానుప్రకాశ్ (20), సోమవారం రాత్రి ఆలస్యంగా ఇంటికి రావడంతో తల్లిదండ్రులు అతడిని మందలించారు. దీంతో మనస్తాపానికి లోనైన అతను బెడ్ రూంలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. తినడానికి రావాలని పిలిచినా స్పందన లేక పోవడంతో కుటుంబ సభ్యులు గదిలోకి వెళ్లి చూడగా ఉరివేసుకొని కనిపించాడు. సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూడు గంటలు ఖాళీగా కూర్చోబెట్టారు..

- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ క్రిశాంక్
- గచ్చిబౌలి పీఎస్‌లో విచారణకు హాజరు


మాట్లాడుతున్న క్రిశాంక్

గచ్చిబౌలి: కంచగచ్చిబౌలి భూముల విషయంలో ఫేక్ వీడియోలతో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారని టీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ క్రిశాంక్‌పై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన రెండోసారి విచారణకు హాజరయ్యారు. దాదాపు 8 గంటల పాటు పోలీసులు అతడిని విచారించారు. అనంతరం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఎదుట క్రిశాంక్ విలేకరులతో మాట్లాడుతూ విచారణలో భాగంగా తనను ఎలాంటి వివరాలు అడగలేదని ఖాళీగా కూర్చోబెట్టారన్నారు. ఈ నెల16న మూడోసారి విచారణకు మళ్లీ రావాలని నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. సీఎం కార్యాలయంలో కొందరు అధికారులు ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ సీఎంకు భజన చేస్తున్నారని ఆరోపించారు. మొదటి సారి ఆరేడు ప్రశ్నలు అడిగారని ఈ రోజు ఒక్క ప్రశ్న కూడా అడగలేదన్నారు. గ్రూప్-1 పరీక్షల్లో 654 మంది అభ్యర్థులకు ఒకే రకంగా మార్కులు వచ్చాయని వాటిపై దృష్టి పెట్టకుండా సోషల్ మీడియాపై దృష్టి పెట్టారన్నారు. తన మొబైల్ ఫోన్ కావాలని అడిగినట్లు తెలిపాడు. బయట ఉంటే ప్రశ్నలు అడుగుతున్నామని పీసీసీ అధ్యక్షుడు, సీఎం సోషల్ మీడియా ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించాడు. ప్రశ్నలు తయారు చేసేది వేరేవాళ్లని, అధికారులకు ఎమి చేయాలో తెలియడం లేదన్నారు. ప్రధాని నరేంద్రమోదీ కూడా కంచె గచ్చిబౌలి విషయమై మాట్లాడారని, ఆయనపై కూడా కేసు పెట్టాలని సూచించారు. ప్రజలకు ఎన్నో సమస్యలు ఉన్నాయని, వాటిని వదిలి తపై కేసులు పెట్టి వేధించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



సాక్షి, హైదరాబాద్: అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను హైకోర్టులో జస్టిస్ సూరేపల్లి నందా ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 14 నుంచి ఏప్రిల్ 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రాణాలను త్యాగం చేసిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించనున్నారు. బాంబే డాక్ యార్డులో 'ఫోర్ట్ స్టికిస్'అనే నౌకలో 1944లో జరిగిన అగ్ని ప్రమాదంలో మంటలను ఆర్పే క్రమంలో 66 మంది అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. వారి వీరత్వాన్ని స్మరించుకుంటూ వారోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

తల్లి కర్మకాండలు చేసేందుకు డబ్బులు లేక..

- గంజాయి దందా
- నిందితుడి అరెస్ట్
- 4.50 కిలోల గంజాయి ప్యాకెట్ల స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న జీఆర్‌పీ డీఎస్పీ జావెద్ తదితరులు

సికింద్రాబాద్: తల్లి కర్మకాండలు ఘనంగా నిర్వహించేందుకు డబ్బులు లేక గంజాయి వ్యాపారిగా మారిన వ్యక్తిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి అతడి నుంచి రూ.2.50 లక్షల విలువైన 4.50 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ డీఎస్పీ ఎస్ఎన్ జావెద్, ఇన్‌స్పెక్టర్ బీ.సాయీశ్వర్‌గౌడ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఈనెల మంగళవారం ఉదయం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే పోలీసులు 10వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని లగేజీ సోదా చేయగా గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడిని ఒడిశా రాష్ట్రం, గజపతి జిల్లా గుమిగూడ గ్రామానికి చెందిన బెంజమిన్ గమాంగోగా గుర్తించారు. మూడు నెలల క్రితం బెంజిమెన్ తల్లి మృతి చెందింది. అనంతరం నిర్వహించాల్సిన కార్యక్రమాల ఖర్చుల కోసం గంజాయి వ్యాపారి వద్ద కూలీగా చేరిన అతను కొన్నాళ్లల్లోనే తానే వ్యాపారిగా అవతారం ఎత్తాడు. ఒడిశా నుంచి పూణెకు గంజాయి రవాణా చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా ఒడిశా నుంచి గంజాయి తీసుకుని విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో పూణే బయలుదేరిన బెంఝిమెన్ సికింద్రాబాద్ పోలీసులకు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉదయం ఎండ.. మధ్యాహ్నం వాన!


పంజగుట్ట మెట్రోస్టేషన్ వద్ద..

ఒక్కసారిగా మారిన వాతావరణం | పంజగుట్ట, అమీర్‌పేట ప్రాంతాల్లో వడగండ్లు

విపరీతమైన ఉక్కపోత, వేడి నుంచి నగరవాసికి కాసింత ఉపశమనం లభించినట్లయ్యింది. మంగళవారం ఉదయం నుంచి తీవ్రమైన ఉక్కపోతతో అవస్థపడ్డ జనాలకు మధ్యాహ్నం తర్వాత వరుణుడి రాకతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. పంజగుట్ట, అమీర్‌పేట్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, ఖైరతాబాద్ ప్రాంతాల్లో మధ్యాహ్నం తర్వాత 20నిమిషాల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులన్నీ జలమయం అయ్యాయి. పంజగుట్ట, అమీర్‌పేట్ ప్రాంతాల్లో వడగండ్లు సైతం పడ్డాయి. – బంజారాహిల్స్




సోమాజిగూడ పోచమ్మబస్తీలో..


అమీర్‌పేట్ ఎల్లారెడ్డిగూడ రోడ్డులో..


పంజగుట్టలో..

ఆన్‌లైన్‌లో టాస్క్‌ల పేరుతో మోసం

వెంగళరావునగర్: ఆన్‌లైన్‌లో టాస్క్‌ల పేరుతో యువతిని మోసగించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భూపాల్‌పల్లి జిల్లాకు చెందిన సంపూర్ణ స్థానిక మధురానగర్‌లో ఉంటూ ప్రైవేట్‌జాబ్ చేస్తుంది. ఆమెకు ఇటీవల దివ్యశర్మ అనే యువతి నుంచి వాట్సాప్ మెసేజ్ అందింది. ఆన్‌లైన్‌లో స్టార్ రేటింగ్స్ రెస్టారెంట్స్, హోటల్స్‌ను సమీక్షించాలని తెలియజేసింది. ఈ మేరకు అందులో సభ్యురాలు కావాలని, అనంతరం పెద్ద ఎత్తున నగదు వస్తాయని తెలియజేసింది. దాంతో ఆమె తొలుత రూ.వెయితో సభ్యురాలిగా చేరింది. అనంతరం వివిధ టాస్క్‌ల కోసం రూ.36 వేల వరకు చెల్లించింది. అయితే తిరిగి రాలేదు. దాంతో తాను మోసపోయానని గ్రహించి సైబర్ పోలీసులను ఆశ్రయించింది. అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అకారణంగా కోడలిపై అత్త దాడి

వెంగళరావునగర్: అకారణంగా కోడలిపై అత్త, బంధువులు దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సయ్యద్ రియాజ్, షహీన్‌బేగం దంపతులకు 16 ఏళ్ల కిందట వివాహమైంది. రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య చిన్న గొడవ జరగడంతో ఆమె ఈనెల 7వ తేదీ పుట్టింటికి వెళ్లింది. తిరిగి 14న మధ్యాహ్నం కుమార్తెతో కలిసి అత్తగారింటికి వచ్చింది. తన దుస్తులు, ఇతర వస్తువులు ఇవ్వాలని కోరింది. దాంతో ఆమె అత్త జుబేదా బేగం ఆమెపై అకారణంగా దాడి చేసింది. అంతేగాకుండా ఆమె బావగారి కుమారుడు ఇంతియాజ్‌ను పిలిపించి అతడితో కొట్టించింది. షహీన్‌బేగం, ఆమె కుమార్తె ఎంత వేడుకున్నా వదలకుండా దాడి చేశారు. దాంతో ఆమె గాయపడింది. తనకు న్యాయం చేయాలని కోరుతూ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి ఆత్మహత్య

వెంగళరావునగర్: అనుమానాస్పదస్థితిలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి ప్రాంతానికి చెందిన సాయిరామ్(30), ఆర్.చంద్రికలు 2018లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈనెల 10న తల్లితో కలిసి భీమవరంలోని బంధువుల ఫంక్షన్‌కు వెళ్లింది. తిరిగి సోమవారం ఉదయం వచ్చి విధులకు వెళ్లింది. రాత్రి ఇంటికొచ్చి ఆమె తలుపులోపల గడిపెట్టి ఉండటాన్ని గమనించింది. భర్తకు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో తమ్ముడు, మరిదికి ఫోన్ చేసి పిలిపించి తలుపులు తెరిపించింది. ఇంట్లో భర్త ఉరేసుకుని చనిపోయి ఉన్నాడు. బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికతో వ్యక్తి అసభ్య ప్రవర్తన

బాధితురాలి తల్లి ఫిర్యాదుతో నిందితుడి రిమాండ్

బంజారాహిల్స్: సహ జీవనం చేస్తున్న మహిళ కూతురిపై లైంగిక దాడికి యత్నించిన నిందితుడిని మంగళవారం బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్ రోడ్ నం.2లోని ఇందిరానగర్‌లో నివసించే వ్యక్తి (40)కి భార్యతో పాటు కొడుకు, కూతురు ఉన్నారు. అదే సమయంలో మరో వివాహిత (40)తో అక్రమ సంబంధం పెట్టుకుని రెండేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. దీంతో అతడి భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. సహజీవనం చేస్తున్న మహిళ కళ్లుగప్పి పదేళ్ల బాలికపై కామాంధుడు కన్నేసి పలుమార్లు లైంగిక దాడికి యత్నించాడు. బాలిక ఈ విషయాన్ని తన తల్లికి తెలియజేసింది. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

కాలుజారి పడి వృద్ధుడి మృతి

వెంగళరావునగర్: కాలుజారి పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. కార్మికనగర్‌లో నివాసం ఉంటున్న రాజయ్య (78) ఈనెల 1న నీళ్ల ట్యాంకు నింపడానికి డాబా ఎక్కాడు. కాలుజారి కిందపడగా అతని కుమారుడు శివకుమార్ స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం 7వ తేదీన గాంధీ ఆసుపత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ ఈనెల 14వ తేదీన వృద్ధుడు మృతి చెందాడు. శివకుమార్ ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫస్ట్ డే | సీజ్..

అక్రమ మోటార్ల స్పెషల్ డ్రైవ్ షురూ • 18 నల్లా మోటార్లు సీజ్

- రూ.5 వేలు జరిమానా విధించిన అధికారులు
- దాడుల్లో పాల్గొన్న విజిలెన్స్ పోలీసులు
- ప్రతిరోజూ తనిఖీలు ఉంటాయంటున్న అధికారులు

బంజారాహిల్స్: మంచినీటి నల్లాలకు విద్యుత్ మోటార్లు బిగించి అక్రమంగా నీళ్లను తోడేస్తున్న వారిపై జలమండలి కొరడా ఝుళిపిస్తోంది. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం జలమండలి అధికారులు, విజిలెన్స్ పోలీసులు, స్థానిక లా అండ్ ఆర్డర్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో పర్యటించి విద్యుత్ మోటార్లతో మంచి నీటిని లాగుతున్న నివాసాలపై దాడులు చేసి ఒక్కరోజే 18 మోటార్లను సీజ్ చేశారు. జలమండలి డివిజన్–6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, తట్టిఖానా, సోమాజీగూడ, ఎల్లారెడ్డిగూడ, బోరబండ, ఎస్పీఆర్‌హిల్స్, వెంగళరావునగర్, ఎస్సార్‌నగర్, ఫతేనగర్ వాటర్ సెక్షన్ల పరిధిలో ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగింది. జలమండలి జీఎం హరిశంకర్‌తో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది, జలమండలి విజిలెన్స్ పోలీసులు ఈ దాడుల్లో పాల్గొన్నారు.

నీటిని తోడేస్తున్న హాస్టళ్లపై దృష్టి..

మోటార్ల ద్వారా నల్లా నీటిని తోడేస్తున్న హాస్టళ్లపై ప్రధానంగా దృష్టిపెట్టారు. హాస్టళ యజమానులు భారీ మోటార్లు ఏర్పాటుచేసుకుని పెద్ద ఎత్తున మంచినీటిని లాగడం వల్ల వాటికి అనుబంధంగా ఉన్న కాలనీలు, బస్తీల్లో నల్లాల్లో నీళ్ల రాక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో హాస్టళ్లతో పాటు వ్యాపార సముదాయాలు, గెస్ట్‌హౌస్‌లు, హోటళ్లు, భారీ వ్యక్తిగత అంతస్తులపై దృష్టిపెట్టారు. మోటార్ ఫ్రీ ట్యాప్ వాటర్ లక్ష్యంగా ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. నల్లాలకు మోటార్లు బిగించి నీటిని తోడేస్తున్నట్లు గుర్తించిన అధికారులు మొత్తంగా కనెక్షన్ కట్ చేసి రూ.5,000 జరిమానా విధించారు.

మోటార్ ఫ్రీ ట్యాప్ వాటర్ పేరుతో కార్యాచరణ..

నీటి సరఫరాలోలో ప్రెషర్‌కు చెక్ పెట్టడమే లక్ష్యంగా జలమండలి ఏప్రిల్ 15 నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించుకుంది. లైన్‌మెన్ దగ్గర నుంచి జీఎం వరకు అందరూ మంచినీటిని వదిలే సమయంలో ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించింది. వేసవిలో నీటి కొరత రాకుండా జలమండలి అధికారులు చర్యలు చేపడుతున్నారు. నీరు వృథా చేసే వారిపై దృష్టి పెడుతున్నారు. నల్లాల నుంచి మోటార్ల ద్వారా నీటిని తోడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే హెచ్చరించారు. నీటి సరఫరాలో సాధారణ ప్రెషర్ ఉండే విధంగా చర్యల కోసం మోటార్ ఫ్రీ ట్యాప్ వాటర్ పేరుతో కార్యాచరణ ప్రకటించారు. ఇందులో భాగంగానే ఈ వేసవిలో నాలుగు దశల్లో తనిఖీలు చేపట్టనున్నారు.

- నల్లా నీటి సరఫరాలో లో–ప్రెషర్‌కు చెక్ పెట్టి సాధారణ స్థాయి ఒత్తిడితో నీటి సరఫరా జరిగే విధంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించారు.
- వేసవి ముగిసేవరకు ఆకస్మిక తనిఖీలు కొనసాగనున్నాయి.
- ఈ సర్వేలో సమగ్ర పరిశీలన జరపకుండా తప్పుడు నివేదిక సమర్పిస్తే సదరు అధికారికి మెమోలు జారీ చేయనున్నారు.
- ప్రతిరోజూ ఆన్‌లైన్ ఆధారంగా నివేదికలు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే వాటర్ వాల్వ్‌లను జియో ట్యాగింగ్ చేసి ఆన్‌లైన్ లాగిన్‌కు అనుసంధానం చేశారు.


నల్లాకు మోటార్ పెట్టి మంచినీటిని లాగుతున్న దృశ్యం


తనిఖీలు చేస్తున్న జలమండలి అధికారులు


స్వాధీనం చేసుకున్న మోటార్లు

మోటార్లు బిగిస్తే కఠిన చర్యలు

మంచినీటి నల్లాలకు మోటార్లు బిగించి నీళ్లను తోడితే ఆ నివాసాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ప్రతిరోజూ తనిఖీలు ఉంటాయి. ఎక్కడెక్కడ నీళ్లు వదులుతున్నామో ఆ ప్రాంతాల్లో జలమండలి చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జ్ఞానేందర్‌రెడ్డి కూడా తనిఖీలు నిర్వహిస్తారు. విజిలెన్స్ పోలీసులు ఈ తనిఖీల్లో పాల్గొంటారు. లా అండ్ ఆర్డర్ పోలీసులు కూడా ఈ బృందాల్లో ఉంటారు. అప్పటికప్పుడే మోటార్లను సీజ్ చేస్తారు. జరిమానాలు విధిస్తారు. కనెక్షన్ కట్ చేస్తారు. అందరూ జాగ్రత్తగా ఉండాలి. ఇది ఇంకా కొన్నాళ్లు కొనసాగుతోంది.
– హరిశంకర్, జీఎం, జలమండలి డివిజన్–6

అన్నపూర్ణ స్టూడియోలో అగ్ని ప్రమాదాలపై అవగాహన

బంజారాహిల్స్: అగ్నిమాపక వారోత్సవాల్లో మంగళవారం జూబ్లీహిల్స్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పి.సాయిరెడ్డి ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–5లోని మెట్రోస్టేషన్‌తో పాటు అన్నపూర్ణ స్టూడియోలో సిబ్బందికి అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు నివారించే అంశాలపై అవగాహన కలిగించారు. ఎక్కడైనా అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు 101కు ఫోన్ చేసి పూర్తి వివరాలు, ల్యాండ్ మార్క్ తెలియజేయడం వల్ల ఫైర్ ఇంజిన్ సకాలంలో ఘటనా స్థలానికి చేరుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. అగ్ని ప్రమాదాల్లో ఎలాంటి వస్తువులు దగ్ధమవుతున్నాయో ఆ వివరాలను స్పష్టంగా చెప్పాలన్నారు. అగ్ని ప్రమాద సంఘటన వివరాలు తెలియజేసేటప్పుడు కంగారు పడవద్దన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా ఘటన జరిగితే చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్లు అతికించడమే కాకుండా కరపత్రాలను పంపిణీ చేశారు.


అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న జూబ్లీహిల్స్ ఫైర్ ఆఫీసర్ పి.సాయిరెడ్డి

వీధి దీపాలకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో స్ట్రీట్ లైట్లు వెలగకపోవడంతో చీకట్లు కమ్ముకుంటున్నాయంటూ మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన సమస్య పట్ల జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 వీధిదీపాల విభాగం అధికారులు స్పందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారుగా 22 వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టి వెలుగులకు నోచుకునేలా చేశారు. వాక్‌వేలో చీకట్లు కమ్ముకుంటుండటంతో 'అలంకార ప్రాయంగా మారిన వీధి దీపాలు'అనే శీర్షికన వాకర్లు, సందర్శకులు పడుతున్న ఇబ్బందులను 'సాక్షి'వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టారు. దీంతో మంగళవారం రాత్రి వాక్ వే మొత్తం వెలుగులు పరచుకున్నాయి.


బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో వెలుగుతున్న లైట్లు..

'దళితరత్న అవార్డు మరింత బాధ్యతను పెంచింది'


దళితరత్న అవార్డు అందుకుంటున్న కొమ్ము కృష్ణ

శ్రీనగర్‌కాలనీ: ఎల్లారెడ్డిగూడకు చెందిన దళితనేత కొమ్ము కృష్ణమాదిగ దళితరత్న అవార్డు వరించింది. సామాజిక సేవ కార్యక్రమాలతో పాటు దళితుల హక్కుల కోసం చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్ ఇటికరాజు మాదిగ మంగళవారం కొమ్ము కృష్ణను దళితరత్న అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణమాదిగ మాట్లాడుతూ.. ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు. సామాజిక సమస్యలు, దళితుల హక్కుల కోసం పోరాడుతూనే ఉంటానని తెలిపారు.

శభాష్.. ఫసియుద్దీన్

క్షతగాత్రుడిని సకాలంలో ఆసుపత్రికి తరలించిన కార్పొరేటర్



రహమత్‌నగర్: ఆత్మహత్యయత్నానికి పాల్పడిన వ్యక్తిని సకాలంలో ఆసుపత్రికి తరలించి బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ మానవత్వాన్ని చాటుకున్నారు. డివిజన్‌లోని ఎస్ఆర్టీనగర్‌కు చెందిన మోయిన్ కుటుంబ కలహాల కారణంగా సోమవారం రాత్రి ఒంటిపై తిన్నర్ పోసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ హుటాహుటిన బాధితుడి నివాసానికి చేరుకుని అంబులెన్స్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడితో పాటు ఆసుపత్రికి చేరుకున్న బాబా ఫసియుద్దీన్ ఆర్‌ఎంఓతో మాట్లాడి మెరుగైన చికిత్సను అందించాలని కోరారు. బాబా స్పందించిన తీరుపట్ల బస్తీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంత్‌కుమార్‌కు దళితరత్న అవార్డు



బంజారాహిల్స్: దళితజాతికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా బంజారాహిల్స్ రోడ్ నం.11లోని ఉదయనగర్ బస్తీకి చెందిన గన్నారం ప్రశాంత్‌కుమార్‌కు దళితరత్న అవార్డు లభించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రాం జయంతి ఉత్సవాల కమిటీ 2025 రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ దళిత బహుజన సమితి గ్రేటర్ జనరల్ సెక్రటరీగా సేవలు అందిస్తున్న ప్రశాంత్‌కుమార్‌కు ఈ అవార్డును వ్యవస్థాపకుడు గజ్జెల్లి మల్లికార్జున్ మాదిగ సమక్షంలో అందజేశారు. ప్రశాంత్‌తో పాటు గ్రేటర్ అధ్యక్షుడు చలమెల కిషోర్‌బాబు, చింతా శ్రీకాంత్, ఎం.కార్తీక్‌లకు కూడా అవార్డులు అందజేశారు.

చెట్టు ఎక్కి కిందపడి పంప్ ఆపరేటర్ మృతి

ఖైరతాబాద్: మామిడి కాయలు కోసేందుకు చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్‌లో నివాసముండే ఉప్పల కుమార్ (43) టీఎస్ ట్రాన్స్‌కో కార్యాలయంలో ఆర్టిజన్ పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 13న ఉదయం 9.30 గంటల ప్రాంతంలో కార్యాలయం ఆవరణలో వెనుక వైపు ఉన్న మామిడి చెట్టుపైకి ఎక్కి మామిడికాయలు కోసే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడిపోయాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతడి వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వెన్నెముకకు, తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మంగళవారం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. మృతుడి భార్య అంబికా ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ వీసాతో మోసం

ట్రావెల్స్ నిర్వాహకుడిపై కేసు

రహమత్‌నగర్: విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన ఓ ట్రావెల్స్ యాజమానిపై బోరబండ పోలీసులు కేసు నమోదు చేశారు. కంచన్‌బాగ్‌కు చెందిన షేక్ మాలిక్, షేక్ రివాజ్‌లు విదేశీ వీసాలతో పాటు ఉద్యోగాలు ఇప్పిస్తామన్నాడు. ఎర్రగడ్డకు చెందిన అల్ జాహ్రా టూర్ ట్రావెల్స్ కరపత్రాన్ని చూసి ఎర్రగడ్డకు ట్రావెల్స్‌కు చేరుకుని రూ.40వేలు నిర్వాహకుడికి అందించారు. ట్రావెల్స్ నుంచి అందిన వీసా నకిలీదని గుర్తించడంతో వారు పోలీసులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

లిబర్టీ: రాజ్యాంగ విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం సవరణ చేసిన వక్ఫ్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానంద డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని అమలు చేయడానికి వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పలు రాజకీయ పక్షాలు సూచించిన సవరణలను పరిగణలోకి తీసుకోకుండా అర్ధరాత్రి మోదీ ప్రభుత్వం చట్టాన్ని తీసుకువచ్చినని ఆరోపించారు. ఉభయ సభలను కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం బుల్డోజ్ చేసిందని విమర్శించారు. ముస్లింలను లక్ష్యంగా చేసుకుని 'విభజించు.. పాలించు'విధానాన్ని బీజేపీ అనుసరిస్తోందని ఆరోపించారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

'అనాథపిల్లల సంక్షేమానికి మా సహకారం ఉంటుంది'


ఆదర్శ ఫౌండేషన్ అనాథాశ్రమంలో చిన్నారులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: అనాథపిల్లల సంక్షేమానికి.. వారి అభ్యున్నతికి మా సహకారం ఎప్పటికీ ఉంటుందని కన్స్యూమర్స్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం నేషనల్ సెక్రటరీ డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి అన్నారు. బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం కళ్యాణ్‌నగర్ వెంచర్–3లోని ఆదర్శ ఫౌండేషన్ అనాథాశ్రమంలో చిన్నారులకు నోట్‌బుక్స్, నిత్యావసరాలను అందజేశారు. ఆశ్రమ చిన్నారుల చదువుకు తమ వంతు సహాయం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నేతలు పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

టీబీ రహిత సమాజ నిర్మాణానికి చేయిచేయి కలపాలి


టీబీ రోగులకు కిట్స్ అందజేస్తున్న ప్లాన్ ఇండియా టీమ్ సభ్యులు

వెంగళరావునగర్: టీబీ రహిత సమాజాన్ని చూడాలంటే ప్రతి ఒక్కరూ చేయిచేయి కలపాలని టీబీ యూనిట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఎర్రగడ్డ ప్రధాన రహదారిపై ఉన్న టీబీ నియంత్రణ కేంద్రంలో టీబీ రోగులకు దుస్తులు, ఆహారం, మంచి నీరు తదితర పదార్థాలు మెడిసిన్స్ ఉన్న కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ రాజేశం మాట్లాడుతూ... దేశంలో క్షయవ్యాధి అనేది కొన్నేళ్ల కిందట ప్రమాదకరమైన వ్యాధిగా ఉండేదని చెప్పారు. అయితే ప్రస్తుతం టీబీ సోకిన వారిని పూర్తిగా నయం చేయవచ్చన్నారు. ఎవరికైనా టీబీ సోకిందని తెలిస్తే భయపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. సమీపంలో ఉన్న టీబీ సెంటర్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ ఉన్నట్లయితే కొన్ని రకాల పద్ధతులు, మందుల ద్వారా పూర్తిగా నయం అవుతోందని చెప్పారు. అయితే వైద్యులు సూచించిన విధంగానే ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మందులు వేసుకోవాలని నెలరోజులు తిరకుండానే మార్పు స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు. తొలుత టీబీరోగులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రగడ్డ ప్రభుత్వ టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ డి.చల్లాదేవి, ప్లాన్ ఇండియా ఎన్‌జీవోలు, కింగ్‌కోటి, మలక్‌పేట, ఉస్మానియా, దూద్‌బౌలీ, డబీర్‌పుర, ముషీరాబాద్ తదితర టీబీ యూనిట్లకు చెందిన రోగులు, వైద్యేతర సిబ్బంది పాల్గొన్నారు.

'రన్ ఫర్ జీసస్'కు రావాలని కార్పొరేటర్‌కు ఆహ్వానం

వెంగళరావునగర్: రన్ ఫర్ జీసస్ కార్యక్రమానికి కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని కార్పొరేటర్ దేదీప్య విజయ్ తెలియజేశారు. ఈనెల 19న రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని జూబ్లీహిల్స్ క్రిస్టియన్ ఫోరం (జేసీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుత బోరబండలో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం ర్యాలీగా బయలుదేరి చివరగా వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని కృష్ణకాంత్‌పార్క్ వద్ద జరిగే వేడుకతో ముగుస్తుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని జూబ్లీహిల్స్ క్రిస్టియన్ ఫోరం నేతలు మంగళవారం కార్పొరేటర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ర్యాలీకి రావాల్సిందిగా ఆమెకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... పార్కు వద్ద నిర్వహించనున్న ముఖ్య సమావేశం, అల్పాహార విందు, మంచినీరు, ఇతర సౌకర్యాలను కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫోరం నేతలు ఏసురాజు, ఎన్.విజయ్‌కుమార్, రాకేష్, వసంతరావు, జోసఫ్‌కపూర్, బాబు, సూర్య, మాజీ కార్పొరేటర్ శ్యాంరావు, బీఆర్ఎస్ నేతలు బాలరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.


కార్పొరేటర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న జూబ్లీహిల్స్ క్రిస్టియన్ ఫోరం ప్రతినిధులు

కోనోకార్పస్ మొక్కల వల్ల అనర్థాలేమీ లేవు

స్పష్టం చేసిన పర్యావరణ శాస్త్రవేత్తలు


సమావేశంలో మాట్లాడుతున్న వృక్షశాస్త్ర నిపుణులు

పంజగుట్ట: సైన్స్ పరంగా కోనోకార్పస్ మొక్కల వల్ల ఎలాంటి అనర్థం లేదని పలువురు పర్యావరణ శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. ఎవరో శాస్త్రీయత లేని వీడియోలు చేసి ఆ మొక్కల వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని చెప్పగానే నమ్మి మొక్కలను నరికివెయ్యడం సరికాదన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ ఎ.ఆర్.రెడ్డి, సీసీఎంబీ పూర్వ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.మోహన్ రావు, జన విజ్ఞాన వేదిక మాజీ తెలంగాణ అధ్యక్షుడు, ఉస్మానియా యూనివర్సిటీ వృక్షశాస్త్ర ప్రొఫెసర్ బి.ఎస్.రెడ్డి, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, జీవశాస్త్ర నిపుణులు గోపాలకృష్ణ మాట్లాడారు. కోనోకార్పస్ మొక్కపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రీసెర్చ్ చేసిన ప్రొఫెసర్ ఎ.ఆర్.రెడ్డి మాట్లాడుతూ ఈ చెట్టును ఒక విలన్‌లా చూస్తున్నారని, కానీ మొక్కలన్నింటిలోనూ అత్యధిక కార్బన్ డయాక్సైడ్‌ను తీసుకుని అత్యధిక ఆక్సిజన్ అందిస్తున్న మొక్క కోనోకార్పస్ అని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరిపిన అన్ని పరిశోధనల్లోనూ ఈ మొక్కవల్ల మంచి ప్రయోజనాలు ఉన్నాయని తేలిందని, ఈ మొక్కలను అనవసరంగా నరకవద్దని అన్నారు. ఇది జంతువులకు ఆహారంగా పనికిరాదనడం తగదని, వీటి ఆకులను మేకలు తిన్నాయని, వాటికి మంచి ప్రయోజనాలు కలిగాయని తమ పరిశోధనల్లో తేలిందన్నారు. సి.హెచ్ మోహన్ రావు మాట్లాడుతూ ఏ చెట్టూ ఎవరికీ హాని చేయొద్దని, రూ.కోట్లు ఖర్చుపెట్టి లక్షల చెట్లు పెట్టారని, ఇప్పుడు వాటిని నరికి వేయడం సరికాదన్నారు. 'ఈ చెట్టు వల్ల ఆస్తమా, అలర్జీ వస్తుందనేది నిజమే. కానీ, అన్ని చెట్ల వల్ల అలర్జీ వస్తుంది' అని తెలిపారు.

యాచక రహిత సమాజాన్ని నిర్మిద్దాం

– కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: యాచక రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రాష్ట్ర పార్టీ కేంద్ర కార్యాలయంలో యాచక రహిత సమాజం, మానవత్వ విలువలు, ధర్మ యుగం అనే అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ పాడిన పాటను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు సమాజ సేవా కార్యకర్తలు మాట్లాడుతూ అనేక చోట్ల తల్లిదండ్రులు విడిచిపెట్టిన పిల్లలు, పిల్లలకు దూరమైన తల్లిదండ్రులు రహదారులపై యాచకులుగా మారుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇందులో చాలామంది శారీరక, మానసిక వికలాంగులు ఉన్నారని తెలిపారు. ఇటువంటి వారిలో విద్యార్థి దశలో ఉన్న వారికి గురుకుల పాఠశాలలో, చిన్న పిల్లలైతే అనాథాశ్రమాల్లో చేర్పిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛంద సేవా సంస్థలు, కార్పొరేట్ కంపెనీలు, స్థానిక ప్రజలు, వైద్య, విద్యా సంస్థలు సాయం చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్, స్ఫూర్తి, విజేత విద్యా సంస్థల అధినేత రామకృష్ణం రాజు, ముదిగొండ విశ్వేశ్వర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

అంబర్‌పేట: రైల్వేలో ఉద్యోగాలు సాధించడానికి కావాల్సిన శిక్షణను పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ గ్రీన్‌లాండ్స్ సంస్థల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించనున్నారు. రైల్వేలో ఉద్యోగం పొందడానికి 3 నుంచి 4 నెలలపాటు అన్ని విధాలా శిక్షణను నిరుద్యోగ యువతకు ఇవ్వనున్నట్లు సంస్థల ప్రతినిధులు గద్దె భాస్కర్, మువ్వ రాంరెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మీకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతకు ఈ నెల 20వ తేదీన అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన నిరుద్యోగులకు ఉచిత భోజనం, వసతి, కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. శ్రీధర్ సీసీఈ ఇనిస్టిట్యూట్ సహకారంతో ఉత్తమ శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో అర్హత రాత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత పరీక్షకు హాజరు కావాల్సిన వారు ముందుగా తమ పేర్లను ఈ నెల 17వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని, ఆసక్తి గల వారు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఫేస్‌బుక్ పేజీ, యూట్యూబ్ చానల్‌ను, ఫోన్: 9515658033లలో సంప్రదించవచ్చని సూచించారు.

రూ.లక్షలు పలికిన లక్కీ నెంబర్‌లు

మణికొండ: తమ వాహనాలకు లక్కీ నెంబర్‌లు ఉండాలని కోరుకునే వారు వాటిని దక్కించుకునేందుకు పోటీలు పడ్డారు. మణికొండలోని రంగారెడ్డి జిల్లా ఆర్టీఏ కార్యాలయంలో జరిగిన ఈ బిడ్డింగ్‌లో లక్కీ నెంబర్‌ల ధరలు లక్షల రూపాయల్లో పలికాయి. మంగళవారం జరిగిన బిడ్డింగ్‌లో మొత్తం రూ.52,69,216 ఆదాయం సమకూరినట్టు ఆర్టీఏ అధికారులు తెలిపారు. అందులో టీజీ 07ఆర్ 9999 నెంబర్ ఏకంగా రూ. 12,49,999లకు కాంగ్యూంట్ డెవలపర్స్ వారు దక్కించుకున్నారు. టీజీ 07ఎఎ 0009 నెంబర్‌ను రుద్ర ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ రూ.8.50లకు, టీజీ 07ఎఎ 0001నెంబర్‌ను 4.77 లక్షలకు ఫ్యూజీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థలు దక్కించుకున్నాయని అధికారులు తెలిపారు.

మూసివేత ప్రమాదంలో ప్రభుత్వ హాస్టళ్లు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: సంక్షేమ హాస్టళ్లను మూసివేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. మంగళవారం కాచిగూడలో జరిగిన బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హాస్టళ్లకు గత 5 నెలలుగా మెస్ బిల్లులు, 3 సంవత్సరాలుగా హాస్టల్ భవనాల అద్దెలు, ఒక ఏడాది కరెంట్ బిల్లుల బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో హాస్టళ్ల నిర్వహణ భారంగా తయారైందని, 8 రోజుల్లో బకాయిలు చెల్లించకపోతే హాస్టళ్లను మూసివేస్తామని అధికారులే చెబుతున్నారని ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. హాస్టళ్ల అద్దెలు, మెస్ బిల్లులు, విద్యుత్ చార్జీలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. బడా కాంట్రాక్టర్ల బిల్లులు, ఫ్లైఓవర్లు, స్కైఓవర్లు, మూసీ సుందరీకరణ చేయడానికి ప్రభుత్వం వద్ద నిధులు ఉంటాయి కానీ, హాస్టళ్ల బిల్లులు చెల్లించడానికి ఉండవా అని ప్రశ్నించారు. హాస్టళ్లకు సరఫరా అయ్యే కూరగాయలు, మాంసం, గుడ్లు, పప్పులు, నూనెలు, ఇతర నిత్యావసర వస్తువుల బిల్లులను గత 5 నెలలుగా ప్రభుత్వం చెల్లించడం లేదని తెలిపారు. మూడేళ్ల నుంచి బీసీ హాస్టళ్లకు అద్దె చెల్లించకపోవడంతో భవనాలను ఖాళీ చేయాలని ఇంటి యజమానులు ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. గత సంవత్సర కాలంగా కరెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, పరీక్షల సమయంలో హాస్టళ్లకు కరెంట్ కట్ చేస్తే విద్యార్థులు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. కాలేజీ విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.4వేల కోట్లు ఉన్నాయని, వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు నీల వెంకటేష్, జిల్లపల్లి అంజి, పగిళ్ల సతీష్, మోదీ రాందేవ్, ఉమేష్ యాదవ్, రాజేందర్, ఆశీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి.. క్రమశిక్షణే స్ఫూర్తి

- దీక్షాంత్ పరేడ్‌లో అడిషనల్ డీజీపీ శ్రీనివాసరావు
- కొత్తగా విధుల్లోకి 142 మంది పోలీసు కానిస్టేబుళ్లు



శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుల్‌కు బహుమతి ప్రదానం చేస్తున్న అడిషనల్ డీజీపీ శ్రీనివాసరావు

మేడ్చల్ రూరల్: శిక్షణ పూర్తి చేసుకుని సమాజంలోకి అడుగుపెడుతున్న నూతన పోలీసులు క్రమశిక్షణ అలవర్చుకుని వృత్తిలో లోటుపాట్లు లేకుండా ముందుకు సాగాలని అడిషనల్ డీజీపీ, తెలంగాణ పోలీస్ అకాడమీ ఆర్‌బీవీఆర్‌ఆర్ డైరెక్టర్ వీవీ శ్రీనివాసరావు అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో మంగళవారం శిక్షణ పూర్తి చేసుకున్న 142 కానిస్టేబుళ్లకు దీక్షాంత్ పరేడ్ నిర్వహించారు. కార్యక్రమంలో అడిషన్ డీజీపీ ముఖ్య అతిథిగా పాల్గొని అభ్యర్థుల గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లకు సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని, పోలీస్ శాఖకు వన్నె తెచ్చేలా ప్రవర్తన ఉండాలని సూచించారు. తెలంగాణ పోలీస్ శాఖ ఇతర రాష్ట్రాల పోలీస్ వ్యవస్థలకు దిక్సూచిగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల కుటుంబాలకు విద్యా, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్పీ మధుకర్ స్వామి మాట్లాడుతూ తొమ్మిది నెలల కఠోర శ్రమ అనంతరం ఉద్యోగంలో చేరుతున్న వారంతా విధి నిర్వహణలో రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు చేకూర్చాలని సూచించారు. అనంతరం కళాశాలలో నూతనంగా నిర్మించిన ఫౌంటెయిన్లు, సైబర్ సెక్యూరిటీ ల్యాబ్, ఫోరెన్సిక్ ల్యాబ్, సీసీటీవీలను అడిషనల్ డీజీపీ శ్రీనివాస రావు ప్రారంభించారు. కార్యక్రమంలో యూసుఫ్ గూడ బెటాలియన్ కమాండెంట్ పి.మురళీకృష్ణ, పోలీస్ ట్రైనింగ్ కాలేజీ డీఎస్పీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు ఉద్యోగం సాధించిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు

ఒకే కుటుంబంలో ముగ్గురు పోలీసులు....

మేడ్చల్ పీటీసీలో 9 నెలలపాటు శిక్షణ పూర్తి చేసుకుని ఉద్యోగంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా కానిస్టేబుళ్ల తల్లిదండ్రులు, కుటుంబీకులు ఆనందంతో ఉద్వేగానికి లోనయ్యారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేస్తున్న నూతన కానిస్టేబుళ్లను పీటీసీ ట్రైనింగ్ అధికారులు అభినందించారు. కాగా, సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం తోల్వ తండాకు చెందిన ఒకే కుటుంబంలోని భార్య, భర్తతోపాటు మరో వ్యక్తి పోలీసు ఉద్యోగాలు సొంతం చేసుకున్నారు. మంగళవారం నిర్వహించిన పరేడ్ అనంతరం సక్కుభాయి ఏఆర్ కానిస్టేబుల్‌గా విధుల్లోకి అడుగుపెడుతుండగా, ఆమె సోదరి కుమారుడు రాథోడ్ సురేశ్ సైతం ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. ఇది వరకే మేడ్చల్ పీటీసీలో మొదటి విడతలో శిక్షణ పూర్తి చేసుకున్న సక్కుభాయి భర్త రాథోడ్ సురేశ్ ప్రస్తుతం బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సక్కుబాయి ఒకవైపు తన పాపకు అమ్మ ప్రేమను పంచుతూ, మరోవైపు శిక్షణ పూర్తి చేసుకోవడంతో పోలీసు ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్‌తో అక్రమాలకు ఊతం

- ప్రభుత్వ తీరును తప్పుబట్టిన హైకోర్టు
- మణికొండలోని అక్రమ నిర్మాణాలపై నివేదికివ్వండి
- లేనిపక్షంలో నేరుగా హాజరై వివరణ ఇవ్వాలి
- జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ కమిషనర్లకు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: క్రమబద్ధీకరణ పేరుతో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లుగా ఉన్నాయని హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. అధికారులు ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలకు అనుమతిస్తూ పోవడం, తర్వాత ఇలా ఎల్‌ఆర్‌ఎస్ పేరిట క్రమబద్ధీకరించుకోవడం సర్వ సాధారణంగా మారిందని వ్యాఖ్యానించింది. అక్రమ, అనధికార నిర్మాణాలపై ఉక్కు పాదం మోపి కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉండగా, క్రమబద్ధీకరణ జీహెచ్‌ఎంసీలోని కొందరు అధికారులకు కూడా వరంగా మారిందని ఘాటు వ్యాఖ్యలు చేసింది. రంగారెడ్డి జిల్లా మణికొండ జాగీరులో ఈ రోజు వరకు ఆ భూమిలో ఎన్ని నిర్మాణాలున్నాయి.. ఎన్నింటికి అనుమతులిచ్చారు.. అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టినవి ఎన్ని.. ప్లాన్‌ను ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాలెన్ని.. జీహెచ్‌ఎంసీ చట్టం ప్రకారం అనధికారిక, అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలపై ఏం చర్యలు తీసుకున్నారు.. అనధికార నిర్మాణాలకు విద్యుత్, నీటి సరఫరాను నిలిపివేయాలని ఎన్ని లేఖలు రాశారు.. అక్రమ, అనధికార నిర్మాణాలను నిరోధించడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారో.. ఇలా పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచాలని జీహెచ్‌ఎంసీని హైకోర్టు ఆదేశించింది. మణికొండలోని సర్వే నంబర్ 203/1/3/1, 204, 205, 206, 207, 208, 209, 210/1/3ల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఎస్.గోపాల్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం 2023, మార్చిలో స్టేటస్‌కో ఆదేశాలు జారీ చేసింది.

ఆగని అక్రమ నిర్మాణాలు..

అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ గోపాల్ ధిక్కరణ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి మరోసారి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున ఆంజనేయులు వాదనలు వినిపిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులున్నా అక్రమ నిర్మాణాలు చేపడుతూనే ఉన్నారని, అయినా అధికారులు వారితో కుమ్మక్కై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఎలాంటి అక్రమ నిర్మాణాలు కొనసాగడం లేదని జీహెచ్‌ఎంసీ న్యాయవాది పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్ అందజేసిన ఫొటోలను పరిశీలిస్తే అధికారులు సరైన చర్యలు చేపట్టడం లేదని తెలుస్తోందన్నారు. తదుపరి విచారణ జూలై 2వ తేదీకి వాయిదా వేస్తూ, ఆలోగా నివేదిక అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. నివేదిక అందజేయడంలో విఫలమైన జీహెచ్‌ఎంసీ కమిషనర్, హెచ్‌ఎండీఏ కమిషనర్ నేరుగా కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని పేర్కొంది.

నోవాటెల్‌లో సీఎల్పీ సందడి

- సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికిన మంత్రులు, ఎమ్మెల్యేలు
- ఉదయం నుంచి హడావిడిగా



నోవాటెల్ హోటల్ వద్ద ఎమ్మెల్యేల సందడి

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయలోని నోవాటెల్ హోటల్‌లో మంగళవారం కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ(సీఎల్పీ) సందడి నెలకొంది. నోవాటెల్‌లో తొలిసారి సీఎల్పీ భేటీ జరిగింది. సీఎల్పీ సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉదయం 10 గంటల నుంచి హోటల్‌కు చేరుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు వారి అనుచరులు సైతం హోటల్ వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం 1.10 గంటలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నోవాటెల్ హోటల్‌కు చేరుకోగా ఎమ్మెల్యేలు, మంత్రులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించి స్వాగతం పలికారు. గంటపాటు సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంలో పాల్గొనడంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఇందిరమ్మ లబ్ధిదారులకు విడతలవారీగా వచ్చే మొత్తాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. జపాన్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి హోటల్ నుంచి నేరుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని బెంగళూరు బయలుదేరారు. అక్కడి నుంచి టోక్యో వెళ్లారు. ఈ సందర్భంగా నోవాటెల్ హోటల్‌తోపాటు చుట్టపక్కల ప్రాంతాల్లో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నగర శివారు పరిధిలోని ఎమ్మెల్యేలు ఎవరు కూడా ఈ భేటీకి హాజరుకాకపోవడం గమనార్హం.

తిండితిప్పలు

ఎమ్మెల్యే, మంత్రులు గన్‌మెన్లు, పోలీసులు పెద్ద సంఖ్యలో ఉండటంతో వారి మధ్యాహ్న భోజనానికి ఉన్నతాధికారులు టోకెన్లు అందజేశారు. టోకెన్లను కూడా తినడానికి కొద్ది సమయం ముందు మాత్రమే ఇచ్చారు. దీంతో వాటిని దక్కించుకోడానికి నానా పాట్లు పడ్డారు. హోటల్‌ని హైదరాబాద్ బాల్‌రూం పక్కనే వారికి భోజనం ఏర్పాటు చేశారు. టోకెన్లు అందక కొందరు, ప్లేట్లు దొరక్క మరికొందరు భోజనానికి తిప్పలు పడ్డారు. ఆకలితో ఉన్న ఖాకీలు సైతం క్రమశిక్షణ పక్కన పెట్టేసి భోజనం కోసం ఎగబడటంతో అక్కడ పరిస్థితి అంతా గందరగోళంగా మారింది. దొరికిన వారే కడుపు నింపుకుని హమ్మయ్య అనుకున్నారు. మరి కొందరు మీడియాకు ఏర్పాటు చేసిన డైనింగ్ హాలు వద్దకు చేరుకుని కడుపు నింపుకున్నారు.

ప్రపంచ ఉద్యోగుల్లో | మూడింట ఒకవంతు భారతీయులే..



నారాయణన్

సాక్షి, సిటీబ్యూరో: భవిష్యత్‌లో ప్రపంచ ఉద్యోగుల్లో మూడింట ఒకవంతు భారతీయులుంటారని కేపీఎంజీ విద్య, నైపుణ్య అభివృద్ధి అధిపతి నారాయణన్ రామస్వామి ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇథేమ్స్ బిజినెస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజినెస్ స్కూల్ రంగంలో సరికొత్త కోర్సులు ప్రవేశ పెడుతున్నట్లు ప్రకటించారు. విద్యార్థుల ఉజ్వల భవితకు తోడ్పాటు అందించడమే తమ లక్ష్యమన్నారు. రాబోవు రోజుల్లో అంతర్జాతీయస్థాయిలో తమ విద్యార్థుల ప్రతిభను చూడబోతున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఫ్యూచరిస్టిక్ మేనేజ్‌మెంట్ ఇథేమ్స్ బిజినెస్ స్కూల్‌తో జత కడుతున్నట్లు ప్రకటించారు. వృత్తి పరమైన అభ్యాసం మధ్య అంతరాన్ని తగ్గించి వ్యాపార రంగంలో విద్యార్థులను సిద్ధం చేయడ మే తమ లక్ష్యమన్నారు. ఇథేమ్స్ బిజినెస్ స్కూల్ చైర్మన్ కాళి ప్ర సాద్ గాదిరాజు మాట్లాడుతూ ఇథేమ్స్ మార్కెటింగ్ అవసరాలకు అనుగుణంగా ఉంటుందన్నారు. కేపీఎంజీతో భాగస్వామ్యం విద్యార్థులకు గేమ్ ఛేంజర్‌గా, అత్యాధునిక పరిశ్రమ అంచనాలకు అనుగుణంగా నైపుణ్యాలతో కూడిన పోటీతత్వ ఉద్యోగ మార్కెట్లలోకి ప్రవేశించేందుకు దోహదంచేస్తుందన్నారు.

ప్రజావాణిలో 274 దరఖాస్తులు

సాక్షి, సిటీబ్యూరో: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 274 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు సంబంధించి 53 దరఖాస్తులు ఉండగా, విద్యుత్ 39, రెవెన్యూ 51, ఇందిరమ్మ ఇండ్ల కోసం 70 దరఖాస్తులు వచ్చాయి. ప్రవాసీ ప్రజావాణికి 01, ఇతర శాఖలకు సంబంధించి 166 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత శాఖలకు బదిలీ చేశారు. అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించారు.

ప్రమాదవశాత్తు కంటిపై దిగబడిన స్క్రూడ్రైవర్

తొలగించిన గాంధీ ఆస్పత్రి వైద్యులు



గాంధీఆస్పత్రి: ప్రమాదవశాత్తు కంటి పైభాగంలో దిగబడిన స్క్రూడ్రైవర్‌ను సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా తొలగించారు. ఆస్పత్రి అధికారులు, వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన రంజిత్(21) ఎలక్ట్రికల్ మెకానిక్. ఈ నెల 8వ తేదీన మెకానిక్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు స్క్రూడ్రైవర్ కుడి కంటి పైభాగంలో బలంగా దిగబడింది. కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్‌కు తరలించి బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేటు కంటి ఆస్పత్రిలో చేర్చారు. అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించగా అక్కడి వైద్యులు గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ నెల 10న గాంధీలో చేరగా, ఆప్తమాలజీ వైద్యులు పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించి కంటికి ఎటువంటి గాయం కాలేదని, కంటి పైభాగంలో స్క్రూడ్రైవర్ గుచ్చుకుందని నిర్ధారించి న్యూరో సర్జరీ విభాగానికి తరలించారు. గాంధీ న్యూరో సర్జరీ వైద్యులు సుమారు రెండు గంటలపాటు శ్రమించి అరుదైన ఆపరేషన్ నిర్వహించి బాధిత రోగి కంటిపై భాగంలోంచి స్క్రూడ్రైవర్‌ను విజయవంతంగా తొలగించారు. సర్జరీ అనంతరం రోగి రంజిత్ కోలుకుంటున్నాడని, త్వరలోనే డిశ్చార్జీ చేస్తామని ఆస్పత్రి అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, గాంధీ ఆస్పత్రి పాలనా యంత్రాంగం మీడియాకు విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో బాధితుడి బిఫోర్ సర్జరీ, ఆఫ్టర్ సర్జరీ ఫొటోలపై పలు అనుమానాలు వ్యక్తం కావడం గమనార్హం.

మియాపూర్ రన్నర్స్ టీ షర్ట్ ఆవిష్కరణ

కేపీహెచ్‌బీ కాలనీ: ఇగ్నైట్ విద్యాసంస్థల సైన్స్ ల్యాబ్ ప్రాంగణంలో మంగళవారం బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ చేతుల మీదుగా మియాపూర్ రన్నర్స్ టీ షర్ట్, మెడల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరికీ శారీరక దారుఢ్యంతో కూడిన మానసిక వికాసం ఎంతో అవసరమని అన్నారు. ఈ నేపథ్యంలో ఇగ్నైట్, అవంతిక యాజమాన్యాలు ఈ నెల 20న చేపట్టనున్న మియాపూర్ రన్‌ను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, ఇగ్నైట్ చైర్మన్ రమేష్, అవంతిక కన్‌స్ట్రక్షన్స్ శ్రీనివాసరెడ్డి, తెలంగాణ రన్నర్స్ తరఫున జగన్మోహన్‌రెడ్డి, నరేష్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



టీ షర్ట్, మెడల్‌ను ఆవిష్కరించిన డీసీపీ సురేష్ కుమార్ తదితరులు

18న రైల్ మ్యూజియం ఉచిత సందర్శన

కాచిగూడ: వరల్డ్ హెరిటేజ్ డే సందర్భంగా ఈ నెల 18వ తేదీన కాచిగూడ రైల్వే స్టేషన్‌లోని రైల్ మ్యూజియంను ఉచితంగా సందర్శించవచ్చని స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ తెలిపారు. స్కూల్, కాలేజీ విద్యార్థులు, రైల్ ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా 'ఆకాశవాణి' వజ్రోత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న ఆకాశవాణి అధికారులు

గన్‌ఫౌండ్రీ: ఆకాశవాణి మొబైల్ యాప్‌ను, ప్రసార భారతి ఇటీవల ప్రారంభించిన వేవ్స్ అనే ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆకాశవాణి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ బి.హరిసింగ్ అన్నారు. మంగళవారం రవీంద్ర భారతిలో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1933లో మహబూబ్ అలీ అనే వ్యక్తి స్థాపించిన హైదరాబాద్ రేడియోను 1935లో నిజాం స్వాధీనం చేసుకొని దక్కన్ రేడియోగా ఏర్పాటు చేశారన్నారు. 1950లో భారత ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తూ ప్రజాహిత ప్రసారాలను ప్రారంభించినట్లు గుర్తు చేశారు. అంతకు ముందు ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ డాక్టర్ ప్రజ్ఞ పలివాల్ గౌర్ ఢిల్లీ నుంచి వర్చువల్ పద్ధతిలో ఆకాశవాణి ప్రాంగణంలో నిర్మించిన పైలాన్‌ను ఆవిష్కరించారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత గడ్డం సమ్మయ్య బృందం చిందు యక్షగానం, కొలువుల మహేష్ బృందం మల్లన్న కథ, దుబ్బాక పెద్ద నర్సింలు బృందం ఎల్లమ్మ కథ, ముగ్గు అంజయ్య బృందం బాల గాంధార కథ, సిరిగిరి జాలయ్య బృందం బుడగ జంగాల కథలు ప్రేక్షకులను అలరించగా సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, దూరదర్శన్ హైదరాబాద్ కేంద్రం ప్రతినిధులు ఎస్వీ రమణ, ఎంఎస్ మహేష్, పీవీ సత్యనారాయణలతోపాటు పలు శాఖల అధికారులు, ఆకాశవాణి విశ్రాంత అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో బీసీలకు తీరని అన్యాయం

– జస్టిస్ వి.ఈశ్వరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య

పంజగుట్ట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో చట్టం చేసిన ఘనత రేవంత్ రెడ్డిది కాదని, అది యావత్ బీసీ సమాజానిదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్, కేంద్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య అన్నారు. మంగళవారం బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో 'తెలంగాణ రాష్ట్రం–సామాజిక న్యాయం' అనే అంశంపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో వారు ఐక్యమై ఉద్యమించారని, దానికి దిగివచ్చిన రేవంత్ సర్కార్ కులగణన చేసి బీసీ రిజర్వేషన్ల బిల్లు కేంద్రానికి పంపిందన్నారు. కానీ ప్రతిపక్షాలను ఎందుకు కలుపుకుపోకుండా ఒంటెద్దు పోకడలు ఎందుకు పోతున్నారో అర్థం కావడంలేదని ఆయన పేర్కొన్నారు. అన్ని రంగాల్లో బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని విమర్శించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు మాట్లాడుతూ .. సామాజిక న్యాయం పేరుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు కానీ.. బీసీలను ఓట్లు వేసే యంత్రాల మాదిరిగానే చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని రంగాల పదవుల్లో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని ఆయన లెక్కలతో చూపించారు. ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఐ.తిరుమలి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఒక సోషల్ జస్టిస్ కమిషన్ ఏర్పాటు చెయ్యాలని, బడ్జెట్‌లో బీసీలకు కేటాయింపులు, పదవుల్లో వాటాపై సలహాలు తీసుకోవాలని సూచించారు.

రాత్రికి రాత్రే పార్క్ చిందరవందర

అధికారులు అభివృద్ధి చేశారు.. కబ్జాదారు ధ్వంసం చేశాడు..



భవానీ కాలనీలో పార్కులోని సామగ్రిని ధ్వంసం చేయడంతో ఎమ్మెల్యేకు వివరిస్తున్న కాలనీవాసులు

బండ్లగూడ: ఓ కబ్జాదారుడు బరితెగించాడు. కాలనీవాసులకు ఆహ్లాదాన్ని ఇచ్చే పార్క్‌ను అధికారులు అభివృద్ధి చేయగా, కబ్జాదారుడు ధ్వంసం చేశాడు. కబ్జాదారు మనుషులు రాత్రికి రాత్రే ప్రహరీని కూలగొట్టి పార్క్‌ను చిందరవందర చేశారు. ఈ సంఘటన బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారంరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్‌లో గల భవానీ కాలనీలో 1,020 గజాల పార్కు స్థలం ఉంది. హీరాసింగ్ అనే వ్యక్తి ఈ పార్కును కబ్జా చేసేందుకు యత్నించడంతో స్థానికులు గతంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్, పలువురు మంత్రులు, హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు స్పందించి పార్కు చుట్టూ ప్రహరీని ఏర్పాటు చేశారు. అనంతరం కార్పొరేషన్ నిధులతో పార్కును అభివృద్ధి చేసి పిల్లలు ఆడుకునేందుకు సామగ్రితోపాటు మహిళలు, వృద్ధులు వాకింగ్ చేసేలా సౌకర్యాలు కల్పించారు. కానీ, సోమవారంరాత్రి కొంతమంది వ్యక్తులు బుల్డోజర్లను తీసుకువచ్చి పార్కు కంచె, ప్రహరీతోపాటు చిన్నపిల్లల ఆట సామగ్రిని ధ్వంసం చేశారు. దీంతో కాలనీవాసులు మంగళవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు అధికారులకు, పోలీసులకు ఎమ్మెల్యే సమాచారాన్ని అందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధ్వంసమైన పార్కును పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్రకు సూచించారు. సామగ్రిని ధ్వంసం చేయడంతో హీరాసింగ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అందరివాడు అంబేడ్కర్: వివేక్

కాచిగూడ: భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేష్ బాబు ఆధ్వర్యంలో రూపొందించిన మాల మహానాడు నూతన సంవత్సర కేలండర్, అంబేడ్కర్ చరిత్ర బ్రోచర్‌ను మంగళవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అంబేడ్కర్ కొందరివాడు కాదని, అందరివాడని అన్నారు. అంబేడ్కర్ వాదాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిన ఘనత అంబేద్కర్‌దేనని అన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు కొండ్ర రాజలింగం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వలికి కృష్ణమూర్తి, ఎన్నమల్ల శ్రీకాంత్, తాలుకా అనిల్, చేతన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాల మహానాడు కేలండర్, బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 16, ఏప్రిల్, 2025

సహజ ఫలం.. ఆరోగ్య పానీయం..

హైడ్రేషన్.. వేసవిలో ఈ పదం మన ఆరోగ్యానికే కాదు, మన జీవితానికీ కీలకంగా మారుతుంది. ముఖ్యంగా మెట్రో నగరాల్లో వేడి ఉష్ణోగ్రతలు, ట్రాఫిక్ కష్టాలు, ఎయిర్ కండిషనర్ల నీడలో గడిచే జీవితాలు.. ఇలాంటి కారణాలతో మన శరీరంలోని నీటి శాతం గణనీయంగా తగ్గుతుంది. దాదాపు 70 శాతం పైగా నీరుండే మానవ శరీరం డీహైడ్రేషన్‌తో తాత్కాలిక ఆరోగ్య సమస్యలు మొదలు ప్రాణాపాయ పరిస్థితులకూ చేరుకుంటుంది. ప్రధానంగా చిన్నారుల్లో, వృద్ధుల్లో ఈ సమస్య జటిలంగా మారుతుంది. ఈ నేపథ్యంలో పళ్లరసాలు వేసవి తాపానికి, దాహానికి, దేహానికి సహజమైన పరిష్కారాలను అందిస్తున్నాయి. హైడ్రేషన్ కోసం సహజమైన, రుచికరమైన, ఆరోగ్యవంతమైన ప్రత్యామ్నాయం అందిస్తున్నాయి.

- సాక్షి, సిటీబ్యూరో



వేసవిలో సైతం పండే పండ్లలో నీటి శాతం అధికంగా ఉండటం వల్ల.. ఇవి తక్షణ హైడ్రేషన్‌ను కలిగిస్తాయి. ద్రాక్ష, మామిడి, కర్బూజ, పుచ్చకాయ, నేరేడు, నారింజ వంటి పండ్లు పోషక సమ్మేళనంగా రసాలతో పాటు విటమిన్స్, మినరల్స్‌ను అందిస్తాయి. వీటిలో ముఖ్యంగా విటమిన్-సీ, పొటాషియం, ఫైటో న్యూట్రియంట్స్ వంటి పోషకాలుంటాయి. ఇవి శరీరానికి జలాభిషేకం చేయడమే కాదు, హీట్ స్ట్రోక్, చెమట వల్ల వచ్చే అలసట, నీరసం వంటి వాటిని కూడా తగ్గిస్తాయి.

డీహైడ్రేషన్‌ను ఎలా తగ్గిస్తాయి?

వేసవి కాలంలో చెమట ద్వారా శరీరం నుంచి నీరు, లవణాలు (ఎలక్ట్రోలైట్స్) కోల్పోవడం సర్వసాధారణం. పళ్లరసాల్లో ఉండే సహజ పొటాషియం, సోడియం లాంటి ఖనిజాల వల్ల ఈ లోపాలను భర్తీ చేయడం సాధ్యపడుతుంది. ముఖ్యంగా నారింజ రసం శరీరానికి తక్షణ శక్తిని అందించగలవని ఆరోగ్య నిపుణుల సూచన. ముఖ్యంగా పుచ్చకాయ రసంలో 90 శాతానికి పైగా నీరు ఉండటంతో ఇది సహజ కూలెంట్‌గానూ పనిచేస్తుంది.



కూల్ డ్రింక్స్ ఎందుకు మంచివి కావు?

హైదరాబాద్ వంటి ప్రముఖ నగరాల్లో అధికంగా వినియోగించే కూల్ డ్రింక్స్‌లో అధిక చక్కెర, కృత్రిమ రంగులు, కార్బన్‌డయాక్సైడ్ ఉంటాయి. ఇవి తాత్కాలికంగా శరీరానికి చల్లదనాన్ని కలిగించినట్టు అనిపించినా, అసలైన హైడ్రేషన్‌ను కలిగించవు. పైగా.. అధికంగా తీసుకుంటే మధుమేహం, దంత సమస్యలు, శరీర బరువు పెరగడం వంటి దీర్ఘకాలిక ప్రమాదాలున్నాయని వైద్యులు చెబుతున్నారు.

ఎండదెబ్బ నుంచి రక్షణనిచ్చే పళ్ల రసాలు



- డీహైడ్రేషన్‌కు విరుగుడు హైడ్రేషన్ మాత్రమే
- ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లకు రక్షణగా
- సీజనల్ ఫ్రూట్ జ్యూస్‌లో పోషకాలు మెండు
- హైడ్రేషన్‌కు పనికిరాని కూల్ డ్రింక్స్, పైగా అనారోగ్యం

వేసవిలో తీసుకోవాల్సిన పళ్లరసాలు..

మామిడి పానకం : సహజ చక్కెరతో, తేనెతో తయారు చేస్తే శరీరాన్ని శక్తివంతంగా ఉంచుతుంది.

నారింజ/మోసంబి రసం : విటమిన్-సీ అధికంగా ఉండి రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది.

పుచ్చకాయ రసం : శరీర ఉష్ణోగ్రత తగ్గించడంలో ఉత్తమమైనది.

ద్రాక్ష రసం : హైడ్రేషన్‌తో పాటు యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి.

తాజా కొబ్బరి నీరు : సహజమైన ఎలక్ట్రోలైట్లతో నిండి ఉంటుంది.

రోజుకో గ్లాసు..



ఉదయం కార్యాలయానికి లేదా ఇతర పనుల మీద బయలుదేరేముందు ఓ గ్లాసు తాజా పళ్ల రసం తీసుకోవడం అలవాటు చేసుకోవడం ఉత్తమం. ఈ పండ్ల రసాలు రోడ్ల మీద దొరికేవి కాకుండా ఇంట్లోనే తయారు చేసుకోవడం శ్రేయస్కరం. షుగర్ లేని, ప్లాస్టిక్ ఫ్రీ, ఆరోగ్యాన్ని మెరుగుపరిచే మార్గం ఇదేనని వెల్‌నెస్ ట్రైనర్ల అభిప్రాయం. వేసవిలో శరీరాన్ని చల్లబరచాలంటే.. చల్లని నీళ్ల కాకుండా, ఆరోగ్యవంతమైన పళ్లరసాలు ఎంచుకోవడం ఉత్తమం.





మెడ్‌ట్రానిక్‌తో నైపుణ్య ఒప్పందం



సాక్షి, సిటీబ్యూరో: అధునాతన శస్త్రచికిత్సా విధానాలపై యువ, వర్ధమాన సర్జన్‌ల నైపుణ్యం పెంచడానికి నగరానికి చెందిన మల్టీ-స్పెషాలిటీ హాస్పిటల్ నెట్‌వర్క్, కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, ఆరోగ్య సంరక్షణ, సాంకేతిక పరిజ్ఞానంలో అంతర్జాతీయంగా పేరొందిన మెడ్‌ట్రానిక్‌తో అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. ఈ భాగస్వామ్యం ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలో 100 మందికి పైగా సర్జన్లకు శిక్షణ ఇవ్వడం, జనరల్ సర్జరీ, ఆంకాలజీ, యూరాలజీ-గైనకాలజీ, ఎండోస్కోపీలో శస్త్రచికిత్స నైపుణ్యాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా కిమ్స్ చైర్మన్ డాక్టర్ బి.భాస్కరరావు మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం తదుపరి శస్త్రచికిత్స నిపుణులను అభివృద్ధి చేసేందుకు ఉపకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెడ్‌ట్రానిక్ ఇండియా ఎండీ.మన్‌దీప్ సింగ్ కుమార్ పాల్గొని మాట్లాడారు.

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై

దృష్టి పెట్టాలి..



సాక్షి, సిటీ బ్యూరో: విద్యార్థులు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పై దృష్టి పెట్టాలని, ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి చేరాలని విద్యావేత్తలు, స్టార్టప్ ప్రముఖులు సూచించారు. నగరానికి చెందిన బోవర్ స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో 'నాయకత్వం, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మార్గం: అండర్ గ్రాడ్యుయేట్ విద్యలో కొత్త శకం' అంశంపై టీ-హబ్‌లో యూజీ సమ్మిట్ జరిగింది. రాష్ట్ర ఐటి శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమానికి విద్యావేత్తలు, తల్లిదండ్రులు, ప్రముఖ స్టార్టప్ వ్యవస్థాపకులు, వెంచర్ క్యాపిటలిస్టులు, విద్యార్థులు హాజరయ్యారు. సదస్సులో భాగంగా అండర్ గ్రాడ్యుయేట్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కోర్సు బోవర్ స్కూల్ ప్రకటించింది. భవిష్యత్ వ్యాపారులను తీర్చిదిద్దడానికి ఉద్దేశించిన ఈ కోర్సులో అంతర్జాతీయ విజ్ఞాన ఆధారిత పాఠ్యాంశాలను చేర్చామని, స్టార్టప్ వ్యవస్థాపకుల నేతృత్వంలో బోధన సాగుతుందని బోవర్ స్కూల్ స్థాపకుడు పవన్ అల్లెన తెలిపారు.

యువ ఫిల్మ్ మేకర్స్ కోసం..

కీప్ ఇట్ షార్ట్..

- నూతన ఓటీటీ ప్లాట్‌ఫామ్ ప్రారంభం
- దర్శకత్వం, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, కథా రచన తదితరులకు వేదిక

సాక్షి, సిటీబ్యూరో: యువ ఫిల్మ్ మేకర్స్ ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా సినీస్టార్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో కీప్ ఇట్ షార్ట్ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో సినీస్టార్ టెక్నాలజీస్ సీఈఓ నాగేందర్ పోలమరాజు మాట్లాడుతూ.. ఇది దేశంలోనే మొదటి ఫిల్మ్, యానిమేషన్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఓటీటీ ప్లాట్‌ఫామ్ అన్నారు. యువ ఫిల్మ్ మేకర్స్‌కు ప్రారంభ వేదికగా దీనిని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 1,500 పైగా ఫిల్మ్ ఇన్‌స్టిట్యూషన్స్, 1,200 యానిమేషన్ ఇన్‌స్టిట్యూట్లకు చెందిన ఐదు లక్షలకు పైగా విద్యార్థులు ఉన్నారని, వారందరి కలల సాకారం కోసం ఈ వేదిక ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్లాట్‌ఫామ్ ప్రారంభంలో వెయ్యి నుంచి పన్నెండు వందల షోరీల్స్ లేదా టీమ్ ఎంట్రీలు (ఒక్కో టీమ్‌లో కనీసం ఐదుగురు సభ్యులు) అందుకుంటుందని అంచనా, దీని ద్వారా ఆరు వేలకు పైగా యువ ఫిల్మ్ మేకర్స్ పాల్గొననున్నారని అన్నారు. దర్శకత్వం, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, కథా రచన, స్క్రీన్ రైటింగ్ రంగాల్లో సృజనాత్మకతకు అద్భుత వేదికని, ఇప్పటికే దేశవ్యాప్తంగా ఫిల్మ్, యానిమేషన్ ఇన్‌స్టిట్యూట్లు, మీడియా గవర్నింగ్ బాడీలు ఈ ప్లాట్‌ఫామ్‌తో కలిసి పని చేయడానికి ఆసక్తిని వ్యక్తం చేస్తున్నాయన్నారు.




చరిత్రకు చిహ్నాలు..


పురాతన కట్టడాలు..

నిజాం పాలనలో రజాకార్ల దాడుల గురించి ముందస్తుగా ప్రజలకు తెలియజేయడానికి గ్రామాల్లో అప్పట్లో బురుజులు నిర్మించారు. బురుజులపై ఎల్లప్పుడూ ఒకరిద్దరు కాపలా ఉండేవారు. గ్రామం పొలిమేర వరకూ కనిపించడానికి బురుజుల చుట్టూ కిటికీ లాంటి నిర్మాణాలుండేవి. అక్కడి నుంచి రజాకార్ల రాకను పసిగట్టి ప్రజలను అప్రమత్తం చేసేవారు. ఈ కట్టడాలు మేడ్చల్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఉన్నాయి. అవి నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. ప్రభుత్వం చొరవచూపి వీటిని అభివృద్ధి చేస్తే భావితరాలకు చరిత్రను తెలిపే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

- శామీర్‌పేట








- రాజుల కాలంలో నిఘా కోసం బురుజుల నిర్మాణం
- ఇప్పటికీ చెక్కుచెదరని అలనాటి కట్టడాలు
- నాటిగుర్రపు శాలే నేటి మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయం

ఉమ్మడి శామీర్‌పేట మండలం లాల్‌గడి మలక్‌పేటలో, ఘట్‌కేసర్ మండలంలో కొండాపూర్, అంకుషాపూర్, మర్పల్లిగూడలో, మేడ్చల్ మండలంలోని డబిల్‌పూర్, బండమాదారంలో, మేడ్చల్ పట్టణంలో నిజాం రాజుల గుర్రాల కోసం నిర్మించిన గుర్రపుశాల నేటికీ తహసీల్దార్ కార్యాలయంగా వినియోగంలో ఉంది.

వందల ఏళ్లు గడిచినా..

ఆ కట్టడాలు కట్టి వందల ఏళ్లు గడుస్తున్నా నేటికీ చెక్కు చెదరకుండా దృఢంగా ఉన్నాయి. మేడ్చల్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సుమారు 400 సంవత్సరాల క్రితం రాజులు పాలిస్తుండగా తరచూ చోరీలు జరిగేవి. దీంతో నాటి కాలంలో గ్రామాల నడిబొడ్డున పెద్ద రాతి కట్టడాలు (బురుజులు) నిర్మించారు. అనంతరం రజాకార్ల కాలంలో వారి ప్రవేశాన్ని గుర్తించేందుకు బురుజులను వినియోగించారు.



నాటి సైనికుల విడిది కేంద్రం..

నాడు మేడ్చల్ అటవీ ప్రాంతం కావడంతో రాజులు వేటకు వచ్చేవారు. మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయ భవనం సైనికుల విడిది కేంద్రంగా, చుట్టూ ఆవరణలో ఉన్న చిన్న చిన్న గదుల్లో గుర్రాలను కట్టించి ఉంచేవారు. తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న మేడ్చల్ పెద్ద మసీదును ప్రార్థనల కోసం నాడు నిర్మించినదే. కాలక్రమేణ నాటి గుర్రపు శాల నేడు మేడ్చల్ తహసీల్దార్ భవనంగా మారింది.



మొక్కలతో

వనజీవికి నివాళి..

- 'వనజీవి' స్మరణార్థం భారీగా మొక్కలు నాటిన బృహస్పతి టెక్నాలజీస్
- పద్మశ్రీ దరిపల్లి రామయ్య ప్రేరణతో వినూత్న ప్రయత్నం





సాక్షి, సిటీబ్యూరో: జీవితాంతం హరిత విప్లవానికి అంకితమై విశేష కృషి చేసిన 'వనజీవి' పద్మశ్రీ దరిపల్లి రామయ్య స్మరణార్థం నగర శివారులోని ప్రముఖ ఏఐ ఆధారిత సర్వైలెన్స్, ఈ-సెక్యూరిటీ సిస్టమ్స్ సంస్థ బృహస్పతి టెక్నాలజీస్ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. జీవితాంతం మొక్కలు పెంచుతూ, పర్యావరణ సంరక్షణ కోసం పాటు పడిన వనజీవి రామయ్యకు నివాళిగా వెల్జెర్ల వేదికగా 100 మందికి పైగా బృహస్పతి టెక్నాలజీస్ ఉద్యోగులు, స్థానిక రైతులు పాల్గొని మొక్కలు నాటుతూ రామయ్యను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఏక కాలంలో 600కు పైగా మొక్కలు నాటుతూ భవిష్యత్ కార్యాచరణను ప్రారంభించామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్ పాపోలు తెలిపారు. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణపై విజ్ఞానం పెంచేందుకు విశేషంగా పనిచేసిన ఉద్యోగులను ప్రోత్సహించడమే లక్ష్యంగా వారిని ప్రత్యేకంగా సత్కరించి బహుమతులు అందించారు. ప్రతి పౌరుడూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించేందుకు చర్యలు చేపట్టాలని రామయ్య చెప్పకనే చెప్పారని గుర్తు చేశారు. ఈ మొక్కలు నాటడంలో పద్మశ్రీ దరిపల్లి రామయ్య సేవలు తమకు ప్రేరణ అని, ఈ ప్రయత్నంతో ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కార్పొరేట్ సంస్థగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఉద్యోగుల్లో ప్రకృతి పట్ల ప్రేమను పెంచడమే కాదు, పనితో వచ్చే ఒత్తిడిని కూడా తగ్గించవచ్చన్నారు. సస్టెయినబిలిటీ, సామాజిక బాధ్యతగా ఈ వినూత్న కార్యక్రమం సామాజిక విప్లవంగా మారాలని అన్నారు.

ఆర్ట్ ఫర్ హోప్.. ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: వర్ధమాన చిత్రకారులు/కళాకారులను ప్రోత్సహించేందుకు ఆర్ట్ ఫర్ హోప్‌ని ప్రారంభిస్తున్నట్లు హ్యుందాయ్ మోటార్ ఇండియా ఫౌండేషన్‌కు చెందిన పునీత్ ఆనంద్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రపంచ కళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రారంభించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన 50 మంది వ్యక్తులు/బృందాలకు ఆర్థిక సహాయం అందిస్తామని, అంతేకాకుండా దేశవ్యాప్తంగా వారి కళా ప్రదర్శనలు ఏర్పాటు చేసేందుకు చేయూత అందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా తమ ప్రతిభను నిరూపించుకుందామనే ఆసక్తి కలిగిన చిత్ర/కళాకారులు దరఖాస్తు చేసుకోవచ్చని, మే 1వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభిస్తున్నామని తెలియజేశారు. అదనపు సమాచారం కోసం contactus@hyundaiartforhope.com ద్వారా సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా...

రేవంత్ కేసు విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిపై 2016లో దాఖలైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణ నుంచి జస్టిస్ కె.లక్ష్మణ్ తప్పుకున్నారు. రాజోలు నియోజకవర్గం ఎస్సీ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ డైరెక్టర్ పెద్దిరాజుకు సంబంధించి ఓ కేసులో గతంలో జస్టిస్ కె.లక్ష్మణ్ వాదనలు వినిపించారు. అతను ఈ కేసులో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుదారుడైనందున విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు ఆయన చెప్పారు. మరో బెంచ్ ముందు పిటిషన్‌ను విచారణకు ఉంచాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేశారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపనపల్లి గ్రామం సర్వే నంబర్ 127లోని 31.5 ఎకరాలపై ఫిర్యాదుదారు (డీఫ్యాక్టో కంప్లైనెంట్) పెద్దిరాజుకు, ఎనుముల సోదరుల మధ్య వివాదం ఉంది. తన భూమిలోకి అక్రమంగా చొరబడి జేసీబీతో సొసైటీకి చెందిన గదిని కూల్చివేశారని, అంతేకాకుండా తనను కులం పేరుతో అసభ్యకరంగా దూషించారని పెద్దిరాజు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కొండల్‌రెడ్డిని ఏ–1గా, ఇ.లక్ష్మిని ఏ–2గా, రేవంత్‌రెడ్డిని ఏ–3గా పేర్కొంటూ పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. 2016, జనవరి 13న గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో దాఖలైన ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ 2020లో రేవంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకున్నా రాజకీయ ప్రేరేపితంగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారన్నారు. ఈ పిటిషన్ జస్టిస్ కె.లక్ష్మణ్ వద్దకు మంగళవారం విచారణకు వచ్చింది. ఫిర్యాదుదారు తరఫున గతంలో వాదనలు వినిపించినందున విచారణ చేపట్టలేనంటూ ఆయన తప్పుకున్నారు.

కూతురు తనను విడిచి వెళ్తోందని..

మనస్తాపంతో తల్లి ఆత్మహత్య



గోదావరిఖని:రంజాన్ పండుగకు వచ్చిన కూతురు తన మాట వినకుండా.. భర్త వద్దకు వెళ్తోందనే మనస్తాపంతో ఆమె తల్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని విఠల్ నగర్‌కు చెందిన ఎండీ సాజిదా (42) కూలి పనులు చేసుకుంటూ.. తల్లి మౌలాన్‌బీతో నివాసముంటోంది. రంజాన్ పండుగకు కూతురు సానియా గోదావరిఖనిలోని తల్లి సాజిదా వద్దకు వచ్చింది. పండగ తర్వాత భర్త వద్దకు వెళ్తానని తల్లికి చెప్పింది. భర్త వద్దకు వెళ్లకుండా తన వద్దే ఉండాలని, తనను విడిచి వెళ్తే ఉరి వేసుకుని చనిపోతానని తల్లి బెదిరించింది. గతంలో కూడా ఇలానే చాలాసార్లు బెదిరించింది. అయితే, తల్లిని సముదాయించిన సానియా.. భర్త వద్దకు వెళ్లేందుకు బ్యాగు తీసుకుని అమ్మమ్మ మౌలాన్‌బీతో కలిసి బస్టాండ్‌కు బయల్దేరింది. మనుమరాలిని బస్టాండ్ వద్ద దింపి ఇంటికి వచ్చి చూసేసరికి సాజిదా ఉరి వేసుకుని కనిపించింది. మౌలాన్‌బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

మోసపోయి.. అప్పులపాలై..

గల్ఫ్ ఏజెంట్ మోసం..

అప్పుల భారం.. రైతు ఆత్మహత్య



శ్రీనివాస్‌రెడ్డి(ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): గల్ఫ్‌కు పంపిస్తానంటూ ఓ ఏజెంట్ మోసగించడం.. పొలంలో బోర్లు వేసినా నీళ్లు రాకపోవడంతో అప్పులపాలై మనోవేదనతో ఒక రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం పోతారం(జే) గ్రామ పంచాయతీ పరిధిలోని తుర్కనవానికుంటలో జరిగిన ఈ సంఘటనపై పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బోడ శ్రీనివాస్‌రెడ్డి (40)ని దుబాయ్ పంపిస్తానని.. సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లికి చెందిన ఓ గల్ఫ్ ఏజెంట్ రూ.4 లక్షలు తీసుకున్నాడు. తర్వాత రేపు, మాపంటూ దాటవేశాడు. మరోవైపు శ్రీనివాసరెడ్డి.. మరోవైపు వ్యవసాయానికి దాదాపు రూ.16 లక్షలు.. దుబాయ్ కోసం రూ.4 లక్షలు.. ఇలా మొత్తం రూ.20 లక్షలు అప్పు చేశాడు. గల్ఫ్ ఏజెంట్ మోసం.. పంటలు పండక పోవడం.. అప్పుల భారం భరించలేక.. సోమవారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులు ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో.. ఇంట్లో సూసైడ్ నోట్ రాసి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

తెలంగాణకు పూర్తి సహకారం

సీఈఏ చైర్‌పర్సన్ హామీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) చైర్మన్ ఘన్ శ్యాం ప్రసాద్‌హామీ ఇచ్చారు. ఆయన మంగళవారం రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, డిస్కంల సీఎండీలు ముషారఫ్ అలీ ఫారూఖీ, వరుణ్ రెడ్డితో హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర విద్యుత్ డిమాండ్ – సరఫరా, రిసోర్స్ ప్లాన్, పునరుత్పాదక విద్యుత్ లక్ష్యాల సాధనకు తీసుకుంటున్న చర్యలు, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ నుంచి అవసరమైన సహకారం, రాష్ట్రంలో అమలవుతున్న ప్రాజెక్టుల పురోగతి తదితర అంశాలపై చర్చించారు.

చేపా.. చేపా.. ఎందుకు పెరగలే?



ఉమ్మడి వరంగల్ జిల్లా మోతుకుంటలో పట్టిన చిన్న సైజు చేపలను చూపుతున్న మత్స్యకారులు

ఆశించిన ఫలితాలనివ్వని ఉచిత చేపపిల్లల పంపిణీ పథకం

- టెండర్ల ఆలస్యం.. నాసిరకమైన చేపపిల్లల సరఫరానే కారణమంటున్న మత్స్యకారులు
- రికార్డుల్లో చూపుతున్న చేపపిల్లల సంఖ్యకు.. సరఫరా చేసిన సంఖ్యలో భారీగా వ్యత్యాసం
- కాంట్రాక్టర్లతో మత్స్యశాఖ అధికారుల కుమ్మక్కు.. బిల్లులు డ్రా చేసేందుకు సన్నాహాలు

చేపా.. చేపా ఎందుకు ఎండలేదు అన్న కథ గుర్తుంది కదా.. ఇప్పుడు చేపా.. చేపా ఎందుకు ఎదగలేదు అంటే అదే మాదిరి కథలా ఉంది పరిస్థితి. చేప పిల్లల టెండర్లు వాయిదా పడుతూ రావడం ఒక కారణమైతే.. చెరువుల్లో వాటిని ఆలస్యంగా వదలడం మరో కారణం. ఇంకో కారణం ఏమిటంటే.. నాసిరకమైన చేప పిల్లలను వదలడమే అంటున్నారు మత్స్యకారులు.

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఉచిత చేపపిల్లల పంపిణీ పథకం ఆశించిన మేర ఫలితాలివ్వలేదు. దీంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారు. వర్షాలు కురిసి..నీరు చేరిన వెంటనే చేపపిల్లలను చెరువుల్లో వదలాలి. జూలై నుంచి ఆగస్టులోపు పిల్లలను చెరువుల్లో వదిలితే.. ఏప్రిల్ చివరివారం వరకు చేపలు పెరిగి దిగుబడి బాగా వస్తుంది. చేపపిల్లల సరఫరా కాంట్రాక్టర్ల ఎంపిక కోసం రాష్ట్ర స్థాయిలో చేపట్టిన టెండర్ ప్రక్రియలో జరిగిన అక్రమాల కారణంగా ఈ పంపిణీలో తీవ్ర జాప్యం జరిగింది. అక్టోబర్‌లో ప్రారంభమై డిసెంబర్ వరకు చేప పిల్లల పంపిణీ కొనసాగింది. దీంతో ఈ పిల్లలు పెరగలేదు. ఈ కారణంగా ఆశించిన మేరకు దిగుబడి రాలేదు. దీంతో తాము తీవ్రంగా నష్టపోయామని, తమ ఉపాధిపై దెబ్బపడిందని మత్స్యకారులు వాపోతున్నారు. నాసిరకం చేపపిల్లలను పంపిణీ చేయడం కూడా మరో కారణమని వారు ఆరోపిస్తున్నారు.

పంపిణీలోనూ కాకిలెక్కలే..

చేపపిల్లల సరఫరా ప్రక్రియలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఆయా చెరువుల్లో వదిలినట్టు రికార్డుల్లో చూపుతున్న చేపపిల్లల సంఖ్య, వాస్తవంగా వదిలిన చేపపిల్లల సంఖ్యను పొంతన లేదు. ఒక్క సంగారెడ్డి జిల్లాలోనే ఈసారి 76 చెరువుల్లో 68 లక్షల చేపపిల్లలను వదిలినట్లు రికార్డుల్లో పేర్కొన్నారు. కానీ జిల్లా మొత్తం మీద 40 లక్షల చేపపిల్లలు కూడా వదలలేదని మత్స్యకారులు వాపోతున్నారు. మత్స్యశాఖ అధికారులు మాత్రం 80 నుంచి 100 ఎంఎం సైజు ఒక్కో చేప పిల్లకు రూ.1.73 చొప్పున, మొత్తం రూ.1.17 కోట్లు డ్రా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్రంలో దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నిబంధనల ప్రకారం చెరువుల్లో చేప పిల్లలు వదిలినప్పుడు వాటిని లెక్కిస్తున్న తీరును వీడియో తీయాలి. ఆ చెరువు మత్స్యకారుల సమక్షంలో చేప పిల్లలను వదలాలి. అయితే మెజారిటీ జిల్లాల్లో ఇవేవీ పాటించకుండా పూర్తిస్థాయిలో బిల్లులు డ్రా చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఆ శాఖ అధికారులు కూడా కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు ఉన్నాయి.



ఖమ్మం జిల్లాలో చేపలు పడుతున్న మత్స్యకారులు

సరఫరా చేసిన చేపపిల్లల రకాలు..	రవ్వ, బొచ్చ, మ్రిగాల, బంగారు తీగ
చేపపిల్లల సైజులు..	80 ఎంఎం -100 ఎంఎం, 35ఎంఎం-40 ఎంఎం
నాణ్యమైన చేపలు పెరగాల్సిన సైజులు	కిలో నుంచి 1.5 కిలోలు..
ప్రస్తుతం పెరిగిన సైజు 250 గ్రాముల నుంచి 750 గ్రాముల లోపు..	

➤ సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మహబూబ్‌సాగర్ చెరువులో ఏటా 1.60 లక్షల చేపపిల్లలను వదిలేవారు. ఈసారి 80 వేల చేపపిల్లలను వదులుతున్నామని సరఫరా కాంట్రాక్టర్ ఆ చెరువుకు సంబంధించిన మత్స్యకారులకు చెప్పారు. తీరా లెక్కిస్తే అవి 35 వేలకు మించి లేవు. అవి కూడా నాణ్యత లేని పిల్లలు వేశారని మత్స్యపారిశ్రామిక సంఘం సభ్యుడు నగేష్ వాపోయారు. తమ సంఘం సుమారు 4 లక్షల చేప పిల్లలను కొన్నామని, ఇందుకు రూ.6 లక్షలకు మించి ఖర్చు అయ్యిందని చెప్పారు.

అరకిలో సైజు కూడా పెరగలేదు..



➤ మా ఊరి చెరువులో దసరా టైంలో 20 వేల చేప పిల్లలను వదిలారు. ఆలస్యంగా వదలడంతో ఇప్పుడు అవి 100 గ్రాముల నుంచి అరకిలో వరకు మాత్రమే పెరిగాయి. ఇప్పుడున్న ఎండలకు చెరువులో నీరు ఇంకిపోతోంది. దీంతో చేప సైజు చిన్నగా ఉన్నా, పట్టుకొని అమ్ముకుంటున్నాం. మా సంఘం తరఫున జూన్‌లో చేప పిల్లలను కొనుక్కొని వచ్చి పోసినం. వాటి సైజు కిలో వరకు ఉన్నయి.

– కంచం సంపత్, మత్స్యకార సంఘం అధ్యక్షుడు, ఆన్‌సాన్‌పల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా.

చిన్న చేపలను రూ.20కే విక్రయిస్తున్నాం



పెద్దదేవులపల్లి చెరువులో చేపలు పట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాం. చేప పిల్లల పంపిణీలో నాణ్యత లేకపోవడంతో పావుకిలో, అరకిలో మాత్రమే ఎదుగుదల ఉంది. దీంతో ఈ చిన్న చేపలను వ్యాపారులకు రూ.20కే అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. 3 కిలోల నుంచి 5కిలోల వరకు పెరిగితేనే మాకు ఉపాధి దొరుకుతుంది.

– ముత్తయ్య, మత్స్యకారుడు, నల్లగొండ జిల్లా

ప్రైవేట్ చేప విత్తనమే బాగుంది



➤ ప్రభుత్వం ఉచితంగా చెరువుల్లో వదిలిన చేపపిల్లలు పెరగలేదు. ఇప్పటివరకు అరకిలో లోపే ఉన్నాయి. మేమే ప్రైవేట్‌గా చేపపిల్లలను కొన్నాం. ఇవి కిలో వరకు పెరిగాయి. ప్రభుత్వం మత్స్యకార సంఘాలకు నేరుగా డబ్బులు ఇస్తే మేమే నాణ్యమైన చేపలను కొంటాము. ప్రభుత్వం వేసిన చేపపిల్లలతో పెద్దగా ఉపాధి లేకుండా పోయింది.

– పుట్టి శంకర్, సర్సాపూర్(డబ్ల్యూ), లక్ష్మణ్ చందా, నిర్మల్ జిల్లా

ప్రతి దరఖాస్తుకు ఒక డెడ్‌లైన్

▶ మొదటి పేజీ తరువాయి

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సవరణలు కోరవచ్చు. ఆ భూమికి సంబంధించి ప్రభుత్వం గతంలో జారీచేసిన పాసు పుస్తకాలు, టైటిల్ డీడ్స్, పహాణీలు లేదా రిజిస్టర్ డాక్యుమెంట్లు, ఇతర డాక్యుమెంట్లతో పాటు తాను చేసుకున్న దరఖాస్తు సరైనదేనని అఫిడవిట్ జత చేయాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తులను ఆర్డీవోలు, జిల్లా కలెక్టర్లు పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటారు. ఆర్డీవోలు తీసుకున్న నిర్ణయంపై అభ్యంతరాలుంటే జిల్లా కలెక్టర్లకు, కలెక్టర్ల నిర్ణయాలపై అభ్యంతరాలుంటే ట్రిబ్యునల్స్‌కు రీఅప్పీల్ (మళ్లీ దరఖాస్తు) చేసుకోవచ్చు. ఈ దరఖాస్తుల పరిష్కారానికి రెవెన్యూ వర్గాల నుంచి సంబంధిత వ్యక్తులకు నోటీసు వస్తుంది. ఈ నోటీసులపై సెకండ్ పార్టీ (దరఖాస్తుదారులు కాకుండా) వారం రోజుల్లోగా లిఖిత పూర్వక అభ్యంతరాలు ఇవ్వాల్సి ఉంటుంది. అలా ఇవ్వని పక్షంలో సంబంధిత అధికారి నిబంధనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటారు. లిఖిత పూర్వక అభ్యంతరాలు సమర్పించిన పక్షంలో నోటీసులు అందిన వారం రోజుల తర్వాత సదరు అధికారి ఆ దరఖాస్తుపై విచారణ జరుపుతారు. విచారణ రిపోర్టుతోపాటు ఇరుపక్షాల నుంచి వచ్చిన సాక్ష్యాలను పరిశీలిస్తారు. నేరుగా వారు వాదనలు వినిపించే అవకాశం కల్పిస్తారు. ఆ తర్వాత సదరుఅధికారి తగు ఉత్తర్వులు జారీ చేస్తారు. ఈ ఉత్తర్వులను భూభారతి పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతారు. ఇదంతా నోటీసు జారీ చేసిన 60 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది.

రిజిస్ట్రేషన్లు ఇలా..

ఏదైనా భూమిని రిజిస్ట్రేషన్‌తోపాటు మ్యుటేషన్ చేసుకునేందుకు భూభారతి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. భూమి రిజిస్ట్రేషన్ కోసం తహసీల్దార్‌ను సమయం (స్లాట్) అడిగితే, ఆ మేరకు తహసీల్దార్ స్లాట్ కేటాయిస్తారు. స్లాట్ ఇచ్చిన సమయంలో ఇరు పక్షాలు సంతకాలు చేసిన డాక్యుమెంట్లు, పట్టాదారు పాసుపుస్తకాలు, టైటిల్ డీడ్స్ సమర్పించాల్సి ఉంటుంది. వీటి ఆధారంగా దరఖాస్తుదారుడు పేర్కొన్న వివరాలు హక్కుల రికార్డుతో సరిపోలాయా.. లేదా? ఆ భూమి నిషేధిత భూముల జాబితాలో ఉందా? అసైన్డ్ భూమా? షెడ్యూల్డ్ ఏరియాలో ఉందా? అనే వివరాలను పరిశీలించి సదరు అధికారి రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే తహసీల్దార్ సంబంధిత రికార్డును కూడా భూభారతిలో మార్చాలి. ఈ వివరాల తో కూడిన డాక్యుమెంట్‌ను క్రయవిక్రయదారులిద్దరికీ ఇవ్వాలి. ఇందుకు సంబంధించిన పాసుపుస్తకం కూడా వెంటనే జారీ చేయాల్సి ఉంటుంది.

సాదా బైనామాల క్రమబద్ధీకరణ

ఈ చట్టం ద్వారా పెండింగ్‌లో ఉన్న 9 లక్షలకు పైగా సాదా బైనామా దరఖాస్తులకు మోక్షం కలగనుంది. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లేకుండా తెల్ల కాగితాలపై భూ యాజమాన్య హక్కులను జూన్ 2, 2014 నాటికి మార్చుకున్నవారు.. తమ పేరిట ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని 2020, అక్టోబర్ 12 నుంచి నవంబర్ 10 వరకు చేసుకున్న దరఖాస్తులను ఈ చట్టం ప్రకారం పరిష్కరించవచ్చు. ఈ దరఖాస్తుల పరిష్కారం కోసం విచారణకు రావాలని ఆర్డీవో నోటీసులు జారీ చేస్తారు. అప్పుడు దరఖాస్తుదారుడు అఫిడవిట్ సమర్పించాల్సి ఉంటుంది. ఆర్డీవో క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ జరిపి సాదాబైనామా నిజమా కాదా అనేది నిర్ధారించి తగు నిర్ణయం తీసుకుంటారు. అయితే, ఆ భూమి సీలింగ్, షెడ్యూల్డ్ ఏరియా, పీఓటీ (అసైన్డ్) చట్టాల పరిధిలోనికి రానిదై ఉండాలి. ఒకవేళ సాదాబైనామా కింద దరఖాస్తుదారునికి హక్కులు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంటే సర్టిఫికెట్ జారీ చేస్తారు. దానిని వారం రోజుల్లోగా ఇరుపక్షాలకు పంపుతారు. ఆ తర్వాత ఆర్డీవోనే సదరు భూమిని భూభారతి చట్టం మార్గదర్శకాలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ చేస్తారు. ఈ ప్రక్రియ అంతా నోటీసులిచ్చిన 90 రోజుల్లోపు పూర్తి కావాల్సి ఉంటుంది.

వారసత్వ భూములపై హక్కులు

వీలునామాల ఆధారంగా లేదా వారసత్వంగా వచ్చే భూములపై హక్కుల కోసం భూభారతి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వారసత్వ హక్కుల కోసం దరఖాస్తు చేసుకోవాలంటే వారసులందరూ అఫిడవిట్లు జత చేయాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తుల పరిష్కారం కోసం వారసులందరికీ తహసీల్దార్ నోటీసులు జారీ చేస్తారు. ఈ నోటీసును గ్రామపంచాయతీలు, తహసీల్దార్ ఆఫీసుల్లోని నోటీసు బోర్డుల్లో కూడా ప్రదర్శిస్తారు. ఈ నోటీసులు అందుకున్న ఏడు రోజుల్లోగా దరఖాస్తుదారుడు అన్ని డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుంది. తహసీల్దార్ వాటిని పరిశీలించి అవసరమైతే వారసులను విచారించి నిర్ణయం తీసుకుంటారు. ఇదంతా నోటీసులు జారీచేసిన 30 రోజుల్లోగా పూర్తి చేయాలి. అలా చేయని పక్షంలో ఆ దరఖాస్తు ఆమోదింపబడుతుంది.

మ్యుటేషన్‌కు 30 రోజులు గడువు..!

కోర్టు ఆదేశాలు, లోక్‌అదాలత్ తీర్పులు, రెవెన్యూ కోర్టుల ఉత్తర్వులు, ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్, సీలింగ్, భూదాన్, 1977 అసైన్డ్ చట్టం కింద ఇచ్చిన భూములు, ఇనామ్‌ల రద్దు చట్టం కింద ఓఆర్‌సీ, రక్షిత కౌలుదారు చట్టం కింద యాజమాన్య సర్టిఫికెట్లు, ఇండ్ల స్థలాల రూపంలో ఇచ్చిన భూములకు మ్యుటేషన్ కోసం భూభారతి ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న తర్వాత ఆర్డీవో నోటీసు ఇస్తారు. ఈ నోటీసు ప్రకారం ప్రత్యక్ష విచారణ లేదంటే రిపోర్టు తెప్పించుకోవడం ద్వారా డాక్యుమెంట్లను పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటారు. ఈ ప్రక్రియ 30రోజుల్లో పూర్తి కావాల్సి ఉంటుంది.

ప్రతి భూ యజమానికి భూధార్ కార్డు

భూభారతి పోర్టల్‌లో ఉన్న హక్కుల రికార్డు ఆధారంగా తహసీల్దార్లు తాత్కాలిక భూధార్ కార్డులు జారీ చేస్తారు. పోర్టల్‌లో పేరున్న ప్రతి ఒక్కరికీ ఈ కార్డులు జారీ అవుతాయి. ప్రభుత్వ నిర్ణయం మేరకు భవిష్యత్తులో ప్రతి భూమికి యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ (యూఐఎన్) ఇస్తారు. రాష్ట్రంలోని భూములన్నింటినీ సర్వే చేసి, ప్రతి భూమికి అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా హద్దులు నిర్ణయించి ఈ కార్డులను జారీ చేయాల్సి ఉంటుంది.

కొత్త పాసుపుస్తకాల జారీ

కొత్త పాసుపుస్తకాల కోసం కూడా ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ దరఖాస్తులను తహసీల్దార్ పరిశీలించి హక్కుల రికార్డులోని వివరాల ఆధారంగా పాసుపుస్తకం కమ్ టైటిల్ డీడ్ జారీ చేస్తారు. భూభారతి పోర్టల్‌లో నమోదైన భూయజమానులందరికీ తహసీల్దార్లు సుమోటోగా పాసుపుస్తకాలు ఇవ్వొచ్చు. దేనికైనా నిర్దేశిత ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. హక్కుల రికార్డులో నమోదైన భూములను ఎప్పుడైనా లైసెన్స్‌డ్ సర్వేయర్ ద్వారా సర్వే చేయించుకోవచ్చు. ఈ సర్వే ద్వారా నిర్ధారించిన మ్యాప్‌ను పాసుపుస్తకాల్లో కూడా ముద్రించాల్సి ఉంటుంది.

గ్రామ అకౌంట్ల నిర్వహణ

గ్రామస్థాయిలో రెవెన్యూ రికార్డులను నిర్వహించాల్సి ఉంటుంది. మ్యుటేషన్, రికార్డుల అప్‌డేషన్ జరిగినప్పుడు ఆ వివరాల ఆధారంగా అవసరాన్ని బట్టి గ్రామ పహాణీ, ప్రభుత్వ భూమి రిజిస్టర్, బదిలీ రిజిస్టర్, సాగునీటి సౌకర్యం రిజిస్టర్‌లను మార్చాల్సి ఉంటుంది. ఏటా డిసెంబర్ 31 అర్ధరాత్రిలోపు గ్రామ అకౌంట్ వివరాలను సంబంధిత అధికారికి సమర్పించాలి. టైటిల్, కబ్జా, లేదంటే ఇతర సివిల్ అంశాల్లో ఎవరికి ఏ భూమిపై ఎలాంటి అభ్యంతరం ఉన్నా సంబంధిత సివిల్ కోర్టులకు వెళ్లి పరిష్కరించుకునే అవకాశాన్ని ఈ చట్టం కల్పిస్తుంది.

అప్పీళ్లతో పాటు రివిజన్ కూడా..

భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తుల పరిష్కారం కోసం రెవెన్యూ వర్గాలు తీసుకునే నిర్ణయాలపై ఎవరికైనా అభ్యంతరాలుంటే అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది. తహసీల్దార్ల నిర్ణయాలపై ఆర్డీవోలకు, ఆర్డీవోల నిర్ణయాలపై కలెక్టర్లకు, కలెక్టర్ల నిర్ణయాలపై ట్రిబ్యునల్‌కు అప్పీల్ చేసుకోవచ్చు. దరఖాస్తును బట్టి 30 నుంచి 60 రోజుల్లోపు ఈ అప్పీళ్లను పరిష్కరించాలి. ఎవరైనా, ఏ భూమిపై అయినా మోసపూరితంగా హక్కులు పొందారని భావిస్తే, ఆ భూమి గురించి భూభారతి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లేదంటే భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) సుమోటోగా కూడా అనుమానాస్పద భూములపై విచారణ చేపట్టవచ్చు. రికార్డులు, డాక్యుమెంట్లు, సాక్ష్యాలను పరిశీలించి అవసరమైతే సదరు భూమిని వెనక్కు తీసుకునే వెసులుబాటును ఈ చట్టం కల్పిస్తోంది.

ఉచిత న్యాయ సాయం..

పేద రైతులకు ఈ చట్టం ద్వారా ఉచిత న్యాయ సాయం కూడా అందుతుంది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మహిళలు, వికలాంగ రైతులకు మండల, జిల్లా లీగల్ అథారిటీల సహకారంతో ఈ సాయాన్ని అందజేస్తారు. భూభారతి పోర్టల్ నిర్వహణ సీసీఎల్‌ఏ అధీనంలో ఉంటుంది. రికార్డుల తయారీ, నిర్వహణ, అప్‌డేషన్, సమయానుగుణంగా మార్పు చేర్పులు, ప్రభుత్వ అనుమతి మేరకు షెడ్యూళ్ల మార్పు, అవసరాలకు అనుగుణంగా ఆదేశాల జారీ, మార్గదర్శకాల రూపకల్పన అధికారాలన్నీ సీసీఎల్‌ఏ పరిధిలోనే జరుగుతాయి.

సర్వే మ్యాప్‌లు ఇప్పుడే కాదు!

- రిజిస్ట్రేషన్లతోపాటు సర్వే మ్యాప్ కోసం తర్వాత నోటిఫికేషన్
- అప్పటివరకు మ్యాప్‌లు లేకుండానే రిజిస్ట్రేషన్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా అమల్లోకి వచ్చిన భూభారతి చట్టం ద్వారా జరిగే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు ఇప్పటికిప్పుడు సర్వే మ్యాప్‌లు అవసరం లేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అమలవుతున్న విధంగానే అవసరమైన డాక్యుమెంట్ల ఆధారంగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయని వెల్లడించాయి. అయితే, ప్రభుత్వం భూమి మ్యాపింగ్ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ ఇస్తుందని, అప్పుడు లైసెన్స్‌డ్ సర్వేయర్ల చేత సర్వే చేయించి, భూమి హద్దులను అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా నిర్ధారించి మ్యాప్ ఇస్తారని పేర్కొన్నాయి. అప్పటి నుంచి రిజిస్ట్రేషన్ల సమయంలో కచ్చితంగా సర్వే మ్యాప్ అవసరమవుతుందని, అప్పటివరకు మ్యాప్‌లు లేకుండానే రిజిస్ట్రేషన్లు జరుగుతాయని తెలిపాయి. చట్టం మార్గదర్శకాల్లోనూ ఈ అంశాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. ప్రభుత్వం నోటిఫై చేసిన తర్వాత రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతోపాటు మ్యాప్ అవసరమవుతుందని పలు సెక్షన్లలో ప్రస్తావించారు.

పోర్టల్‌లో ఏం మారింది?

ధరణి పోర్టల్ స్థానంలో వచ్చిన భూభారతిలో ఏముందన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. సోమ, మంగళవారాల్లో ఈ పోర్టల్‌ను దాదాపు 2.20 లక్షల మంది వీక్షించారు. భూభారతి పోర్టల్ వెబ్‌పేజీపై ఎడమ వైపు సీఎం రేవంత్‌రెడ్డి, కుడి వైపున రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫొటోలు, మధ్యలో తెలంగాణ ప్రభుత్వ చిహ్నం, తెలంగాణ తల్లి ఫొటో ఉన్నాయి. ఆకుపచ్చ రంగు ఎక్కువగా కనిపించే ఈ పోర్టల్‌ను ఓపెన్ చేయగానే సీఎం రేవంత్‌రెడ్డి సందేశం కనిపిస్తోంది. ఆ తర్వాత పొంగులేటి సందేశం, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు (లాగిన్), సమాచారం (ప్రజల కోసం), భూధార్, భూమిత్ర, భూపరిపాలన శాఖ, ప్రభుత్వ భూముల రక్షణ, దస్తావేజు రిజిస్ట్రేషన్ మార్గదర్శకాల గురించిన వివరాలు పొందుపరిచారు. భూమిత్ర పేరుతో కొత్తగా చాట్‌బాట్ ఏర్పాటు చేసినప్పటికీ, అది ఇంకా అందుబాటులోకి రాలేదు. ధరణిలాగే ప్రజలు తరచూ అడిగే ప్రశ్నలు, వాటికి సమాధానాలను ఇచ్చారు. భూముల మార్కెట్ విలువ, భూముల వివరాలు, నిషేధిత భూములు, ఈ చలాన్, దరఖాస్తుల పురోగతి, రిజిస్టర్డ్ డాక్యుమెంట్ల సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచారు. నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్‌ఐసీ) నేతృత్వంలో ఈ పోర్టల్‌ను తెలుగుతోపాటు ఇంగ్లిషు భాషలో కూడా రూపొందించారు.

భూభారతి పోర్టల్ ప్రారంభం

నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా మొదలు.. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి తహసీల్‌లో అవగాహన కార్యక్రమం



దరఖాస్తు విధానాన్ని వివరిస్తున్న నేలకొండపల్లి తహసీల్దార్ వెంకటేశ్వర్లు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: భూభారతి పోర్టల్ రాష్ట్రంలోని 4 మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైంది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం, నారాయణపేట జిల్లా మద్దూరు మండలం, కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం, ములుగు జిల్లా వెంకటాపురం మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. భూమి రిజిస్ట్రేషన్లు, మ్యుటే షన్, నాలా మార్పులు, చేర్పులు, అప్పీల్, రివిజన్ తదితర సమస్యల పరిష్కారానికి భూభారతి పోర్టల్ వేదిక కానుంది. పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తొలిరోజు మంగళవారం దీనిపై నేలకొండపల్లి తహసీల్‌లో అవగా హన సదస్సు నిర్వహించారు. ఈ నెల 17 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు నేలకొండపల్లి మండలంలోని 23 రెవెన్యూ గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో రికార్డుల సవరణతో పాటు రైతుల భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ మండలంలో 37,405 ఎకరాల సాగు భూమి ఉండగా, సాదాబైనామా కింద 3,417 దరఖాస్తులు వచ్చాయి. అలాగే ధరణిలో రిజి స్ట్రేషన్‌కు సంబంధించి 150 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని రెవెన్యూ అధికారులు భూభారతి ద్వారా పరిష్కరించనున్నారు. పలువురు రైతులు పోర్టల్ వివరాలు తెలుసుకునేందుకు తహసీ ల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఈ విషయమై నేల కొండ పల్లి తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభు త్వం భూభారతి పోర్టల్ ద్వారా భూ సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయన్నారు.

స్లాట్ బుకింగ్ విధానానికి వ్యతిరేకంగా..

నేటినుంచి డాక్యుమెంట్ రైటర్స్ నిరసనలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టే ఆలోచ నను విరమించుకోవాలని తెలంగాణ డాక్యుమెంట్ రైటర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా డాక్యుమెంట్ రైటర్లు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. తొలుత పైలట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టిన 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానం విఫలమైందన్నారు. దీన్ని గుర్తించి స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనివల్ల వినియోగదారులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. దస్తావేజులు రాస్తూ ఎంతో మంది ఉపాధి పొందుతున్నారని, వారంతా రోడ్డున పడతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ డాక్యుమెంట్ రైటర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు రాష్ట్రంలోని యాదగిరిగుట్ట, ఘట్‌కేసర్, నారపల్లి, మేడ్చల్, సంగారెడ్డి, రాజేంద్రనగర్, చంపాపేట్, ఎల్బీనగర్, చిక్కడపల్లి, మల్కాజిగిరి, చౌటుప్పల్, సూర్యాపేట, జనగామ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు.

నేతల మెప్పుకోసం పనిచేయకండి

కరీంనగర్ కార్పొరేషన్ కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: అధికారులు రాజకీయ నేతల మెప్పు కోసం పనిచేయవద్దని, రాజ్యాంగం, చట్టం ప్రకారం విధులు నిర్వహించాలని హైకోర్టు సూచించింది. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని ఓ నిర్మాణానికి అనుమతి నిరాకరణపై కమిషనర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎలాంటి సర్వే చేయకుండా, కేవలం కార్పొరేటర్ ఫిర్యాదు చేశారంటూ ఫీజు కట్టించుకున్న తర్వాత అనుమతి నిలిపివేస్తారా అని ప్రశ్నించింది. సదరు భూమికి సంబంధించి వెంటనే సర్వే నిర్వహించి అనుమతిపై నిర్ణయం తీసుకోవాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ వేసవి సెలవులు పూర్తయ్యే వరకు వాయిదా వేసింది. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్గునూర్ సర్వే నంబర్ 437/సీలోని 459.35 చదరపు గజాల్లో భవన నిర్మాణంకోసం ఫీజు చెల్లించి అనుమతి పొందిన తర్వాత.. మళ్లీ అనుమతిని రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ బి.వీణారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వ భూమి ఉందని అందిన ఫిర్యాదు మేరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారని చెప్పారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. పిటిషనర్ నుంచి ఫీజు డీడీ తీసుకుని 4 వారాల్లో భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని గత నవంబర్‌లో ఆదేశించింది. అయినా అనుమతి ఇవ్వక పోవడంతో జనవరి 28న ధిక్కరణ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. గత ఆదేశాల మేరకు కమిషనర్ చాహత్ బాజ్‌పాయి ధర్మాసనం ఎదుట హాజరయ్యారు. కమిషనర్ సమాధానానికి సంతృప్తి చెందని న్యాయమూర్తి.. సర్వే చేయకుండా ఎలా నిరాకరిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే చేపట్టి ప్రభుత్వ భూమి ఉందో లేదో తేల్చాలని.. అనంతరం భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేశారు.

తెలంగాణ ఖ్యాతి పెరిగేలా ప్రపంచ సుందరి పోటీలు

ఉన్నతస్థాయి స్టీరింగ్ కమిటీ సూచన

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ సుందరి పోటీలను ఎలాంటి అవాంతరాలు లేకుండా ఘనంగా నిర్వహించటం ద్వారా.. తెలంగాణ, హైదరాబాద్ బ్రాండ్లను విశ్వవ్యాప్తం చేసేందుకు అన్ని సంబంధిత విభాగాలు కృషి చేయాలని పోటీల నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి స్టీరింగ్ కమిటీ ఆదేశించింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధ్యక్షతన కమిటీ మంగళవారం చౌమొహల్లా ప్యాలెస్‌లో సమావేశమైంది. ఈ సందర్భంగా ఎలాంటి ఏర్పాట్లు చేయాలనే అంశాన్ని కమిటీ సభ్యులు సమీక్షించారు.



కాఫీ స్క్రబ్

కాఫీ పౌడర్ ఒక టేబుల్ స్పూన్, ముల్తాని మట్టి రెండు టేబుల్ స్పూన్లు, నీళ్లు రెండు టీ స్పూన్లు, మూడు – నాలుగు చుక్కల ఎసెన్షియల్ ఆయిల్ (వెనీలా, చాకొలెట్, ఆరెంజ్, లెమన్, ఆరెంజ్... ఏదో ఒకరకం) తీసుకోవాలి. ఒక కప్పులో కాఫీపౌడర్, ముల్తానీ మట్టి వేసి నీటితో కలపాలి. బాగా కలిసిన తర్వాత సెంటెడ్ ఆయిల్ కూడా వేసి కలపాలి. ఈ మిశ్రమం ఎక్స్‌ఫోలియేషన్‌కు బాగా పనిచేస్తుంది. కాని కొంచెం గరుకుగా ఉంటుంది కాబట్టి ముఖానికి, మెడకు అప్లయ్ చేయకూడదు. ఈ రెండింటినీ మినహాయించి ఒంటికి పట్టించి మర్దన చేస్తే మృతకణాలు తొలగిపోవడంతోపాటు చర్మం నునుపుగా మారుతుంది.

లీగల్

మీరు నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు

నేను ఒక ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నాను. పెరిమెనోపాజ్ స్టేజ్‌లో ఉన్నాను. దాంతో ఇర్రెగ్యులర్ పీరియడ్స్ వస్తున్నాయి. ఆ సమయంలో చికాకుగా, ఆందోళనగా... ఎవరైనా ఏమైనా అంటే కొట్టాలన్నంత కోపంగా ఉంటుంది. మొదటి రెండు రోజులూ ఈ లక్షణాలు మరీ ఎక్కువగా ఉంటాయి. దాంతో నావల్ల ఎవరికీ ఇబ్బంది కలగకుండా ఉండాలని నేను డేట్ రాగానే లీవ్ పెడుతుంటాను. అయితే ఈ విషయమై కొందరు నా గురించి ఎగతాళిగా మాట్లాడుకుంటున్నట్లు తెలిసింది. కొందరైతే ఆ డేట్స్ గుర్తు పెట్టుకుని మొహం మీదే నువ్వు ఇంకా సెలవు పెట్టలేదేంటి అని వెకిలిగా అడుగుతుంటారు. నాకు చాలా బాధగా ఉంది. దీని గురించి నేను ఏమీ చేయలేనా? సలహా ఇవ్వగలరు.

– ఒక సోదరి, హైదరాబాద్

2013 పీఓఎస్‌హెచ్ చట్టం ప్రకారం, ఈ క్రింది వాటిలో ఏదైనా ఒకటి లేదా అనేక అవాంఛనీయ(అంగీకార యోగ్యం కాని) చర్యలు లేదా ప్రవర్తన/వైఖరి ''లైంగిక వేధింపు''గా పరిగణించబడుతుంది:

1. శారీరక సంప్రదింపు (కొరకు) పురోగతి,
2. లైంగిక ప్రయోజనాలు కోరటం/అభ్యర్థించడం లేదా డిమాండ్ చేయటం, లేదా
3. లైంగిక స్వభావం కలిగిన వ్యాఖ్యలు చేయటం, లేదా
4. అశ్లీల చిత్రాలను చూపించటం లేదా
5. మరే ఇతర లైంగిక స్వభావం కలిగిన అవాంఛనీయ (ఆమోదయోగ్యం కాని) శారీరక, మౌఖిక లేదా సైగల ద్వారా ప్రదర్శించటం.

ఒక స్త్రీ తన మెనోపాజ్ దశలో ఎదుర్కొనే అనేక శారీరక – మానసిక మార్పులు, మూడ్ స్వింగ్స్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయటం, ఆ కారణంగా స్త్రీ పట్ల వివక్ష లేదా శిక్షపూరిత చర్యలు తీసుకోవటం, అనుచితంగా (ఇన్‌సెన్సిబుల్) వ్యవహరించడాన్ని కూడా లైంగిక వేధింపుగానే పరిగణించాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 స్ఫూర్తి కూడా ఇదే! మీరు ఏం భయపడకుండా దీనిమీద మీ బాస్‌కి చెప్పి చూడండి. ఒకవేళ మీ పై అధికారులే మిమ్మల్ని కామెంట్ చేస్తూ బాధపెడుతుంటే మీరు పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు.



- శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాల కోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

న్యూస్ మేకర్స్



రాధ

లింగవ్వ

సరోజ

నీరు లేదు... నిప్పు లేదు అడవిలో ఆ నలుగురు

తెలిసిన అడవే. కాని ఉరుములు మెరుపులతో చీకటి పడిపోయింది. దారి తప్పారు. ఊరి వైపు కాకుండా అడవిలోకి వెళ్లిపోయారు. నలుగురు స్త్రీలు... తునికాకు కోసం వెళ్లి రాత్రంతా అడవిలో ప్రాణాలు కాపాడుకోవడానికి పోరాడారు. వారి కథ గగుర్పాటు కలిగించేలా ఉంది. ధైర్యాన్ని నూరిపోసేలా కూడా. చిత్రమేమిటంటే తిరిగి వచ్చేప్పుడు పోలీసులు కూడా దారి తప్పారు. అంత మాయలమారి అడవి అది.

'రాధ ఆడ నీ పక్కకున్న కట్టెలందుకోయే..'

'ఏంటికే లింగవ్వ.. కట్టెలకు మంట పెడదమంటే మన తాన అగ్గిపుడక కూడ లేదు గదనే..'

'లేదే.. ఏదో సప్పుడైతుంది. గుడ్డెలుగులో, అడివిపందులో చీకట్ల తెలుస్త లేదే. కట్టె పట్టుకుని సప్పుడు చేస్తే దూరం పోతయని...' చెట్టు మొదట్లో కాళ్లు ముడుచుకుని, చుట్టూ ఉన్న చీకట్లను భయంగా చూస్తూ చెబుతోంది లింగవ్వ.

'ఈ చిమ్మచీకట్లల్ల ఆడోళ్లం ఏం చేస్తం. ఏదచ్చినా ఏం చేయలేం. ఇగ మనకు దేవుడే దిక్కు. తెల్లారితేనే మన బతుక్కు ఏమన్న తోవ దొరుకతదేమో..'అని రాధతో పాటు సరోజ, లక్ష్మి మాట కలిపారు.

రోజూ రాత్రి ఏడింటికే నిద్రపోయే ఆ నలుగురు.... ఆ రాత్రిపూట కనీసం కనురెప్ప వాల్చలేదు. ఏ దిక్కు నుంచి ఏమొస్తుందోనన్న ఆందోళనతోనే రాత్రంతా గడిపారు. తమ జీవితంలో ఇలాంటి ఓ రాత్రి వస్తుందని వారు కలలో కూడా ఊహించి ఉండకపోవచ్చు. తెల్లారిన తర్వాతే వాళ్ల జీవితాలకు వెలుగొచ్చింది.

అడవిలో చిక్కుకున్నారు

నిర్మల్ జిల్లా మామడ మండలం కప్పన్‌పల్లి గ్రామానికి చెందిన రాజుల రాధ, గట్టుమీది లక్ష్మి, కంబాల లింగవ్వ, బత్తుల సరోజ అనే నలుగురు మహిళలు ఈనెల 10న తునికాకు సేకరణ కోసం అటవీప్రాంతానికి వెళ్లి దారి తప్పారు. దాదాపు 15 గంటలపాటు దట్టమైన అడవిలోనే చిక్కుకుపోయారు. రాత్రంతా భయంకరమైన చీకటిలో అటవీ జంతువుల మధ్య గడిపారు. ఆ నలుగురూ సాదాసీదా కుటుంబాలకు చెందిన మహిళలే. ఈ సీజన్‌లో తునికాకు సేకరించి పెట్టుకుంటే నాలుగు పైసలు ఎక్కువొస్తయనుకునే చిన్నపాటి ఆశలున్నవాళ్లే. అందుకే ఈ నెల 10న కప్పన్‌పల్లిలో రోజంతా కూలి పనులు చేసుకుని, మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో నలుగురు కలిసి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లారు. తునికాకు ఏరుతూ ఏడెనిమిది కిలోమీటర్ల దూరం వెళ్లిపోయారు. ఇకచాలు ఇంటికెళ్దాం అనుకునే సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉరుములు, మెరుపులు, గాలి దుమారం వారిని కంగారు పెట్టాయి. ఇళ్లకు వెళ్లాల్సిన దారి తప్పిపోయారు. తాము ఊరివైపు కాకుండా అడవిలోనే మరోవైపు వెళ్తున్నట్లు గ్రహించారు. కానీ అప్పటికే రాత్రి ఎనిమిదైంది. నలుగురిలో ఒకరైన రాధ దగ్గర సెల్‌ఫోన్ ఉన్నా అక్కడ సిగ్నల్స్ లేవు. ఇక తప్పని పరిస్థితుల్లో రాత్రంతా చిమ్మచీకట్లో దట్టమైన అడవి ఒడిలో బిక్కుబిక్కుమంటూ మంటూ ఉండిపోయారు. మరోవైపు చీకటి పడుతున్నా తమవాళ్లు ఇళ్లకు చేరకపోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు కంగారుపడ్డారు. సమీప అటవీ ప్రాంతాలన్నీ గాలించారు. ఇక లాభం లేదనుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు.

> ఇన్నేళ్లలో ఇట్ల ఎప్పుడు కాలేదు. తిరిగి వచ్చేటప్పుడు ఎట్ల దారి తప్పిపోయినమో కూడా గుర్తుకొస్త లేదు. రాత్రికి ఏమన్న జంతువులస్తయేమోనని నేను కొంచెంసేపు చెట్టెక్కి కూసున్న ఆ రాత్రిని చూసినంక ఇగ తిరిగొస్తమనుకోలేదు. ఇప్పటికీ మనసుల నుంచి దడుకు పోతలేదు.
>
> - కంబాల లింగవ్వ

> మాకు తిండి, నీళ్లు లేవు. దారి తప్పాక అట్లనే రెండు మూడు గంటలు నడుసుకుంట అరుసుకుంటనే తిరిగినం. చివరికి నీరసంతో అరవడానికి శక్తి లేకుండా అయిపోయింది.
>
> - బత్తుల సరోజ

రంగంలో పోలీసులు

సమాచారం అందిన క్షణం నుంచి ఎస్పీ జానకీ షర్మిల అలర్ట్ అయ్యారు. నలుగురు మహిళలు, అదీ లోయలు, గుట్టలతో ఎలుగుబంట్లు, అడవి పందులు ఉండే దట్టమైన అడవిలో తప్పిపోవడంతో వారికేం కాకుండా వీలైనంత త్వరగా తీసుకురావాలని నిర్ణయించుకున్నారు. కొందరు గ్రామస్తులతో కలిసి బృందాలుగా వెళ్లాలంటూ తమవాళ్లకు సూచించారు. రాత్రంతా ప్రయత్నం చేసినా దట్టమైన అడవిలో మహిళల జాడను కనుక్కోలేకపోయారు.

ఆ చెట్టే దిక్కనుకుని..

మరోవైపు అడవిలో ఆ చీకట్లో సెల్‌ఫోన్ టార్చిలైట్ ఆన్ చేసుకుని ఆ నలుగురు చాలా దూరమే నడిచారు. అలా ఎంతసేపు నడిచినా లాభం లేదనుకుని ఓ పెద్దచెట్టును చూసుకుని దాని దగ్గరే కూర్చున్నారు. వారందరికీ ఆ చెట్టు ఆసరా ఇచ్చింది. గాలివాన రాని, ఏ జంతువూ రాని ఏమైనా కానీ పొద్దున వరకు ఈ చెట్టు దగ్గర నుంచి కదలొద్దని నిశ్చయించుకున్నారు. ఏవైనా జంతువులు వస్తే చప్పుడు చేసి చెదరగొట్టడానికి తలో కట్టె చేతిలో పట్టుకుని కూర్చున్నారు. ఒకరికొకరు పైకి ధైర్యం చెప్పుకుంటున్నారు కానీ మనసుల్లో మాత్రం ఏదో తెలియని భయం. నాలుగు గోడల మధ్య పిల్లాపాపలతో గడిపేవాళ్లకు ఆ రాత్రి ఓ నరకంలా గడిచింది. ఎప్పుడూ వినని జంతువుల చప్పుళ్లు, కళ్లు పొడుచుకుని చూసినా కానరానంత చీకట్లో కంటి మీద కునుకు లేకుండా జాగారం చేశారు.

తెల్లారితేనే..

ఆ నలుగురు కొన్ని గంటల వ్యవధిలో పగలు, రాత్రిని కళ్లారా చూశారు. శుక్రవారం ఉదయం తెల్లవారగానే సమీపంలో ఉన్న గుట్టపైకి వెళ్తే ఏమైనా ఊళ్లు కనిపిస్తాయేమోనన్న ఆశతో ఆ గుట్ట ఎక్కారు. కనుచూపు మేరలో ఊళ్లు కనిపించలేదు గానీ.. తమ దగ్గర ఉన్న సెల్‌ఫోన్‌లో సిగ్నల్స్ కనిపించడంతో కొండంత ధైర్యం వచ్చింది. వెంటనే తమ వాళ్లకు ఫోన్లు చేశారు. ఆ కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారంతో నిర్మల్ ఎస్పీ జానకీషర్మిల స్వయంగా రంగంలోకి దిగారు. తమ వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ట్రాక్టర్లను తెప్పించి అడవి లోపలికి వెళ్లారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా డ్రోన్ కెమెరాలు, ప్రత్యేక పోలీసు బలగాల సాయంతో వారిని చేరుకున్నారు. అయితే తిరిగి వచ్చేటప్పుడు పోలీసులు కూడా తప్పిపోయారు. ఆఖరుకు డ్రోన్‌ను ఫాలో అవుతూ గమ్యాన్ని చేరారు.

– రాసం శ్రీధర్, సాక్షి, నిర్మల్

కూల్ సమ్మర్

మండు వేసవిలో చల్లని జపాన్

- జపనీయులు సాంకేతికంగా ఎంత ముందు ఉన్నా సంప్రదాయ పద్ధతులకు మాత్రం వీడ్కోలు చెప్పలేదు. అందులో ఒకటి... ఉచిమిజు. 'ఉచి' అంటే కొట్టడం లేదా తాకడం. 'మిజు' అంటే నీరు. 'ఉచిమిజు' అంటే నీటితో భూమిని తాకడం.
- వేడి వేసవి నెలల్లో 'ఉచిమిజు' అనేది సాధారణ దృశ్యం. వీధులు, బహిరంగ ప్రదేశాలలో నీటిని చల్లుతారు. 'ఉచిమిజు'తో నీటి బాష్పీభవనం ద్వారా చుట్టుపక్కల వాతావరణాన్ని చల్లబరుస్తారు. ఈ పద్ధతి గ్రీన్‌హౌజ్ వాయు ఉద్గారాలను గణనీయంగా తగ్గిస్తుంది.
- గ్లోబల్ వార్మింగ్ పెరుగుతున్న నేపథ్యంలో 'ఉచిమిజు'ను ప్రోత్సహించడానికి ప్రభుత్వంతో పాటు పర్యావరణ సంస్థలు నడుం బిగించాయి. వేసవిలో సామూహిక ఉచిమిజు కార్యక్రమాలు నిర్వహిస్తారు.





- యుకాటా, జీన్బీ అనేవి జపనీస్ వేసవి దుస్తులు. కంఫర్ట్, వెంటిలేషన్ వీటి ప్రత్యేకత. కాటన్‌తో తయారు చేసే ఈ సంప్రదాయ దుస్తులు శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలో ఉపయోగపడతాయి.
- సంప్రదాయ సుడేర్ స్క్రీన్‌లు శతాబ్దాలుగా జపనీస్ గృహాలలో అంతర్భాగం అయ్యాయి. వెదురు పలకలు, నాచులతో కలిపి అల్లిన స్క్రీన్‌లు ఇవి. వేసవి నెలల్లో తీవ్రమైన వేడి ప్రభావం ఇంటి లోపలి భాగాలపై పడకుండా సుడేర్ స్క్రీన్‌లు ఉపయోగిస్తారు. ఇవి వేడి నుంచి ఉపశమనం ఇవ్వడమే కాదు కళాకృతులుగా కూడా ఆకట్టుకుంటాయి.



'పోలీసు శాఖలో అధికారుల స్థాయి ర్యాంకుల్లో మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉంది' అంటుంది తాజా ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025

● లేడీ ఆఫీసర్స్

వారి సంఖ్య ఎందుకు తక్కువ?

ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025

ఇండియా జస్టిస్ రిపోర్ట్ ప్రకారం...

- పోలీస్‌శాఖకు సంబంధించి జాతీయ స్థాయిలో కేవలం 8 శాతం మహిళా అధికారులు మాత్రమే ఉన్నారు. వీరిలో 52 శాతం మంది సబ్ ఇన్‌స్పెక్టర్‌లు, 25 శాతం మంది ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు.
- కానిస్టేబుల్ స్థాయిలో మహిళలు 13 శాతం ఉన్నారు.
- ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపిఎస్) అధికారులలో కేవలం 12 శాతం మంది మాత్రమే మహిళలు ఉన్నారు.
- అత్యధికంగా మహిళా డిఎస్పీలతో (133) మధ్యప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది.
- ప్రస్తుతం 78 శాతం పోలిస్ స్టేషన్‌లలో మహిళా హెల్ప్ డెస్కులు ఉన్నాయి.
- ఏ ఒక్క రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతం కూడా పోలీసుశాఖలో మహిళల కోసం వారి స్వంత రిజర్వ్ కోటాను చేరుకోలేదు.

ఎందుకు ఇలా?

'పోలీసు శాఖలో మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉండడానికి దీర్ఘకాలిక, సామాజిక, వ్యవస్థాగత వైకల్యాలే కారణం. పోలీసింగ్ అనేది పురుషులు, శారీరక బలం ఉన్న వారి వృత్తి మాత్రమే, సుదీర్ఘమైన పని గంటలతో ముడిపడి ఉన్న ఉద్యోగం అనే లోతైన అభిప్రాయం చాలామందిలో ఉంది. కుటుంబం, సామాజిక ఆకాంక్షలు మహిళలు పోలీసు వృత్తిలోకి రాకుండా నిరుత్సాహపరుస్తున్నాయి. ముఖ్యంగా చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది' అంటున్నారు మాజీ ఐపీఎస్ ఆఫీసర్ కిరణ్ బేడీ.



కిరణ్ బేడీ

వ్యవస్థాగత అవరోధాలను కూడా ఆమె ఎత్తి చూపారు.

'చైల్డ్‌కేర్ ఫెసిలిటీస్, సేఫ్ వర్కింగ్ కండీషన్, జెండర్–సెన్సిటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కొరత స్పష్టంగా ఉంది. మహిళలను లక్ష్యంగా చేసుకొని తగినంత రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లు లేకపోవడం, పరిమిత మార్గదర్శకత్వం, కెరీర్ పురోగతి మందగించడం వంటి ఇతర సమస్యలు దీనిని మరింత తీవ్రతరం చేస్తాయి. ఈ మౌలిక సమస్యలను పరిష్కరించకపోతే, పోలీస్ వృత్తిలోకి మహిళల ప్రవేశం పరిమితంగానే కొనసాగుతుంది' అంటారు కిరణ్ బేడీ.

'యూనిఫాం ధరించిన పురుష సిబ్బంది నుంచి మహిళా పోలీసులకు తగినంత సహకారం లభించడం లేదు' అంటున్నారు కొందరు మహిళా పోలీసు అధికారులు.

నెమ్మదిగా అయినా సరే...

'చాలా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మహిళలకు 30 శాతం లేదా అంతకంటే ఎక్కువ రిజర్వేషన్‌లు ఉన్నాయి. ఎక్కువమంది మహిళలను చేర్చుకోవడంలో వారంతా సీరియస్‌గా ఉన్నారు. నెమ్మదిగా మా సంఖ్య పెరుగుతోంది' అంటారు మాజీ ఐపీఎస్ అధికారి మీరాన్ చద్దా.



ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ

'పోలీసుశాఖలో మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉంది' అంటుంది ఇండియా జస్టిస్ రిపోర్ట్–2025. 'ఎందుకు ఇలా?' అనేదానిపై ఎందరో ప్రముఖులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'పోలీసు డిపార్ట్‌మెంట్‌లో మహిళలు తప్పనిసరిగా ఎందుకు ఉండాలి' అనే కోణంలో కొందరు విలువైన విశ్లేషణ చేశారు. అన్నపూర్ణలాంటి ధైర్యసాహసాలు మూర్తీభవించిన పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ల గురించి చదివినప్పుడు వారి విశ్లేషణ నూటికి నూరుపాళ్లు సరియైనదే అనిపిస్తుంది.

అన్నపూర్ణ కాదు ఆదిపరాశక్తి!

కర్నాటకలోని హుబ్లీ నగరంలో గత ఆదివారం ఐదేళ్ల బాలికను అపహరించి, అత్యాచార యత్నం చేసి, చంపేసిన సంఘటన రాష్ట్రాన్ని అట్టుడికించింది. ఈ దుర్మార్గానికి ఒడిగట్టింది బిహార్‌కు చెందిన రితేష్ కుమార్. ఇతడు వలసకూలీ. సీసీ టీవీల కెమెరా ఫుటేజీ సహాయంతో రితేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ కోసం తీసుకువెళుతున్న సమయంలో రితేష్ పోలీసులపై రాళ్ల దాడి చేసి తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. అశోక్‌నగర్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ 'పారిపోవద్దు' అని రితేష్‌ను హెచ్చరిస్తూ గాలిలో కాల్పులు (వార్నింగ్ షాట్) జరిపింది.

రితేష్ ఆమె హెచ్చరికను ఖాతరు చేయలేదు. రాళ్ల దాడీ ఆపలేదు.

దీంతో గత్యంతర లేని పరిస్థితులలో అన్నపూర్ణ రితేష్‌పై కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ సంఘటనలో అన్నపూర్ణతో పాటు ఇద్దరు పోలీసులు గాయపడ్డారు.



కిడ్నాప్ దృశ్యం

అన్నపూర్ణ ధైర్యసాహసాలకు దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి 'లేడి సింగం' అనే విశేషణాన్ని ఆమె పేరుకు ముందు జోడిస్తున్నారు.

తాజా విషయానికి వస్తే...

కర్నాటక మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ అన్నపూర్ణను అభినందించారు. 'హేయమైన నేరాలకు పాల్పడిన నిందితులను ఉరి తీయాలి. న్యాయం త్వరితగతిన జరగాలి. పోలిస్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ చర్య రాష్ట్రవ్యాప్తంగా ఇతర అధికారులకు స్ఫూర్తిగా నిలవాలి. అన్నపూర్ణను అత్యున్నత రాష్ట్ర పురస్కారంతో సత్కరించాలని ముఖ్యమంత్రి, హోంమంత్రులకు సిఫారసు చేస్తాం' అన్నారు హెబ్బాళ్కర్.

బెల్గాం జిల్లాలోని గుజనట్టి గ్రామానికి చెందిన అన్నపూర్ణ ధార్వాడ్ అగ్రికల్చరల్ యూనివర్శిటీలో ఎంఎస్‌సీ చేసింది. 2018లో పోలిస్‌శాఖలో చేరింది.

'రాష్ట్రంలో ఇంతకు ముందు ఏ మహిళా పోలీస్ అధికారి చేయని సాహసాన్ని అన్నపూర్ణ చేసింది. హాట్సాఫ్' అంటూ సోషల్ మీడియాలో అన్నపూర్ణపై ప్రశంసలు కురిపిస్తున్నారు నెటిజనులు.



ఫైనల్లో పంకజ్ అద్వానీ

ప్రపంచ బిలియర్డ్స్ (టైమ్ ఫార్మాట్) చాంపియన్‌షిప్‌లో భారత దిగ్గజం పంకజ్ అద్వానీ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఐర్లాండ్‌లోని కార్లో నగరంలో మంగళవారం జరిగిన తొలి సెమీఫైనల్లో పంకజ్ అద్వానీ 1070-300 పాయింట్ల తేడాతో భారత్‌కే చెందిన ధ్రువ్ సిత్వాలాపై విజయం సాధించాడు. నేడు జరిగే ఫైనల్లో భారత్‌కే చెందిన సౌరవ్ కొఠారితో పంకజ్ తలపడతాడు. రెండో సెమీఫైనల్లో సౌరవ్ కొఠారి 864-547తో డేవిడ్ కాసియర్ (ఇంగ్లండ్)పై గెలిచాడు.

నాలుగో సీడ్ జంటకు బోపన్న జోడీ షాక్



జీఎండబ్ల్యూ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నమెంట్‌లో రోహన్ బోపన్న (భారత్)-బెన్ షెల్టన్ (అమెరికా) జోడీ శుభారంభం చేసింది. మ్యూనిక్‌లో మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-షెల్టన్ ద్వయం 6-4, 6-3తో నాలుగో సీడ్ రాజీవ్ రామ్ (అమెరికా)-జేమీ ముర్రే (బ్రిటన్) జోడీని బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 63 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో బోపన్న-షెల్టన్ ఏడు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు.

సొంత మైదానంలో బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌పై పంజాబ్ కింగ్స్ పడుతూ లేస్తూ 111 పరుగులు చేసింది. మరో 27 బంతులు మిగిలి ఉండగానే ఇన్నింగ్స్ ముగిసింది. డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) విజయంపై ఎవరికీ ఎలాంటి సందేహాలు లేవు. 14.1 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదిస్తే కోల్‌కతా జట్టు పాయింట్ల పట్టికలో నంబర్‌వన్ స్థానానికి కూడా దూసుకుపోతుంది. ఎంత వేగంగా ఛేదిస్తారనే దానిపైనే చర్చ. 62/2 స్కోరుతో జట్టు గెలుపు దిశగా సాగింది. కానీ ఒక్కసారిగా అనూహ్యం జరిగింది. యుజువేంద్ర చహల్ పదునైన స్పిన్‌తో కేకేఆర్ పతనానికి శ్రీకారం చుట్టాడు. 17 పరుగుల వ్యవధిలో కోల్‌కతా 6 వికెట్లు కోల్పోయింది. అయితే రసెల్ ఒకే ఓవర్లో 16 పరుగులు రాబట్టడంతో మళ్లీ కేకేఆర్ విజయంపై అంచనాలు... కానీ యాన్సెన్ బంతితో రసెల్ ఆట ముగిసింది... మరో 29 బంతులు మిగిలి ఉండగానే కోల్‌కతా ఆలౌట్... పంజాబ్ అభిమానులతో మైదానం ఒక్కసారిగా హోరెత్తింది. శనివారం 245 పరుగులు చేసి కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓడిన పంజాబ్ కింగ్స్... ఇప్పుడు ఐపీఎల్ చరిత్రలోనే అతి తక్కువ లక్ష్యాన్ని కాపాడుకున్న జట్టుగా నిలిచింది.

111 తోనే పంజాబ్ పండుగ

ఉత్కంఠపోరులో అనూహ్య విజయం

● 16 పరుగులతో ఓడిన కోల్‌కతా ● 4 వికెట్లతో గెలిపించిన చహల్

ముల్లాన్‌పూర్: ఐపీఎల్‌లో అరుదుగా కనిపించే తక్కువ స్కోర్ల మ్యాచ్ అత్యంత ఉత్కంఠభరితంగా ముగిసింది. మంగళవారం జరిగిన ఈ పోరులో పంజాబ్ కింగ్స్ 16 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్ 15.1 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌటైంది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (15 బంతుల్లో 30; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం కోల్‌కతా 15.1 ఓవర్లలో 95 పరుగులకే ఆలౌటైంది. రఘువంశీ (28 బంతుల్లో 37; 5 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలవగా, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యుజువేంద్ర చహల్ (4/28) ప్రత్యర్థిని కుప్పకూల్చాడు.

ఓపెనింగ్ మినహా...

తొలి 19 బంతుల్లో 39/0... తర్వాతి 17 బంతుల్లో 15/4... పవర్‌ప్లేలో పంజాబ్ ఆటతీరు ఇది. ఓపెనర్ల ఆటతీరు చూస్తే ఈ మైదానంలో జరిగిన గత రెండు మ్యాచ్‌ల తరహాలోనే భారీ స్కోరు ఖాయమనిపించింది. కానీ ఆ తర్వాత జట్టు ఒక్కసారిగా కుప్పకూలింది. నోర్జే ఓవర్లో ప్రియాన్ష్ ఆర్య (12 బంతుల్లో 22; 3 ఫోర్లు, 1 సిక్స్) రెండు ఫోర్లు కొట్టగా... అరోరా వేసిన తర్వాతి ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ వరుసగా 4, 6, 4 బాదాడు. అదే ఓవర్లో ప్రియాన్ష్ కూడా ఫోర్ కొట్టడంతో మొత్తం 20 పరుగులు వచ్చాయి. రాణా తొలి బంతిని ప్రియాన్ష్ సిక్స్ కొట్టే వరకు అంతా బాగుంది. కానీ ఆ తర్వాతి బంతి నుంచే కోల్‌కతా బౌలర్ల జోరు మొదలైంది. అదే ఓవర్లో ప్రియాన్ష్, శ్రేయస్ అయ్యర్ (0)లను అవుట్ చేసిన రాణా తన తర్వాతి ఓవర్లో ప్రభ్‌సిమ్రన్‌ను కూడా వెనక్కి పంపాడు. అంతకు ముందే సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడిన ఇన్‌గ్లిస్ (2) కూడా వరుణ్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. 6 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 54/4కు చేరింది. ఇక ఆ తర్వాత పంజాబ్ కోలుకోలేకపోయింది. నైట్‌రైడర్స్ కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు బ్యాటర్లంతా ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. పవర్‌ప్లే తర్వాత ఆడిన 57 బంతుల్లో 57 పరుగులు మాత్రమే చేసిన జట్టు 6 వికెట్లు కోల్పోయింది. వధేరా (10), మ్యాక్స్‌వెల్ (7), ఇంపాక్ట్ సబ్‌గా వచ్చిన సూర్యాంశ్ (4) ఏమాత్రం ప్రభావం చూపలేకపోగా, శశాంక్ సింగ్ (17 బంతుల్లో 18; 1 ఫోర్, 1 సిక్స్) కూడా విఫలమయ్యాడు.

టపటపా...

ఛేదనలో కోల్‌కతాకు సరైన ఆరంభం లభించలేదు. మూడు బంతుల వ్యవధిలో ఒకే స్కోరు వద్ద ఓపెనర్లు నరైన్ (5), డికాక్ (2) వెనుదిరిగారు. అయితే అజింక్య రహానే (17), రఘువంశీ కలిసి కొన్ని చక్కటి షాట్లతో మూడో వికెట్‌కు 38 బంతుల్లో 55 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. అయితే రహానే వెనుదిరిగిన తర్వాత కేకేఆర్ పతనం వేగంగా సాగిపోయింది. ఒక్కరు కూడా పట్టుదలగా నిలబడి జట్టును గెలిపించే ప్రయత్నం చేయలేకపోయారు. చివర్లో రసెల్ (11 బంతుల్లో 17; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కొంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. రహానే దురదృష్టవశాత్తూ ఎల్బీపై రివ్యూ కోరకపోవడం కూడా కేకేఆర్‌కు నష్టం కలిగించింది. అతని అవుట్ తర్వాతే పరిస్థితి మారింది. బాల్ ట్రాకింగ్‌లో ప్రభావం ఆఫ్ స్టంప్ బయట కనిపించింది. రివ్యూ కోరితే అతను నాటౌట్‌గా తేలేవాడు.



చహల్ మ్యాజిక్

టోర్నీ తొలి 5 మ్యాచ్‌లలో ఏకంగా 83.50 సగటు, 11.13 చెత్త ఎకానమీతో కేవలం 2 వికెట్లు... 2 మ్యాచ్‌లలో మాత్రమే ఓవర్ల కోటా పూర్తి... వేలంలో రూ.18 కోట్లతో అమ్ముడుపోయిన చహల్ పేలవ ఫామ్ ఇది. కచ్చితంగా రాణించాల్సిన తీవ్ర ఒత్తిడి మధ్య బరిలోకి దిగిన అతను మ్యాజిక్ చూపించాడు. వరుస ఓవర్లలో రహానే, రఘువంశీలను అవుట్ చేసి పంజాబ్ శిబిరంలో ఆశలు రేపిన అతను కీలక సమయంలో వరుస బంతుల్లో రింకూ, రమణ్‌దీప్‌లను వెనక్కి పంపి విజయానికి బాటలు వేశాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా తనకున్న గుర్తింపును నిలబెట్టుకుంటూ మళ్లీ రేసులోకి వచ్చాడు.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
గుజరాత్	6	4	2	8	1.081
ఢిల్లీ	5	4	1	8	0.899
బెంగళూరు	6	4	2	8	0.672
పంజాబ్	6	4	2	8	0.172
లక్నో	7	4	3	8	0.086
కోల్‌కతా	7	3	4	6	0.547
ముంబై	6	2	4	4	0.104
రాజస్తాన్	6	2	4	4	-0.838
హైదరాబాద్	6	2	4	4	-1.245
చెన్నై	7	2	5	4	-1.276

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ఢిల్లీ X రాజస్తాన్
వేదిక: న్యూఢిల్లీ
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ (సి) రమణ్‌దీప్ (బి) రాణా 22; ప్రభ్‌సిమ్రన్ (సి) రమణ్‌దీప్ (బి) రాణా 30; శ్రేయస్ (సి) రమణ్‌దీప్ (బి) రాణా 0; ఇన్‌గ్లిస్ (బి) వరుణ్ 2; వధేరా (సి) వెంకటేశ్ (బి) నోర్జే 10; మ్యాక్స్‌వెల్ (బి) వరుణ్ 7; సూర్యాంశ్ (సి) డికాక్ (బి) నరైన్ 4; శశాంక్ (ఎల్బీ) (బి) అరోరా 18; యాన్సెన్ (బి) నరైన్ 1; బార్ట్‌లెట్ (రనౌట్) 11; అర్ష్‌దీప్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (15.3 ఓవర్లలో ఆలౌట్) 111. **వికెట్ల పతనం:** 1-39, 2-39, 3-42, 4-54, 5-74, 6-76, 7-80, 8-86, 9-109, 10-111. **బౌలింగ్:** వైభవ్ అరోరా 2.3-0-26-1, నోర్జే 3-0-23-1, హర్షిత్ రాణా 3-0-25-3, వరుణ్ చక్రవర్తి 4-0-21-2, నరైన్ 3-0-14-2.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: డికాక్ (సి) సూర్యాంశ్ (బి) బార్ట్‌లెట్ 2; నరైన్ (బి) యాన్సెన్ 5; రహానే (ఎల్బీ) (బి) చహల్ 17; రఘువంశీ (సి) బార్ట్‌లెట్ (బి) చహల్ 37; వెంకటేశ్ (ఎల్బీ) (బి) మ్యాక్స్‌వెల్ 7; రింకూ సింగ్ (స్టంప్డ్) ఇన్‌గ్లిస్ (బి) చహల్ 2; రసెల్ (బి) యాన్సెన్ 17; రమణ్‌దీప్ (సి) శ్రేయస్ (బి) చహల్ 0; రాణా (బి) యాన్సెన్ 3; అరోరా (సి) ఇన్‌గ్లిస్ (బి) అర్ష్‌దీప్ 0; నోర్జే (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (15.1 ఓవర్లలో ఆలౌట్) 95. **వికెట్ల పతనం:** 1-7, 2-7, 3-62, 4-72, 5-74, 6-76, 7-76, 8-79, 9-95, 10-95. **బౌలింగ్:** యాన్సెన్ 3.1-0-17-3, బార్ట్‌లెట్ 3-0-30-1, అర్ష్‌దీప్ 3-1-11-1, చహల్ 4-0-28-4, మ్యాక్స్‌వెల్ 2-0-5-1.

సౌరభ్‌కు కాంస్యం



లిమా (పెరూ): అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్‌ఎస్‌ఎఫ్) ప్రపంచకప్ రెండో టోర్నమెంట్‌లో భారత్ పతకాల బోణీ చేసింది. మంగళవారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్ సౌరభ్ చౌధరీ కాంస్య పతకం సాధించాడు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో సౌరభ్ 219.1 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని నెగ్గాడు. కైవసం చేసుకున్నాడు. భారత్‌కే చెందిన వరుణ్ తోమర్ 198.1 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాడు. హు కాయ్ (చైనా; 246.4 పాయింట్లు) స్వర్ణం, ఫ్రెలిప్ అల్మీడా (బ్రెజిల్; 241 పాయింట్లు) రజతం సాధించారు.

బంగ్లాదేశ్‌లో భారత్ పర్యటన ఖరారు

ఢాకా: భారత క్రికెట్ జట్టు పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం బంగ్లాదేశ్‌కు వెళ్లనుంది. ఈ ఏడాది ఆగస్టులో జరిగే ఈ పర్యటనలో భాగంగా ఇరు జట్ల మధ్య 3 వన్డేలు, 3 టి20లు మ్యాచ్‌లు జరుగుతాయి. 2014 తర్వాత టీమిండియా తొలిసారి బంగ్లాదేశ్ గడ్డపై వన్డే సిరీస్ ఆడనుండగా... టి20 ద్వైపాక్షిక సిరీస్ ఆడనుండటం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ ఆరు మ్యాచ్‌లలో ఢాకా వేదికగా నాలుగు మ్యాచ్‌లు, చిట్టగాంగ్ వేదికగా మరో రెండు మ్యాచ్‌లు జరుగుతాయి. ఆగస్టు 13న భారత జట్టు బంగ్లాదేశ్‌లో అడుగు పెడుతుంది. ఆగస్టు 17, 20, 23 తేదీల్లో వన్డేలు...ఆ తర్వాత 26, 29, 31 తేదీల్లో టి20 మ్యాచ్‌లు జరుగుతాయి.

దివ్య ఖాతాలో రెండో గెలుపు




పుణే: 'ఫిడే' మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ చెస్ టోర్నీలో రెండో రోజు భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక తమ గేమ్‌లను 'డ్రా' చేసుకోగా... ప్రపంచ జూనియర్ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ వరుసగా రెండో విజయం అందుకుంది. మరో గ్రాండ్‌మాస్టర్ వైశాలి తొలి పరాజయం చవిచూసింది. రెండో రౌండ్‌లో దివ్య 26 ఎత్తుల్లో వైశాలిని ఓడించింది. హంపి-సలోమి (జార్జియా) మధ్య జరిగిన గేమ్ 41 ఎత్తుల్లో... హారిక-అలీనా (పోలాండ్) మధ్య జరిగిన గేమ్ 26 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి.

సాక్షి సినిమా

మా అంచనాలకు మించి అద్భుతంగా వచ్చింది
- సునీల్ బలుసు, అశోక్‌వర్ధన్ ముప్పా



''అర్జున్ సన్నాఫ్ వైజయంతి' చిత్రంలో కల్యాణ్ రామ్, విజయశాంతిగార్ల పాత్రలు పోటా పోటీగా ఉంటాయి. నటన పరంగానూ సమానంగా ఉంటాయి. సెకండ్ హాఫ్ చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఫోన్ కూడా చూడరు. తర్వాత ఏం జరుగుతుందనే ఎగ్జయిట్‌మెంట్ ఉంటుంది. ఇలాంటి గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లే ఉన్న సినిమాలు అరుదుగా వస్తుంటాయి. ఫైనల్ ఔట్‌పుట్ చూసుకున్నాక మా అంచనాలకు మించి ఈ చిత్రం చాలా అద్భుతంగా వచ్చిందనిపించింది'' అని నిర్మాతలు సునీల్ బలుసు, అశోక్‌వర్ధన్ ముప్పా చెప్పారు. కల్యాణ్ రామ్, సయీ మంజ్రేకర్ జంటగా విజయశాంతి కీలక పాత్రలో నటించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించారు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై అశోకవర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా సునీల్, అశోక్‌వర్ధన్ మాట్లాడుతూ– ''కల్యాణ్ రామ్‌గారు ప్రయోగాత్మక సినిమాలు ఎక్కువగా చేస్తున్నారు. ఒక మాస్ కమర్షియల్ చిత్రం చేయాలని 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' కథ సిద్ధం చేయించాం. ఆయన తల్లి పాత్రకి విజయశాంతి గారినే అనుకున్నాం. ఆమెకు కూడా కథ నచ్చడంతో వెంటనే ఒప్పుకున్నారు. ఎక్కువ భావోద్వేగాలున్న ఈ సినిమాని ప్రదీప్ బాగా తెరకెక్కించారు. ఈ కథని నమ్మి బాగా ఖర్చు పెట్టాం. మేం ఖర్చు పెట్టిన ప్రతి రూపాయి స్క్రీన్ మీద కనిపిస్తుంది. మా సినిమా చూసిన ఎన్టీఆర్‌గారు ఎమోషనల్ అయ్యారు. అజనీష్ లోక్‌నాథ్ అద్భుతమైన మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చారు. ఏ నిర్మాత అయినా థియేటర్స్ వసూళ్లనే నమ్ముకుని సినిమా తీయాలి. అంతేకానీ, ఓటీటీ, శాటిలైట్ హక్కులు వంటి డిజిటల్ బిజినెస్‌పై ఆధా రపడకూడదు. మరో సినిమా నిర్మించ డానికి కథలు విన్నాం'' అన్నారు.



ఫుల్ మాస్...

● ధనుష్

అక్కినేని నాగార్జున, ధనుష్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్న హీరోయిన్‌గా నటిస్తుండగా, జిమ్ సర్భ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి ఎస్‌వీసీ ఎల్‌ఎల్‌పీపై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్న ఈ సినిమా జూన్ 20న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి తొలి పాటని ఈ నెల 20న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో విజిల్ వేస్తూ డ్యాన్స్ చేస్తున్నారు ధనుష్. ఫుల్ మాస్‌గా ఈ పాట ఉంటుందని సమాచారం.

సరికొత్త ఆధ్యాత్మిక ప్రపంచంలో...



● ఆది సాయికుమార్

ఆది సాయికుమార్ హీరోగా నటిస్తున్న చిత్రం 'శంబాల'. 'ఏ మిస్టిక్ వరల్డ్' అనేది ఉపశీర్షిక. యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అర్చనా అయ్యర్ కథానాయికగా నటిస్తున్నారు. రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ మూవీ మేకింగ్ వీడియోను విడుదల చేశారు. ''ఇండియన్ సిల్వర్ స్క్రీన్‌పై ఇదివరకెన్నడూ టచ్ చేయని పాయింట్‌తో సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రం 'శంబాల'. ఈ చిత్రంలో భౌగోళిక శాస్త్రవేత్త పాత్రలో ఆది కనిపిస్తారు. కాల్పనిక ప్రపంచంలో జరిగే అద్భుతమైన ఘట్టాలతో ప్రేక్షకులను సరికొత్త ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఈ సినిమా ఉంటుంది. ఈ చిత్రంలో భారీ యాక్షన్ ఎపిసోడ్స్ ఉంటాయి. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. శ్వాసిక, రవివర్మ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శ్రీరామ్ మద్దూరి.

పూరి సినిమాలో?

'బెగ్గర్' సినిమాలో భాగం కానున్నారట హీరోయిన్ రాధికా ఆప్టే. విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో 'బెగ్గర్' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే చిత్రం రానుంది. పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ జూన్‌లో ఆరంభం అవుతుంది. ఈ సినిమాలోని ఓ కీలక పాత్రలో టబు నటించనున్నారు. తాజాగా రాధికా ఆప్టే నటించనున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. మరి... వార్తల్లో ఉన్నట్లు ఈ బ్యూటీ ఈ సినిమాలో భాగం అవుతారా? ఒకవేళ నటిస్తే... టబులానే ఆమె కూడా కీలక పాత్రలో కనిపిస్తారా? లేక హీరోయిన్‌గానా? అనేది త్వరలోనే తెలిసిపోతుంది.



● రాధికా ఆప్టే

అందరూ చూడాల్సిన చిత్రం డియర్ ఉమ
- సుమయ రెడ్డి

''కొన్ని వాస్తవ ఘటనలకు కాస్త ఫిక్షన్ జోడించి, 'డియర్ ఉమ' చిత్రం తీశాం. ప్రస్తుతం కార్పొరేట్ హాస్పిటల్స్‌లో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయో చూపించాం. డాక్టర్లు, పేషెంట్స్‌కి మధ్య అనుసంధానంగా ఉండే వ్యక్తులు సరిగ్గా లేకపోతే ఏం జరుగుతుందో ఈ సినిమాలో చూస్తారు. ఈ కథని ఒక సందేశంలా కాకుండా పరిష్కారంగా చూపిస్తున్నాం. అందరూ చూడాల్సిన చిత్రం ఇది'' అని సుమయ రెడ్డి చెప్పారు. ఆమె కథ అందించి, హీరోయిన్‌గా నటించడంతో పాటు నిర్మించిన చిత్రం 'డియర్ ఉమ'. సాయి రాజేశ్ మహాదేవ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పృథ్వీ అంబర్ హీరోగా నటించారు. ఈ చిత్రం ఈ నెల 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సుమయ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ– ''మాది అనంతపురం. చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఇష్టంతో తొలుత మోడలింగ్ చేసి, సినిమావైపు వచ్చాను. హీరోయిన్ అవుదామనుకున్నాను. అయితే 'డియర్ ఉమ' కోసం నిర్మాతగానూ చేయాల్సి వచ్చింది. కరోనా సమయంలో కలలో నన్ను వెంటాడిన ఓ పాయింట్ మీదే ఈ కథ రాసుకున్నాను. నా కథని సాయి రాజేశ్ వంద శాతం చక్కగా తీశారు. నటించడం చాలా సులభం... అయితే నిర్మాతగా ఉండటం చాలా కష్టం. అనుకున్న దానికంటే బడ్జెట్ ఎక్కువైంది. సినిమాలు చేయడం చాలా సులభం అనుకున్నాను. కానీ, కష్టమని అర్థమైంది. ఎందుకంటే సినిమా తీసినా విడుదల కోసం అందరి వెంట పడాల్సి వస్తోంది. ఓటీటీ విషయంలోనూ ఇదే పరిస్థితి. ఎన్ని కష్టాలు ఎదురైనా సినిమాపై ఉన్న ప్యాషన్‌తో ఇక్కడే ఉండాలని నిర్ణయించుకున్నాను. మా బ్యానర్‌లో మరో సినిమాకి ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి'' అని తెలిపారు.



ప్రేమకు పునర్జన్మ



● అవినాష్ వర్మ, నీలిమ

అవినాష్ వర్మ, ఆద్య రెడ్డి, నీలిమ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'జగమెరిగిన సత్యం'. తిరుపతి పాలే దర్శకత్వంలో అచ్చ విజయ భాస్కర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'పదమూడు సంవత్సరాలకు తిరిగొచ్చేసరికి గాని జీవితంలో ఇంకో పోరి ఉందని తెలిసింది... అయినా నన్ను మర్చిపోలేదు. గిప్పుడు మా ప్రేమ మళ్లీ పునర్జన్మెత్తింది' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో అవినాష్ మాట్లాడుతూ– ''మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దులో జరిగే కథ ఇది. మంచి ఎమోషనల్, సెంటిమెంటల్ మూవీగా ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు. ''మంచి సినిమాతో వస్తున్నాం'' అన్నారు దర్శక–నిర్మాతలు తిరుపతి–భాస్కర్. ''ఫీల్ గుడ్ ఫిల్మ్ ఇది'' అన్నారు సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి.

ఈ సినిమాకి ఏదో మేజిక్ జరగబోతోంది
- శర్వానంద్



● సంపత్ నంది, తమన్నా, శర్వానంద్, డి. మధు

''తమన్నాగారు అద్భుతమైన ఆర్టిస్టు. 'ఓదెల 2' టీజర్ చూడగానే, 'అరుంధతి, అమ్మోరు' సినిమాలు చూసిన ఫీలింగ్ కలిగింది. ఈ సినిమాకు ఏదో మేజిక్ జరగబోతోందనిపిస్తోంది. ఓ మాస్ సినిమా కోసం ఎదురు చూసినట్లుగా ఆడియన్స్ ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్నారు. నేనూ ఈ సినిమా చూడటానికి వెళ్తాను'' అని అన్నారు హీరో శర్వానంద్. తమన్నా ప్రధాన పాత్రలో, హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్. సింహా ఇతర ముఖ్య పాత్రల్లో నటించిన సూపర్ నేచురల్ థ్రిల్లర్ మూవీ 'ఓదెల 2'. 'ఓదెల రైల్వేస్టేషన్' సినిమాకు సీక్వెల్‌గా 'ఓదెల 2' రూపొందింది. దర్శకుడు సంపత్ నంది సూపర్ విజన్‌లో అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్ పతాకాలపై డి. మధు నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు అతిథిగా హాజరైన హీరో శర్వానంద్ మాట్లాడుతూ– ''సంపత్ నంది గారితో ఏడాదిగా ట్రావెల్ అవుతున్నాను. ఆయన ఒక అడిక్షన్. తమన్నాగారితో సంపత్‌గారు నాలుగు సినిమాలు చేశారంటే చిన్న విషయం కాదు'' అన్నారు. ''ఈ సినిమాలో చేసిన శివశక్తి పాత్ర నా కెరీర్‌లో స్పెషల్‌గా నిలిచిపోతుంది. సంపత్, మధుగార్లు కోసం ఈ మూవీ ఆడాలని కోరుకుంటున్నాను. శర్వానంద్ గారితో కలిసి నటించాలని ఉంది'' అని తెలిపారు తమన్నా. ''ఒక గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇచ్చే సినిమా ఇది'' అని పేర్కొన్నారు సంపత్ నంది. ''ఈ సినిమా ఆడియన్స్‌ను గొప్పగా ఎంటర్‌టైన్ చేసేలా ఉంటుంది'' అన్నారు వశిష్ఠ. ''మంచి–చెడులకు మధ్య జరిగే యుద్ధమే ఈ సినిమా'' అని చెప్పారు డి. మధు. ''సీటీ మార్' సినిమా టైమ్‌లో తమన్నాగారితో ఫొటో కావాలని సంపత్‌గారిని అడిగితే, ఏకంగా సినిమా ఇచ్చినందుకు ఆయనకు థ్యాంక్స్. మధుగారు పెద్ద నిర్మాతగా నిలబడిపోతారు'' అన్నారు అశోక్ తేజ.

ఆరేళ్ల తర్వాత డే డ్రింకర్‌గా...



● జానీ డెప్

హాలీవుడ్‌లో డే డ్రింకర్‌గా మారిపోయారు ప్రముఖ నటుడు–దర్శక–నిర్మాత జానీ డెప్. కొంత గ్యాప్ తర్వాత జానీ డెప్ నటిస్తున్న చిత్రం 'డే డ్రింకర్'. ఈ గ్యాప్‌కి కారణం ఆయన వ్యక్తిగత వివాదాలు. మాజీ భార్య అంబర్ హర్డ్‌తో కొంత కాలంగా కొన్ని విషయాల్లో చట్టపరంగా పోరాటం చేస్తున్నారు జానీ డెప్. దీంతో నటుడిగా ఆయన కెరీర్‌లో చిన్న గ్యాప్ వచ్చింది. 'వెయిటింగ్ ఫర్ ది బార్బేరియన్స్' (2019) తర్వాత జానీ డెప్ నటిస్తున్న చిత్రం 'డే డ్రింకర్'. '500 డేస్ ఆఫ్ సమ్మర్, స్నో వైట్' వంటి హాలీవుడ్ చిత్రాలకు దర్శకత్వం వహించిన మార్క్ వెబ్ ఈ 'డే డ్రింకర్' సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాలో జానీ డెప్‌తో పాటు నటి పెనెలోప్ క్రజ్ మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. బుధవారం ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. 'బ్లో' (2001), పైరేట్స్ ఆఫ్ ది కరేబియన్: ఆన్ స్ట్రేంజర్ టైడ్స్ (2011), మర్డర్ ఆన్ ది ఓరియంట్ ఎక్స్‌ప్రెస్' (2017) చిత్రాల తర్వాత జానీ డెప్, పెనెలోప్ క్రజ్ మళ్లీ కలిసి నటిస్తున్న చిత్రం ఇదే. ఇక ఓ మిస్టీరియస్ గెస్ట్ నేపథ్యంలో 'డే డ్రింకర్' సినిమా కథనం సాగుతుందని హాలీవుడ్ సమాచారం.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,578	76,735
నిఫ్టీ ▲	500	23,329

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	16,830	▽	1
డోజోన్స్	40,502	▽	23
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,249	▲	115
డాక్స్	21,254	▲	299
షాంఘై	3.268	▲	5
నికాయ్	34,268	▲	285

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	92,400
బంగారం (22 క్యారెట్)	88,000
వెండి (కేజీ)	1,10,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.35	86.37
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	116.01	111.10
€	యూరో	ఎస్‌బీఐ	96.11	98.82
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.22	60.77
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.44	55.63
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	62.82	67.53
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.97	23.47
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.46	24.24
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.85	12.67

సెన్సెక్స్‌ప్రెస్!

2 రోజుల్లో రూ.18.42 లక్షల కోట్లు

దలాల్ స్ట్రీట్‌లో రెండు ట్రేడింగ్ సెషన్లలో రూ.18.42 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో బీఎస్‌ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.412.24 లక్షల కోట్ల(4.81 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకుంది. మంగళవారం ఒక్కరోజే రూ.10.8 లక్షల కోట్ల సంపద ఇన్వెస్టర్ల సొంతమైంది.

- ట్రంప్ ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై సుంకాలు మినహాయింపు
- ఆటోమొబైల్స్‌పై టారిఫ్‌ల సవరణ వార్తల ప్రభావం
- అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు
- సూచీలు రెండు శాతం ర్యాలీ
- బ్యాంకులు, ఆటో షేర్లలో భారీ కొనుగోళ్లు

ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాల నుంచి ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను మినహాయించడంతో పాటు ఆటోమొబైల్స్‌పై సుంకాలు సవరించే వీలుందని సంకేతాలివ్వడంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు భారీగా లాభపడ్డాయి. అక్కడి నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న దేశీయ స్టాక్ సూచీలు మంగళవారం 2% ర్యాలీ చేశాయి. బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ ధర 65 డాలర్లకు దిగిరావడం, డాలర్ ఇండెక్స్ బలహీనత అంశాలూ కలిసొచ్చాయి. ఫలితంగా సెన్సెక్స్ 1,578 పాయింట్లు పెరిగి 76,735 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 500 పాయింట్లు బలపడి 23,329 వద్ద ముగిసింది. ఉదయం సెన్సెక్స్ 1,695 పాయింట్ల లాభంతో 76,852 వద్ద, నిఫ్టీ 539 పాయింట్లు పెరిగి 23,368 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. విస్తృత స్థాయిలో అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు ఆరంభ లాభాలు నిలుపుకోలిగాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 76,907 వద్ద, నిఫ్టీ 23,368 వద్ద గరిష్టాలు నమోదు చేశాయి. రంగాల వారీగా సూచీలు రియల్టీ 6%, ఇండస్ట్రియల్, క్యాపిటల్ గూడ్స్ 4%, ఆటో, కన్జూమర్ డిస్కెషనరీ, ఫైనాన్సియల్ సర్వీసెస్, మెటల్ షేర్లు మూడుశాతం లాభపడ్డాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు 3% ర్యాలీ చేశాయి.

లాభాల బాటలో అంతర్జాతీయ మార్కెట్లు

ఆసియాలో సింగపూర్ స్ట్రెయిట్ టైమ్స్, తైవాన్ వెయిటెడ్ 2%, జపాన్ నికాయ్, కొరియా కోస్పీ, ఇండోనేషియా జకార్తా ఒకశాతం పెరిగాయి. హాంగ్‌కాంగ్ హాంగ్‌సెంగ్, చైనా షాంఘై అరశాతం రాణించాయి. యూరప్‌లో ఫ్రాన్స్ సీఏసీ 1%, జర్మనీ డాక్స్ 1.50%, బ్రిటన్ ఎఫ్‌టీఎస్‌ఈ 1.5% ర్యాలీ చేశాయి. అమెరికా స్టాక్ సూచీలు అరశాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.


బ్యాంకింగ్ షేర్ల దన్ను: ఆర్‌బీఐ వడ్డీరేట్ల తగ్గింపు కస్టమర్లకు బదిలీలో భాగంగా పలు బ్యాంకులు డిపాజిట్ల రేట్లు తగ్గిస్తున్నాయి. ఈ ప్రక్రియతో బ్యాంకుల నికర వడ్డీరేట్ల మార్జిన్ల ఒత్తిళ్లు తగ్గొచ్చని బ్రోకరేజ్ సంస్థ జెఫ్పారీస్ అంచనా వేసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు షేర్లు 3%, ఇండస్ఇండ్ బ్యాంకు 7%, యాక్సిస్ బ్యాంక్ 4 శాతం ర్యాలీ చేశాయి. సెన్సెక్స్ ఆర్జించిన మొత్తం పాయింట్ల ఈ నాలుగు షేర్ల వాటాయే 750 పాయింట్లు కావడం విశేషం.

ఆటో షేర్ల పరుగులు: ఆటో మొబైల్స్ పరిశ్రమపై గతంలో విధించిన సుంకాలు సవరించే వీలుందని ట్రంప్ సంకేతాలతో ఆటో షేర్లు పరుగులు పెట్టాయి. సంవర్ధన మదర్సన్‌సుమీ 8%, భారత్ ఫోర్జ్, బాలకృష్ణ ఇండస్ట్రీస్ 7%, టాటా మోటార్స్, ఎంఆర్‌ఎఫ్ 4.50% ర్యాలీ చేశాయి. హీరో మోటో కార్ప్ 4%, ఐషర్ మోటార్స్ 3.50%, టీవీఎస్ మోటార్, అశోక్ లేలాండ్, బజాజ్ ఆటో 3% లాభపడ్డాయి. ఎంఅండ్ఎం, మారుతీ 2% పెరిగాయి.



రూపాయి రెండోరోజూ ర్యాలీ

దేశీయ ఈక్విటీ మార్కెట్ అనూహ్య ర్యాలీ, అమెరికా కరెన్సీ బలోపేతంతో డాలర్ మారకంలో రూపాయి విలువ 30 పైసలు బలపడి 85.50 వద్ద స్థిరపడింది. క్రూడాయిల్ ధరలు దిగిరావడం, దేశీయ ద్రవ్యోల్బణ గణాంకాలు అంచనాలకు తగ్గట్లు నమోదుకావడం, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు భారత కరెన్సీ బలపడేందుకు తోడ్పడ్డాయి. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ట్రేడింగ్ 85.85 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 85.59 స్థాయి వద్ద గరిష్టాన్ని తాకింది.



ఎగుమతులు మళ్లీ ప్లస్

- మార్చిలో 42 బిలియన్ డాలర్లు
- 0.7 శాతం వృద్ధి
- 4 నెలల గరిష్టానికి దిగుమతులు
- పెరిగిన వాణిజ్య లోటు

న్యూఢిల్లీ: వస్తు ఎగుమతులు నాలుగు నెలల తర్వాత సానుకూలంగా మారాయి. మార్చి నెలలో 0.7 శాతం వృద్ధితో 41.97 బిలియన్ డాలర్లకు (రూ.3.6 లక్షల కోట్లు సుమారు) చేరాయి. వాణిజ్య లోటు 21.54 బిలియన్ డాలర్లకు విస్తరించినట్టు ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద వస్తు ఎగుమతులు 0.08 శాతం పెరిగి 437.42 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు 6.67 శాతం పెరిగి 720.24 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దీంతో వాణిజ్య లోటు గత ఆర్థిక సంవత్సరం మొత్తానికి 283 బిలియన్ డాలర్లకు పెరిగిపోయింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో వాణిజ్య లోటు 14.05 బిలియన్ డాలర్లు కాగా.. గతేడాది మార్చిలో 15.33 బిలియన్ డాలర్ల చొప్పున ఉంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య లోటు 241 బిలియన్ డాలర్లుగా ఉండడాన్ని గమనించొచ్చు. దిగుమతులు ఈ ఏడాది మార్చిలో నాలుగు నెలల గరిష్టానికి చేరి 63.51 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

సేవల్లో వృద్ధి..

ఇక 2024–25 సంవత్సరంలో వస్తు, సేవల ఎగుమతులు అన్నీ కలిసి 821 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్టు ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2023–24లో నమోదైన 778 బిలియన్ డాలర్లతో పోల్చి చూస్తే 5.5 శాతం వృద్ధి నమోదైనట్టు తెలుస్తోంది. 2023–24లో సేవల ఎగుమతులు 341 బిలియన్ డాలర్లు కాగా, 2024–25లో 383.51 బిలియన్ డాలర్లకు పెరిగినట్టు అంచనా. 2023–24తో పోల్చితే 2024–25లో ఇంజనీరింగ్ ఎగుమతులు 109.3 బిలియన్ డాలర్ల నుంచి 117 బిలియన్ డాలర్లకు, ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 29 బిలియన్ డాలర్ల నుంచి 38 బిలియన్ డాలర్లకు, ఫార్మా ఎగుమతులు 28 బిలియన్ డాలర్ల నుంచి 30.47 బిలియన్ డాలర్లకు పెరిగాయి. పెట్రోలియం ఉత్పత్తులు (63.34 బిలియన్ డాలర్లు) కెమికల్స్ రంగాల్లో (28.7 బిలియన్ డాలర్లు) ఎగుమతులు క్షీణించాయి.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
రిటైల్ మాల్స్‌కు డిమాండ్ భళా...
టారిఫ్‌లను ఎదుర్కొనే సత్తా భారత్‌కు ఉంది

ధరలు దిగొచ్చాయ్!

ఆరేళ్ల కనిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం

- మార్చిలో 3.34 శాతానికి పరిమితం
- ఆహార ధరలు తగ్గుదల
- టోకు ద్రవ్యోల్బణం సైతం కిందికి..

న్యూఢిల్లీ: కూరగాయలు, గుడ్లు తదితర ఉత్పత్తుల ధరలు శాంతించడంతో రిటైల్ ద్రవ్యోల్బణం మరింత కిందకు దిగొచ్చింది. మార్చి నెలకు వినియోగ ధరల ఆధారిత సూచీ (సీపీఐ) 3.34 శాతంగా నమోదైంది. ఇది ఆరేళ్ల కనిష్ట స్థాయి కావడం గమనార్హం. మధ్య కాలానికి రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి మించకుండా చూడాలన్నది ఆర్‌బీఐ ముందున్న లక్ష్యం. అంతకంటే దిగువకే వచ్చినందున ఆర్‌బీఐ మరో విడత వడ్డీ రేట్ల కోతను చేపడుతుందన్న అంచనాలు బలపడుతున్నాయి. మరోవైపు టోకు ద్రవ్యల్బణం సైతం ఆరు నెలల కనిష్ఠ స్థాయి 2.05 శాతానికి తగ్గింది. రిటైల్ ద్రవ్యోల్బణం చివరిగా 2019 ఆగస్టులో 3.28 శాతంగా నమోదు కావడం గమనార్హం. రిటైల్ ద్రవ్యోల్బణం ఈ ఏడాది ఫిబ్రవరిలో 3.61 శాతం కాగా, 2024 మార్చిలో 4.85 శాతంగా ఉంది. ప్రధానంగా కూరగాయలు, గుడ్లు, పప్పు ధాన్యాలు, మీట్, చేపలు, తృణ ధాన్యాల ధరలు తగ్గడం ద్రవ్యోల్బణం కనిష్టానికి చేరినట్టు ఎన్ఎస్ఓ తెలిపింది.



- రిటైల్ ఆహార ద్రవ్యోల్బణం మార్చి నెలలో 2.69%కి తగ్గింది. ఫిబ్రవరిలో ఇది 3.75% కాగా, గతేడాది మార్చిలో 8.52%గా ఉంది.
- గుడ్ల ధరలకు సంబంధించి ద్రవ్యోల్బణం మైనస్ 3.16%గా నమోదైంది. కూరగాయల విభాగంలో మైనస్ 7.04%, పప్పులకు మైనస్ 2.73%, దినుసులకు సంబంధించి మైనస్ 4.92%గా నమోదు కావడం అనుకూలించింది.

0.50 శాతం రేట్లు తగ్గొచ్చు..

'ఆహారోత్పత్తుల ధరలు క్షీణించడం వల్లే రిటైల్ ద్రవ్యోల్బణం ఈ స్థాయిలో దిగొచ్చింది. వచ్చే 3 పాలసీ సమీక్షల్లో 0.50% మేర పాలసీ రేట్లను తగ్గించేందుకు అవకాశాలున్నాయి'అని ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ పేర్కొన్నారు.

టోకు ద్రవ్యోల్బణం 2.05 శాతం

టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) సైతం మార్చి నెలకు 2.05%కి పరిమితమైంది. ఫిబ్రవరిలో ఇది 2.38%గా ఉంటే, 2024 మార్చిలో 0.26%గా ఉండడం గమనార్హం. ప్రధానంగా కూరగాయలు, బంగాళాదుంపలు, ఇతర ఆహార ఉత్పత్తుల ధరలు తగ్గడం ఇందుకు దోహదం చేసింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

జాబ్ పాయింట్

ఎన్‌పీసీఐఎల్, ముంబైలో 400 ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టులు

ముంబైలోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్).. ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 400.
- » ప్రారంభ వేతనం: నెలకు రూ.56,100.
- » విభాగాలు: మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్.
- » అర్హత: కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ, బీటెక్, బీఎస్సీ/ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
- » వయసు: 30.04.2025 నాటికి 26 ఏళ్లు మించకూడదు. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్ల వయో సడలింపు ఉంటుంది.
- » ఎంపిక విధానం: గేట్ 2023/2024/2025 స్కోరు,ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 30.04.2025
- » వెబ్‌సైట్: https://npcilcareers.co.in

సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ, హైదరాబాద్‌లో 11 జేఎస్ఏ పోస్టులు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ).. జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(ఎన్‌జీఆర్ఐ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 11.
- » వేతనం: నెలకు రూ.38,483.
- » పోస్టుల వివరాలు: జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(జనరల్)–08, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(ఎఫ్–ఏ)–01, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ (ఎస్–పీ)–02.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్ ఉత్తీర్ణులవ్వాలి.దీంతో పాటు టైపింగ్ వచ్చి ఉండాలి. వయసు: 28 ఏళ్లు ఉండాలి.
- » ఎంపిక: రాతపరీక్ష, టైపింగ్ టెస్ట్ ఆధారంగా.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 05.05.2025
- » వెబ్‌సైట్: https://www.ngri.res.in

డీఆర్‌డీవో-జీటీఆర్ఈ, బెంగళూరులో 150 అప్రెంటిస్‌లు

బెంగళూరులోని డీఆర్‌డీవో–గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్(జీటీఆర్ఈ) వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా, ఐటీఐ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం ఖాళీల సంఖ్య: 150.
- » ఖాళీల వివరాలు: గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ట్రైనీస్–105,డిప్లొమా అప్రెంటిస్ ట్రైనీస్–20, ఐటీఐ అప్రెంటిస్ ట్రైనీస్–25.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్,డిగ్రీ,డిప్లొమా, ఐటీఐలో ఉత్తీర్ణులై ఉండాలి. వయసు:18 నుంచి 27 ఏళ్లు ఉండాలి.
- » స్టైపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8000, ఐటీఐ అప్రెంటిస్‌కు రూ.7000.
- » ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 08.05.2025
- » వెబ్‌సైట్: https://drdo.gov.in

డీఆర్‌డీవో-ఏఆర్‌డీఈ, పుణెలో 70 ట్రేడ్ అప్రెంటిస్‌లు

పుణె (మహారాష్ట్ర) లోని డీఆర్‌డీవో–గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏఆర్‌డీఈ) వివిధ విభాగాల్లో ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం ఖాళీల సంఖ్య: 70.
- » స్టైపెండ్: నెలకు రూ.13,000.
- » విభాగాలు: ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెషినిస్ట్, ఎంఎంటీఎం, సీవోపీఏ, ఎంఎంవీ, ఆర్–ఏసీ, ఫోటోగ్రాఫర్, టర్నర్, వెల్డర్, కార్పెంటర్, డ్రాఫ్ట్స్‌మెన్ మెకానికల్.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 01.04.2025 నాటికి 18 నుంచి 30 ఏళ్లలోపు ఉండాలి.
- » ఎంపిక విధానం: ట్రేడ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 20.04.2025
- » వెబ్‌సైట్: https://drdo.gov.in/drdo

అన్ని స్కూల్స్‌లో.. తెలుగు తప్పనిసరిగా!

» తప్పనిసరి సబ్జెక్టుగా తెలుగు బోధించాలని ప్రభుత్వ ఆదేశం
» సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ అన్ని స్కూల్స్‌కు వర్తింపు
» 2025-26 నుంచే అమలు చేయాలని నిర్ణయం

జాతీయ విద్యా విధానం-2020.. పాఠశాల విద్యలో త్రీ లాంగ్వేజ్ ఫార్ములాను సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే! ఇంగ్లిష్, హిందీతోపాటు.. ఒక ప్రాంతీయ భాషనూ ప్రవేశ పెట్టాలనే ఉద్దేశంతో చేసిన సిఫార్సు!! దీనికి అనుగుణంగా తాజాగా తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ.. రాష్ట్రంలోని అన్ని బోర్డ్‌ల పాఠశాలల్లో.. 2025-26 విద్యా సంవత్సరం నుంచి విధిగా 'తెలుగు' సబ్జెక్ట్‌ను బోధించాలని ఆదేశించింది! దీనిపై జాతీయ స్థాయి బోర్డ్‌లైన సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ తదితర పాఠశాలల విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో.. తెలంగాణలో తెలుగు సబ్జెక్ట్ తప్పనిసరి బోధనకు కారణాలు, విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలు తదితర అంశాలపై విశ్లేషణ..

ప్రభుత్వ ఆదేశాలు ఇలా

తెలుగును తప్పనిసరి సబ్జెక్ట్‌గా ప్రవేశ పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీని ప్రకారం రాష్ట్రంలో గుర్తింపు పొందిన అన్ని ప్రభుత్వ పాఠశాలలతోపాటు, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ బోర్డ్ అనుబంధ స్కూల్స్ సైతం సెకండ్ లాంగ్వేజ్‌గా తెలుగును బోధించాలి. ముఖ్యంగా 9, 10 తరగతుల్లో తప్పనిసరిగా సెకండ్ లాంగ్వేజ్‌గా తెలుగును బోధించాలి. 2025–26 విద్యా సంవత్సరం నుంచే దీన్ని అమలు చేయాలి. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి చదువుతున్న విద్యార్థులు సైతం తెలుగును సెకండ్ లాంగ్వేజ్‌గా చదవాల్సి ఉంటుంది.

సులభతరంగా ఉండేలా పుస్తకం

తెలుగు లాంగ్వేజ్‌ను తప్పనిసరి చేసిన నేపథ్యంలో.. పాఠశాల విద్యార్థులకు తెలుగు సబ్జెక్ట్ సులభంగా ఉండేలా.. 'సింగిడి' పుస్తకం స్థానంలో 'వెన్నెల' పుస్తకాన్ని బోధించాలని పేర్కొన్నారు. తొలుత 2025–26లో తొమ్మిదో తరగతికి.. 2026–27లో పదో తరగతికి ఈ ఉత్తర్వులను అమలు చేయాలని స్పష్టం చేశారు.

సీబీఎస్ఈ విద్యార్థులకు సమస్యగా

ప్రస్తుతం సీబీఎస్ఈ కరిక్యులంలో భాగంగా.. తొమ్మిది, పదో తరగతుల్లో కోర్ సబ్జెక్ట్‌లు, ఫస్ట్ లాంగ్వేజ్ సబ్జెక్ట్‌గా ఇంగ్లిష్‌తోపాటు, రెండో లాంగ్వేజ్ సబ్జెక్ట్‌ను మాత్రమే బోధించే విధానం అమలవుతోంది. మూడో లాంగ్వేజ్ అనే విధానం లేదు. అంతేకాకుండా రెండో లాంగ్వేజ్‌గా ఎక్కువ మంది హిందీని చదువుతున్నారు. తాజా ఉత్తర్వులతో రెండో లాంగ్వేజ్‌గా హిందీకి బదులు తెలుగు సబ్జెక్ట్‌నే చదవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది ఇతర రాష్ట్రాలకు చెందిన, మన రాష్ట్రంలో చదువుతున్న విద్యార్థులకు ఇబ్బందికరంగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సీబీఎస్ఈ నుంచి ఇంకా అందని సమాచారం

తెలంగాణ ప్రభుత్వం తెలుగు లాంగ్వేజ్‌ను తప్పనిసరి సబ్జెక్ట్‌గా నిర్ణయించిన నేపథ్యంలో.. సీబీఎస్ఈ బోర్డ్ నుంచి పాఠశాలలకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదని.. దీంతో.. తెలుగును సెకండ్ లాంగ్వేజ్‌గా బోధించాలా? వద్దా? అనే ఆందోళన పాఠశాలల యాజమాన్యాల్లో నెలకొంది. అదే విధంగా ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు.. తెలుగును సెకండ్ లాంగ్వేజ్‌గా తమపై బలవంతంగా రుద్దడం సరికాదని అంటున్నారు. తెలుగు సబ్జెక్ట్‌ను పొందుపర్చడం వల్ల తమకు ఇబ్బంది లేదని.. అయితే సీబీఎస్ఈ విధానానికి విరుద్ధంగా రెండో లాంగ్వేజ్‌గా తెలుగును బోధించమని చెప్పడమే తమ సమస్యగా వారు పేర్కొంటున్నారు. దీనికి బదులుగా తెలుగును థర్డ్ లాంగ్వేజ్‌గా అమలు చేస్తే తమకు ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేస్తున్నారు.



టీజీ స్కూల్ ఎడ్యుకేషన్

ఎన్ఈపీ సిఫార్సు ఇలా

త్రీ లాంగ్వేజ్ ఫార్ములా ప్రకారం-జాతీయ విద్యా విధానం సిఫార్సుల మేరకు ఆయా రాష్ట్రాల్లోని పాఠశాలలు ప్రాంతీయ భాషను లాంగ్వేజ్ సబ్జెక్ట్‌లో పొందుపర్చాలి. ఇంగ్లిష్‌ను సెకండ్ లాంగ్వేజ్‌గా.. ఏదైనా ఇండియన్ లాంగ్వేజ్‌ను థర్డ్ లాంగ్వేజ్‌గా రూపొందించాలి. కొన్ని రాష్ట్రాల్లో సీబీఎస్ఈ బోర్డ్ స్కూల్స్‌లో ఇంగ్లిష్ ఫస్ట్ లాంగ్వేజ్‌గా, హిందీ సెకండ్ లాంగ్వేజ్‌గా ఉంటోంది. తెలంగాణలోని సీబీఎస్ఈ స్కూల్స్‌లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. కానీ తాజా ఉత్తర్వులతో హిందీకి బదులు తెలుగును సెకండ్ లాంగ్వేజ్‌గా చదవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

సీబీఎస్ఈ కూడా ప్రతిపాదన

త్రీ లాంగ్వేజ్ విధానంలో భాగంగా పదో తరగతిలో మూడు లాంగ్వేజ్ సబ్జెక్ట్‌లను బోధించాలని.. సీబీఎస్ఈ సైతం గత ఏడాది ప్రతిపాదనలు చేసింది. వీటిలో కచ్చితంగా రెండు భారతీయ భాషలు ఉండాలని స్పష్టం చేసింది. అయితే సెకండ్ లాంగ్వేజ్ లేదా థర్డ్ లాంగ్వేజ్ అనే విషయంలో స్పష్టత ఇవ్వలేదు. అదే విధంగా 12వ తరగతి విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న ఒక లాంగ్వేజ్‌కు బదులు రెండు లాంగ్వేజ్ సబ్జెక్ట్‌లు చదివేలా ప్రతిపాదనలు రూపొందించింది. దీంతో.. తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వులపై సీబీఎస్ఈ బోర్డ్ నుంచి సమాచారం కోసం పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.

పుస్తకాల సమస్య

తెలుగు సబ్జెక్ట్ సెకండ్ లాంగ్వేజ్ విషయంలో తలెత్తుతున్న మరో సమస్య.. పుస్తకాల లభ్యత. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, స్టేట్ బోర్డ్ అనుబంధ పాఠశాలలకు ప్రతి ఏటా పుస్తకాల కొరత ఏర్పడుతోంది. ఇదే సమయంలో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ బోర్డ్ విద్యార్థులకు కూడా తెలుగు సబ్జెక్ట్‌ను బోధించాలని.. ఇందుకోసం తొలి దశలో తొమ్మిదో తరగతి విద్యార్థులకు 'వెన్నెల' వాచకంను అందించాలని నిర్ణయించారు. అయితే ప్రత్యేకంగా వెన్నెల వాచకం పుస్తకాలు ఎక్కడ లభిస్తాయి? అందులోని పాఠ్యాంశాలు? విషయంలో సందిగ్ధత నెలకొంది.

టీచర్ల నియామకం

తెలుగును సెకండ్ లాంగ్వేజ్‌గా చేర్చిన నేపథ్యంలో సీబీఎస్ఈ, ఐఎస్ఎస్‌సీ, ఐబీ బోర్డ్ యాజమాన్యాలకు టీచర్ల లభ్యత కూడా సమస్యగా మారనుంది. ఇందుకోసం వారు ప్రత్యేకంగా తెలుగు టీచర్లను నియమించుకోవాల్సి ఉంటుంది.

వెన్నెల పుస్తకంలో.. 8 చాప్టర్లు

ప్రస్తుతం తెలంగాణ ఎస్‌సీఈఆర్‌టీ విధానం మేరకు తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఉద్దేశించిన 'వెన్నెల' తెలుగు వాచకంలో మొత్తం ఎనిమిది చాప్టర్లు ఉన్నాయి. వీటిలోని అంశాలను నేర్చుకునే విషయంలో అవగాహన-ప్రతిస్పందన, వ్యక్తీకరణ- సృజనాత్మకత, భాషాంశాలు(గ్రామర్, సొంత వాక్యాలు తదితర) ప్రాతిపదికగా విద్యార్థుల నైపుణ్యాన్ని పరీక్షిస్తారు. ఇప్పటివరకు తెలుగు సబ్జెక్ట్ చదవని సీబీఎస్ఈ బోర్డ్ విద్యార్థులు.. ఒక్కసారిగా వీటిని అవగాహన చేసుకోవడంలో ఇబ్బంది పడతారనే వాదన వినిపిస్తోంది.

విద్యార్థులు ఏం చేయాలి

తెలుగును తప్పనిసరి సబ్జెక్ట్‌గా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన నేపథ్యంలో.. సీబీఎస్ఈ కూడా దాదాపు అనుమతి ఇచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. కాబట్టి విద్యార్థులు వెన్నెల పుస్తకంలోని అంశాలపై ఇప్పటి నుంచే అవగాహన పెంచుకోవాలని సూచిస్తున్నారు. ఎస్‌సీఈఆర్‌టీ వెబ్‌సైట్‌లోని ఈ–బుక్‌ను డౌన్‌లోడ్ చేసుకొని.. వెన్నెల పుస్తకంలోని పాఠ్యాంశాలను చదువుతూ.. అవగాహన –ప్రతిస్పందన, సృజనాత్మకత, వ్యక్తీకరణ నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలని పేర్కొంటున్నారు.

త్వరగా స్పష్టత ఇస్తేనే

తెలుగును విధిగా అన్ని బోర్డ్‌ల స్కూల్స్‌లో అమలు చేయాలనే ఆదేశాల నేపథ్యంలో.. దీనిపై ఆయా బోర్డ్‌లు త్వరగా స్పష్టత ఇవ్వాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఆయా బోర్డ్‌లతో సంప్రదించి.. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే స్పష్టత వచ్చేలా చూడాలని పేర్కొంటున్నారు.

తెలుగు తప్పనిసరి సబ్జెక్ట్.. ముఖ్యాంశాలు:

- తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు తప్పనిసరిగా సెకండ్ లాంగ్వేజ్‌గా తెలుగు.
- రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ స్కూల్స్‌తోపాటు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ స్కూల్స్‌లో అమలు చేసేలా ఉత్తర్వులు.
- 2025–26లో తొమ్మిదో తరగతిలో ప్రారంభం .. 2026–27లో పదో తరగతికి కొనసాగింపు.
- వెన్నెల వాచకంతో బోధించాలని ఆదేశాలు.
- హిందీ లాంగ్వేజ్‌ను థర్డ్ లాంగ్వేజ్‌గా చదవాల్సిన పరిస్థితి.
- ఇప్పటి వరకు సీబీఎస్ఈ స్కూల్స్‌లో సెకండ్ లాంగ్వేజ్‌గా హిందీ.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్- తెలంగాణ చరిత్ర » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- ఇంగ్లిష్

కొడుకు తిండిపెట్టడం లేదు..

పోలీసులను ఆశ్రయించిన మాజీ ఎంపీటీసీ



శంకరపట్నం: కొడుకు, కోడలు తిండి పెట్టడం లేదని కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం రాజాపూర్ మాజీ ఎంపీటీసీ ఆసరి అయిలయ్య మంగళవారం కేశవపట్నం ఠాణాలో ఫిర్యాదు చేశారు. అయిలయ్య భార్య సారమ్మ, చిన్న కుమారుడు గణపతి గతంలోనే అనారోగ్యంతో మరణించారు. అయిలయ్య కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. పెద్ద కొడుకు సదయ్య, కోడలు తిండి పెట్టకుండా మానసికంగా హింసిస్తున్నారని ఆయన పోలీసులకు గోడు వెళ్లబోసుకున్నాడు. మరుగుదొడ్డి వాడకుండా అడ్డుకుంటున్నారని, ఇంట్లో ఉండకుండా దుర్భాషలాడుతున్నారని మొరపెట్టుకున్నాడు. తాను సంపాదించిన భూమిలో వ్యవసాయం చేసుకుంటున్న కొడుకు, కోడలు తనకు తిండి పెట్టకపోవడంతో పస్తులు ఉంటున్నానని, తనకు చావే శరణ్యమని రోదించాడు.

చోక్సీకి హైదరాబాద్‌తో లింకులు

బెల్జియంలో వజ్రాల వ్యాపారి అరెస్టు

సాక్షి, హైదరాబాద్: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను మోసం చేసిన కేసులో వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీని సీబీఐ అభ్యర్థన మేరకు బెల్జియం పోలీసులు ఈనెల 12న అరెస్టు చేశారు. మెహుల్ చోక్సీకి హైదరాబాద్‌తో లింకులు ఉన్నాయి. బ్యాంక్ రుణాల ఎగవేత కుంభకోణంలో హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటు చేసిన వజ్రాల కంపెనీల వ్యవహారం బయటపడింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల ఎస్ఈజెడ్ కేంద్రంగా చోక్సీ 2005లో గీతాంజలి జెమ్స్ పేరుతో వజ్రాల కంపెనీని ఏర్పాటు చేశాడు. ఈ కంపెనీని పలు బ్యాంకులకు కార్పొరేట్ సెక్యూరిటీ కింద పెట్టాడు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో గీతాంజలి జెమ్స్ పేరుతోనూ రుణం తీసుకున్నాడు. ఈ వ్యవహారంపై గీతాంజలి గ్రూప్‌నకు చెందిన 10 మంది డైరెక్టర్లపై 2022 డిసెంబర్ 14న సీబీఐ కేసు నమోదు చేసింది. సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరో కేసు నమోదు చేసింది. ఈ క్రమంలో ఈడీ అధికారులు ఆ సంస్థకు చెందిన పలు ఆస్తులను జప్తు చేశారు. గీతాంజలి జెమ్స్ మూతపడింది.



ధాన్యం తడవకుండా పట్టాలు కప్పుతున్న పోలీసులు

• పట్టాలు కప్పి.. పంట కాపాడి

రైతులకు పోలీసుల సాయం

హాలియా: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం అకాల వర్షానికి తడిసిపోవడాన్ని గమనించిన స్పెషల్ పోలీస్ బృందం వాటిపై పట్టాలు కప్పి పంటను కాపాడింది. హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అలీనగర్ వద్ద జరిగిన ఈ సంఘటన వివరాలివి. అలీనగర్ ప్రాంతంలో జాతీయ రహదారి ఫ్లై ఓవర్‌పై కొందరు రైతులు ధాన్యం ఆరబోశారు. మంగళవారం సాయంత్రం గాలిదుమారంతో కూడిన వర్షం కురిసింది. అదే సమయంలో నల్లగొండ స్పెషల్ పోలీసులు నిడమనూరు మండలం బొక్కముంతలపాడు వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా.. తడుస్తున్న ధాన్యాన్ని చూసి చలించారు. తమ వాహనాన్ని ఆపి ధాన్యం తడవకుండా పట్టాలు కప్పి పంటను కాపాడారు. పంటను కాపాడిన స్పెషల్ పోలీసులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

రైళ్లు ఇలా మళ్లిస్తున్నారు..



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో నిర్మాణంలో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల నేపథ్యంలో 76 రైళ్లు మళ్లింపు

చర్లపల్లి, మల్కాజిగిరి, కాచిగూడ, నాంపల్లి స్టేషన్‌ల నుంచి రాకపోకలు • 120 రోజులపాటు కొనసాగనున్న ఆంక్షలు

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనుల దృష్ట్యా 10వ నంబర్ ప్లాట్‌ఫామ్ నుంచి 7వ నంబర్ ప్లాట్‌ఫాం వరకు మూసివేశారు. అలాగే 5, 6వ నంబర్ ప్లాట్‌ఫామ్‌లను కూడా అవసరాలకు అనుగుణంగా మూసివేయనున్నారు. నిర్మాణ పనులను దృష్టిలో ఉంచుకొని ప్లాట్‌ఫామ్‌ల మూసివేత, రైళ్ల మళ్లింపు చర్యలు చేపట్టనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. సుమారు 120 రోజులపాటు రైళ్ల రాకపోకలపైన ఆంక్షలు కొనసాగే అవకాశం ఉంది.

టెర్మినల్ మార్పు...

నాంపల్లి నుంచి చెన్నై సెంట్రల్‌కు నడిచే చార్మినార్ ఎక్స్‌ప్రెస్ (12603/12604), సికింద్రాబాద్–గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (12590/12589), షాలిమార్–హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ (18045/18046) రైళ్లను చర్లపల్లి టెర్మినల్‌కు మార్చారు. సికింద్రాబాద్–కర్నూల్ సిటీ (17023/17024) కాచిగూడ నుంచి రాకపోకలు సాగించనుంది.

సికింద్రాబాద్ నుంచి తాత్కాలికంగా ఇతర స్టేషన్‌లకు మళ్లించిన రైళ్లు	30
శాశ్వతంగా చర్లపల్లి టెర్మినల్‌కు మారినవి	8
చర్లపల్లిలో అదనపు హాల్టింగ్ కల్పించిన రైళ్లు	6
సికింద్రాబాద్‌కు బదులు చర్లపల్లి మీదుగా నడిచే దూరప్రాంత రైళ్లు	32

తాత్కాలికంగా మారిన స్టేషన్‌లు...

➤ విజయవాడ–సికింద్రాబాద్ (12713/12714) ఎక్స్‌ప్రెస్ కాచిగూడ నుంచి విజయవాడకు రాకపోకలు సాగించనుంది. పోర్‌బందర్–సికింద్రాబాద్ (20968/20967) ఎక్స్‌ప్రెస్‌ను ఉందానగర్ నుంచి నడుపుతారు.

➤ అలాగే సిద్దిపేట్ నుంచి సికింద్రాబాద్ వరకు నడిచే ప్యాసింజర్ రైళ్లను సికింద్రాబాద్‌కు బదులు మల్కాజిగిరి నుంచి నడిపేందుకు చర్యలు తీసుకున్నారు. సికింద్రాబాద్ నుంచి పుణేకు నడిచే శతాబ్ది ఎక్స్‌ప్రెస్ (12026/12025) నాంపల్లి నుంచి పుణేకు రాకపోకలు సాగించనుంది.

చర్లపల్లి నుంచి నడిచే రైళ్లు ఇవే...

➤ సికింద్రాబాద్–మణుగూర్ (12745/12746), సికింద్రాబాద్–రేపల్లె (17646/17645), సిలిచర్–సికింద్రాబాద్ (12513/12514), సికింద్రాబాద్–దర్భంగా (17007/17008), సికింద్రాబాద్–యశ్వంత్‌పూర్ (12735/12736), సికింద్రాబాద్–అగర్తల (07030/07029), సికింద్రాబాద్–ముజఫర్‌పూర్ (05294/05293), సికింద్రాబాద్–దానాపూర్ (07647/07648), సికింద్రాబాద్–సంత్రాగచ్చి (07221/07222), హైదరాబాద్–రక్సాల్ (07051/07052) ఎక్స్‌ప్రెస్ రైళ్లు సికింద్రాబాద్ రీడెవలప్‌మెంట్ పనుల దృష్ట్యా చర్లపల్లి నుంచి రాకపోకలు సాగిస్తాయి. ➤ అలాగే సికింద్రాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్, గుంటూర్–సికింద్రాబాద్ రైళ్లకు చర్లపల్లి టెర్మినల్‌లో అదనపు హాల్టింగ్ సదుపాయం కల్పించారు.

చర్లపల్లి నుంచి మళ్లింపు...

వివిధ ప్రాంతాల నుంచి బయలుదేరి సికింద్రాబాద్ స్టేషన్ మీదుగా నడిచే 32 రైళ్లను చర్లపల్లి మీదుగా మళ్లించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ రైళ్లు సికింద్రాబాద్‌కు రాకుండా లింగంపల్లి నుంచి సనత్‌నగర్, మౌలాలి రూట్‌లో చర్లపల్లికి చేరుకుంటాయి. ఆదిలాబాద్–తిరుపతి కృష్ణా ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి–కాకినాడ గౌతమి ఎక్స్‌ప్రెస్, కాజీపేట్–హడాప్సర్, లింగంపల్లి–విశాఖపట్టణం, సంబాల్పూర్–నాందేడ్, విశాఖపట్టణం–నాందేడ్, విశాఖపట్టణం–సాయినగర్ షిరిడీ, విశాఖపట్టణం–నాగర్‌సోల్, నర్సాపూర్–నాగర్‌సోల్, వాస్కోడిగామ –జాసిడ్, మచిలీపట్నం–సాయినగర్ షిరిడీ, కాకినాడ–సాయినగర్ షిరిడీ, విశాఖపట్టణం–ఎల్‌టీటీ ముంబై, పూర్ణ–తిరుపతి, నాందేడ్–ఈరోడ్, కాకినాడ–లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ రైళ్లు చర్లపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

చర్లపల్లికి కనెక్టివిటీ కటకట...

సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రాకపోకలు సాగించే సుమారు 60కి పైగా రైళ్లను చర్లపల్లి టెర్మినల్ నుంచి నడిపేందుకు చర్యలు తీసుకున్నారు. కానీ ప్రయాణికుల రద్దీ మేరకు బస్సులు, ఎంఎంటీఎస్ రైళ్లు అందుబాటులో లేవు. ప్రస్తుతం ఒకే ఒక్క ఎంఎంటీఎస్ రైలు ఉదయం ఒకటి, సాయంత్రం ఒకటి చొప్పున నడుస్తున్నాయి. చర్లపల్లి నుంచి సికింద్రాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు సిటీబస్సులు కూడా పరిమితంగానే ఉన్నాయి. పైగా రాత్రిపూట బస్సులు అందుబాటులో లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈసీ తీరు అనుమానాస్పదం

ఓటర్ల డేటా ఎందుకివ్వరు? • మండిపడ్డ పార్టీలు, సంస్థలు

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై పలు పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు మండిపడ్డాయి. ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకు సంస్థ పూర్తిగా తిలోదకాలిస్తోందంటూ ధ్వజమెత్తాయి. ''ఓటింగ్‌కు సంబంధించి పౌరులందరికీ తెలియాల్సిన గణాంకాలను అడిగినా బయటపెట్టడం లేదు. ఎన్నికల ప్రక్రియలో భారీ అవకతవకలు జరుగుతున్నాయన్న అనుమానాలు ఈసీ తీరుతో నానాటికీ బలపడుతున్నాయి'' అంటూ దుయ్యబట్టాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల శాతానికి సంబంధించిన పూర్తి గణాంకాలను బయట పెట్టాల్సిందిగా అవి డిమాండ్ చేస్తుండటం తెలిసిందే. ఈ విషయమై అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్)తో పాటు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా తదితరులు సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు కూడా దాఖలు చేశారు. 2019 ఎన్నికల్లో నమోదైన మొత్తం ఓట్లకు సంబంధించి 17సీ పార్ట్–1 తాలూకు ప్రతులన్నింటినీ వెల్లడించేలా ఈసీని ఆదేశించాలని కోరారు. దీనిపై తొలుత ఈసీని సంప్రదించాల్సిందిగా గత నెల కోర్టు వారికి సూచించింది. దాంతో ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ ఆహ్వానం మేరకు మంగళవారం సమావేశం జరిగింది. ఏడీఆర్ ప్రతినిధులతో పాటు సుప్రీంకోర్టు సీనియర్ అడ్వొకేట్ ప్రశాంత్ భూషణ్, మొయిత్రా తదితరులు భేటీలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈసీ తీరుపై పెదవి విరిచారు.

సీఈసీ, ఈసీ ఎక్కడ: భూషణ్



సీఈసీ గానీ, ఎన్నికల కమిషనర్లు గానీ భేటీలో పాల్గొనకపోవడాన్ని ప్రతినిధులు తీవ్రంగా తప్పుబట్టారు. ''ఏదో అత్యున్నత న్యాయస్థానం సూచించింది గనుక తప్పలేదన్నట్టుగా వ్యవహరించారు. భేటీకి కేవలం ఈసీ ప్రతినిధులను పంపి సరిపెట్టారు. సంస్థ విశ్వసనీయతకు సంబంధించిన అతి కీలకమైన సమస్య విషయంలో వారి చిత్తశుద్ధి ఏపాటిదో దీన్నిబట్టే తేలిపోతోంది. అయినా సుప్రీంకోర్టుపై గౌరవంతో మా అనుమానాలన్నింటినీ ఈసీ ప్రతినిధుల ముందుంచాం. 2019 లోక్‌సభ ఎన్నికల ఓటింగ్ శాతానికి సంబంధించిన డేటాలో చాలా అవకతవకలున్నట్టు వారి దృష్టికి తీసుకెళ్లాం. వాటిపై సమాధానాలు కోరాం. ఫాం 17(సీ), 20 వంటివాటిని వెబ్‌సైట్లో అందరికీ అందుబాటులో ఉంచాల్సిందిగా సూచించాం. కానీ వారినుంచి సానుకూల స్పందనే లేదు'' అంటూ ప్రశాంత్ భూషణ్ పెదవి విరిచారు. దీనిపై తమ తదుపరి వాదనలను ఇక సుప్రీంకోర్టు ముందే ఉంచుతామని స్పష్టం చేశారు. ''ఓటింగ్ విషయంలో తప్పిదాలు, అవకతవకలు జరుగుతున్నాయని, ఈవీఎంల టాంపరింగ్ జరుగుతోందని దేశవ్యాప్తంగా చాలా అనుమానాలున్నాయి. అవి వాస్తవమేనంటూ దేశ విదేశాలకు చెందిన పలువురు ప్రముఖులు గళమెత్తుతున్నారు. ఈసీ ప్రవర్తన ఆ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది'' అంటూ భూషణ్ దుయ్యబట్టారు.

2024లోనూ అవకతవకలు: మొయిత్రా



2019లోనే గాక 2024 లోక్‌సభ ఎన్నికల విషయంలో కూడా ఓటింగ్‌కు సంబంధించి భారీ అవకతవకలు జరిగాయని మొయిత్రా ఆరోపించారు. ''గత రెండు లోక్‌సభ ఎన్నికల్లోనూ చాలా నియోజకవర్గాల్లో ఈవీఎంలలో నమోదైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు పొంతనే లేదు. సాయంత్రం దాకా ఉన్న పోలింగ్ శాతాలు రాత్రికల్లా భారీగా పెరిగిపోయాయి. చాలాచోట్ల ఈ పెరుగుదల ఏకంగా 20 శాతం దాకా ఉంది'' అని గుర్తు చేశారు. ఫలితంగా ప్రస్తుతం ఈసీ విశ్వసనీయత ఎన్నడూ లేనంతగా అడుగంటిందని విమర్శించారు. ముఖ్యంగా మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల విషయంలో ఈసీ పూర్తిగా అప్రతిష్టపాలైందన్నారు. ''మేం కోరుతున్నది రహస్య వివరాలేమీ కాదు. దేశప్రజలందరికీ వాటిని తెలుసుకునే హక్కుంది'' అని ఆమె స్పష్టం చేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

తాటి ముంజలతో లాభాలు మేటి

వేసవిలో జోరుగా విక్రయాలు

మండే ఎండల్లో చల్లని తాటిముంజలు





జ్యోతినగర్(రామగుండం): మండే వేసవిలో చల్లదనంతోపాటు సం**పూర్ణారోగ్యాన్ని** చేకూర్చే తాటిముంజల **వ్యాపారం**తో వేలాది కుటుంబాలు **ఉపాధి** పొందుతున్నాయి. తెలం**గాణ**లో తాటిముంజలు అం**టే** తెలియని వారుండరు.. అందుకే వీటికి ఏటా డిమాండ్ పెరుగుతూ వస్తోంది.. దీన్ని దృష్టిలో పెట్టుకున్న చిరు వ్యాపారులు, రోజువారీ కూలీలు.. గీత కార్మికుల నుంచి హోల్‌సేల్‌గా కొనుగోలు చేస్తూ పట్టణాలు, నగరాలకు తరలిస్తూ విక్రయిస్తున్నారు. మరికొం**ం**దరు గీత కార్మికులే **నేరుగా** విక్రయిస్తున్నారు. పెద్దప**ల్లి జిల్లా** రామగుండం పారిశ్రామిక **ప్రాంతం**లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు **ఏటా 46–48** డిగ్రీల సెల్సియస్ వరకు **నమోదవుతున్నాయి.** వేడి నుంచి ఉపశమనం **కోసం శ్రామికులు,** కార్మికులే కాదు.. అధికారులూ తాటిముంజల వైపు మొగ్గు చూపుతున్నారు. వీటిని ఆధారం చేసుకుని పెద్దపల్లి జిల్లాలో సుమారు 100 మంది, **ఉమ్మ**డి కరీంనగర్ **జిల్లావ్యా**ప్తంగా పరిశీలిస్తే **దాదాపు** 500 మంది **వరకు తా**టిముం**జలు వి**క్రయి**స్తూ** సీజనల్ **ఉపా**ధి పొందుతున్నారు.

వైద్యులు ఏమంటున్నారంటే..

- అరటిపండ్లలో మాదిరిగానే పొటాషియం ఉంటుంది
- గుండె సంబంధిత వ్యాధుల నుంచి కాపాడుతుంది
- **రక్తపో**టును అదుపులో ఉంచుతుంది
- **విట**మిన్ కే, సీ, బీ, జింక్, ఐరన్, **కాల్షి**యం, పోషకాలు లభిస్తాయి
- **శరీ**రంలో ద్రవాలు పెరుగుతాయి
- **అధి**క బరువును నియంత్రిస్తుంది
- **చెడు** కొలెస్ట్రాల్‌ను తొలగించి, జీర్ణశక్తిని పెంచుతుంది

సీజన్ వ్యాపారం బాగుంది



ప్రతీ సీజన్‌లో దొరికే మామిడి, దోసకాయలు అమ్ముత. ఈసారి కూడా పల్లెటూరులో గౌడ కులస్తుల వద్ద ముంజకాయలు కొనుగోలు చేసి ఎన్టీపీసీ తీసుకొచ్చిన. గిరాకీ బాగుంది. ఖర్చుపోనూ రోజూవారీ కూలి మంచిగనే గిట్టుబాటవుతోంది. వారం నుంచి ఈ వ్యాపారం చేస్తున్న.

– బాకం మల్లేశ్, చిరు వ్యాపారి, ఎన్టీపీసీ రింగ్‌రోడ్డు

చిన్నప్పుడు తినేవాళ్లం



చిన్నప్పుడు మా ఊరిలో గౌడ్ నుంచి మా నాన్న ముంజకాయలు తీసుకొచ్చేవారు. ఇప్పుడు తిందామంటే ఊరికి వెళ్లడానికి కుదరడం లేదు. గోదావరిఖనికి వెళ్లి తాటిముంజలు కొనుగోలు చేసి తీసుకొస్తున్న. మా పిల్లలకు కూడా వీటి గురించి చెప్పి తినిపిస్తున్న. ఎండాకాలంలో మంచిది.

– స్వరూప, నర్రాశాలపల్లె, ఎన్టీపీసీ

అమ్మ తీసుకొచ్చింది



నేను పాఠశాల నుంచి వస్తున్నప్పుడు రోడ్డు పక్కన తాటిముంజలు చూసిన. అవి కావాలని మా అమ్మకు చెప్పిన. వెంటనే వెళ్లికొని తీసుకొచ్చింది. చాలా రుచిగా ఉన్నాయి. మా పాఠశాలలో కూడా వీటిగురించి చెప్పిన. ఫాస్ట్‌ఫుడ్ కన్నా ఇవి ఆరోగ్యానికి ఎంతోమంచివని మా ఉపాధ్యాయులు కూడా చెప్పారు.

– నిత్యశ్రీ, విద్యార్థిని, ఎన్టీపీసీ, రామగుండం

తెలంగాణలో కల్లు ఫేమస్



తెలంగాణలో తాటి, ఈతకల్లు ఫేమస్. వేరే ప్రాంతాల్లో కల్లు గీయడం, తాటి ముంజలు అమ్ముకోవడం చాలా తక్కువ. తెలంగాణలో చాలామంది గీత కార్మికులు ఉన్నారు. తెల్లకల్లు మూడు సీజన్లలో దొరుకుతుంది. వీటిని పొద్దాటి, పరుపుదాటి, పండుతాటి అని అంటారు. నీరా, అడగల్లు కూడా ఉంటుంది.

– సింగం మల్లికార్జున్‌గౌడ్, మేడిపల్లి

ఆరోగ్యానికి మంచిది




తాటిముంజలు తింటే గుండె, లివర్, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడే వారికి వేసవిలో ఎంతో ప్రయోజనం కలుగుతుంది. వాటిలోని పోషకాలు ఆరోగ్యానికి ఉపయోగకరం. శరీరంలో నీటి శాతం తగ్గకుండా దోహదపడుతాయి. ఎండలో బయటకు వెళ్తే జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ రాజశేఖరరెడ్డి, ఫిజీషియన్, ప్రభుత్వ ఆస్పత్రి, గోదావరిఖని

ధాన్యం కొనుగోలు, పీడీఎస్ బలోపేతం భేష్

గుజరాత్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రమేశ్ చంద్ర మీనా



సాక్షి, హైదరాబాద్: రైతులు, ఆహార భద్రత కార్డులున్న వారికి తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అందిస్తున్న సేవలను.. గుజరాత్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రమేశ్ చంద్ర మీనా అభినందించారు. తెలంగాణ పర్యటనలో ఉన్న ఆయన మంగళవారం పంజగుట్ట, ఏజీ కాలనీల్లోని జన్ పోషణ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా తమ శాఖ పనితీరును.. రాష్ట్ర ప్రభుత్వ పౌర సరఫరాల విభాగం ప్రధాన కార్యదర్శి డి.ఎస్.చౌహాన్ వివరించారు. రాష్ట్రంలో రేషన్ లబ్ధిదారులకు బియ్యం, ఇతర వస్తువుల పంపిణీ కోసం అనుసరిస్తున్న 'ఈ పాస్'వ్యవస్థ గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాల విభాగం ధాన్యం కొనుగోలు, పీడీఎస్ బలోపేతానికి చేపట్టిన చర్యలు రమేశ్ చంద్ర మీనాను ఆకట్టుకున్నాయి. వ్యవస్థలో దుర్వినియోగానికి అవకాశం లేకుండా చేసిన విధానాలను ఆయన ప్రశంసించారు. పారదర్శకత, సమర్థతతో కూడిన ప్రజా పంపిణీ వ్యవస్థ అమల్లో తెలంగాణ అనుసరిస్తున్న సాంకేతికత ఆధారిత ప్రగతిని ఆయన అభినందించారు. గత ఏడాది అమలైన కీలక సంస్కరణలను వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న ధాన్యం విక్రయించే రైతులకు క్వింటాకు అదనంగా రూ.500 ప్రయోజనం అందించడాన్ని చవాన్ వివరించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 'సన్నబియ్యం' పంపిణీ, మహాలక్ష్మి పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ప్రతి సిలిండర్‌ను రూ.500కు అందించడం, తెలంగాణ రాష్ట్రం ఫిలిప్పీన్స్‌కు జీ2జీ (ప్రభుత్వం నుంచి ప్రభుత్వానికి) బియ్యం ఎగుమతి చేసిన తొలి రాష్ట్రంగా గుర్తింపు పొందడాన్ని గుజరాత్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రమేశ్‌చంద్ర మీనా అభినందించారు.

ములుగు, భద్రాద్రి కొత్తగూడెంలోనే 'అన్న'ల ప్రభావం

- దేశవ్యాప్తంగా 38కి తగ్గిన మావోయిస్టు ప్రభావిత జిల్లాలు
- వెల్లడించిన కేంద్ర హోంశాఖ



సాక్షి, హైదరాబాద్: సాయుధ పోలీసు బలగాల కగార్ ఆపరేషన్, వరుస కూంబింగ్‌లతో మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాలు నానాటికీ కుంచించుకుపోతున్నాయి. గతంలో మావోయిస్టులకు అడ్డాలుగా ఉన్న ప్రాంతాల్లోనూ సాయుధ పోలీస్ బలగాలు పాగా వేస్తుండడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 2018లో దేశవ్యాప్తంగా 126 జిల్లాల్లో నక్సల్ ప్రభావం ఎక్కువగా ఉండగా.. 2024 నాటికి ఆ సంఖ్య 38కి తగ్గినట్టు కేంద్ర హోంశాఖ తాజా గణాంకాల్లో వెల్లడించింది. తెలంగాణలో మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో భద్రాద్రి–కొత్తగూడెం, ములుగు జిల్లాలు ఉన్నట్టు వెల్లడించింది. గతంలో ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉండగా.. క్రమంగా ఆ సంఖ్య పరిమితమవుతూ వస్తోంది. తాజా నివేదిక ప్రకారం తెలంగాణలో భద్రాద్రి–కొత్తగూడెం జిల్లాలోనే కాస్త ఎక్కువ ప్రభావం ఉంది. ఈ జిల్లాలోనూ స్థానిక పోలీసుల చొరవతో మావోయిస్టుల లొంగుబాట్లు ఇటీవల పెరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాతోపాటు మిగిలిన రాష్ట్రాల్లో చూస్తే.. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కాంకేర్, నారాయణ్‌పూర్, సుక్మా, దంతేవాడ, గరియాబంద్, మోహ్లా–మన్పూర్–అంబాఘర్ చౌకి, జార్ఖండ్‌లోని లతేహార్, ఒడిశాలోని నువాపాడ, మధ్యప్రదేశ్‌లోని బలాఘాట్, ఒడిశాలోని కలహండి, కంధమాల్, మల్కన్‌గిరి, జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్, మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ప్రస్తుతం మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉన్నట్టు కేంద్ర హోంశాఖ తెలిపింది. గత 10 సంవత్సరాలలో 8 వేల మందికి పైగా నక్సలైట్లు హింసాత్మక మార్గాన్ని విడిచిపెట్టినట్టు వెల్లడించింది. కాగా, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల జాబితాలో తెలంగాణలోని ఆదిలాబాద్, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలను సైతం చేర్చాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో విజ్ఞప్తి చేశారు.

తొమ్మిదో షెడ్యూల్‌లో తెలంగాణ బీసీ బిల్లులు

జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌కు బీసీఏఎఫ్ వినతి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ శాసన సభలో తీర్మానించిన బీసీ బిల్లులను 9వ షెడ్యూల్‌లో చేర్చడంతో పాటు.. దేశవ్యాప్తంగా కులగణన, మహాత్మాఫూలే దంపతులకు భారతరత్న ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీసీ ఆజాదీ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం బీసీఏఎఫ్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ నేతృత్వంలోని బృందం జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహిర్‌ను కలిసి వినతి పత్రం అందజేసింది. తెలంగాణలో కులగణన, 42 శాతానికి రిజర్వేషన్లను పెంచుతూ అసెంబ్లీ తీర్మానించడాన్ని బీసీ కమిషన్‌కు వివరించారు. ప్రస్తుతం తెలంగాణ గవర్నర్ వద్ద ఉన్న ఆ బిల్లును పార్లమెంట్‌లో చట్టం చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చేలా చొరవ చూపాలని కోరారు. దేశవ్యాప్త కులగణన కోసం 15 రోజులుగా ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బీసీ ఆజాదీ జేఏసీ నేత బత్తుల సిద్దేశ్వర పటేల్ ఆరోగ్యం క్షీణిస్తోందని గంగారాం అహిర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం కులగణనపై అనుకూలమైన నిర్ణయం తీసుకునేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

2016లో కేటాయింపు..



సాక్షి, హైదరాబాద్: నైనీ బొగ్గు బ్లాక్‌ను 2016 మేలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ సింగరేణికి కేటాయించింది. అన్ని రకాల అనుమతులు సాధించి, గనిలో తవ్వకం ప్రారంభించడానికి తొమ్మిదేళ్లు నిరీక్షించాల్సి వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క అప్పటి కేంద్ర బొగ్గు శాఖ మంత్రి ప్రహ్లాద్ **జోషి, ప్రస్తుత** బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని కలిసి **విజ్ఞప్తులు** చేశారు. ఒడిశా సీఎంతో సంప్రదింపులు **జరిపి** గని ప్రారంభానికి భట్టి మార్గం సుగమ**ం** చేశారు. దీంతో చివరికి సింగరేణీయుల చిరకాల స్వప్నం సాకారమైంది

నైనీ బొగ్గు బ్లాక్ విశేషాలు

- ఈ గనిలో 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు తవ్వితీయటానికి అవకాశం ఉంది. ఈ గనిలో ఉత్పత్తి పూర్తి స్థాయికి చేరుకుంటే ఏడాదికి 10 మిలియన్ టన్నులు.. అనగా కో**టి** టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుంది.
- సింగరేణిలో ప్రస్తుతం ఉన్న 17 ఓపె**న్ కాస్ట్** గనులకన్నా ఇదే అతి పెద్ద గని కాను**ంది.**
- ఏడాదికి కోటి టన్నుల చొప్పున 38 **సంవత్సరాల పాటు** ఈ గని నుంచి బొగ్గు తవ్వి తీయనున్నారు.
- తెలంగాణలో ప్రస్తుతం సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో ఒక టన్ను బొగ్గు తవ్వి తీయడానికి సగటున 12 టన్నుల ఓవర్ బర్డెన్ (పై మన్ను) తొలగిస్తుండగా ఈ గనిలో మాత్రం ఒక టన్ను బొగ్గుకు కేవలం రెండున్నర క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తీస్తే సరిపోతుంది. దీంతో లాభదాయకం కానుంది.
- ఈ గనిలో మేలైన జీ–10 రకం నాణ్యమైన బొగ్గు లభిస్తోంది.
- **ఓవర్ బర్డెన్ తొ**లగించడానికి, బొగ్గు తవ్వకానికి, **బొగ్గు రవాణా**కు సంబంధించి ఇప్పటికే కాం**ట్రాక్టులను** అప్పగించారు.
- **ఇక్క**డ ఉత్పత్తి చేసే బొగ్గును **ప్ర**స్తుతం రోడ్డు మార్గం ద్వారా **సమీ**పంలోని జరపడ రైల్వేసైడింగ్‌కు రవాణా చేసి, అక్కడి నుంచి **వినియోగదారులకు** సరఫరా **చే**యనున్నారు.
- అయితే ఈ ప్రాంతంలోగల **ఇత**ర బొగ్గు కంపెనీలతో కలిసి ఒక **ప్రత్యే**క 60 కిలోమీటర్ల రైలు **మార్గా**న్ని నిర్మించడం కోసం కూడా **ప్రయత్నా**లు ప్రారంభించారు. మరో **మూడేళ్లలో ఇది** కార్యరూపం దాల్చే అవకాశం **ఉంది.**
- నైనీ బొగ్గు బ్లాకు కోసం మొత్తం 2,255 ఎకరాల భూమి సేకరించారు. దీనిలో 1,935 ఎకరాల అటవీ భూమి, 320 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూమి ఉంది.

ఇరిగేషన్ల విలీనంతో చిన్న నీటి వనరులకు సమస్యలు

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక.. గత ప్రభుత్వం చిన్న, భారీ నీటిపారుదల శాఖలను విలీనం చేయడంతో చెరువులు, చిన్న నీటి వనరులకు కష్టమొచ్చిందని రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. కర్ణాటక రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజు మంగళవారం హైదరాబాద్‌లోని బేగంపేట టూరిజం ప్లాజాలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యురాలు భవానీ రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెండు రాష్ట్రాల్లోని నీటి ప్రాజెక్టులు, రైతుల సమస్యలపై చర్చించారు. తెలంగాణలో చిన్న నీటి వనరులుగా ఉన్న చెరువులకు మరమ్మతులు జరగక, కబ్జాలకు గురై భూగర్భ జలాలు అడుగంటిపోయాయని తెలిపారు. ఈ నేపథ్యంలో కమిషన్ ఇప్పటికే మైనర్ ఇరిగేషన్ శాఖను విడదీసి.. స్థానిక రైతులను నీటి సంఘాలుగా ఏర్పాటు చేసి భూగర్భ జలాలు పెంపొందించేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి నివేదిక ఇచ్చినట్లు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి వివరించారు. కర్ణాటక రాష్ట్రంలో అమలవుతున్న మైనర్ ఇరిగేషన్ విధానంపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషన్‌ను మంత్రి బోసురాజు కర్ణాటకకు ఆహ్వానించారు.



చిటారు కొమ్మన మిఠాయి పొట్లం

నిర్మల్ జిల్లా మామడ మండలం అటవీ ప్రాంతంలోని కప్పన్‌పల్ల గ్రామ శివారులో ఉన్న ఒక చెట్టు నిండా ఉన్న తేనె తుట్టెలు ఆకర్షిస్తున్నాయి. 61వ నంబర్ జాతీయ రహదారికి కూతవేటు దూరంలోని ఈ చెట్టుపై 20కి పైగా తేనె తుట్టెలుండటం విశేషం. ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు.. వీటిని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిర్మల్







పంట కోతలకు 'యంత్రా'ంగం

కూలీల కొరతకు తోడు ఇతర కారణాలతో రైతులు నానాటికీ వ్యవసాయ యాంత్రీకరణకు మొగ్గు చూపుతున్నారు. చాలా ఏళ్లుగా వరి కోతలకు యంత్రాలను ఉపయోగిస్తుండగా.. కొన్నేళ్ల క్రితం నుంచి మొక్కజొన్న కోతకు సైతం యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ యంత్రం మొక్కజొన్న పంట కోస్తూ.. కంకులను తీసుకుని గింజలను బయటకు విడుదల చేస్తోంది. పని త్వరగా పూర్తవుతుండడంతో రైతులు వీటిపై మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యాన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి యజమానులు ఈ యంత్రాలను తీసుకొచ్చి ఇక్కడ పంట కోతల్లో నిమగ్నమయ్యారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

నా బంగారు కూన..


తల్లితో సాంబార్ డీర్ పిల్ల




తల్లి పాలు తాగుతున్న కృష్ణ జింక పిల్ల


తల్లి పాలు తాగుతున్న బార్కింగ్ డీర్

విశాఖలోని ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో గణనీయంగా జింక జాతి వృద్ధి చెందుతోంది. వివిధ జాతుల జింకలు ఇటీవల పిల్లలకు జన్మనిచ్చాయని జూ క్యూరేటర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. జూ సిబ్బంది పర్యవేక్షణలో పిల్లలన్నీ ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉన్నాయని వివరించారు. ప్రత్యేకించి మౌస్ డీర్, బార్కింగ్ డీర్, సాంబార్ డీర్, చుక్కల జింక, నీల్‌గై, కృష్ణ జింక పిల్లలకు జన్మనిచ్చినట్లు చెప్పారు. ఒక మౌస్ డీర్ పిల్ల, రెండు బార్కింగ్ డీర్ పిల్లలు తమ తల్లుల వెంట తిరుగుతూ సందడి చేస్తున్నాయి. అలాగే మూడు నీల్‌గై పిల్లలు(నీలి ఎద్దు), ఐదు సాంబార్ డీర్(కనుజు) పిల్లలు మాతృ ప్రేమ ఒడిలో హాయిగా గడుపుతున్నాయి. ఏడు చుక్కల జింక పిల్లలు (స్పాటెడ్ డీర్), తొమ్మిది కృష్ణ జింక పిల్లలు (బ్లాక్ బక్) సైతం తమ తల్లుల చెంత ఆటలాడుకుంటున్నాయి. ఇలా జింక పిల్లల సందడితో జూ ప్రాంగణం ఆహ్లాదకరంగా మారిందని క్యూరేటర్ సంతోషం వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ చిన్నారి జింకలను వాటి ఎన్‌క్లోజర్లలో సందర్శకుల కోసం విడిచిపెడతామని వెల్లడించారు.

– ఆరిలోవ


తల్లి వెంట మౌస్‌డీర్ పిల్ల

ఎస్సీ ఏకసభ్య కమిషన్ గడువు మరో నెల పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల్లోని ఉప కులాల వర్గీకరణకు నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ గడువును ప్రభుత్వం మరో నెల పొడిగించింది. వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేసిన ప్రభుత్వం కమిషన్ గడువును నెలరోజుల పాటు పొడిగిస్తూ అప్పట్లో నిర్ణయం తీసుకుంది. ఆ గడువూ ముగియడంతో మరోసారి పొడిగించింది. ఈ నెల 11 నుంచి మే 10 వరకు కాలపరిమితి విధిస్తూ సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం ఎం నాయక్ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు.

వైఎస్సార్ జిల్లాలో ప్రపంచ ఆహార పథకం

సాక్షి, అమరావతి: వైఎస్సార్ జిల్లాలో ప్రపంచ ఆహార పథకం కార్యక్రమం అమలు కానుంది. ఈ మేరకు ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ ప్రపంచ ఆహార పథకం (వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్–డబ్ల్యూఎఫ్‌పీ)తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది. లెటర్ ఆఫ్ అండర్ స్టాండింగ్ (ఎల్‌వోయూ)పై వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, డబ్ల్యూఎఫ్‌పీ జాతీయ డైరెక్టర్ ఎలిజబెత్ ఫెయిరీ మంగళవారం సంతకాలు చేశారు. ఈ పథకం మన రాష్ట్రంతోపాటు ఒడిశా, తమిళనాడులో ఐదేళ్లు అమలు కానుంది.

డాక్టర్ ప్రభావతి పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ఎంపీ, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ఫిర్యాదు మేరకు సీఐడీ నమోదు చేసిన కేసులో గుంటూరు జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ వాయిదా పడింది. డాక్టర్ ప్రభావతి పిటిషన్ మంగళవారం న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం ముందుకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వ్యక్తిగత కారణాలతో కోర్టుకు హాజరుకాకపోవడంతో ధర్మాసనం విచారణు ఈ నెల 24కి వాయిదా వేసింది.

అంబేడ్కర్ స్మృతి వనాన్ని ప్రైవేటుపరం చెయ్యొద్దు

సాక్షి, అమరావతి: మహోన్నత ఆశయంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విజయవాడలో నిర్మించిన అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ప్రాంగణాన్ని ప్రైవేటు పరం చేయొద్దని జాతీయ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖను మంగళవారం ఆయన మీడియాకు విడుదల చేశారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక మహాశిల్పం ఉన్న ప్రాంతాన్ని పీపీపీ పద్ధతిలో నిర్వహిస్తామన్న ప్రభుత్వం ప్రతిపాదన సరికాదన్నారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు.

పీపీపీ యోచన విరమించుకోవాలి..
అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ప్రాంగణాన్ని పీపీపీ విధానంలో ప్రైవేటు పరం చేసే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ విషయమై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామికి లేఖ రాశారు.

ఆక్వా రైతులకు రిలీఫ్ ప్యాకేజీ ప్రకటించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు


భీమవరం: అమెరికా విధానాల వల్ల దెబ్బతిన్న ఆక్వా రైతులకు పెట్టుబడి ఖర్చుల కోసం ప్రభుత్వం ప్రత్యేక రిలీఫ్ ప్యాకేజీని ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల నుంచి ఆక్వా రంగాన్ని కాపాడాలని కోరుతూ మంగళవారం సీపీఎం ఆధ్వర్యాన భీమవరంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అమెరికా సుంకాలతో ఆక్వా రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలిందని ఆందోళన వ్యక్తంచేశారు. చంద్రబాబు ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆక్వా రంగాన్ని పరిశ్రమగా గుర్తించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



ఈ చిత్రంలో దిగాలుగా కూర్చున్న వ్యక్తి చింతూరు మండలం ఏజీకొడేరుకు చెందిన 80 ఏళ్ల అగరం నారాయణ. ఇతను ఇప్పటివరకు బ్యాంకు పనిమీద మండలకేంద్రం వెళ్లి రావడమే తప్ప ఇతర ప్రాంతాలకు వెళ్లిందిలేదు. అలాంటిది పోలవరం ముంపులో భాగంగా గ్రామం విడిచి కొత్త ప్రాంతానికి వెళ్లాల్సి వస్తోందని, త్వరలోనే గ్రామంతో బంధం తెగిపోతోందని దిగులు చెందుతున్నాడు. శబరినది పక్కనే నివాసముంటున్న తాను వరదలు వస్తే గ్రామంలోనే ఏదోచోట సురక్షిత ప్రాంతానికి వెళ్లేవాడినని అలాంటిది పోలవరం ఊరును ముంచేస్తుంటే ఇక శాశ్వతంగాగ్రామాన్ని వదలాల్సివస్తోందని మదనపడుతున్నాడు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న 90 ఏళ్ల వృద్ధురాలు ఏజీకొడేరుకు చెందిన బల్లెం ముత్తమ్మ. దశాబ్దాలుగా కుటుంబంతో కలసి గ్రామంలోనే నివాస ముంటోంది. ఆ రోజుకు తినేందుకు కూరలు ఏమీలేకున్నా పక్కనున్న చేలల్లోకి వెళ్లి పచ్చకూర కోసితెచ్చి వండు కుని ఆ పూటకు కడుపు నింపుకొంటామని చెబుతోంది. పోలవరం ముంపులో తమ గ్రామంతో బంధాన్ని వీడి కొత్త ప్రాంతానికి వెళ్లవలసి రావడం ఆవేదన కలగచేస్తోందని ఆమె అంటోంది. అక్కడ సౌకర్యాలు ఎలా ఉంటాయో అర్థంకాని పరిస్థితి నెలకొందని, మాగ్రామం తప్ప ఎప్పుడూ కొత్త ప్రాంతాలకు వెళ్లలేదని, పునరావాసం పేరుతో ఇక్కడి నుంచి తరలిస్తుండడంతో ఈ అవసాన దశలో ఈ కష్టమేంటని ఆమె ఆవేదన వ్యక్తంచేస్తోంది.



ఇక్కడే పుట్టి.. పెరిగాం.. ఇప్పుడు వీడి పోవాలా ?

ఊళ్లే లేకుండా పోతున్నాయక్కో.. ఈ మట్టితో బంధం తెగిపోతున్నదక్కో.. ముల్లె సదురుకుని ఎల్లిపోవాలక్కో.. అంటూ పోలవరం నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో పలు గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఈ ప్రాంతాలను వీడి పునరావాస ప్రాంతాలకు వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో దశాబ్దాలుగా గ్రామాలతో పెనవేసుకున్న బంధం వీడనుండడంతో నిర్వాసితుల్లో ఆందోళన ప్రారంభమైంది. పుట్టిన ఊళ్లను, పెరిగిన ఇళ్లను, సాగు భూములను వదిలి వెళ్లలేక వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ప్రాంతాలను వదిలివెళ్లడం ద్వారా తమ సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగు కానున్నాయని ప్రధానంగా గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

– చింతూరు

- అమ్మ లాంటి ఊరుతో ప్రేమ బంధం తెగిపోతుందా ?
- పోలవరం నిర్వాసితుల్లో ఆందోళన
- గ్రామాలను వీడలేక మనోవేదన
- సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగు

ఊరంటే కేవలం మట్టి కాదు..ఆ వాసనతో పెనవేసుకున్న ఇగిరిపోని బంధం. ఊరంటే ఇళ్లే కావు.. వాటితో ఉండే అనుబంధాల కాపురాలు. ఊరంటే ఇవే కాదు.. గడప గడపలో కనిపించే ఎడతెగని ఆప్యాయతలు.. వీధి వీధితో విడదీయలేని నేస్తుల అభిమానాలు.. దారి దారిలో విరబూసిన సుగంధాల పరిమళాలు.. ప్రతి కుడ్యం అందమైన చిత్రం... చెట్టూచేమ, రాయీరప్పా.. బండిపెండి, పాదు, పసిరక, ఏరుగట్టు, పైరు గాలి.. ఇలా అన్నీ అపురూపాలే..

సంతలు కనుమరుగేనా?

గిరిజనులు నిత్యావసరాల కొనుగోలుకు సంతలపై ఆధారపడతారు. చింతూరులో ప్రతి బుధవారం పెద్ద సంత జరుగుతుంది. సంతలకు మారుమూల గ్రామాలకు చెందిన గిరిజనులు అధికసంఖ్యలో వచ్చి వారానికి సరిపడా నిత్యావసరాలు కొనుగోలు చేసుకుని వెళ్తుంటారు. తాము సేకరించిన అటవీ ఉత్పత్తులను సంతల్లో విక్రయించి ఆదాయాన్ని పొందుతుంటారు. సంతలు కేవలం వ్యాపార స్థలాలుగానే కాకుండా సంస్కృతి, సంప్రదాయాలకు, ఆచారవ్యవహారాలకు కేంద్రాలుగా, స్నేహబంధం కొనసాగించే ప్రాంతాలుగా గిరిజనుల జీవితాలతో ముడిపడి ఉన్నాయి. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టుతో ఆయా సంత ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి.

పోలవరం ముంపు గ్రామాల్లో పరిహారం, పునరావాస ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. ముందుగా ప్రాధాన్యతా క్రమంలో చేర్చిన ప్రతి ముంపు గ్రామంలో గ్రామసభలను నిర్వహిస్తున్నారు. ముంపునకు గురవుతున్న గ్రామానికి సంబంధించిన నిర్వాసితుల జాబితాలను గ్రామసభల్లో వెల్లడిస్తున్నారు. దీంతో పరిహారం సొమ్ములు అందినవెంటనే గ్రామాలను ఖాళీచేయాల్సి వస్తుందని నిర్వాసితుల్లో జోరుగా చర్చ సాగుతోంది. కాగా ప్రస్తుతం గ్రామసభలు నిర్వహిస్తున్న అధికారులు నిర్వాసితుల అభిప్రాయాల మేరకు పునరావాస ప్రాంతాల్లో ఇళ్లను నిర్మించడంతో అన్నిరకాల మౌలికసౌకర్యాలు కల్పించిన అనంతరం మాత్రమే వారిని ఇక్కడినుంచి తరలించాల్సి ఉంటుంది. రాళ్లు రప్పలతో నిండిన భూములను దశాబ్దాలుగా ఎంతో కష్టపడి ఇప్పుడిప్పుడే సాగుకు అనుకూలంగా మార్చుకున్నారు. ఆ భూములు ఇప్పుడు ముంపునకు గురవుతున్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పునరావాస ప్రాంతంలో భూములన్నీ రాళ్లు, రప్పలతో సాగుకు అనుకూలంగా లేవని వాటిని మళ్లీ అభివృద్ధి చేసి సాగులోకి తెచ్చేందుకు ఏళ్ల సమయం పడుతుందని వారు అంటున్నారు.


పోలవరం ముంపునకు గురవుతున్న చింతూరు గ్రామం

పండగలకు అధిక ప్రాధాన్యత

గిరిజనులు తమ సంస్కృతి, సంప్రదాయాల్లో భాగంగా పండగలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తారు. ప్రతి గ్రామంలో గ్రామదేవతలను ఏర్పాటు చేసుకుని పూజలు నిర్వహిస్తారు. తొలకరి ప్రారంభంతో పంటలు బాగా పండాలని భూమిపండగ, బీరకాయ, ఆనపకాయ తినేందుకు పచ్చపండగ, వరివిత్తనాలు నాటే సమయంలో కొత్తల్ పండగ, చిక్కుడు కాయలు తినేందుకు చిక్కుడు పండగల ను వారు నిర్వహిస్తారు. దీంతో పాటు పెళ్లిళ్ల సమయంలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేయడంతో పాటు ప్రతి మూడేళ్లకు కొలుపులు నిర్వహిస్తారు. భూమిపండగ ఈ ప్రాంత గిరిజను లకు ఎంతో ప్రత్యేకమైనది. పండగలో భాగంగా పురుషులు సమీపంలోని అడవికి వెళ్లి సంప్రదాయ జంతువుల వేట కొనసాగిస్తుంటారు. మహిళలు తమ గ్రామాలకు సమీపంలోని ప్రధాన రహదారులపై సంప్రదాయ గిరిజన నృత్యాలు చేస్తూ వాహనదారుల నుంచి పండగ ఖర్చుల కోసం విరాళాలు సేకరిస్తారు.ప్రస్తుతం పోలవరం ముంపులో భాగంగా తమను మైదాన ప్రాంతాలకు తరలిస్తుండడంతో భూమి పండగ నిర్వహించే అవకాశాలు ఉండవేమోనని వారు ఆందోళన చెందుతున్నారు.


విప్పచెట్టుకు పూజ చేస్తున్న గిరిజనుడు

ముంపుబారిన ఆదాయాన్నిచ్చే చెట్లు

గిరిజనులకు పలురకాల చెట్లు ఆదాయాన్ని అందిస్తుంటాయి. విప్ప, తాటి, చింత, మామిడిచెట్లు వీటిలో ప్రధానమైనవి. విప్పచెట్టు నుంచి విప్పపువ్వు, విప్పబద్ద, విప్పనూనె, చింతచెట్టు నుంచి చింతపండు, చింతపిక్కలు సేకరించి విక్రయించడం ద్వారా ఒక్కో కుటుంబం ఏడాదికి రూ.10 వేల వరకు ఆదాయం పొందుతుంది. మామిడిచెట్టు ద్వారా ఏడాదికి రూ.20 వేలు, తాటి చెట్టు ద్వారా ఏడాదికి రూ.లక్ష వరకు, కూరగాయల సాగుద్వారా ఏడాదికి రూ.లక్ష వరకు ఆదాయం పొందుతుండగా ప్రాజెక్టు పూర్తయితే ఇవన్నీ ముంపుబారిన పడి గిరిజనులు ఆదాయం కోల్పోనున్నారు.

గ్రామ దేవతలను కోల్పోతున్నాం



పోలవరం ముంపుతో మా గ్రామదేవతలను కోల్పోతున్నాం. దేవతలను పూజిస్తే గ్రామానికి మంచి జరుగుతుందనే విశ్వాసంతో ప్రతిఏటా ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. పునరావాస కేంద్రాల్లో గ్రామదేవతలను ప్రతిష్ఠించేందుకు చాలా సమయం పడుతుంది.

– నవలం సుబ్బయ్య, గ్రామపటేల్, చూటూరు, చింతూరు మండలం

ఊరు వీడాలంటే భయంగా ఉంది



దశాబ్దాలుగా భూమిని సాగు చేసుకుని, కూలీనాలీ చేసుకుని వచ్చిన సొమ్ములతో జీవనం సాగిస్తున్నాం. ముంపులో భాగంగా గ్రామాలను వీడాలంటే ఎంతో భయంగా ఉంది. పునరావాస ప్రాంతంలో పరిస్థితులు ఎలా ఉంటాయోనని ఆందోళన చెందుతున్నాం.


– నవలం లచ్చమ్మ, చూటూరు, చింతూరు మండలం

భవిష్యత్తు తలుచుకుంటే ఆందోళనగా ఉంది



ఉన్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేసుకుంటూ, పిల్లల్ని చదివిస్తూ జీవనం సాగిస్తున్నాం. కొత్త ప్రాంతంలో మా భవిష్యత్తును తలుచుకుంటే ఆందోళనగా ఉంది. మరోసారి కొత్త జీవితం ప్రారంభించాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

– నవలం దారయ్య, మాజీ సర్పంచ్, చూటూరు, చింతూరు మండలం



శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూలైన్ టీబీసీ వద్దకు చేరింది. సోమవారం అర్ధరాత్రి వరకు 73,078 మంది స్వామి వారిని దర్శించుకోగా 25,831 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.58 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది.

భక్తులతో కిటకిటలాడిన మద్ది క్షేత్రం



జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు స్వామివారికి తెల్లవారుజామున ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల హనుమద్ నామ స్మరణతో ఆలయం మార్మోగింది.

గరుడ వాహనంపై ఆదికేశవస్వామి



నరసాపురం: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ ఆదికేశవ ఎంబేరు మానార్ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గరుడ వాహనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో కీలకమైన ఘట్టం కావడంతో గరుడ వాహనంపై పుర వీధుల్లో ఊరేగిన శ్రీదేవి, భూదేవి సమేత ఆదికేశవస్వామిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.



ఔషధ గుణం.. ఆరోగ్య ప్రదం

ఆలమూరు: వేసవి తాపాన్ని అధిగమించేందుకు, శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారించి ఆరోగ్య ప్రయోజనాలను చేకూర్చేందుకు ప్రకృతి ప్రసాదించిన తాటిముంజలు ఐస్ యాపిల్‌గా విశేష ప్రాచుర్యం పొందాయి. ఈ తాటిముంజల సీజన్ ఇప్పుడే ప్రారంభం కావడంతో, వీటికి విపరీతమైన డిమాండు ఏర్పడింది. ఈ తాటిముంజలు శరీరంలోని చక్కెర, ఖనిజాల ప్రమాణాలను సమతుల్యం చేసే లక్షణం కలిగి ఉన్నందున వీటికి విపరీతమైన డిమాండు ఉంటుంది.

కాలక్రమంలో..: గ్రామీణ ప్రాంతాల్లో తాటి చెట్లు అధికంగా ఉండేవి. తాటి ముంజల లభ్యత ఎక్కువగా ఉన్నా.. చెట్లు ఎక్కి ముంజకాయలు దింపే కార్మికుల కొరత ఏర్పడడంతో వీటి లభ్యత నానాటికీ తగ్గిపోతోంది.

ఆరోగ్య ప్రదాయినిగా.. : ప్రకృతిలో విరివిగా లభ్యమయ్యే ఈ తాటిముంజలు కల్తీ లేని, స్వచ్ఛమైనవి కావడంతో ఆరోగ్య ప్రదాయినిగా భావిస్తుంటారు. జిల్లాలో తాటి ముంజలు సేకరించే వారు కరవయ్యారు. దీంతో మైదాన ప్రాంతాల్లో ఉన్న డిమాండును దృష్టిలో ఉంచుకుని కొందరు మెట్ట, చాగల్నాడు ప్రాంతాలకు చెందిన రైతు కూలీలు తాటిముంజలను పట్టణ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో తాటిముంజల సీజన్ ప్రారంభమైంది. తాటిముంజుల పరిమాణాన్ని బట్టి డజను రూ.80 నుంచి రూ.120 వరకూ విక్రయిస్తున్నారు. ధర ఎక్కువగా ఉన్నా తాటిముంజల ప్రియులు దీనిని లెక్కచేయడం లేదు. లేలేతగా ఉండే తాటిముంజలు అద్భుత రుచితో నోరూరిస్తున్నాయి.



ప్రయోజనాలివే..

- తాటిముంజల్లో విటమిన్లు, ఫాస్పరస్, థయామిన్, బీ–కాంప్లెక్స్, కాల్షియం, పొటాషియంతో పాటు, సోలెబుల్ ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి.
- వీటిలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల డీహైడ్రేషన్ నుంచి ఉపశమనం కలిగిస్తుంది. వేసవితాపం, వడదెబ్బ నుంచి రక్షణ కలిగిస్తుంది. వికారం, వాంతులను నివారిస్తుంది.
- తాటిముంజలను తినడం వల్ల శరీరంలో పేరుకున్న హానికర వ్యర్థ పదార్థాలను బయటకు పంపడంతో పాటు, రక్తపోటును అదుపులో ఉంచుతుంది.
- వేసవిలో ఏటా సీజన్‌లో క్రమం తప్పకుండా తాటిముంజలను తినడం ద్వారా చెడు కొలస్ట్రాల్‌ను తగ్గించుకుని, మంచి కొలస్ట్రాల్‌ను వృద్ధి చేసుకోవచ్చు. లివర్‌ను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.
- వీటిలో తక్కువ మొత్తంలో క్యాలరీలు, ఎక్కువ మొత్తంలో పోషకాలుండటం వల్ల అలసట, నిర్జలీకరణం నుంచి ఉపశమనం కలిగించి, శరీర బరువు పెరగకుండా చేస్తుంది.
- వీటిలో ఉండే పోషకాలు జీర్ణ సంబంధ సమస్యలను తగ్గించి, జీర్ణ ప్రక్రియను మెరుగుపరుస్తాయి.
- ఆహారం సక్రమంగా జీర్ణమై గ్యాస్, ఎసిడిటీ, ఉదర సంబంధ సమస్యల నివారణకు దోహదపడుతుంది.
- మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలను బాగా తగ్గిస్తుంది. వేసవిలో వచ్చే చికెన్ ఫాక్స్‌ని నివారించి, శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.
- తాటిముంజల్ని గుజ్జుగా చేసి ముఖానికి పూతలా వేస్తే చర్మం ప్రకాశవంతంగా మారుతుంది.

● బడుగు రైతును 'గట్టెక్కించే' అద్భుత మెట్ట పంట

● చల్లని ప్రాంతాల్లోనే కాదు.. వేడి వాతావరణం, కరువు ప్రాంతాలూ పనస సాగుకు అనుకూలమే

● కరువొచ్చి పంటలు ఆదుకోకపోయినా... బడుగు రైతు బతుకు బండిని సునాయాసంగా గట్టెక్కిస్తున్న పనస పండ్లు

● తమిళనాడులో వేల హెక్టార్లలో ప్రత్యేకంగా పనస తోటల సాగు





పనస! అద్భుతాహార పంట

మన దేశానికి ప్రకృతి ఇచ్చిన అద్భుతమైన ఆహార పంట పనస. పోషకాల పుట్ట పనస. వేసవిలో పనస తొనలు చక్కని చిరుతిండి. మాంసం తినవద్దనుకునే వారికి అద్భుతమైన ప్రత్యామ్నాయం పనస పలావు. పనస తొనల ఒరుగులు, పొడి, గింజల పొడి.. ఇలా అనేక ఉత్పత్తులను అందిస్తోంది పనస. ముఖ్యంగా అంతర్జాతీయ షుగర్ కేంద్రంగా నిలిచిన మన దేశానికి ఒక వరం. పనస పొడిని కొంచెం కలుపుకొని గోధుమ రొట్టెలు చేసుకొని తింటే షుగర్ నియంత్రణలోకి వస్తుందని ఇప్పటికే రుజువైంది. పనస చెట్టు కరువును తట్టుకుంటుంది. ఎటువంటి నేలల్లోనైనా పెరుగుతుంది. ఒక్క చెట్టు పెరట్లో నాటుకుంటే చాలు బోలెడన్ని కాయలు కొన్ని దశాబ్దాల పాటు ఇస్తూనే ఉంటుంది. పొలాల్లో గట్ల మీద పనస మొక్కలు నాటుకుంటే చాలు, వర్షాధార వ్యవసాయదారులకు ఆర్థికంగా, పోషకాహార రీత్యా ఎంతో అండగా ఉంటుంది... ఇలా చెప్పుకుంటూ వెళ్తే పనస చెట్టు మనకు అందించే ప్రయోజనాలు, ఎన్నో ఉపాధి అవకాశాలు అన్నీ ఇన్నీ కాదు! కొన్ని స్టార్టప్‌లు పనస ఆధారిత ఉత్పత్తులతో సత్తా చాటుతుండటం ఇందుకో ఉదాహరణ!! అయితే, తెలుగు ప్రజలు పనస మేలును విస్మయకరంగా విస్మరిస్తున్నారంటే అతిశయోక్తి కాదు!!!

పనసతో 40 రకాల వంటకాలు

లేత పనస కాయలతో చేసే కూరలు మహారాష్ట్రలోని హోటళ్లలో మంచి గిరాకీ ఉంది. దీన్ని మాంసాహారానికి ప్రత్యామ్నాయంగా తింటున్నారు. కేరళ ప్రజల మెనూలో పనస ఉత్పత్తులు అనేకం ఉంటాయి. పచ్చళ్లు, జామ్‌లు, స్క్వాష్‌లు, జెల్లీలు, హల్వా సహా పలు రకాల ఉత్పత్తులను తయారు చేసి వాడుతున్నారు. కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు పనస ఉత్పత్తుల తయారీ, విక్రయంపై ఇటీవల దృష్టిని కేంద్రీకరిస్తున్నాయి. బెంగళూరు సమీపంలోని టూబుగెరె ప్రాంతంలో పెరటి తోటల్లో పనస చెట్లు పెంచుతున్న వాళ్లంతా సహకార సంఘంగా ఏర్పడి తమ ఉత్పత్తులను అమ్ముతూ చెట్టుకు ఏడాదికి రూ. 3 వేల వరకు ఆదాయం పొందుతున్నారు.

కేరళలోని పాతనంతిట్ట జిల్లా తిరువళ్ల సమీపంలోని తెల్లియార్‌లో గల కృషి విజ్ఞాన్ కేంద్రం పనసతో 40 రకాల ఉత్పత్తులను తయారు చేసే సాంకేతిక విజ్ఞానాన్ని రూపొందించింది. 6 నెలల నుంచి 12 నెలల వరకు నిల్వ చేసుకొని అమ్మేందుకు వీలుందని శాస్త్రవేత్తలు తెలిపారు. పనస సాగు, ఉత్తత్తుల తయారీపై ఈ కేవీకే శిక్షణ కూడా ఇస్తోంది. తిరువనంతపురానికి చెందిన 'గాంధీ సెంటర్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్' కూడా పనస ఉత్పత్తుల తయారీపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. వరి, గోధుమలకు బదులుగా పనస ఉత్పత్తులను ప్రధానాహారంగా తీసుకోవడానికీ వీలుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పెరట్లోనో, పొలం గట్ల మీదనో కొన్ని పనస చెట్లను పెంచుకోవడం అలవాటు చేసుకుంటే.. సాగుదారులు స్థానిక మార్కెట్లలోనే అమ్ముకొని చక్కని ఆదాయం పొందవచ్చు. పనస వంటి చెట్లను 'ఆగ్రో ఫారెస్ట్రీ'లో భాగంగా ప్రభుత్వం ప్రోత్సహించాలి. ప్రాసెసింగ్, మార్కెటింగ్ మౌలిక సదుపాయాల కల్పించి, పనస తోటల సాగునూ ప్రోత్సహించవచ్చు.

పనస అంట్లు 4-6 ఏళ్లలో కాపుకొస్తాయి...

పనస ఏ నేలల్లోనైనా పెరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లోకన్నా తెలంగాణలో కొంచెం ఫలసాయం తక్కువగా ఉంటుంది. మేం పదేళ్ల క్రితం కొన్ని పనస జాతులు నాటాం. ఐదేళ్లుగా అధ్యయనం చేస్తున్నాం. మామిడి వచ్చే సీజన్‌లోనే పనస పంట వస్తుంది. ఇప్పుడు సపోటాకూ ఇదే ఇబ్బంది. పొలం గట్ల మీద, ఖాళీ స్థలాల్లో నాటుకోవడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందడానికి అనువైన పంట. ఇతర పండ్ల తోటల్లో కొన్ని మొక్కలు నాటుకోవచ్చు. అయితే, వాణిజ్యపరంగా తోటలుగా సాగు చేయాలంటే.. ప్రాసెసింగ్, మార్కెటింగ్ సదుపాయాలు జాగ్రత్తగా చూసుకోవాలి.

పెట్టుబడి స్వల్పం, రిస్క్ తక్కువ...



పనస మొక్కలకు ఎరువులు, తెగుళ్లు, పురుగుల ఖర్చుండదు. కాబట్టి పెట్టుబడి అవసరం లేదు. మొక్కల్ని రెండేళ్లు జాగ్రత్తగా కాపాడితే చాలు. తర్వాత అవే పెరుగుతాయి. మహారాష్ట్రలోని యవత్‌మాల్ వంటి జిల్లాల్లో రైతు కుటుంబాలను పనస చెట్లు ఆదుకుంటున్నాయి. అక్కడి వాతావరణం, ఉష్ణోగ్రత తెలంగాణలో మాదిరిగానే ఉంటాయి. వర్షపాతం ఇంకా తక్కువ. వార్షిక పంటలు విఫలమైనప్పుడు, కరువు కాలంలోనూ పనస చెట్లు రైతులను పోషకాహారపరంగా, ఆర్థికపరంగా కూడా ఆదుకుంటున్నాయి. అక్కడి హోటళ్లలో లేత పనస కాయలతో చేసే కూర మాంసం కూరను మరిపిస్తుంది. ఒరుగులు, చిప్స్, దోసెలు వంటి ఉత్పత్తులు కూడా చేస్తున్నారు. పోషకాలతోపాటు పీచు అధికంగా ఉన్న పనస ఆరోగ్యానికి చాలా మంచిది. ప్రతి రైతూ పొలం గట్ల మీద 5-10 పనస మొక్కలు నాటుకుంటే మేలు. ఈ లక్ష్యంతోనే రైతు రామ్‌బా వద్ద నుంచి వెయ్యి మొక్కలు తీసుకొని రైతులకు పంచాం.

- డా. బి. రాజశేఖర్ (83329 45368),
చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, సుస్థిర వ్యవసాయ కేంద్రం, సికింద్రాబాద్



పనస పండ్ల (జాక్ ఫ్రూట్) సాగు అనగానే పుష్కలంగా వర్షం కురిసే కేరళ, తమిళనాడులోని ప్రాంతాలే గుర్తుకొస్తాయి. కేరళలో పదో పరకో పనస చెట్లు లేని పెరటి తోటలే కనపడవు. సంప్రదాయకంగా పనస సాగు, వినియోగంలోనూ కేరళ ముందంజలో ఉంది. ఇక తమిళనాడులోని కడలూరు జిల్లా పన్రుతి ప్రాంత రైతులైతే వేలాది ఎకరాల్లో ప్రత్యేకంగా పనస తోటలనే సాగు చేస్తున్నారు. హెక్టారుకు ఏడాదికి రూ. లక్షన్నర వరకు ఆదాయం పొందుతున్నారు. ఎరువులు, తెగుళ్లు, పురుగుల బెడద లేని పంట కాబట్టి నికరాదాయం ఉంటున్నది. అయితే, కేరళ, తమిళనాడు తీర ప్రాంతాల్లో కన్నా తక్కువ వర్షపాతం, వేడి వాతావరణం పనస సాగుకు సరిపడదేమో అన్న భయంతోనే కావచ్చు.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో పెరట్లో ఒకటీ అరా వేసుకోవడమే తప్ప పనస చెట్లను రైతుకు ఆదాయ భద్రతనిచ్చే పెద్ద భరోసాగా చూడలేదు. ఈ నేపథ్యంలో వేడి వాతావరణం, అత్యంత బెట్ట పరిస్థితుల్లోను ఈ చెట్లు కొండంత అండగా నిలిచి కాసులు కురిపిస్తాయని మహారాష్ట్రలోని విదర్భ ప్రాంత రైతుల అనుభవాలు చాటి చెబుతున్నాయి.

గట్లపై అండ

రైతు ఆత్మహత్యలతో తరుచూ వార్తల్లో నిలిచే విదర్భ ప్రాంతంలోని యవత్‌మాల్, చంద్రాపూర్, గడ్చిరోలి జిల్లాల్లో గత పదేళ్లుగా పొలం గట్లపై పనస చెట్ల సాగు విస్తరిస్తోంది. నాగపూర్ తదితర విదర్భ పట్టణాల్లో లేత పనస కాయలకు, పండ్లకు మంచి డిమాండ్ ఉండటంతో రైతులకు చక్కని ఆదాయం వస్తోంది. యవత్‌మాల్ జిల్లా కామత్‌వాడా చుట్టుపక్కల గల నల్లరేగడి పొలాల గట్లపై పనస చెట్లను విరివిగా సాగు చేస్తున్నారు. అక్కడి వాతావరణం, ఉష్ణోగ్రత తెలంగాణను పోలి ఉంటుంది. వర్షపాతం ఇంకా తక్కువ. గాలిలో తేమ శాతమూ తక్కువే. అక్కడి రైతులు పత్తి, సోయాబీన్, గోధుమ, కంది వంటి ఇతర పంటలను సాగు చేసి నష్టపోయిన సందర్భాల్లోనూ పనస చెట్లు నిస్సందేహంగా ఏటా చక్కని ఫలసాయాన్నిస్తున్నాయి.

పంట సాగు గురించి వివరాలడిగితే చాలు.. పనస చెట్లున్న రైతుల కళ్లల్లో ఆత్మవిశ్వాసంతో కూడిన మెరుపు తళుక్కుమంటుంది. విదర్భ ప్రాంత రైతులు నల్లరేగడి నేలల్లో విజయవంతంగా సాగు చేస్తున్నారు. తేలికపాటి ఎర్ర నేలలు, కంకర నేలలు కూడా పనస సాగుకు అనుకూలమైనవే. అయితే, మొక్కల పెరుగుదల లోతైన నల్లరేగడి నేలల్లో అంత వేగంగా, బలంగా ఉండదు. ఇతర పంటలు సాగుకు అంతగా అనుకూలించని సున్నపు రాయి, ఇసుక అధిక పాళ్లలో ఉన్న ఖాళీ నేలల్లోనూ పనస చెట్లను సాగు చేస్తున్న వాళ్లున్నారు. '13 ఏళ్ల క్రితం మా పొలం గట్లపైన 15 పనస మొక్కలు నాటాను. ఏడేళ్ల నుంచి కాపు మొదలైంది. రాబోయే ఏడాదికి ఒక్కో చెట్టును రూ. 11 వేలకు వ్యాపారులకు గుత్తకు ఇచ్చాను. పనస మొక్కల నర్సరీ పెట్టి మొక్క రూ. 20 చొప్పున అమ్ముతున్నాను. 500 మంది వరకు రైతులు నా దగ్గర మొక్కలు కొని నాటుకున్నారు. ఇప్పుడు మంచి ఆదాయం పొందుతున్నారు..'అన్నారు ఓ విదర్భ ప్రాంత రైతు.


తొలి రెండేళ్లు నీరివ్వాలి

తొలి రెండేళ్లలో తగు మాత్రంగా నీరందిస్తే చాలు. ఎరువులు, పురుగుమందులు, తెగుళ్ల మందుల అవసరం ఉండదని నిపుణులు చెబుతున్నారు. పనస మొక్క నాటిన ఏడేళ్ల నుంచి పంట చేతికొస్తుందని, వందేళ్ల వరకు చెట్లు పండ్లనిస్తూ ఉంటాయని రైతులు చెబుతున్నారు. అంట్లు నాటుకుంటే 4-6 ఏళ్లలోనే కాపుకొస్తాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. లేత కాయలు కొన్నిటిని తీసేస్తే (దీన్నే 'థిన్నింగ్' అంటున్నారు), తద్వారా మిగతా కాయలు బలంగా పెరగడానికి వీలవుతుందని తమిళనాడు రైతులు చెబుతున్నారు. నీరు నిలబడే నేలలు పనసకు సరిపడవు. మెట్ట ప్రాంతంలో పెరిగిన పనస తొనల రుచి ఎక్కువ. పనస విత్తనాల మొలక శాతం తక్కువ.

పోషకాల గని

పనస పండులో విటమిన్ ఏ, సీలు అధికంగా ఉన్నాయి. వీటితో పాటు పొటాషియం, కాల్షియం, భాస్వరం,, ఇనుము, 12 శాతం పిండి పదార్థాలు, 6-7 శాతం మాంసకృత్తులు, 2-3 శాతం పీచుపదార్థాలు ఉన్నాయి. చెక్కెర శాతం తక్కువగా ఉండి సులభంగా జీర్ణమవుతుంది. హఠాత్తుగా చెక్కెర నిల్వలు పడిపోయే ప్రమాదాన్ని ఇది నివారిస్తుందని..ఓ అధ్యయనంలో తేలింది. 'యాంటీ ఆక్సిడెంట్స్ ఫ్లేవనాయిడ్స్ ఉండటంతో కాన్సర్ నిరోధకంగాను పనిచేస్తుంది. వృద్ధాప్యాన్ని త్వరగా దరి చేరనివ్వదు' అని బెంగళూరు వ్యవసాయ విశ్వ విద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. శ్యామలా రెడ్డి చెప్పారు.







రూ. 10,980కే గానుగ నూనె యంత్రం

ఆరోగ్య రక్షణలో గానుగ నూనెల ప్రాధాన్యాన్ని ఇప్పుడు చాలా మంది తెలుసుకుంటున్నారు. ధర ఎక్కువైనప్పటికీ ఆరోగ్యాభిలాషులు గానుగ నూనెల కొనుగోలుకు వెనుకాడటం లేదు. మన దేశంలో గానుగ నూనెల వ్యాపారం వేగంగా విస్తరిస్తోంది. దీని వార్షిక వ్యాపారం (సిఎజీఆర్) 2024-2032 మధ్యకాలంలో సుమారు 6% పెరుగుతుందని ఒక అధ్యయనం చెబుతోంది. ప్రజల్లో ముఖ్యంగా నగర, పట్టణవాసుల్లో గానుగ నూనెల పట్ల మక్కువ పెరగటంతో పాటు ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తుండటంతో గానుగ నూనెల వ్యాపారానికి భవిష్యత్తులో విస్తరించే అవకాశాలు మెండుగా ఉన్నాయని వ్యాపారవర్గాలు భావిస్తున్నాయి.

ఎద్దును కట్టి గానుగ తిప్పి నూనె వెలికి తీసే సంస్థలతో పాటు విద్యుత్తుతో కట్టె గానుగలు నడుపుతూ కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్‌ను ఉత్పత్తి చేసే యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు ఎవరి ఇంట్లో వాళ్లు పెట్టుకొని నడుపుకోగలిగిన చిన్నవి, ఇంకో చోటికి సులభంగా తీసుకెళ్ల గలిగిన చిన్నపాటి గానుగ యంత్రాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. అయితే, వాటి ధర, నాణ్యతలో ప్రామాణికత లోపిస్తోంది. ఈ నేపథ్యంలో కాన్పూర్ ఐఐటి ఒక కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్ పోర్టబుల్ యంత్రాన్ని తక్కువ ధరలో రూపొందించింది. ఐఐటి కాన్పూర్‌లోని రూరల్ టెక్నాలజీ యాక్షన్ గ్రూప్ (రుటాగ్)లో ఇంక్యుబేషన్ సేవలు అందుకున్న డి-ఐవి ఎంటర్‌ప్రైజెస్ అనే స్టార్టప్ ఈ యంత్రాలను ఉత్పత్తి చేసి మార్కెట్‌లోకి తెచ్చింది.

ఈ యంత్రంలో మూడు భాగాలు ఉంటాయి. ఛాంబర్, ప్లంగర్ రాడ్, స్టెయిన్‌లెస్ సిలెండర్. అడుగున ఒక గిన్నెలో ఛాంబర్‌ను ఉంచి, అందులో నూనె గింజలు పోసి, పైన ఉన్న హేండిల్‌ను పట్టుకొని గుండ్రంగా తిప్పుతూ ఉంటే ప్లంగర్ రాడ్ కిందికి దిగుతూ గింజల్ని వత్తుతుంది. స్టెయిన్‌లెస్ స్టీల్ సిలెండర్‌కు ఉన్న రంధ్రాలలో నుంచి నూనె బయటకు వస్తుంది. తక్కువ విద్యుత్ ఖర్చుతో అధిక నాణ్యత గల నూనెను ఈ విధంగా వెలికితీయవచ్చని ఐఐటి చెబుతోంది. దీన్ని నడపడానికి విద్యుత్తు అవసరం లేదు. ఒక వ్యక్తి పెద్ద శ్రమ లేకుండానే దీనితో నూనెను వెలికితీయవచ్చు. వేరుశనగ, కొబ్బరి, నువ్వులు, సోయా తదితర నూనె గింజల నుంచి దీనితో నూనె తీయవచ్చు. సంవత్సరం క్రితం మార్కెట్‌లోకి వచ్చిన ఈ యంత్రం ఆఫ్రికా దేశాలకు కూడా వెళ్లింది. ఎక్కడికైనా సులువుగా తీసుకెళ్లగలిగే ఈ యంత్రం ధర రూ. 10,980 మాత్రమే. ఇతర యంత్రాలతో పోల్చితే దీని ఖరీదు చాలా తక్కువని ఐఐటి కాన్పూర్ రుటాగ్ అధిపతి డాక్టర్ అమన్‌దీప్ సింగ్ చెప్పారు.

యంత్రం తయారీదారు మెయిల్ ఐడి:
divakmse@gmail.com

ఈ యంత్రం వీడియో లింక్:
https://www.youtube.com/watch?v=0ZMNaZMMC5o

ఎర్ర పనస ఎంతో మేలు!

బెంగళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐఐహెచ్‌ఆర్)లో 75 పనస రకాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. సిద్దు రకంలో ఎర్రటి తొనలు (కాపరీ రెడ్ ఫ్లేక్స్) ఉంటాయి. పసుపు రంగు తొనల్లో కన్నా ఇందులో పోషకాలు మెండుగా ఉన్నాయని ఐఐహెచ్‌ఆర్ ప్రకటించింది. దీని తీపి 31 బ్రిక్స్, విటమిన్‌సి 6.48 ఎం.జి./100 గ్రా., టోటల్ ఫెనాల్స్ 31.76 ఎం.జి., టోటల్ ఫ్లావనాయిడ్స్ 3.74 ఎం.జి., టోటల్ కెరొటెనాయిడ్స్ 4.43 ఎం.జి., లైకోపెన్ 1.12 ఎం.జి. ఉన్నట్లు ఐఐహెచ్‌ఆర్ ప్రకటించింది. ఈ వంగడాన్ని కర్ణాటక రైతులకు ఇచ్చి భాగస్వామ్య పద్ధతిలో ఐఐహెచ్‌ఆర్ సాగు చేయిస్తోంది.





బిజినెస్ రీల్

లాయిడ్ లగ్జూరియా ఏసీల కలెక్షన్



న్యూఢిల్లీ: లాయిడ్ లగ్జూరియా కలెక్షన్ కింద హావెల్స్ ఇండియా కొత్త ఎయిర్ కండీషనర్ల శ్రేణిని ఆవిష్కరించింది. ఇందులో భాగంగా వినూత్నమైన స్టన్ఎయిర్ ఉత్పత్తిని ప్రవేశపెట్టడంతో పాటు స్టెల్లార్, స్టైలస్ మోడల్స్ శ్రేణిని విస్తరించింది. వీటి ఉత్పత్తి సామర్థ్యాలను వార్షికంగా 30 లక్షల ఏసీల స్థాయికి పెంచుకున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యోగేశ్ కుమార్ గుప్తా తెలిపారు. స్టన్ఎయిర్‌లో ఏఐ ఆధారిత కూలింగ్ వ్యవస్థ, 60 డిగ్రీల ఉష్ణోగ్రతల్లోనూ అత్యంత చల్లబర్చే సామర్థ్యం ఉంటుందని వివరించారు. వీటితో పాటు లాయిడ్ రిఫ్రిజిరేటర్ (కలర్), మినీ ఎల్ఈడీ టీవీ, నొవాంటే వాషింగ్ మెషిన్ మొదలైనవి కూడా కంపెనీ ఆవిష్కరించింది.

ఘనంగా 'గోల్డ్' పుస్తకావిష్కరణ



త్రిసూర్: జోస్ అలుక్కాస్ గ్రూప్ చైర్మన్ 'జోస్ అలుక్కాస్' జీవిత చరిత్రపై రూపొందించిన 'గోల్డ్' పుస్తకావిష్కరణ కార్యక్రమం త్రిసూర్‌లోని లూలూ హయాత్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. కేంద్ర మంత్రి మంత్రి సురేష్ గోపి దీన్ని ఆవిష్కరించారు. తొలి కాపీని కేరళ రెవెన్యూ మంత్రి కే. రాజన్‌కు అందజేశారు. ''భారతదేశ బంగారం రాజధాని త్రిసూర్ నుంచి నా వ్యాపార ప్రయాణం ప్రారంభమైంది. 81 ఏళ్ల జీవితం వ్యక్తిగతమైనది మాత్రమే కాదు, భారతీయ ఆభరణాల వ్యాపార చరిత్ర. ఈ పుస్తకం నేనేమిటో తెలియజేసిన కథ. ఇది త్రిసూర్ కథ కూడా..'' అని జోస్ అలుక్కాస్ అన్నారు. పుస్తకానికి ముందుమాట మలయాళ నవలా రచయిత టీ.డీ.రామకృష్ణన్ రాశారు. పుస్తకావిష్కరణ కార్యక్రమంలో జోస్ అలుక్కాస్ ప్రచారకర్త, ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ ఆర్.మాధవన్, కేరళ విద్యా శాఖ మంత్రి ఆర్. బిందు ఇతర రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

గోల్డ్ లోన్స్‌లోకి పూనావాలా ఫిన్‌కార్ప్



న్యూఢిల్లీ: ఎన్‌బీఎఫ్‌సీ.. పూనావాలా ఫిన్‌కార్ప్ తాజాగా పసిడిపై రుణాల(గోల్డ్ లోన్స్) బిజినెస్‌లోకి ప్రవేశించింది. తద్వారా సైరస్ పూనావాలా గ్రూప్ కంపెనీ హామీగల(సెక్యూర్డ్) రుణ ప్రొడక్టులలోకి బిజినెస్‌ను విస్తరించింది. తాజా బిజినెస్‌లో భాగంగా వ్యక్తులు, బిజినెస్‌లకు భద్రత, వేగం, పారదర్శకతతో కూడిన ఫైనాన్సింగ్ సొల్యూషన్లు అందించనున్నట్లు ఈ సందర్భంగా కంపెనీ పేర్కొంది. వ్యాపార విస్తరణ, వ్యవసాయ ఖర్చులు, వ్యక్తిగత వ్యయాలు తదితర విభిన్న అవసరాలకు రుణాలు సమకూర్చనున్నట్లు తెలియజేసింది. కనీస డాక్యుమెంటేషన్‌తో 30 నిముషాల్లోగా రుణాలు జారీ చేయనున్నట్లు వివరించింది. రుణాలు తిరిగి చెల్లించేందుకు పలు అవకాశాలు కల్పించనున్నట్లు తెలియజేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-4-2025

విశాఖ	425-00
చిత్తూరు	460-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	410-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	405-00
వరంగల్	407-00
రిటైల్ ధర	4.65

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,617
ఎన్ఎస్ఈ	1,01,771
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,62,555
ఎఫ్ఐఐ	+ 6,068
డీఐఐ	- 1,952

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	61.29	$	61.53
బ్రెంట్	64.61	$	64.88

రిటైల్ మాల్స్‌కు డిమాండ్ భళా...

- రెండేళ్లలో కొత్తగా 19 ప్రీమియం మాల్స్
- టాప్–8 నగరాల్లో అందుబాటులోకి
- కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక



న్యూఢిల్లీ: ప్రీమియం షాపింగ్ మాల్స్‌కు నగరాల్లో డిమాండ్ విస్తృతం అవుతోంది. దీనికి అనుగుణంగా వచ్చే రెండేళ్లలో (2026 చివరికి) హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రముఖ నగరాల్లో 19 ప్రీమియం షాపింగ్ మాల్స్ అందుబాటులోకి రానున్నాయి. ఈ వివరాలను రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ సంస్థ తాజాగా ఒక నివేదిక రూపంలో విడుదల చేసింది. 2025, 2026లో నిర్వహణలోకి రానున్న 19 గ్రేడ్ ఏ షాపింగ్ మాల్స్ విస్తీర్ణం 123 లక్షల చదరపు అడుగులుగా ఉండనుంది. ఢిల్లీ ఎన్‌సీఆర్, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, పుణె, అహ్మదాబాద్‌లో ఇవి రానున్నాయి. ఇందులోనూ 86 లక్షల చదరపు అడుగులు ఉన్నత శ్రేణికి నిదర్శనమైన గ్రేడ్ ఏ–ప్లస్ రూపంలో ఉండనుంది. నాణ్యమైన వసతుల వైపు కంపెనీల దృష్టి మళ్లిందనడానికి ఇది నిదర్శనమని కుష్‌మన్ వేక్‌ఫీల్డ్ నివేదిక పేర్కొంది. గ్రేడ్ ఏ–ప్లస్ మాల్స్‌ను సాధారణంగా ప్రముఖ డెవలపర్లు లేదా సంస్థాగత ఇన్వెస్టర్లు నిర్వహిస్తుంటారు. వీటిల్లో భర్తీ రేటు చాలా మెరుగ్గా (85 శాతానికి పైనే) ఉంటుంది.

వినియోగదారుల ఆకాంక్షలకు అనుగుణంగా..

''భారత రిటైల్ పరిశ్రమ చాలా వేగంగా వృద్ధి చెందుతోంది. వినియోగదారుల ఆకాంక్షలు సైతం అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ఉన్నత శ్రేణి మాల్స్ మరిన్ని అందుబాటులోకి రావడం విస్తరణకే కాకుండా నాణ్యత, మెరుగైన అనుభవానికి పెరిగిన ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. ఉత్పత్తి ఎంత ముఖ్యమో, మెరుగైన బ్రాండ్ అనుభవానికీ నేడు కస్టమర్ అంతే ప్రాధాన్యం ఇస్తున్నారు''అని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ రిటైల్ ఇండియా హెడ్ సౌరభ్ షట్దాల్ తెలిపారు. సౌందర్య, ఆరోగ్య సంరక్షణ, ఆహారం–పానీయాలు, క్రీడా వస్త్రాల విభాగాలు రిటైల్ పరిశ్రమ తదుపరి దశను మార్చనున్నాయని చెప్పారు. డిజిటల్‌గా అనుసంధానమైన, భవిష్యత్‌కు అనుకూలమైన రిటైల్ నమూనాలు దేశ వినియోగదారుల ఆకాంక్షలను ప్రతిబింబించేవిగా పేర్కొన్నారు. దేశంలో గ్రేడ్ ఏ షాపింగ్ మాల్స్ విస్తీర్ణం 2024 చివరికి 615 లక్షల చదరపు అడుగులుగా ఉన్నట్టు, ఇందులో గ్రేడ్ ఏ–ప్లస్ మాల్స్ విస్తీర్ణం ఇప్పటికే 63 శాతానికి చేరినట్టు (38.9 మిలియన్ ఎస్ఎఫ్‌టీ) ఈ నివేదిక వెల్లడించింది.

ఆఫీసు స్థలాల అద్దెలు పెరిగాయ్

- గతేడాది ఢిల్లీలో అత్యధికం
- హైదరాబాద్‌లో 4.4% వృద్ధి
- రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ నివేదిక

న్యూఢిల్లీ: దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో గతేడాది(2024) ఆఫీసుల స్థలాల అద్దెలు 4–8% పెరిగినట్లు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ ఓ నివేదికలో తెలిపింది. కొత్త వ్యాపారాలు, కంపెనీల విస్తరణ కారణంగా కార్యాలయాల స్థలాలకు గణనీయమైన డిమాండ్ నెలకొందని పేర్కొంది. ''భారత్‌లో అధిక జనాభా, భారీ కన్జూమర్ బేస్, వేగవంతమైన పట్టణీకరణతో పాటు టెక్నాలజీ, ఫైనాన్స్ రంగాల్లో తక్కువ ధరలకు నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి లభిస్తుంది. అందుకే అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు ఆఫీసు స్పేస్ కోసం భారత్ వైపు దృష్టి సారిస్తున్నాయి'' అని వెస్టియన్ సీఈవో శ్రీనివాస్ రావు తెలిపారు.

- నెలవారీగా కార్యాలయ అద్దెల్లో న్యూఢిల్లీ 8.2 శాతం వృద్ధితో అగ్రస్థానంలో నిలిచింది. చెన్నై 7.7%, ముంబై 6.7% బెంగళూరు 4.7%, పుణే 4.5%, హైదరాబాద్ 4.4%, కోల్‌కత్తా 3.8 శాతం వృద్ధితో తర్వాతి స్థానాల్లో నిలిచాయి.
- నగరాల వారీగా చూస్తే ముంబైలో చదరపు అడుగు నెలవారీ సగటు అద్దె 1.6 డాలర్లుగా ఉంది. బెంగళూరులో 1.1 డాలరు, పూణేలో 1 డాలరు, న్యూఢిల్లీలో 0.9 డాలరు, చెన్నై, హైదరాబాద్ నగరాల్లో 0.8 డాలరు, పూణేలో 0.6 డాలరుగా ఉంది.

అంతర్జాతీయ మార్కెట్లో మిశ్రమంగా...

అంతర్జాతీయంగా ఎనిమిది పెద్ద ఓవర్సీస్ మార్కెట్లలో ఆఫీసు అద్దె వృద్ధి మిశ్రమంగా ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. గతేడాది(2024) న్యూయార్క్‌లో సగటు ఆఫీసు అద్దె 1.3% క్షీణించింది. అక్కడ నెలకు చదరపు అడుగుకు అద్దె 7.5 డాలర్లుగా ఉంది. షాంఘైలో 6.8%, హాంగ్‌కాంగ్‌లో 6%, సియాటిల్‌లో 1.9% క్షీణత నమోదైంది. చదరపు అడుగు నెలవారీ సగటు అద్దెలు వరుసగా 2.8 డాలర్లు, 5.9 డాలర్లు, 4.7 డాలర్లుగా ఉన్నాయి.

- అయితే లండన్‌లో సగటు ఆఫీసు అద్దెలు 8.6% పెరిగాయి. అక్కడ నెలకు చదరపు అడుగు అద్దె 8.6 డాలర్లుగా ఉంది. మియామీలో 7.3% బోస్టన్‌లో 1.2%, సింగపూర్ 0.5 శాతం పెరిగాయి. చదరపు అడుగు నెలవారీ సగటు అద్దెలు వరుసగా 5.1 డాలర్లు, 5.5 డాలర్లు, 7 డాలర్లుగా ఉన్నాయి.

మునుపటి గరిష్టానికి బంగారం

- రూ.96,450కి చేరిక
- రూ.2,500 లాభపడిన వెండి



న్యూఢిల్లీ: పసిడి మరోసారి మెరిసింది. ఢిల్లీ మార్కెట్లో మంగళవారం 10 గ్రాములకు (99.9 శాతం స్వచ్ఛత) రూ.50 పెరగడంతో గత వారం నమోదు చేసిన జీవిత కాల గరిష్ట స్థాయి (ఆల్‌టైమ్ హై) రూ.96,450కి పుంజుకుంది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం రూ.50 పెరిగి రూ.95,950 వద్ద ముగిసింది. మరోవైపు వెండికి డిమాండ్ ఏర్పడింది. కిలోకి రూ.2,500 పెరిగి రూ.97,500 స్థాయికి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లోనూ బంగారం లాభాల బాటలో కొనసాగింది. ఔన్స్‌కు 15 డాలర్లు పెరిగి 3242 డాలర్ల సమీపానికి చేరుకుంది. ''ఆల్‌టైమ్ గరిష్టాల వద్ద బంగారం ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. డాలర్ బలహీనపడడం, యూఎస్ వాణిజ్య విధానాలపై అనిశ్చితి కొనసాగుతుండడం బంగారం ధరలకు మద్దతునిస్తోంది''అని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా తెలిపారు. ''బుధవారం యూఎస్ ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ నిర్వహించే మీడియా సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. వాణిజ్య ఉద్రిక్తతలు మరింత పెరిగితే లేదా ఆర్థిక పరిస్థితులు బలహీనపడితే సెంట్రల్ బ్యాంక్ ఎలా వ్యవహరిస్తుందన్నదానిపై పావెల్ నుంచి సంకేతాల కోసం ఇన్వెస్టర్లు ఆసక్తిగా చూస్తున్నారు''అని మెహతా వివరించారు.

పది నిమిషాల్లో ఇంటికే సిమ్ కార్డులు

బ్లింకిట్‌తో ఎయిర్‌టెల్ జట్టు



న్యూఢిల్లీ: పది నిమిషాల వ్యవధిలోనే, కస్టమర్లకు ఇంటి దగ్గరే సిమ్ కార్డులను అందించే ప్రక్రియకు టెలికం దిగ్గజం భారతి ఎయిర్‌టెల్ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా క్విక్ కామర్స్ ప్లాట్‌ఫాం బ్లింకిట్‌తో చేతులు కలిపింది. తొలి దశలో హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, ముంబై తదితర 16 పెద్ద నగరాల్లో ఈ సర్వీసులు అందుబాటులోకి వస్తాయి. నామమాత్రంగా రూ. 49 కన్వీనియెన్స్ ఫీజుతో కస్టమర్లు ఇంటి దగ్గరే, పది నిమిషాల్లోనే సిమ్ కార్డులను పొందవచ్చు. సిమ్ కార్డును అందుకున్నాకా, 15 రోజుల వ్యవధి లోగా ఆధార్ ఆధారిత కేవైసీ ధృవీకరణ ద్వారా నంబరును యాక్టివేట్ చేసుకోవచ్చు.

ఇండస్‌ఇండ్‌కు డెరివేటివ్ దెబ్బ

నెట్‌వర్త్‌పై రూ. 1,979 కోట్ల ప్రతికూల ప్రభావం



న్యూఢిల్లీ: డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో ఖాతాల అంతరం కారణంగా నెట్‌వర్త్‌పై రూ. 1,979 కోట్లమేర ప్రతికూల ప్రభావం పడినట్లు ప్రయివేట్ రంగ దిగ్గజం ఇండస్‌ఇండ్ బ్యాంక్ తాజాగా వెల్లడించింది. 2024 డిసెంబర్‌కల్లా బ్యాంక్ నెట్‌వర్త్‌కు పన్ను తదుపరి 2.27 శాతం నష్టం కలిగినట్లు పేర్కొంది. డెరివేటివ్ లావాదేవీల కారణంగా ఏర్పడిన ఖాతాల అంతరాన్ని మదింపు చేసేందుకు పీడబ్ల్యూసీని బ్యాంక్ ఎంపిక చేసింది. బ్యాలన్స్‌షీట్‌పై ప్రభావం, వివిధ స్థాయిలో అంతరాలు, వీటికి తగిన పరిష్కారాన్ని చూపేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. కాగా.. ఏజెన్సీ తాజాగా నివేదిక అందజేసినట్లు బ్యాంక్ వెల్లడించింది. 2024 జూన్30కల్లా ఖాతాల అంతరం రూ. 1,979 కోట్లుగా నమోదైనట్లు నివేదికలో ఏజెన్సీ పేర్కొన్నట్లు బ్యాంక్ తెలియజేసింది. దీంతో 2024–25 ఆర్థిక ఫలితాలలో ఈ ప్రభావాన్ని వెల్లడించనున్నట్లు బ్యాంక్ తెలియజేసింది. డెరివేటివ్ ఖాతాల నిర్వహణలో అంతర్గత నియంత్రణలను పటిష్టపరిచేందుకు తగిన చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొంది. అంతేకాకుండా ఖాతాల అంతరాలను ఫోరెన్సిక్ ఆడిట్ ద్వారా మదింపు చేసేందుకు అకౌంటింగ్, కన్సల్టింగ్ దిగ్గజం గ్రాంట్ థార్న్‌టన్‌ను బ్యాంక్ బోర్డు నియమించింది. ఖాతాల వ్యత్యాసాలకు మూల కారణాలను గుర్తించడంతోపాటు.. దీనిపై సమీకృత పరిశోధనను చేపట్టనుంది.

ఆకాశ ఎయిర్‌లో వాటాకు ఓకే

- కొత్త పెట్టుబడులకు సీసీఐ అనుమతి
- ప్రేమ్‌జీ ఇన్వెస్ట్, రంజన్ పాయ్, 360వన్ రెడీ



న్యూఢిల్లీ: దేశీ విమానయాన సంస్థ ఆకాశ ఎయిర్ మాతృ సంస్థ ఎస్ఎన్‌వీ ఏవియేషన్‌లో వాటాల కొనుగోలుకి తాజాగా కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) అనుమతించింది. ఈ జాబితాలో టెక్ టైకూన్ ప్రేమ్‌జీ ఇన్వెస్ట్, మణిపాల్ గ్రూప్ చీఫ్ రంజన్ పాయ్ ఫ్యామిలీ ఆఫీస్, 360 వన్ అసెట్ చేరాయి. ఆకాశ ఎయిర్ దేశీయంగా ప్యాసింజర్, కార్గో రవాణా సర్వీసులందిస్తోంది. ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్న 360 వన్ ఆల్టర్నేట్స్ అసెట్ మేనేజ్‌మెంట్ ద్వారా పీఐవోఎఫ్(ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ సంస్థ), పీఐ ఎగ్జిక్యూటివ్స్, క్లేపాండ్(పాయ్ కుటుంబ సంస్థ), 360 ఫండ్ వాటాలను సొంతం చేసుకోనున్నట్లు సీసీఐ పేర్కొంది. భారీ వృద్ధి ప్రణాళికలకు మద్దతుగా అజీమ్ ప్రేమ్‌జీతోపాటు.. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థల కన్సార్షియంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆకాశ ఎయిర్ వెల్లడించిన సంగతి తెలిసిందే. తద్వారా తాజా పెట్టుబడులను సమకూర్చుకోనున్నట్లు తెలియజేసింది. మరోవైపు ప్రస్తుతం ఆకాశ ఎయిర్‌లో 45.97 శాతం వాటాను కలిగిన సుప్రసిద్ధ ఇన్వెస్టర్ రాకేష్ జున్‌జున్‌వాలా కుటుంబం సైతం అదనపు పెట్టుబడులు అందించేందుకు అంగీకరించింది. సంస్థ సీఈవో, వ్యవస్థాపకులలో ఒకరైన వినయ్ దూబే వాటా 16.13 శాతంకాగా.. సోదరులు సంజయ్, నీరజ్ విడిగా 7.59 శాతం చొప్పున వాటాలు కలిగి ఉన్నారు. అంతేకాకుండా మాధవ్ భట్కులీకి 9.41 శాతం, పీఏఆర్ క్యాపిటల్ వెంచర్స్ ఎల్ఎల్‌సీకి 6.37 శాతం చొప్పున వాటా ఉంది. అయితే ఇతర సంస్థలు కొత్తగా ఇన్వెస్ట్ చేయనున్న నేపథ్యంలో ఆకాశ ఎయిర్‌లో ప్రస్తుత వాటాదారుల వాటాలు దిగిరానున్నాయి.

ప్రతి నెలా ఒక కొత్త ఉత్పత్తి

- 100 శాతం క్లెయిమ్ చెల్లింపులు
- ఎంఎస్ఎంఈ ఉద్యోగులకు ప్రత్యేక ప్లాన్లు
- గెలాక్సీ ఇన్సూరెన్స్ ఎండీ శ్రీనివాసన్



చెన్నై: కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతి నెలా ఒక కొత్త బీమా ఉత్పత్తిని ఆవిష్కరించే ప్రణాళికతో ఉన్నట్లు 'గెలాక్సీ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్' ఎండీ, సీఈవో జి.శ్రీనివాసన్ తెలిపారు. కస్టమర్ల భిన్న అవసరాలను దృష్టిలో పెట్టుకుని వీటిని తీసుకురానున్నట్టు చెప్పారు. అదే మాదిరి ఎస్ఎంఈ, ఎంఎస్ఎంఈ ఉద్యోగులకు ప్రత్యేక ప్లాన్లపైనా దృష్టి సారించినట్టు ప్రకటించారు. స్టాండలోన్ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ అయిన గెలాక్సీకి ఫ్యామిలీ టీవీఎస్ వేణు శ్రీనివాసన్‌తోపాటు, హెల్త్ ఇన్సూరెన్స్ రంగం వెటరన్, స్టార్ హెల్త్ వ్యవస్థాపకుడు వి.జగన్నాథన్ సహ ప్రమోటర్లుగా ఉన్నారు. ''ఏదైనా భిన్నంగా చేయాలన్న లక్ష్యంతో ఈ రెండు కుటుంబాలు కలసి గెలాక్సీ హెల్త్ ఇన్సూరెన్స్‌ను ఏర్పాటు చేశాయి. కస్టమర్లకు కచ్చితంగా వినూత్నమైన, సమగ్రమైన పరిష్కారాలతో ఉత్పత్తులను తీసుకొస్తాం''అని జి.శ్రీనివాసన్ తెలిపారు. కస్టమర్ క్లెయిమ్ దరఖాస్తును వేగంగా పరిష్కరించడంతో పాటు పూర్తి మొత్తాన్ని చెల్లించే విధంగా మెరుగైన సేవలు అందిస్తామన్నారు. రానున్న సంవత్సరాల్లో పెద్ద కంపెనీగా అవతరిస్తామని ప్రకటించారు. ఆరంభంలో తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎక్కువ దృష్టి పెడతామని చెప్పారు.

రూ.200 కోట్ల ప్రీమియం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్ల ప్రీమియం ఆదాయాన్ని అంచనా వేస్తున్నట్టు శ్రీనివాసన్ తెలిపారు. ప్రస్తుతం 60 ప్రాంతాల్లో కంపెనీకి కార్యాలయాలు ఉంటే, వీటిని 100కు పెంచుకోనున్నట్టు చెప్పారు. 90 శాతం వ్యాపారం రిటైల్ కస్టమర్ల నుంచి, మిగిలిన 10 శాతం కార్పొరేట్ క్లయింట్ల నుంచి ఉంటుందన్నారు. రిటైల్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తామన్నారు. తమ ఉత్పత్తులు జబ్బున పడినప్పుడే ఆదుకునే విధంగా ఉండకుండా.. కస్టమర్లు ఆరోగ్యంగా జీవించేందుకు సాయపడతాయని చెప్పారు. తమ ఉత్పత్తుల్లో వెల్‌నెస్ (ఆరోగ్య సంరక్షణ) అంతర్భాగంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం చాలా కంపెనీల హెల్త్ ప్లాన్లలో లేని ఔట్ పేషెంట్ చికిత్సలపైనా తాము దృష్టి సారిస్తామని తెలిపారు. దేశంలో దక్షిణాది రాష్ట్రాల్లోనే బీమా విస్తరణ మెరుగ్గా ఉందంటూ.. అదే సమయమంలో ఆరోగ్య బీమా కవరేజీ ఉన్న వారికి సైతం తగినంత రక్షణ లేకపోవడాన్ని గుర్తించినట్టు శ్రీనివాసన్ వెల్లడించారు.

టారిఫ్‌లను ఎదుర్కొనే సత్తా భారత్‌కు ఉంది

- యూఎస్‌తో వాణిజ్య ఒప్పందానికి చాన్స్
- ఐటీసీ చైర్మన్ సంజీవ్ పురి



న్యూఢిల్లీ: యూఎస్ టారిఫ్‌లతో తలెత్తే సంక్షోభాలను భారత్ సమర్థవంతంగా ఎదుర్కోగలదని ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఐటీసీ చైర్మన్ సంజీవ్ పురి పేర్కొన్నారు. త్వరలో అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరే వీలున్నట్లు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఇందుకు వేగంగా చర్చలు జరుగుతున్నట్లు వెల్లడించారు. ఇటీవల భారత్‌సహా పలు దేశాలపై యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ ప్రతీకార టారిఫ్‌లకు తెరతీసిన నేపథ్యంలో పురి అభిప్రాయాలకు ప్రాధాన్యత ఏర్పడింది. అయితే చైనా మినహా మిగిలిన దేశాలపై విధించిన టారిఫ్‌లను ట్రంప్ 90 రోజులపాటు నిలిపివేసేందుకు నిర్ణయించిన విషయం విదితమే. చైనాపై 145 శాతం సుంకాలు ప్రకటించినప్పటికీ కంప్యూటర్ చిప్స్, మొబైల్స్, ల్యాప్‌టాప్ తదితర కొన్ని ఎలక్ట్రానిక్ ప్రొడక్టులను మినహాయించారు. ప్రతీకార టారిఫ్‌ల అమలు జులై 9వరకూ వాయిదా పడినప్పటికీ యూఎస్ ఎగుమతులపై 10 శాతం అదనపు సుంకాలు అమలుకానున్నాయి. ఈ నేపథ్యంలో దేశీ పరిశ్రమపై టారిఫ్‌ల ప్రభావాన్ని ఇప్పుడే అంచనా వేయడం కష్టమని పురి పేర్కొన్నారు. అయితే భారత్ వీటిని పటిష్టస్థాయిలో ఎదుర్కోగలదని అంచనా వేశారు. పలు దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు(ఎఫ్‌టీఏలు) కుదుర్చుకునేందుకు అవకాశాలున్నట్లు తెలియజేశారు. ఈ ఏడాదిలోనే ఈయూ, యూకేతోపాటు యూఎస్‌తోనూ ఒప్పందాలపై సంతకాలకు వీలున్నట్లు అభిప్రాయపడ్డారు.

మార్చిలో షురూ

యూఎస్, భారత్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి(బీటీఏ) మార్చిలోనే చర్చలు మొదలయ్యాయి. ఒప్పందం తొలి దశను సెప్టెంబర్–అక్టోబర్‌కల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. 2030కల్లా 500 బిలియన్ డాలర్ల విలువైన ద్వైపాక్షిక వాణిజ్యాన్ని సాధించే లక్ష్యంతో ఇందుకు శ్రీకారం చుట్టాయి. అంతర్జాతీయంగా చూస్తే ఎఫ్‌టీఏ, సమీకృత ఆర్థిక సహకార ఒప్పందం(సీఈసీఏ), సమీకృత ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ), బీటీఏలుగా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటాయి. తద్వారా భాగస్వామ్య దేశాలు గరిష్ట సంఖ్యలో వస్తుసంబంధ వాణిజ్యంపై దిగుమతి సుంకాలు భారీగా తగ్గించుకోవడం లేదా ఎత్తివేయడం చేస్తాయి. కాగా.. వినియోగ ఆధారిత దేశ ఆర్థిక వ్యవస్థ స్వల్ప కాలానికి అనిశ్చితులను ఎదుర్కోవలసి ఉంటుందని పురి తెలియజేశారు. అయితే పోటీతత్వం, డిజిటైజేషన్, ఫ్యూచర్ రెడీ పోర్ట్‌ఫోలియో తదితరాల ద్వారా భారత్ నిలదొక్కుకుంటుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. స్వల్పకాల అనిశ్చితి, అంచనాలకు అందని పరిస్థితులు ప్రపంచ వృద్ధిపై ప్రభావాన్ని చూపవచ్చునని, దీంతో భారత్‌పై కొంతమేర ప్రతికూల ప్రభావానికి చాన్స్ ఉన్నదని విశ్లేషించారు. కొత్త అనిశ్చిత ప్రపంచంలో నిలకడ, వృద్ధి అంశంపై ఏర్పాటైన ఏఐఎంఏ సదస్సులో పురి సైడ్‌లైన్స్‌లో పలు అంశాలపై స్పందించారు.

భారత్ వృద్ధిపై టారిఫ్‌ల ఎఫెక్ట్

- అమల్లోకి వస్తే 0.4 పర్సంటేజీ పాయింట్ల వరకు తగ్గే అవకాశం
- ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ అంచనా

న్యూఢిల్లీ: అమెరికా గానీ ప్రతీకార టారిఫ్లను అమలు చేసిన పక్షంలో భారత్, చైనా, జపాన్ వంటి ప్రధాన ఆసియా పసిఫిక్ దేశాల వృద్ధి వచ్చే రెండేళ్లలో 0.2–0.4 పర్సంటేజీ పాయింట్ల (పీపీటీఎస్) వరకు తగ్గే అవకాశాలు ఉన్నట్లు ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ తెలిపింది. టారిఫ్ల హెచ్చరికలు, అమలు వల్ల గ్లోబల్ వాణిజ్యం నెమ్మదించి, వ్యాపార విశ్వాసం దెబ్బతినవచ్చని పేర్కొంది. ప్రాంతీయంగా చైనా, అమెరికాపై ఎక్కువగా ఆధారపడటం వల్ల తయారీ సంస్థలు, చిన్న దేశాలపై ప్రతికూల ప్రభావం గణనీయంగా ఉండొచ్చని వివరించింది. భారత్ వృద్ధి రేటు 2025లో 6.5 శాతంగా, 2026లో 6.8 శాతంగా ఉండొచ్చని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ మార్చిలో అంచనా వేసింది. ఒకవేళ ప్రతీకార టారిఫ్లు అమలైతే ఇది వరుసగా 6.3 శాతం, 6.5 శాతానికి పరిమితం కావచ్చని అభిప్రాయపడింది. అటు వియత్నాం, థాయ్‌ల్యాండ్, తైవాన్ల వృద్ధి రేటుపై అత్యధిక ప్రభావం పడొచ్చని పేర్కొంది. సుంకాల మోతతో కొత్త పెట్టుబడులు నిల్చిపోయి వ్యాపారాలపై ధీమా మరింత సన్నగిల్లుతుందని తెలిపింది. అటు ఈక్విటీ, డెట్ మార్కెట్లు కూడా తీవ్ర ఒడిదుడుకులకు లోను కావచ్చని వివరించింది. చైనా మినహా మిగతా అన్ని దేశాలపై ప్రతీకార టారిఫ్లను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మూడు నెలల పాటు నిలిపివేస్తున్నట్లు ఏప్రిల్ 9న ప్రకటించారు. అయితే, ఏప్రిల్ 2న ప్రకటించిన 10 శాతం అదనపు సుంకాలు మాత్రం యథాప్రకారం అమలవుతున్నాయి.



సాక్షి ప్లస్
బుధవారం : 16-4-2025

సాత్విక్–చిరాగ్ జోడీ పునరాగమనం

సుదిర్మన్ కప్ సమరానికి సిద్ధం ● ఏప్రిల్ 27 నుంచి మే 4 వరకు చైనాలో మెగా ఈవెంట్

ఈ ఏడాది అంతర్జాతీయస్థాయిలో ఆశించిన విజయాలు అందుకోలేకపోతున్న భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు మరో సమరానికి సమాయత్తమవుతున్నారు. ప్రతిష్టాత్మక సుదిర్మన్ కప్‌లో ఈసారైనా పతకం లోటు తీర్చుకోవాలనే లక్ష్యంతో ఉన్నారు. ఈనెల 27 నుంచి చైనాలోని జియామెన్ నగరంలో ప్రపంచ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్ 'సుదిర్మన్ కప్'కు తెర లేవనుంది. ఎనిమిది రోజులపాటు జరిగే ఈ మెగా ఈవెంట్‌లో మొత్తం 16 జట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటాయి. బ్యాడ్మింటన్‌లో ప్రముఖ టీమ్ ఈవెంట్స్ అయిన థామస్ కప్, ఉబెర్ కప్‌లలో... ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌లలో భారత జట్లు పతకాలు సాధించాయి. కానీ 36 ఏళ్ల చరిత్ర కలిగిన సుదిర్మన్ కప్‌లో మాత్రం ఇప్పటి వరకు భారత్ పతకాల బోణీ కొట్టలేదు. అందుబాటులో ఉన్న అగ్రశ్రేణి క్రీడాకారులతో చైనాకు బయలుదేరనున్న భారత బృందం ఈసారి పతకంతో తిరిగి రావాలని ఆశిద్దాం.

న్యూఢిల్లీ: మొత్తం ఐదు మ్యాచ్‌లు... అందులో మూడు గెలిస్తే చాలు విజయం ఖరారు... పురుషుల సింగిల్స్‌లో ఇద్దరు స్టార్లు... మహిళల సింగిల్స్‌లో ప్రపంచ మాజీ చాంపియన్... పురుషుల డబుల్స్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ జోడీ... ఈ మూడు విభాగాల్లో మనవాళ్లు సహజశైలిలో విజృంభిస్తే భారత్‌కు గెలుపుతోపాటు అందని ద్రాక్షగా ఊరిస్తున్న పతకం అందుకోవడం కష్టమేమీ కాదు. అయితే ఈ ఏడాది భారత క్రీడాకారుల ప్రదర్శనను పరిగణనలోకి తీసుకుంటే మాత్రం సుదిర్మన్ కప్‌లో విశేషంగా రాణిస్తేనే పతకాన్ని మెడలో వేసుకోవడం సాధ్యమవుతుంది. ఈనెల 27 నుంచి మే 4 వరకు చైనాలోని జియామెన్ నగరంలో జరిగే ఈ ప్రతిష్టాత్మక టీమ్ ఈవెంట్‌లో పోటీపడనున్న భారత జట్టును మంగళవారం భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) ప్రకటించింది. చిరాగ్ శెట్టి వెన్ను గాయం నుంచి కోలుకోకపోవడంతో ఈ నెలలోనే జరిగిన ఆసియా వ్యక్తిగత చాంపియన్‌షిప్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ జోడీ పాల్గొనలేదు. ప్రస్తుతం చిరాగ్ ఈ గాయం నుంచి తేరుకొని పూర్తి ఫిట్‌నెస్ సాధించడంతో సుదిర్మన్ కప్‌లో ఈ జోడీ పునరాగమనం చేయనుంది. ఈ ఏడాది సాత్విక్–చిరాగ్ జోడీ ఐదు టోర్నీల్లో ఆడి రెండింటిలో సెమీఫైనల్‌కు చేరుకుంది.

మహిళల డబుల్స్‌లో మినహా మిగతా నాలుగు విభాగాల్లో (పురుషుల సింగిల్స్, మహిళల సింగిల్స్, పురుషుల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్) భారత్ నుంచి స్టార్ ప్లేయర్లు పోటీపడుతున్నారు. భారత నంబర్‌వన్ పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జోడీ భుజం గాయం నుంచి ఇంకా కోలుకోలేదు. దాంతో ఈ జంట సుదిర్మన్ కప్‌లో ఆడటంలేదు. ఆసియా వ్యక్తిగత చాంపియన్‌షిప్‌లోనూ గాయత్రి–ట్రెసా జోడీ బరిలోకి దిగలేదు. గాయత్రి–ట్రెసా జోడీ స్థానంలో ప్రియా–శ్రుతి మిశ్రా ద్వయం సుదిర్మన్ కప్‌లో ఆడనుంది. నాలుగు విభాగాల్లో బ్యాకప్ ప్లేయర్లను ఎంపిక చేసిన 'బాయ్' మహిళల డబుల్స్‌లో ఒక్క జోడీనే ఎంపిక చేయడం గమనార్హం.

క్లిష్టమైన 'డ్రా'...

ప్రపంచ ర్యాంకింగ్ ఆధారంగా సుదిర్మన్ కప్ టోర్నీకి భారత్ అర్హత సాధించింది. మొత్తం 16 జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతి గ్రూప్‌లో నాలుగు జట్లకు చోటు కల్పించారు. గ్రూప్ 'డి'లో భారత్, మాజీ చాంపియన్ ఇండోనేసియా, మాజీ రన్నరప్ డెన్మార్క్‌తోపాటు ఇంగ్లండ్ జట్లున్నాయి. ఇంగ్లండ్ జట్టుపై భారత్ గెలిచే అవకాశం ఉన్నా... ఇండోనేసియా, డెన్మార్క్‌లపై నెగ్గాలంటే స్టార్ క్రీడాకారులు పూర్తిస్థాయిలో విజృంభించాల్సి ఉంటుంది. గ్రూప్ మ్యాచ్‌లు ముగిశాక నాలుగు గ్రూప్‌ల నుంచి రెండు జట్ల చొప్పున మొత్తం ఎనిమిది జట్లు నాకౌట్ దశకు (క్వార్టర్ ఫైనల్స్) అర్హత సాధిస్తాయి. సెమీఫైనల్ చేరుకున్న జట్లకు కనీసం కాంస్య పతకాలు లభిస్తాయి.



సుదిర్మన్ కప్ టోర్నీకి భారత బ్యాడ్మింటన్ జట్టు

పురుషుల సింగిల్స్: లక్ష్య సేన్ (ప్రపంచ 18వ ర్యాంక్), హెచ్‌ఎస్ ప్రణయ్ (ప్రపంచ 30వ ర్యాంక్). **మహిళల సింగిల్స్:** పీవీ సింధు (ప్రపంచ 18వ ర్యాంక్), అనుపమ ఉపాధ్యాయ్ (ప్రపంచ 44వ ర్యాంక్). **పురుషుల డబుల్స్:** సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (ప్రపంచ 11వ ర్యాంక్); హరిహరన్–రూబన్ కుమార్ (ప్రపంచ 42వ ర్యాంక్). **మహిళల డబుల్స్:** ప్రియా కొన్‌జెంగ్‌బమ్–శ్రుతి మిశ్రా (ప్రపంచ 39వ ర్యాంక్). **మిక్స్‌డ్ డబుల్స్:** ధ్రువ్ కపిల–తనీషా క్రాస్టో (ప్రపంచ 17వ ర్యాంక్), సతీశ్ కుమార్ కరుణాకరన్–ఆద్య వరియత్ (ప్రపంచ 33వ ర్యాంక్).

బంగ్లాదేశ్ 'హ్యాట్రిక్'



నిగార్ సుల్తానా

లాహోర్: మహిళల వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో బంగ్లాదేశ్ జట్టు విజయాల 'హ్యాట్రిక్' నమోదు చేసుకుంది. మంగళవారం జరిగిన పోరులో బంగ్లాదేశ్ 34 పరుగుల తేడాతో స్కాట్లాండ్‌పై నెగ్గింది. మొదట బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 276 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', కెప్టెన్ నిగార్ సుల్తానా (59 బంతుల్లో 83 నాటౌట్; 11 ఫోర్లు) అజేయ అర్ధశతకంతో ఆకట్టుకోగా... ఫర్గానా (57; 6 ఫోర్లు), షర్మిన్ అక్తర్ (57; 7 ఫోర్లు) హాఫ్ సెంచరీలు చేశారు. స్కాట్లాండ్ బౌలర్లలో క్యాథరిన్ బ్రైస్ 2 వికెట్లు పడగొట్టింది. అనంతరం లక్ష్యఛేదనలో స్కాట్లాండ్ మహిళల జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 242 పరుగులకు పరిమితమైంది. ప్రియనాజ్ (63 బంతుల్లో 61; 7 ఫోర్లు), రాచెల్ (73 బంతుల్లో 61 నాటౌట్; 5 ఫోర్లు) రాణించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో నహిదా 4, జన్నతుల్ 2 వికెట్లు తీశారు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన బంగ్లాదేశ్ 6 పాయింట్లతో పట్టిక అగ్రస్థానంలో కొనసాగుతోంది. మరో మ్యాచ్‌లో ఐర్లాండ్ 46 పరుగుల తేడాతో థాయ్‌లాండ్ జట్టుపై గెలిచింది.

వాంఖడేలో రోహిత్ శర్మ స్టాండ్



ముంబై: ప్రఖ్యాత వాంఖడే స్టేడియంలోని ఒక స్టాండ్‌కు భారత వన్డే, టెస్టు జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ పేరు పెట్టారు. దేశానికి రెండు ఐసీసీ ట్రోఫీలు అందించిన రోహిత్ శర్మకు ఇది తామిచ్చే గౌరవమని ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) వెల్లడించింది. రోహిత్ శర్మతో పాటు భారత మాజీ కెప్టెన్ అజిత్ వాడేకర్, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మాజీ అధ్యక్షుడు శరద్ పవార్ పేరిట కూడా స్టాండ్‌లు ఏర్పాటు చేసింది. మంగళవారం ఎంసీఏ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. దివెచా పెవిలియన్‌లోని మూడో లెవల్‌కు రోహిత్ శర్మ పేరు పెట్టారు. గ్రాండ్ స్టాండ్ మూడో లెవల్‌కు శరద్ పవార్ పేరు, నాలుగో లెవల్‌కు వాడేకర్ పేర్లు పెట్టారు. అజిత్ వాడేకర్ 1966 నుంచి 1974 మధ్య భారత జట్టు తరఫున 37 టెస్టులు, 2 వన్డేలు ఆడాడు. 1971 వెస్టిండీస్, ఇంగ్లండ్‌పై టెస్టు సిరీస్‌లు గెలిచిన భారత జట్టులో అతడు సభ్యుడు. 77 ఏళ్ల వయసులో 2018లో అజిత్ మృతిచెందారు. ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఇప్పటికే దిగ్గజ ఆటగాళ్లు సచిన్ టెండూల్కర్, దిలీప్ వెంగ్‌సర్కార్, సునీల్ గవాస్కర్, విజయ్ మర్చంట్ పేరుతో స్టాండ్స్ ఉన్నాయి. ఇప్పుడు వాటి సరసన రోహిత్ పేరు చేరింది. 2013లో టీమిండియా తరఫున టెస్టు అరంగేట్రం చేసిన రోహిత్ శర్మ 2022లో జట్టు పగ్గాలు చేపట్టాడు. 2023 వన్డే ప్రపంచకప్‌లో టీమిండియాను ఫైనల్‌కు తీసుకెళ్లిన రోహిత్, 2024లో టి20 ప్రపంచ కప్, 2025లో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ అందించాడు.

శ్రేయస్ అయ్యర్‌కు ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు



చాంపియన్స్ ట్రోఫీతో అయ్యర్ (ఫైల్)

దుబాయ్: భారత మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌కు మార్చి నెలకు గానూ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు దక్కింది. చాంపియన్స్ ట్రోఫీలో చక్కటి ప్రదర్శన కనబర్చినందుకుగానూ అయ్యర్‌ను ఈ పురస్కారం వరించింది. ఈ మేరకు ఐసీసీ మంగళవారం వివరాలు వెల్లడించింది. చాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నమెంట్‌లో అయ్యర్ అత్యధిక పరుగులు (243) చేసిన ప్లేయర్‌గా నిలిచాడు. న్యూజిలాండ్ ప్లేయర్లు రచిన్ రవీంద్ర, జాకబ్ డఫీ కూడా ఈ పురస్కారం కోసం పోటీపడగా... ఆ ఇద్దరినీ వెనక్కి నెడుతూ అయ్యర్ విజేతగా నిలిచాడు. 'ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డు దక్కడం గౌరవంగా భావిస్తున్నా. చాంపియన్స్ ట్రోఫీ హస్తగతం చేసుకోవడంతో పాటు అవార్డు గెలుచుకోవడం ఆనందాన్ని రెట్టింపు చేసింది. ఐసీసీ టోర్నీలో టీమిండియా విజయాల్లో కీలక పాత్ర పోషించడం సంతోషంగా ఉంది' అని అయ్యర్ అన్నాడు. ఫిబ్రవరి నెలకు గానూ ఈ పురస్కారాన్ని భారత ఆటగాడు శుబ్‌మన్ గిల్ దక్కించుకున్నాడు.

కాంబ్లీకి గావస్కర్ ఫౌండేషన్ చేయూత

జీవితకాలం పెన్షన్ ఇవ్వాలని నిర్ణయం





ముంబై: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థికంగా కూడా ఇబ్బందుల్లో ఉన్న భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీకి అండగా నిలిచేందుకు దిగ్గజ క్రికెట్ సునీల్ గావస్కర్ ముందుకు వచ్చాడు. గావస్కర్‌కు చెందిన 'చాంప్స్ ఫౌండేషన్' వినోద్ కాంబ్లీకి జీవితకాలం పెన్షన్ ఇవ్వాలని నిర్ణయించింది. దీని ప్రకారం ప్రతీ నెలా కాంబ్లీకి రూ.30 వేల చొప్పున అందిస్తారు. అదనంగా వైద్యపరమైన ఖర్చుల కోసం ఏడాదికి మరో రూ.30 వేలు కూడా ఇస్తారు. గత ఏడాది వ్యవధిలో రెండు సార్లు కాంబ్లీ తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రిపాలయ్యాడు. ఒక దశలో నడిచేందుకు కూడా ఇతరుల సహాయం తీసుకోవాల్సి వచ్చింది. ముంబై క్రికెట్ 50 ఏళ్ల ఉత్సవాల సందర్భంగా తనను కాంబ్లీ కలిసిన తర్వాత అతని పరిస్థితిని చూసిన గావస్కర్ వెంటనే పెన్షన్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీనిపై స్పందించేందుకు గావస్కర్ నిరాకరించారు. కాంబ్లీకి ముందు మరో భారత మాజీ క్రికెటర్ సలీమ్ దురానీకి కూడా ఇదే తరహాలో 'చాంప్స్ ఫౌండేషన్' ఆర్థిక సహాయం అందించింది. 53 ఏళ్ల వినోద్ కాంబ్లీ 1991–2000 మధ్య భారత్ తరఫున 17 టెస్టులు, 104 వన్డేలు ఆడాడు.

రెడ్‌బుల్‌కు వెర్‌స్టాపెన్ టాటా!



బహ్రెయిన్: ఫార్ములావన్ ప్రపంచ చాంపియన్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్... తన జట్టు రెడ్‌బుల్‌ను వీడే అవకాశం ఉందనే వార్తలు వస్తున్నాయి. గత నాలుగేళ్లుగా ప్రపంచ చాంపియన్‌గా నిలుస్తోన్న వెర్‌స్టాపెన్ తాజా సీజన్‌లో జోరు కనబర్చలేకపోతున్నాడు. ఇటీవల జరిగిన బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి అనంతరం వెర్‌స్టాపెన్ జట్టుపై తన అసహనాన్ని బాహాటంగానే వ్యక్తపరించాడు. టైర్లు వేడెక్కడం, బ్రేక్ సమస్యలు, రెండుసార్లు పిట్ స్టాప్ జాప్యాలు ఇలా జట్టు తప్పుల జాబితాను బయట పెట్టాడు. దీంతో వెర్‌స్టాపెన్ వచ్చే సీజన్‌లోపు రెడ్‌బుల్ జట్టును వీడనున్నాడనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. బహ్రెయిన్ రేసును ఆరో స్థానంతో ముగించిన వెర్‌స్టాపెన్... జట్టు సహాయక సిబ్బంది తప్పిదాలతో ఒకదశలో చివరి స్థానానికి కూడా పడిపోయాడు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు నాలుగు (ఆస్ట్రేలియా గ్రాండ్‌ప్రి, చైనీస్ గ్రాండ్‌ప్రి, జపాన్ గ్రాండ్‌ప్రి, బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి) రేసులు ముగియగా... అందులో జపాన్ రేసులో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. మిగిలిన మూడు రేసుల్లోనూ మెక్‌లారెన్ జట్టుకు చెందిన లాండో నోరిస్, పియాస్ట్రి గెలుపొందారు. ఈ ఏడాది డ్రైవర్స్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో నోరిస్ 77 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... వెర్‌స్టాపెన్ 69 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాడు.

సొంతగడ్డపై తొలి విజయం కోసం..

నేడు రాజస్తాన్ రాయల్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ పోరు

● రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 టోర్నమెంట్ 18వ సీజన్‌లో సొంతగడ్డపై తొలి విజయం కోసం ఎదురు చూస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు నేడు జరిగే పోరులో రాజస్తాన్ రాయల్స్‌తో తలపడనుంది. సీజన్ ఆరంభంలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచి జోరు కనబర్చిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు... చివరి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ చేతిలో ఓడింది. దాన్ని పక్కన పెట్టి తిరిగి గెలుపు బాట పట్టాలని అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్ భావిస్తోంది. గత మ్యాచ్‌లో ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగి అదరగొట్టిన కరుణ్ నాయర్‌పై ఒక్కసారిగా అంచనాలు పెరిగిపోగా... డుప్లెసిస్ అందుబాటులోకి వస్తే బ్యాటింగ్ మరింత పటిష్టం కానుంది. ముంబైతో పోరులో భారీ లక్ష్యఛేదనలో సునాయాసంగా గెలుపొందేలా కనిపించిన ఢిల్లీ కరుణ్ నాయర్ అవుటైన అనంతరం తడబడింది. ఆ లోపాలను సరిదిద్దుకొని తిరిగి సత్తాచాటాలని చూస్తోంది. మరోవైపు సంజూ సామ్సన్ సారథ్యంలోని రాయల్స్ అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో బలంగానే ఉన్నా ఆటగాళ్లు సమష్టిగా సత్తా చాటడంలో విఫలమవుతుండటంతో నిలకడ కనబర్చలేకపోతోంది. గత మ్యాచ్‌ల తప్పిదాల నుంచి పాఠాలు నేర్చుకొని మూడో విజయం ఖాతాలో వేసుకోవాలని రాయల్స్ చూస్తోంది.

డుప్లెసిస్ అనుమానమే...

దేశవాళీల్లో పరుగుల వరద పారించి అనూహ్యంగా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి వచ్చిన సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్... తుది జట్టులో అవకాశం దక్కించుకున్న తొలి పోరులో చెలరేగిపోయాడు. మేటి ఆటగాళ్లు సైతం జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు ఆపసోపాలు పడుతున్న తరుణంలో... నాయర్ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. బౌల్ట్, బుమ్రా, దీపక్, సాంట్నర్, హార్దిక్ ఇలా బౌలర్ ఎవరనేది చూడకుండా భారీ షాట్లతో అలరించాడు. దీంతో ఇంపాక్ట్ ప్లేయర్‌గా మరోసారి అతడు ఆడటం ఖాయమే కాగా... అదే జోరు కొనసాగిస్తాడా చూడాలి. డుప్లెసిస్ ఫిట్‌నెస్‌పై సందేహాలు తొలిగిపోలేదు. మంగళవారం సాయంత్రం జట్టు ప్రాక్టీస్‌లోనూ అతడు పాల్గొనలేదు. దీంతో బుధవారం మ్యాచ్ ఆడటంపై స్పష్టత కొరవడింది. డుప్లెసిస్ అందుబాటులో లేకపోతే అభిషేక్ పొరెల్‌తో కలిసి మెక్‌గుర్క్ ఇన్నింగ్స్ ఆరంభించనున్నాడు. కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్, స్టబ్స్, అశుతోష్ శర్మలతో మిడిలార్డర్ బలంగా ఉంది. స్టార్క్, ముకేశ్ కుమార్, మోహిత్ పేస్ బాధ్యతలు తీసుకోనుండగా... కుల్దీప్ యాదవ్, విప్రాజ్ నిగమ్, అక్షర్ పటేల్ స్పిన్ భారం మోయనున్నారు.

29 ఐపీఎల్ టోర్నీ చరిత్రలో ఢిల్లీ క్యాపిటల్స్ రాజస్తాన్ రాయల్స్ జట్లు ముఖాముఖిగా 29 సార్లు తలపడ్డాయి. 15 సార్లు రాజస్తాన్ నెగ్గగా... 14 సార్లు ఢిల్లీ గెలిచింది. రాజస్తాన్‌పై ఢిల్లీ అత్యధిక స్కోరు 221 కాగా... ఢిల్లీపై రాజస్తాన్ అత్యధిక స్కోరు 222.

సామ్సన్ సత్తా చాటితేనే!

మాజీ చాంపియన్ రాజస్తాన్ రాయల్స్ ఈ సీజన్‌లో పడుతూ లేస్తూ సాగుతోంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిన ఆ జట్టు ఆ తర్వాత రెండు మ్యాచ్‌ల్లో గెలిచింది. అనంతరం మరో రెండు మ్యాచ్‌ల్లో ఓడింది. గత మ్యాచ్‌లో కష్టతరమైన పిచ్‌పై యశస్వి జైస్వాల్ సంయమనంతో అర్ధశతకం సాధించడం రాయల్స్‌కు శుభసూచకం. కెప్టెన్ సంజూ సామ్సన్ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోతున్నాడు. రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్ ఫర్వాలేదనిపిస్తున్నా... ఐపీఎల్ వంటి అత్యంత పోటీ ఉండే లీగ్‌లో మెరుపులు లేకపోతే విజయాలు సాధ్యం కావు. వెస్టిండీస్ హిట్టర్ హెట్‌మైర్ నుంచి టీమ్ మేనేజ్‌మెంట్ మరింత దూకుడు ఆశిస్తోంది. గత మ్యాచ్‌లో బెంగళూరు చేతిలో ఓడిన రాయల్స్... అదే మైదానంలో ఢిల్లీతో జరగనున్న పోరులో విజయం సాధించేందుకు తీవ్రంగా కసరత్తు చేస్తోంది. బౌలింగ్‌లో ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్‌పై ఎక్కువ భారం ఉండగా... లంకేయులు తీక్షణ, హసరంగ రాణించాల్సిన అవసరముంది.



రాజస్తాన్ రాయల్స్ జట్టు

తుది జట్లు (అంచనా)

ఢిల్లీ క్యాపిటల్స్: అక్షర్ పటేల్ (కెప్టెన్), డు ప్లెసిస్/మెక్‌గుర్క్, అభిషేక్ పొరెల్, కరుణ్ నాయర్, కేఎల్ రాహుల్, స్టబ్స్, అశుతోష్ శర్మ, విప్రాజ్ నిగమ్, స్టార్క్, కుల్దీప్ యాదవ్, మోహిత్ శర్మ, ముకేశ్ కుమార్.

రాజస్తాన్ రాయల్స్: సంజూ సామ్సన్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, నితీశ్ రాణా, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, హెట్‌మైర్, హసరంగ, ఆర్చర్, తీక్షణ, తుషార్ దేశ్‌పాండే, సందీప్ శర్మ, కుమార్ కార్తికేయ.

బెంగాల్ హింస వెనుక బంగ్లా మూక!

కేంద్ర నిఘా వర్గాల వెల్లడి

కోల్‌కతా/కొచ్చి: కేంద్రం తీసుకొచ్చిన వివాదాస్పద వక్ఫ్(సవరణ) చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్‌లో జరిగిన హింసాత్మక ఘటనల్లో పొరుగున ఉన్న బంగ్లాదేశ్ నుంచి చొరబడిన అల్లరిమూకల హస్తం ఉందని కేంద్ర నిఘా వర్గాలు వెల్లడించాయి. రాళ్లు రువ్విన ఘటనల్లో గుర్తు తెలియని యుక్తవయసు వాళ్లు ఎక్కువగా పాల్గొన్నట్లు కేంద్ర హోం శాఖ పేర్కొన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ మేరకు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ముర్షీదాబాద్ జిల్లా, సౌత్ 24 పరగణాల పరిధుల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నా వాటిని వెంటనే అదుపులోకి తేవడంలో తృణమూల్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని తెలుస్తోంది. ఈ అల్లర్లలో షంషేర్‌గంజ్ ప్రాంతంలో తండ్రీకొడుకులను అల్లరిమూక నరికిచంపడం తెల్సిందే. ఈ హత్యోదంతంలో ఇద్దరు అన్నదమ్ములను మంగళవారం బెంగాల్ పోలీసులు అరెస్ట్‌చేశారు.

హింసకు మమతే కారణం: రిజిజు

వక్ఫ్ చట్టంపై వ్యతిరేకతను చూపాలంటూ మమతా బెనర్జీ ఇచ్చిన పిలుపు కారణంగానే రాష్ట్రంలో హింస చెలరేగిందని కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు ఆరోపించారు. కొచ్చిలో పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. ''పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్ని సీఎం కుర్చీలో కూర్చున్న వ్యక్తి ఎలా అడ్డుకోగలరు?. రాజ్యాంగబద్ధ పద్ధతిని ఆమె ఎందుకు పాటించరు?'' అని రిజిజు ఆగ్రహం వ్యక్తంచేశారు. హింసపై వీహెచ్‌పీ సైతం స్పందించింది. చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్నామన్న సాకుతో హిందువులపై దాడులు, హిందువుల ఆస్తుల విధ్వంసం చేయడాన్ని ఆపాలని వీహెచ్‌పీ డిమాండ్‌చేసింది. అల్లర్లను రెచ్చగొట్టేలా టీఎంసీ మంత్రులు సిద్దిఖుల్లా చౌదరి, ఫిర్హాద్ హకీమ్‌లు మాట్లాడుతున్నారని సిలిగురిలో వీహెచ్‌పీ జాతీయ కార్యదర్శి(వ్యవస్థాగతం) మిలింద్ పరాండే ఆరోపించారు. అల్లర్ల ఉదంతంలో ఇప్పటిదాకా పోలీసులు 221 మందిని అరెస్ట్‌చేశారు. అల్లర్లలో ముగ్గురు చనిపోయారు. చాలా మంది గాయపడ్డారు. వీరిలో 18 మంది పోలీసులు కూడా ఉన్నారు. అల్లర్లు చెలరేగిన చోట్ల స్థానిక యంత్రాంగం ఆంక్షలు విధించింది. ఇంటర్నెట్ సేవలను స్తంభింపజేసింది.

దేశంలో అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 2.2 లక్షల వక్ఫ్ ఆస్తులుండగా తర్వాత పశ్చిమబెంగాల్‌లోనే 80వేలకుపైగా వక్ఫ్ ఆస్తులున్నాయి. ఈ నేపథ్యంలో బెంగాల్‌లో వక్ఫ్(సవరణ) చట్టాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు, ఆందోళనలు జరిగాయి. తొలుత ముర్షీదాబాద్ జిల్లాలో ముస్లింల ఆధిక్య సూతీ, షంషేర్‌గంజ్‌లో మొదలైన అల్లర్లు తర్వాత సోమవారం సౌత్ 24 పరిగణాల జిల్లాలోని భాన్‌గర్‌కూ వ్యాపించాయి. వక్ఫ్(సవరణ) చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఇండియా సెక్యులర్ ఫ్రంట్ చేసిన ర్యాలీ హింసాత్మకంగా మారడం తెల్సిందే.



2023 బ్యాచ్ ఐపీఎస్ అధికారులతో మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో సమావేశమైన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

ఇరాక్‌లో ఇసుక తుఫాను

వేలమందికి శ్వాస సమస్యలు

బాగ్దాద్: ఇరాక్‌లో భారీ ఇసుక తుఫాను బీభత్సం సృష్టించింది. వేలాది మంది ప్రజలు శ్వాసకోశ సమస్యలతోను లోనయ్యారు. 700 మందికి పైగా ఊపిరాడని స్థితిలో ఆస్పత్రుల్లో చేరారు. తుఫానుతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విమాన సేవలు నిలిచిపోయాయి. జనం, పోలీసులు మాస్కులు ధరించారు. దక్షిణ ప్రావిన్సులను నారింజ రంగు దుమ్ము మేఘాలు కమ్మేశాయి. నజఫ్, బస్రా ప్రావిన్సుల్లో విమానాశ్రయాలను మూసేశారు. ఇరాక్‌లో దుమ్ము తుఫానులు పరిపాటి. కానీ వాతావరణ మార్పుల వల్ల అవి తరచూ వచ్చిపడుతున్నాయి. విపరీతమైన వేడి, నీటి కొరతతో వాతావరణ మార్పులకు విపరీతంగా లోనయ్యే దేశాల్లో ఇరాక్ ఒకటని ఐరాస పేర్కొంది. 2022లో తీవ్రమైన ఇసుక తుఫానుతో 5,000 మందికి పైగా శ్వాసకోశ వ్యాధుల బారిన పడ్డారు.

ప్రతి 10 లక్షల మందికి 15 మందే జడ్జీలు

భారతీయ న్యాయవ్యవస్థ తాజా స్థితిపై నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: భారత్‌లో ప్రతి 10 లక్షల జనాభాకు 50 మంది జడ్జీలు ఉండాలని ఓవైపు న్యాయకమిషన్ సిఫార్సులు చేస్తుంటే వాస్తవ పరిస్థితి అందుకు పూర్తి విరుద్ధంగా ఉందన్న విషయం బహిర్గతమైంది. దేశ జనాభాలో సగటున 10 లక్షల జనాభాకు కేవలం 15 మంది జడ్జీలే ఉన్నారని ''2025 ఇండియా జస్టిస్'నివేదిక పేర్కొంది. దేశవ్యాప్తంగా న్యాయవ్యవస్థ అమలు, తీరుతెన్నులను నివేదిక సమగ్రంగా విశ్లేషించింది. ''140 కోట్ల భారతీయులకుగాను కేవలం 21,285 మంది జడ్జీలే ఉన్నారు. అంటే 10 లక్షల జనాభాకు 15 మంది జడ్జీలన్నమాట. 10 లక్షల మందికి కనీసం 50 మంది జడ్జీలుండాలని లా కమిషన్ 1987లో చేసిన సిఫార్సుల స్థాయిని దేశం ఈనాటికీ చేరుకోలేకపోయింది. అన్ని హైకోర్టులకు కలిపి గరిష్టంగా అనుమతించిన జడ్జీల్లో 33 శాతం జడ్జీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 2025లో ఈ ఖాళీలు 21 శాతంగా నమోదయ్యాయి. హైకోర్టు జడ్జీలపై పనిభారాన్ని ఈ గణాంకాలు చాటుతున్నాయి''అని నివేదిక పేర్కొంది.



జడ్జీల్లో ఎస్టీలు 5 శాతమే

''జిల్లా కోర్టుల్లో జడ్జీల్లో 5 శాతం మంది మాత్రమే ఎస్టీ సామాజిక వర్గం వారు ఉన్నారు. 14 శాతం మంది ఎస్సీలు ఉన్నారు. 2018 నుంచి హైకోర్టులో 698 మంది జడ్జీలను నియమిస్తే వారిలో కేవలం 37 మంది మాత్రమే ఎస్సీ, ఎస్టీలున్నారు. కర్ణాటక, మణిపూర్, మేఘాలయ, సిక్కిం, త్రిపుర హైకోర్టులను మినహాయిస్తే మిగతా హైకోర్టుల్లో సగం కేసులు మూడేళ్లగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. అండమాన్, నికోబార్, అరుణాచల్ ప్రదేశ్, బిహార్, గోవా, జార్ఖండ్, మహారాష్ట్ర, మేఘాలయ, ఒడిశా, రాజస్తాన్, ఉత్తర ప్రదేశ్, పశ్చిమబెంగాల్ జిల్లా కోర్టులను మినహాయిస్తే మిగతా రాష్ట్రాల జిల్లా కోర్టుల్లో 40 శాతానికిపైగా కేసులు మూడేళ్లుగా కోర్టులో మూలుగుతున్నాయి''అని నివేదిక పేర్కొంది. 2019లో టాటా ట్రస్ట్ ఈ నివేదిక రూపకల్పనకు నడుం బిగించింది. తర్వాత సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్, కామన్ కాజ్, కామన్వెల్త్ హ్యూమన్‌రైట్స్ ఇనిషియేటివ్, దక్ష, టిస్-ప్రయాస్, విధి సెంటర్ ఫర్ లీగల్ పాలసీ, హౌ ఇండియా లివ్స్ సంస్థలూ ఈ నాలుగో విడత నివేదిక రూపకల్పనలో భాగం పంచుకున్నాయి.

పోలీసింగ్, న్యాయ వితరణలో దక్షిణాది టాప్

కారాగారాల సమర్థ నిర్వహణ, పోలీసింగ్, న్యాయ వితరణ విషయంలో దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. పోలీసింగ్, జైళ్ల నిర్వహణ, న్యాయవ్యవస్థ, న్యాయ సాయం అంశాలను పరిగణనలోకి తీసుకుని తయారుచేసిన ఈ జాబితాలో కర్ణాటక అగ్రస్థానంలో నిలిచింది. 18 పెద్దరాష్ట్రాల ఈ జాబితాలో పశ్చిమబెంగాల్ అట్టడుగున నిలిచింది. పెద్ద, మధ్యస్థాయి రాష్ట్రాల జాబితాలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు ముందు వరసలో నిలిచాయి. ఈ విభాగంలో గత ఏడాది 11వ స్థానంతో సరిపెట్టుకున్న తెలంగాణ ఈసారి మూడో స్థానానికి ఎగబాకడం విశేషం. చిన్న రాష్ట్రాల్లో సిక్కిం అద్భుత, గోవా పేలవ ప్రదర్శన కనబర్చాయి. గతంతో పోలిస్తే బాగా పుంజుకున్న రాష్ట్రంగా బిహార్ నిలిచింది. గత పదేళ్లకాలంలో జైళ్లలో ఖైదీ సంఖ్య 50 శాతం పెరిగింది. ఇందులో విచారణఖైదీలుగా జైళ్లలో మగ్గిపోతున్న వారు ఏకంగా 76 శాతం మంది ఉన్నారు.

ఒక్కో జడ్జిపై 2,200 కేసుల భారం

''కోర్టుల్లో కేసుల కొండ పెరిగింది. జిల్లా కోర్టుల విషయానికొస్తే సగటున ఒక్కో న్యాయమూర్తి నెత్తిన 2,200 కేసుల భారం ఉంది. ఇక అలహాబాద్, మధ్యప్రదేశ్ హైకోర్టుల్లో అయితే ఒక్కో జడ్జి నెత్తి మీద ఏకంగా 15,000 కేసులను మోస్తున్నారు. జిల్లా కోర్టుల్లో 38.3 శాతం మంది మహిళా జడ్జీలు ఉన్నారు. 2025 ఏడాదిలో హైకోర్టుల్లో మహిళా న్యాయమూర్తుల ప్రాధాన్యం కేవలం 14 శాతానికి పరిమితమైంది. హైకోర్టులు, సుప్రీంకోర్టులతో పోలిస్తే జిల్లా కోర్టుల్లోనే మహిళా జడ్జీలు ఎక్కువున్నారు. 25 హైకోర్టుల్లో మహిళా చీఫ్ జస్టిస్‌గా ఒక్కరే ఉన్నారు''అని నివేదిక వెల్లడించింది.

విరమణ చర్చలు విఫలం

ఇజ్రాయెల్, హమాస్ మొండి వైఖరి

జెరూసలేం: ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ పునరుద్దరణకు జరిగిన చర్చలు విఫలమయ్యాయి. యుద్ధానికి పూర్తిగా ముగింపు పలకాలని హమాస్ డిమాండ్ చేసింది. నిరాయుధీకరణ ఒప్పందాన్ని తిరస్కరించింది. హమాస్‌ను తుదముట్టించేవరకూ సైనిక చర్యలు ఆపేది లేదని ఇజ్రాయెల్ ప్రకటించింది. దాంతో ఎలాంటి ఒప్పందం లేకుండానే చర్చలు ముగిశాయి. విరమణను పొడిగిస్తే పాలస్తీనా ఖైదీలకు బదులుగా విడుదల చేయాల్సిన ఇజ్రాయెల్ బందీల సంఖ్యపై చర్చలు జరుపుతామని హమాస్ సంకేతాలిచ్చింది. గతంలో ప్రతిపాదించిన సంఖ్య కంటే ఎక్కువ మందిని వదిలేస్తామని పేర్కొంది. ఐదుగురికి బదులుగా పదిమందిని విడుదల చేయాలని ఇజ్రాయెల్ మంత్రి జీవ్ ఎలిగ్జిన్ డిమాండ్ చేశారు. దీనిపై స్పందించేందుకు హమాస్ గడువు కోరింది. ఇజ్రాయెల్‌తో మరో దఫా చర్చల కోసం తమ ప్రతినిధి బృందాన్ని ఖతార్‌కు పంపుతామని సోమవారం ప్రకటించింది. ఈ వారాంతం, లేదా వచ్చే వారం చర్చలు మొదలయ్యే అవకాశముంది. జనవరిలో ఆరు వారాల కాల్పుల విరమణ కారణంగా వందలాది మంది పాలస్తీనా ఖైదీలకు బదులుగా 33 మంది ఇజ్రాయెల్ బందీలను హమాస్ విడుదల చేయడం తెలిసిందే. అనంతరం ఇజ్రాయెల్ దాడులను పునఃప్రారంభించింది. ఈ రెండు నెలల్లోనే 1,500 మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. హమాస్ వద్ద ఇంకా 59 మంది ఇజ్రాయెల్ బందీలున్నారు. వారిలో 24 మంది బతికి ఉండొచ్చని అంచనా.

తాజా దాడుల్లో 25 మంది మృతి

ఇజ్రాయెల్ దాడులతో లక్షలాది మంది గాజాను వీడుతున్నారు. మరిన్ని భూభాగాలను ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకుంటోంది. గాజాలోకి సహాయ సామగ్రిని అడ్డుకుంటోంది. దాంతో జనజీవనం దుర్భరంగా మారింది. ఉత్తర గాజాలోని జాబాలియాలో ఇజ్రాయెల్ తాజా వైమానిక దాడుల్లో ఓ భవనం నేలమట్టమైంది. కనీసం 25 మంది మరణించినట్లు తెలుస్తోంది.

'బిహార్'పై మంత్రాంగం షురూ!

ఎన్నికల్లో పొత్తులపై కాంగ్రెస్ అధిష్టాన పెద్దలతో ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ చర్చలు

- ఎన్నికల అజెండా అంశాలపై సుదీర్ఘ మంతనాలు
- 17న పట్నాలో మరోమారు భేటీ
- నితీశ్‌ను బీజేపీ హైజాక్ చేసిందని తేజస్వి విసుర్లు

సాక్షి, న్యూఢిల్లీ: ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న బిహార్ శాసనసభ ఎన్నికలపై విపక్షాల 'ఇండియా' కూటమి ఇప్పటికే తమ వ్యూహరచనకు శ్రీకారం చుట్టింది. జనతాదళ్(యూ) నేతృత్వంలోని నితీశ్ కుమార్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్న కసితో ఉన్న రాష్ట్రీయజనతాదళ్(ఆర్‌జేడీ) తన మిత్రపక్షాలైన కాంగ్రెస్, వామపక్ష పార్టీలతో తొలిదశ చర్చలు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా మంగళవారం ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలతో ఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ భేటీకి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్‌తో పాటు బిహార్ కాంగ్రెస్ చీఫ్ రాజేష్ కుమార్, ఆర్జేడీ నాయకులు మనోజ్ ఝా, సంజయ్ యాదవ్ పాల్గొన్నారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన చర్చల్లో పొత్తులు, సీట్ల పంపకాలు, ఎన్నికల అజెండా తదితర కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

అధికారమే లక్ష్యంగా..

గత 2020లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ-జేడీయూలు ఎన్డీఏ కూటమిగా, ఆర్‌జేడీ-కాంగ్రెస్‌లు మహాఘట్‌బంధన్ కూటమిగా బరిలో దిగాయి. 243 స్థానాలున్న బిహార్‌లో ఎన్డీఏ కూటమి 125 స్థానాలను కైవలం చేసుకుంది. మహాఘట్‌బంధన్ కూటమి 110 స్థానాలను దక్కించుకుంది. దీంతో ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టిన నితీశ్ కుమార్ 2022లో బీజేపీతో విభేదించి మహాఘట్‌బంధన్‌లో చేరి తిరిగి ముఖ్యమంత్రి అయ్యారు. అనంతరం మళ్లీ 2024లో మహాఘట్‌బంధన్‌తో బంధం తెంచుకుని తిరిగి బీజేపీ చెంతనచేరారు. కమలదళం దన్నుతో మళ్లీ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు. తాను కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమిలో చేరి అతిపెద్ద తప్పు చేశానని, ఇకపై అలాంటి తప్పులకు తావివ్వబోనని వ్యాఖ్యానించారు. నితీశ్ అంత మోసకారి మరొకరు లేరని, ఆయన విశ్వాసఘాతకుడంటూ కాంగ్రెస్, ఆర్‌జేడీలు ఆయనపై విమర్శలు గుప్పించాయి. నితీశ్ అవకాశ వాదానికి గట్టిగా బదులివ్వాలనే దృఢ సంకల్పంతో ఉన్న రెండు పార్టీలు ఆయన్ను బలంగా ఢీకొట్టాలని భావిస్తున్నాయి. ప్రస్తుతం అసెంబ్లీలో 243 స్థానాలకుగానూ బీజేపీకి 78, జేడీయూకి 45మంది ఎమ్మెల్యేలు ఉండగా, ఆర్‌జేడీకి 75, కాంగ్రెస్‌కు 19 మంది ఎమ్మెల్యేల మద్దతుంది. గడిచిన ఎన్నికల్లో కాంగ్రెస్ 70 స్థానాల్లో పోటీ చేయగా, ఈసారి దాదాపు 90 స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తోంది. ఆర్‌జేడీ గత ఎన్నికల్లో 144 స్థానాల్లో పోటీ పడగా, ఈ సారి 150కి పైగా స్థానాల్లో పోటీకి ఉవ్విళ్లూరుతోంది. మిత్రపక్షాలైన లెఫ్ట్ పార్టీలకు ఎన్ని సీట్లు కేటాయించాలన్న దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆరు నెలల ముందు నుంచే ఎన్నికల సంసిద్ధతను మొదలుపెట్టి సీట్ల పంపకాలు, ఎన్నికల ప్రచార అంశాలపై ఆర్జేడీ తొలి దశ చర్చలకు శ్రీకారం చుట్టింది.



మంగళవారం ఢిల్లీలో ఆర్జేడీ డనేత తేజస్వీ యాదవ్‌తో భేటీ అయిన కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ

నితీశ్‌ను బీజేపీ హైజాక్ చేసిందన్న తేజస్వి

ఈ భేటీ అనంతరం తేజస్వి యాదవ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌తో చర్చలు సానుకూలంగా జరిగాయని, ఏప్రిల్ 17న పట్నాలో కాంగ్రెస్ నాయకులతో జరిగే తదుపరి సమావేశంలో మరిన్ని వివరాలను చర్చిస్తామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌ను బీజేపీ హైజాక్ చేసిందని, ఎన్డీఏ పాలనలో ఎటువంటి అర్థవంతమైన అభివృద్ధి జరగలేదని వ్యాఖ్యానించారు.ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఓడించేందుకు ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలు సహా ఇతర పార్టీలతో కూడిన మహాఘటబంధన్ జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఐక్యంగా పోటీ చేస్తుందని పేర్కొన్నారు. తమ కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఆర్జేడీ, కాంగ్రెస్‌లు చర్చించి ఏకగ్రీవంగా సీఎం అభ్యర్థిని నిర్ణయిస్తాయని, ఈ విషయంలో ఊహాగానాలకు తావివ్వరాదని అన్నారు.

అమెరికా వీసాలు హక్కు కాదు, అదృష్టం

గౌరవంగా ఉండేవారికే ప్రవేశం: రూబియో

వాషింగ్టన్: అమెరికా వీసా విధానంపై కఠిన వైఖరిని విదేశాంగ మంత్రి మార్కో రూబియో సమర్థించుకున్నారు. ''అమెరికా వీసాలు హక్కు కాదు. కొందరికి మాత్రమే లభించే అదృష్టం. మా చట్టాలు, విలువలను గౌరవించే వారికే అమెరికాలో ప్రవేశం ఉంటుంది''అని స్పష్టం చేశారు. వలస నిబంధనలను మరింత కఠినతరం చేస్తామన్నారు. అమెరికా వర్సిటీల్లోని పాలస్తీనా అనుకూల విద్యార్థులపై చర్యల నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేశారు. వీసాదారులంతా తమ అర్హత ప్రమాణాలను నిరంతరం అందుకుంటూ ఉండాల్సిందేనన్నారు. లేదంటే వాటిని రద్దు చేయాల్సి రావచ్చని హెచ్చరించారు. ''అమెరికాకు ఎవరు రావచ్చో, ఎవరు రాకూడదో చట్టాలు స్పష్టంగా ఉన్నాయి. ఆ నిబంధనల ప్రకారమే ప్రతి వీసా దరఖాస్తునూ పరిశీలిస్తారు. ఉగ్రవాద కార్యకలాపాలను సమర్థించేవారు, అందుకు ఇతరులను ఒప్పించే వ్యక్తులు సైతం యూఎస్ వీసాలకు అనర్హులు''అన్నారు. గతేడాది అమెరికా వర్సిటీల క్యాంపస్‌లలో జరిగిన ఘటనలను ప్రస్తావించారు. అమెరికాలో 11 లక్షలకు పైగా విదేశీ విద్యార్థులున్నారు. ''నిరసనల సందర్భంగా వారిలో పలువురు క్యాంపస్‌లను మూసేశారు. యూదు విద్యార్థులను వేధించారు. రహదారులను దిగ్బంధించారు.భవనాలనూ ముట్టడించారు''అని రూబియో చెప్పుకొచ్చారు. ''ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటాం. వీసా ఉల్లంఘనల విషయంలో విదేశీయులకు రాజ్యాంగ రక్షణ వర్తించదు''అన్నారు.

అణ్వస్త్రాల మాటే మర్చిపోండి... లేదంటే దాడులే!

ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: అమెరికాతో అణు ఒప్పందం దిశగా ఇరాన్ అడుగు ముందుకేసిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు హెచ్చరికలు చేశారు. ''అణ్వస్త్ర భావననే ఇరాన్ మర్చిపోవాలి. లేదంటే ఆ దేశ అణు స్థావరాలపై సైనిక చర్యలకు వెనుకాడం''అని స్పష్టం చేశారు. అణ్వాస్త్ర తయారీకి ఇరాన్ చాలా చేరువగా వచ్చింది. అందుకే అణు ఒప్పందాన్ని కావాలనే జాప్యం చేస్తోంది''అని ఆరోపించారు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ శనివారం ఒమన్‌లో ఇరాన్ సీనియర్ అధికారితో భేటీ అయ్యాక ట్రంప్ ఈ మేరకు ప్రకటన చేశారు. నిర్మాణాత్మక చర్చలు జరిగాయని ఇరాన్, అమెరికా తెలిపాయి. వాటిపై ఇరాన్ సుప్రీం నాయకుడు అయతొల్లా ఖమేనీ మంగళవారం స్పందించారు. ''అవి సానుకూలంగా జరిగాయి. అయితే ఇందులో మరీ ఆనందించడానికి గానీ, బాధపడటానికి గానీ ఏమీ లేదు'' అన్నారు. రెండో దశ చర్చలు రోమ్‌లో జరగాలని నిర్ణయించగా ఇరాన్ మాత్రం అవి ఒమన్‌లోనే కొనసాగాలని తాజాగా కోరింది. తాము అణ్వాయుధాలను కోరుకోవడం లేదని ఆ దేశం పదేపదే చెబుతుండటం తెలిసిందే.

అమెరికా-ఇరాన్ అణు ఒప్పందం

2015 అంతర్జాతీయ అణు ఒప్పందానికి నేతృత్వం వహించిన అధ్యక్షుడు బరాక్ ఒబామా హయాంలోనే ఇరు ప్రభుత్వాల మధ్య చివరిసారిగా ప్రత్యక్ష చర్చలు జరిగాయి. అమెరికా మాజీ అధ్యక్షుడు జోబైడెన్ హయాంలో అమెరికా, ఇరాన్ పరోక్ష చర్చలు జరిపినా పెద్దగా పురోగతి కనిపించలేదు. అయితే, జనవరిలో అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ ఇరాన్‌ను మళ్లీ తెరపైకి తెచ్చారు. ఇరాన్ అత్యున్నత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీకి మార్చిలో ఒక లేఖను పంపారు. అణు చర్చలకు పిలుపునిచ్చారు. టెహ్రాన్ నిరాకరిస్తే సైనిక చర్య తప్పదని హెచ్చరించాడు. ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేస్తోందని అమెరికాతో సహా పాశ్చాత్య దేశాలు చాలాకాలంగా అనుమానిస్తున్నాయి. ఈ ఆరోపణలను టెహ్రాన్ ఖండిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి ఈ వారంలో మిత్రదేశమైన రష్యాలో పర్యటించి అమెరికాతో అణు ఒప్పందంపై చర్చించనున్నారు.

కారణం చూపకుండానే 9 మంది వీసా రద్దు

ఆందోళన వ్యక్తం చేసిన మసాచుసెట్స్ యూనివర్సిటీ

వాషింగ్టన్: దేశ వ్యతిరేక భావజాలం నింపుకున్న వాళ్లకు అమెరికాలో నిలువనీడ లేదని ఇప్పటికే చాటిన ట్రంప్ సర్కార్ పలు విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసిస్తున్న విదేశీ విద్యార్థుల వీసాల రద్దు పర్వాన్ని కొనసాగిస్తోంది. శాస్త్రసాంకేతిక పరిశోధనా విద్యలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ది మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) విశ్వవిద్యాలయం పైనా ఈ వీసాల రద్దు ప్రభావం పడింది. ఇప్పటికే పలు వర్సిటీల్లో విద్యార్థులతో పాటు పరిశోధకులు, బోధనా, బోధనేతర సిబ్బంది పైనా వీసాల రద్దు వేటువేసిన రిపబ్లికన్ ప్రభుత్వం కనీసం ఎందుకు వీసా రద్దు చేస్తున్నారో చెప్పకపోవడం దారుణమని ఎంఐటీ వర్సిటీ పేర్కొంది. తమ వర్సిటీలో 9 మంది విదేశీ విద్యార్థుల వీసాలను కారణం చూపకుండానే రద్దుచేశామని వర్సిటీ తాజాగా వెల్లడించింది. అమెరికాలో సీబీఎస్ మీడియాసంస్థ సమాచారం మేరకు ఇప్పటిదాకా అక్కడి 88 కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో దాదాపు 530 మంది విద్యార్థులు, సిబ్బంది, పరిశోధకుల వీసాలను ట్రంప్ ప్రభుత్వం ఆకస్మికంగా రద్దుచేసింది. తమ వర్సిటీలో విదేశీ విద్యార్థుల వీసాల రద్దుపై ఎంఐటీ వర్సిటీ అధ్యక్షురాలు సలీ కార్న్‌బ్లూత్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. వర్సిటీ వర్గాలకు ఈ మేరకు సోమవారం ఆమె ఒక లేఖ రాశారు. ''ఏప్రిల్ 4వ తేదీ తర్వాత హఠాత్తుగా విద్యార్థుల చదువులను కాలరాస్తూ తీసుకున్న ఈ విధానాలు ఏమాత్రం ఆమోదనీయంకాదు. కనీసం ముందస్తు సమాచారం ఇవ్వలేదు. వీసాల రద్దుకు కారణం చెప్ప లేదు. అత్యంత ప్రతిభావంతులైన విదేశీ విద్యార్థులను ఆకర్షించగల వర్సిటీ సామర్థ్యాన్ని ఈ నిర్ణయాలు దెబ్బతీస్తాయి. వర్సిటీ కార్యకలాపాలూ కుంటుపడతాయి. అప్పుడు అంతర్జాతీయంగా వర్సిటీల్లో శాస్త్రసాంకేతిక పరిశోధనలకు సంబంధించి మా వర్సిటీలో ప్రపంచ అగ్రగామిగా కొనసాగడం కష్టసాధ్యమవుతుంది. నూతన పరిశోధనలు, ఆవిష్కరణలతో దేశాన్ని మరింత సుసంపన్నం చేసే క్రతువు కుంటువుడుతుంది''అని ఆమె అన్నారు.

పరిశోధనా వ్యయాలకు పరిమితిపైనా వర్సిటీల ఆగ్రహం

అధునాతన అధ్యయనాలకు సంబంధించిన పరోక్ష పరిశోధనా వ్యయాలను పరిమితం చేసుకోవాలని ప్రభుత్వ ఇంధన శాఖ ప్రకటించడంపై వర్సిటీలో తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. పరోక్ష పరిశోధనా ఖర్చులు ఎంత పెరిగినాసరే ప్రభుత్వం మాత్రం 15 శాతం మాత్రమే రీయింబర్స్ చేస్తుందని పేర్కొనడాన్ని వర్సిటీలు తీవ్రంగా తప్పుబడుతున్నాయి. విద్యాసంస్థలకు నిధులు తగ్గిస్తే ఆయా విభాగాల సిబ్బందికి జీతభత్యాల చెల్లింపు దాదాపు ఆగిపోతుందని వర్సిటీలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ఈ మేరకు ఇప్పటికే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎనర్జీ(డీఓఈ)పై బోస్టన్ ఫెడరల్ కోర్టులో ప్రిన్స్‌టన్, కాల్‌టెక్, ఇల్లినాయీ, ఎంఐటీ వర్సిటీలు కోర్టులో దావా వేశాయి.

గ్రామ న్యాయాలయాల బిల్లును ఎప్పుడు ఆమోదించారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

భారత న్యాయ వ్యవస్థ

దిగువ కోర్టులు (Subordinate Courts)

భారత రాజ్యాంగంలోని ఆరో భాగంలో ప్రకరణలు 233 నుంచి 237 వరకు సబార్డినేట్ కోర్టులు (అధీన న్యాయస్థానాలు) గురించి ప్రస్తావించారు. హైకోర్టు తర్వాత వచ్చే దిగువ కోర్టులను 'సబార్డినేట్ కోర్టులు' అంటారు. వీటిలో జిల్లా కోర్టులు, సిటీ సివిల్ కోర్టులు, మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులు ఉంటాయి.

సిటీ సివిల్ కోర్టులు, జిల్లా అదనపు న్యాయమూర్తి, సంయుక్త న్యాయమూర్తి, అదనపు న్యాయమూర్తి, సెషన్స్ జడ్జీలకు 'జిల్లా జడ్జీ' హోదా ఉంటుంది.

ప్రకరణ 50 ప్రకారం అధీన న్యాయస్థాలను కార్యనిర్వాహక శాఖ నుంచి వేరు చేశారు. కింది న్యాయస్థానాలపై అప్పీళ్లు, పర్యవేక్షణాధికార పరిధి తోపాటు న్యాయమూర్తులపై పరిపాలనా నియంత్రణను హైకోర్టు కలిగి ఉంటుంది.

- ప్రకరణ 233 ప్రకారం జిల్లా న్యాయమూర్తుల నియామకం, పదోన్నతి విషయాల్లో గవర్నర్ హైకోర్టును సంప్రదిస్తారు.
- ప్రకరణ 243 ప్రకారం న్యాయమూర్తులతో పాటు న్యాయశాఖ సర్వీసుకు చెందిన ఇతర ఉద్యోగుల నియామకం విషయంలో, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తోపాటు హైకోర్టును కూడా గవర్నర్ సంప్రదించాలి.
- జిల్లా కోర్టులు, వాటి కింది కోర్టుల్లో పనిచేసే నిమ్న స్థాయి ఉద్యోగాల నియామకం, పదోన్నతి, సెలవు మంజూరు లాంటి వ్యవహారాలపై నియంత్రణను హైకోర్టుకు ఇచ్చారు.

జాతీయ న్యాయ మండలి (National Judicial Council)

లోక్‌సభ 2008 అక్టోబరు 8న న్యాయమూర్తుల విచారణ బిల్లు-2006ను ఉపసంహరించి, దానిస్థానంలో న్యాయమూర్తుల విచారణ సవరణ బిల్లు-2008ని ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదిత బిల్లు జాతీయ న్యాయమండలి (ఎన్.జె.సి.) ఏర్పాటుకు అవకాశం కల్పిస్తుంది. ఇందులోని ముఖ్యాంశాలు..

- ఉన్నత స్థానాల్లో ఉన్న న్యాయమూర్తులపై వచ్చిన ఫిర్యాదుల దర్యాప్తు, నిర్ణీత ప్రక్రియను అవలంబించడం ద్వారా ఫిర్యాదులు వచ్చిన వారిపై తీసుకోవాల్సిన చర్యలను సిఫార్సు చేసే అధికారం ఈ మండలికి ఉంటుంది.
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టుకు చెందిన ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులు, అత్యధిక సీనియారిటీ ఉన్న ఇద్దరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు (వీరిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నామినేట్ చేస్తారు) ఈ మండలిలో సభ్యులుగా ఉంటారు.
- సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులపై ఎన్.జె.సి.కి ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. ఈ ఫిర్యాదుపై ప్రాథమిక పరిశీలన చేసి, విచారణ జరిపే అధికారం ఎన్.జె.సి.కి ఉంటుంది. ఆరోపణలు ఎదుర్కొన్న న్యాయమూర్తి దోషిగా నిరూపణ అయితే, ఆ న్యాయమూర్తిని పార్లమెంట్‌లో అభిశంసించడం ద్వారా పదవి నుంచి తొలగించాలని ఎన్.జె.సి. సూచించవచ్చు. దుష్ప్రవర్తనకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదు నిరూపణ అయితే.. ఆ ప్రవర్తన పదవి నుంచి తొలగించాల్సినంత తీవ్రమైంది కాకపోతే హెచ్చరించడం, మందలించడం, అభిశంసించడం లేదా నిర్ణీత కాలంపాటు ఏవిధమైన న్యాయపరమైన బాధ్యతలు అప్పగించకపోవడం, పదవీ విరమణ కోరడం లాంటి చర్యలు తీసుకోవచ్చు.
- న్యాయమూర్తిని తొలగించాలని కోరుతూ చేసిన తీర్మానం ప్రాతిపదికగా లోక్‌సభ స్పీకర్ లేదా రాజ్యసభ స్పీకర్ నివేదిస్తే.. న్యాయ మండలి స్వల్ప చర్యను సిఫారసు చేయడం, తీసుకోవడంగానీ చేయలేదు.



ఈ ప్రతిపాదిత బిల్లు న్యాయవ్యవస్థ పనితీరులో పారదర్శకత తీసుకువస్తుంది. దాని ప్రతిష్ఠను కూడా ఇనుమడింపజేస్తుంది.

గ్రామ న్యాయాలయాలు

గ్రామ న్యాయాలయాల బిల్లు-2008 పార్లమెంటు ఉభయ సభలు డిసెంబర్ 3న ఆమోదించాయి. గ్రామ న్యాయాలయాల చట్టాన్ని 2009 అక్టోబరు 2 (గాంధీ జయంతి సందర్భంగా) నుంచి అమల్లోకి తీసుకువచ్చారు. ఈ చట్టం ద్వారా దేశవ్యాప్తంగా బ్లాక్ స్థాయిలో 5,067 కోర్టులను ఏర్పాటు చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. దేశంలోని గ్రామీణ ప్రజలు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో న్యాయం పొందడానికి వీలవుతుంది. గ్రామ న్యాయాలయాలు చట్టం ప్రకారం దేశంలోని వివిధ గ్రామాల్లో సంచార న్యాయస్థానాలను ఏర్పాటు చేస్తారు. ఈ న్యాయస్థానాల్లో విచారణను న్యాయాధికారి (ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్) నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధిత హైకోర్టులను సంప్రదించి ఈ న్యాయాధికారులను నియమిస్తాయి.

గ్రామ న్యాయాలయాలు విచారించే కేసులు:

క్రిమినల్, సివిల్ కేసులు, మరణశిక్ష, యావజ్జీవ కారాగార శిక్ష, రెండు సంవత్సరాలకు పైగా శిక్ష విధింపునకు సంబంధించిన కేసులు మినహా మిగిలిన అన్ని రకాల వివాదాలపై గ్రామ న్యాయాలయాలు విచారణ నిర్వహిస్తాయి. దొంగతనం, దొంగిలించిన వస్తువులను తీసుకోవడం లేదా తన వద్ద ఉంచుకోవడం, దొంగిలించిన వస్తువులు లేదా ఆస్తిని దాచడానికి సహకరించడం (వాటి విలువ రూ. 20,000లకు పైగా లేని సందర్భాల్లో), ఆస్తి కొనుగోలు, భూమిని సాగు చేసుకోవడం, బోరు బావి లేదా సాధారణ బావి నుంచి నీటిని వినియోగించుకోవడం లాంటి కేసులను న్యాయాలయాలు విచారిస్తాయి.

సెషన్స్ కోర్టుకు అప్పీల్ చేసే అవకాశం:

గ్రామ న్యాయాలయాలు ఇచ్చే తీర్పులను సవాలు చేస్తూ సెషన్స్ కోర్టులో అప్పీలు చేసుకునే అవకాశం ఉంది. అప్పీలు దాఖలు చేసిన ఆరు నెలల్లోగా సెషన్స్ కోర్టులు విచారణ జరిపి, తీర్పు ప్రకటించాలి.

లోక్ అదాలత్ (ప్రజా న్యాయస్థానం)

న్యాయస్థానాల్లో కొన్ని కారణాల వల్ల కేసులు పరిష్కరించడంలో ఎక్కువ జాప్యం జరుగుతుంది. వాది, ప్రతివాదులు కూడా కొన్ని సందర్భాల్లో పరిష్కారాలకు సుముఖంగా ఉండక కాలయాపన చేస్తుంటారు. కేసులను త్వరితగతిన పరిష్కరించడం కోసం ప్రత్యామ్నాయ వివాద విచారణ (Alternative Dispute Resolution) పద్ధతిలో లోక్ అదాలత్‌లను ఏర్పాటు చేస్తారు.

- లోక్ అదాలత్ పద్ధతిని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి.ఎన్. భగవతి ప్రచారంలోకి తీసుకు వచ్చారు.
- 1982లో గుజరాత్‌లో మొదటిసారిగా లోక్ అదాలత్‌లను ప్రారంభించారు.
- 1987లో లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం ద్వారా లోక్ అదాలత్‌లకు చట్టబద్ధత కల్పించారు. నిర్దేశిక నియమాల్లో ప్రకరణ 39ఎ ప్రకారం ప్రజలకు ఉచిత న్యాయ సలహా అందించాలని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగానే వీటిని ఏర్పాటు చేశారు.

సులభంగా పరిష్కరించగలిగే కొన్ని రకాల కేసులను పెద్ద మనుషుల మధ్యవర్తిత్వంలో పరిష్కరించడానికి చట్టబద్ధమైన ప్రతిపత్తి కలిగిస్తూ 'లోక్ అదాలత్' పేరుతో ప్రజా న్యాయస్థానాలనే వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ పేదలకు ఉచితంగా న్యాయం అందిస్తుంది. సాధారణ న్యాయస్థానాల్లో పనిచేస్తున్న న్యాయమూర్తి లోక్ అదాలత్ న్యాయాధిపతిగా కూడా వ్యవహరిస్తారు. ఈ విధానం వల్ల కేసులను పరిష్కరించడంలో ఆలస్యాన్ని నివారించవచ్చు.

లోక్ అదాలత్ నిర్మాణం:

సుప్రీంకోర్టు, హైకోర్టు, లీగల్ సర్వీసెస్ కమిటీ, రాష్ట్ర, జిల్లా స్థాయి లీగల్ సర్వీస్ కమిటీలు లోక్ అదాలత్‌లను నిర్వహించవచ్చు. ఇందులో జిల్లా ప్రస్తుత న్యాయమూర్తి లేదా పదవీ విరమణ చేసిన న్యాయమూర్తి, ఆదేవిధంగా వివిధ రంగాల్లో ప్రముఖులు.. ముఖ్యంగా న్యాయశాస్త్రం, సామాజిక సేవ, నిమ్న వర్గాల వికాసానికి కృషి చేస్తున్న వ్యక్తులు సభ్యులుగా ఉంటారు. లోక్ అదాలత్ ఇచ్చే తీర్పులు అంతిమం. వీటిని సాధారణంగా అప్పీల్ చేసుకోవడానికి వీలు లేదు. పార్లమెంట్ 2002లో లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం-1987కు సవరణ చేసి శాశ్వత పద్ధతిలో లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసింది. దీని ప్రకారం శాశ్వత లోక్ అదాలత్‌కు జిల్లా న్యాయమూర్తి లేదా అదనపు న్యాయమూర్తి చైర్మన్‌గా ఉంటారు. పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్‌లో ఇద్దరు నిష్ణాతులను ప్రభుత్వాలు నామినేట్ చేస్తాయి.

లోక్ అదాలత్ పరిధిలోకి వచ్చే అంశాలు:

మోటారు వాహనాలు, ఇన్సూరెన్సు క్లెయిమ్‌లు, కాంట్రాక్టులకు సంబంధించిన వివాదాలు, వివాహ సంబంధ కేసులు, భూ సేకరణ, బ్యాంకు లోన్‌లకు సంబంధించిన కేసులు ఉభయ వర్గాల అంగీకారంతో లోక్ అదాలత్‌ల ద్వారా సత్వరంగా, సంతృప్తికరంగా పరిష్కారమవుతున్నాయి. ఇవి ప్రత్యేక తరహాలో రూపొందించిన న్యాయస్థానాలు. ప్రజలకు సత్వరమే న్యాయాన్ని అందించడం ఈ లోక్ అదాలత్‌ల ముఖ్య ఉద్దేశం.

వినియోగదారుల ఫోరాలు (Consumer Forums)

వినియోగదారులు, అమ్మకందారులకు మధ్య తలెత్తే వివాదాలు వినియోగదారుల ఫోరాల్లో పరిష్కారమవుతున్నాయి. ఇటీవల ఆధునిక రాజ్యాల్లో వినియోగదారుల హక్కులపై చైతన్యం పెరగడం వల్ల ఈ హక్కులకు భంగం కలిగితే వీటి ద్వారా పరిష్కారాలు ఇస్తున్నారు. ఇలా ఈ నూతన న్యాయస్థానాలు ప్రజా న్యాయస్థానాలుగా ఆదరణ పొందుతున్నాయి. 1986లో వినియోదారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని చేశారు. ఇవి మూడు స్థాయిల్లో పనిచేస్తాయి. జిల్లా స్థాయిలో పనిచేసే ఫోరాలు రూ.20 లక్షల లోపు విలువ ఉన్న కేసులను, రాష్ట్ర స్థాయిలోని ఫోరాలు రూ. 20 లక్షల నుంచి ఒక కోటి వరకు విలువ ఉన్న కేసులను, జాతీయ స్థాయిలోని ఫోరం కోటి రూపాయలకు పైగా విలువ ఉన్న కేసులను పరిశీలిస్తాయి. వినియోగదారుడు 100 రూపాయల రుసుం చెల్లించి ఫిర్యాదు చేయవచ్చు. సాధారణ న్యాయస్థానాల్లా న్యాయప్రకియలు ఉండవు. వినియోగదారుడు తన వాదనను స్వయంగా వినిపించవచ్చు.

మాదిరి ప్రశ్నలు

1. హైకోర్టు, సుప్రీంకోర్టుల న్యాయమూర్తులకు సంబంధించి ఏ విషయంలో పోలికలు ఉన్నాయి?
   ఎ) తొలగింపు బి) రాజీనామా
   సి) స్వతంత్ర ప్రతిపత్తి డి) పైవన్నీ
2. సుప్రీంకోర్టు న్యాయ సమీక్ష అధికారం నుంచి మినహాయించిన అంశం?
   ఎ) పార్లమెంటరీ ప్రక్రియలు
   బి) మంత్రి మండలి సలహా
   సి) సభాధ్యక్షుల నిర్ణయాలు
   డి) పైవన్నీ
3. కిందివాటిలో కొలీజియం వ్యవస్థలోని లోపం ఏది?
   ఎ) వృత్తిపరమైన ప్రీతి
   బి) పారదర్శకత లేకపోవడం
   సి) అనూహ్యమైన జాప్యం
   డి) పైవన్నీ
4. జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌కు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
   ఎ) ఇది రాజ్యాంగపరమైన సంస్థ
   బి) న్యాయ నియామకాలు, ఖాళీలను గుర్తిస్తుంది.
   సి) దీనికి అధిపతిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉంటారు
   డి) పైవన్నీ సరైనవే
5. సుప్రీం కోర్టు తీర్పులను ...
   ఎ) రాష్ట్రపతి మార్చవచ్చు
   బి) పార్లమెంటు మార్చవచ్చు
   సి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మార్చవచ్చు
   డి) ఏదీకాదు
6. కింది ఏ అంశాలను సుప్రీంకోర్టు ఆవిష్కరించింది?
   ఎ) ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం
   బి) మౌలిక నిర్మాణ సూత్రం
   సి) కొలీజియం భావన
   డి) పైవన్నీ
7. అమెరికా సుప్రీంకోర్టుకు భారత సుప్రీంకోర్టుకు మధ్య తేడా?
   ఎ) న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు
   బి) అపరిమిత న్యాయ సమీక్ష అధికారం
   సి) ఎ, బి డి) ఏదీకాదు
8. ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని దేనికి ఆపాదించవచ్చు?
   ఎ) న్యాయ సమీక్ష
   బి) న్యాయశాఖ క్రియాశీలత
   సి) న్యాయశాఖ పవిత్రత
   డి) న్యాయశాఖ ఆధిక్యత
9. సుప్రీంకోర్టును రాజ్యాంగ పరిరక్షణకర్తగా పేర్కొంటారు. దీనికి ప్రాతిపదిక?
   ఎ) జీతభత్యాలు బి) స్వతంత్ర సర్వీసులు
   సి) న్యాయ సమీక్ష డి) న్యాయశాఖ ఆధిక్యం
10. ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం సుప్రీంకోర్టులో ప్రారంభమైనప్పుడు నాటి ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
    ఎ) ఎం. హిదయతుల్లా
    బి) వి.ఆర్. క్రిష్ణ అయ్యర్
    సి) పి.ఎన్. భగవతి డి) ఎ.ఎస్.ఆనంద్
11. కింది ఏ కోర్టు లేదా కోర్టులను 'కోర్ట్ ఆఫ్ రికార్డ్స్'గా పరిగణిస్తారు?
    ఎ) సుప్రీంకోర్టు బి) హైకోర్టు
    సి) జిల్లా కోర్టు డి) ఎ, బి
12. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను తర్వాత కాలంలో మార్చవచ్చు. దీన్ని ఏమంటారు?
    ఎ) క్యూరేటివ్ పిటిషన్
    బి) రివిజన్ పిటిషన్
    సి) ప్రాస్పెక్టివ్ ఓవర్ రూలింగ్
    డి) స్టేర్ డెసిసిస్

సమాధానాలు

1) డి; 2) డి; 3) డి; 4) డి; 5) డి; 6) డి; 7) సి; 8) బి; 9) సి; 10) సి; 11) డి; 12) సి.

చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి ఎవరి బిరుదు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

డీసెట్‌లో తెలుగు సబ్జెక్టు కీలక పాత్ర పోషిస్తోంది. కాబట్టి అభ్యర్థులు అశ్రద్ధ చేయకుండా తెలుగుపై పట్టు సాధించాలి. ఇందులో ఎక్కువగా కవులు, రచయితలు, వారి కాలాలు, బిరుదులు, రచనలు, కావ్య ప్రక్రియలు, ప్రసిద్ధ కొటేషన్లు, సాహిత్య అంశాలు, సంధులు, సమాసాలు, ఛందస్సు, అలంకారాలు, అర్థాలు, నానార్థాలు, పర్యాయ పదాలు, ప్రకృతి- వికృతులు, జాతీయాలు- సామెతలు, ప్రత్యక్ష కథనం-పరోక్ష కథనం, నామ్నీకరణం, వాక్య భేదాలు తదితర వ్యాకరణఅంశాలపై ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. 8, 9, 10 తరగతుల కొత్త పాఠ్య పుస్తకాలను సేకరించి సొంత నోట్సు ప్రిపేర్ చేసుకోవాలి.

8వ తరగతి - తెలుగు

కవులు - పరిచయం

1. **గంగాపురం హనుమచ్ఛర్మ (1925-96):**
   గొప్ప కవి పండితులు, రాజకీయవేత్త, సమాజ సేవకులు
   పాఠ్యభాగం: దుందుభి
   ప్రక్రియ : గేయం
   ఇతివృత్తం: పర్యావరణం
   రచనా విశేషాలు: రుగ్వేద విజ్ఞానం, దుందుభి (నదీకావ్యం), మల్కిభరామ, గోపన
2. **డా. బిరుదురాజు రామరాజు (1925-2010):**
   జానపద సాహితీ వేత్త
   పాఠ్యభాగం: మన సంస్కృతి
   ప్రక్రియ: వ్యాసం
   ఇతివృత్తం: సంస్కృతి
   రచనా విశేషాలు: తెలుగు జానపద గేయ సాహిత్యం, చరిత్రకెక్కిన చరితార్థులు, ఆంధ్ర యోగులు, మరుగుపడిన మాణిక్యాలు, ఉర్దూ, తెలుగు నిఘంటువులు, శ్రీ సత్యసాయి విన్న పాలు, తెలుగు వీరుడు, వీరగాథలు, అల్లూరి సీతారామరాజు, తెలుగు జానపద రామాయ ణం, తెలుగు సాహిత్యోద్యమకారులు, తెలంగాణ పల్లెపాటలు, తెలంగాణ పిల్లల పాటలు .
3. **నన్నయ (11వ శతాబ్దం):**
   బిరుదు: ఆదికవి, వాగానుశాసనుడు.
   పాఠ్యభాగం: అమ్మ కోసం
   ప్రక్రియ: పద్యం
   ఇతివృత్తం: మాతృభక్తి
   రచనా విశేషాలు: మహాభారతం, ఆంధ్రశబ్ద చింతామణి, చాముండికా విలాసం, ఇంద్ర విజయం.
4. **కొండూరు వీరరాఘవాచార్యులు (20వ శతాబ్దం):**
   పాఠ్యభాగం: నీతి పరిమళాలు
   ప్రక్రియ: శతకం
   ఇతివృత్తం: నైతిక విలువలు
   రచనా విశేషాలు: మిత్ర సాహస్రి
5. **శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) (1910-83):**
   బిరుదు: మహాకవి, అభ్యుదయ కవిత్వ మూలవిరాట్టు.
   పాఠ్యభాగం: ప్రతిజ్ఞ **ప్రక్రియ:** గీతం
   ఇతివృత్తం: సామాజిక చైతన్యం
   రచనా విశేషాలు: ప్రభవ (భావ కవితా సంపుటి), మహాప్రస్థానం, ఖడ్గసృష్టి, మూడు యాభైలు, చరమరాత్రి, మరో ప్రస్థానం, సిప్రాలి, కార్టూన్ కవితలు, 1999 రేడియో నాటికలు, అనంతం (ఆత్మకథ).
6. **నార్ల వెంకటేశ్వరరావు (1908):**
   పత్రికా సంపాదకులు, కవి, విమర్శకులు, నాటక కర్త.
   పాఠ్యభాగం: అజంతా చిత్రాలు
   ప్రక్రియ: యాత్రా రచన
   రచనా విశేషాలు: రష్యన్ కథలు(అనువాద రచన), నరకంలో హరిశ్చంద్రుడు (నాటకం), నార్లవారి మాట (శతకం), కొత్తగడ్డ (నాటికల సంపుటి), సీత జోస్యం.
7. **గౌరన (15వ శతాబ్దం):**
   బిరుదు: చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి, ప్రతివాద గజ పంచాననుడు.
   పాఠ్యభాగం: హరిశ్చంద్రుడు
   ప్రక్రియ : ద్విపద కావ్యం
   రచనా విశేషాలు: నవనాథ చరిత్ర (ద్విపద కావ్యం), హరిశ్చంద్రోపాఖ్యానం (ద్విపద కావ్యం), లక్షణ దీపిక (సంస్కృత గ్రంథం).
8. **వట్టికోట ఆళ్వారుస్వామి (1915-61):**
   గొప్ప నవలాకారుడు
   పాఠ్యభాగం: చిన్నప్పుడే
   ప్రక్రియ : కథానిక
   ఇతివృత్తం: సామాజిక స్పృహ
   రచనా విశేషాలు: ప్రజల మనిషి (ప్రసిద్ధ నవల), గంగు (ప్రసిద్ధ నవల), జైలు లోపల (కథల సంపుటి).
9. **డా. సి. నారాయణ రెడ్డి (సినారె) (1931):**
   బిరుదు: పద్మభూషణ్
   పాఠ్యభాగం: జీవన భాష్యం
   ప్రక్రియ: గజల్
   ఇతివృత్తం: సామాజిక స్పృహ
   రచనా విశేషాలు: నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, మధ్యతరగతి మందహాసం , విశ్వంభర, ప్రపంచ పదులు, మట్టిమనిషి ఆకాశం, సినారె గజళ్లు, మంటలూ - మానవుడు, అక్షరాల గవాక్షాలు, రుతుచక్రం.
10. **డా. ఇరివెంటి కృష్ణమూర్తి (1930-89):**
    రచనా విశేషాలు: తెలుగు ఉత్తర భారత సాహిత్యాలు, చాటువులు, వాగ్భూషణమ్, వేగుచుక్కలు, వెలుగు బాటలు, అడుగు జాడలు, కవి సమయాలు (సిద్ధాంత గ్రంథం).
11. **అయ్యలరాజు రామభద్రుడు (16వ శతాబ్దం):**
    పాఠ్యభాగం: సముద్ర లంఘనం
    ప్రక్రియ: ప్రబంధం
    రచనా విశేషాలు: రామాభ్యుదయం (ప్రబంధం), సకలకథాసారా సంగ్రహం
12. **నండూరి రామమోహన్‌రావు (1927-2011):** పత్రికా సంపాదకులు.
    పాఠ్యభాగం: సంస్కరణ
    ప్రక్రియ: వార్తావ్యాఖ్య
    రచనా విశేషాలు: విశ్వరూపం, నరావతారం, విశ్వదర్శనం, పల్లవి - అనుపల్లవి, చిరంజీవులు, నండూరి రామమోహనరావు వ్యాఖ్యావళి, చిలక చెప్పిన రహస్యం, మయూర కన్య, హరివిల్లు (పిల్లల గేయాలు).
13. **ఎస్.టి. జ్ఞానానందకవి (1922-2011):**
    బిరుదు: పద్మశ్రీ
    పాఠ్యభాగం: సందేశం
    ఇతివృత్తం: జాతీయ సమైక్యత
    రచనా విశేషాలు: దీనబంధు శతకం, ఆమ్రపాలి, పాంచజన్యం, క్రీస్తు శతకం, నా జీవిత గాథ, కూలి నుంచి కళాప్రపూర్ణ వరకు.

వివిధ శతక కవులు - రచనా విశేషాలు:

- భర్తృహరి (7వ శతాబ్దం) - సుభాషిత త్రిశతి
- ధూర్జటి (16వ శతాబ్దం) - శ్రీకాళహస్తీశ్వర శతకం
- తాళ్లపాక పెద్ద తిరుమలయ్య (16వ శతాబ్దం) - వేంకటేశ్వర శతకం
- మారద వెంకయ్య (17వ శతాబ్దం) - భాస్కర శతకం
- కంచర్ల గోపన్న (17వ శతాబ్దం) - దాశరథీ శతకం
- నీలకంఠ దీక్షితులు (17వ శతాబ్దం) - సభారంజన శతకం (మూల కర్త)
- ఏనుగు లక్ష్మణ కవి (18వ శతాబ్దం) - సుభాషిత రత్నావళి
- ఏలూరిపాటి అనంతరామయ్య (20వ శతాబ్దం)-సభారంజన శతకం (అనువాదకర్త)

మాదిరి ప్రశ్నలు

1. గంగాపురం హనుమచ్ఛర్మ రాసిన దుందుభి ఒక ?
   1) ప్రేమ కావ్యం 2) నదీ కావ్యం
   3) వచన కావ్యం 4) అనువాద కావ్యం
2. మహబూబ్‌నగర్ జిల్లా గంగాపురం ప్రాంతంలో ఏ నదిని 'దేవసేన' అని పిలుస్తారు?
   1) తుంగభద్ర 2) కృష్ణా
   3) మంజీర 4) దుందుభి
3. తెలుగు జానపద గేయ సాహిత్యం ఎవరి పరిశోధన గ్రంథం?
   1) బిరుదురాజు రామరాజు
   2) ఎస్.టి. జ్ఞానానంద కవి
   3) నాయని కృష్ణకుమారి
   4) ఇరివెంటి కృష్ణమూర్తి
4. బిరుదురాజు రామరాజు స్వస్థలం?
   1) కల్వకుర్తి (మహబూబ్ నగర్)
   2) దేవనూరు (వరంగల్)
   3) కవుతవరం (కృష్ణా)
   4) నకిరేకల్ (నల్గొండ)
5. కింది వాటిలో బిరుదురాజు రామరాజు రచన కానిది?
   1) తెలుగు వీరుడు
   2) తెలుగు జానపద రామాయణం
   3) తెలుగు జానపద గేయగాథలు
   4) తెలంగాణ పల్లె పాటలు
6. అనువాద పద్ధతి, శైలిలో తర్వాత తరం కవులకు మార్గదర్శకుడు?
   1) నన్నయ 2) తిక్కన
   3) ఎర్రన 4) శ్రీనాథుడు
7. నన్నయ రాసిన 'అమ్మ కోసం' పాఠ్య భాగం ఏ ప్రక్రియ?
   1) పురాణం 2) ఇతిహాసం
   3) ప్రబంధం 4) పురాణేతిహాసం
8. కిందివాటిలో నన్నయ కవిత్వంలో ప్రధాన లక్షణం కానిది?
   1) అక్షర రమ్యత
   2) ప్రసన్న కథా కలితార్థయుక్తి
   3) సూక్తి వైచిత్రి
   4) నానారుచిరార్థసూక్తి నిధిత్వం
9. సభారంజన శతకం- మూలకర్త?
   1) భర్తృహరి
   2) కొండూరు వీరరాఘవాచార్యులు
   3) ఏలూరిపాటి అనంతరామయ్య
   4) నీలకంఠ దీక్షితులు
10. కొండూరు వీరరాఘవాచార్యులు రాసిన శతకం?
    1) మిత్రసాహస్రి
    2) సభారంజన శతకం
    3) మిత్రార్థ శతకం 4) వేంకటేశ శతకం
11. నీతి, భక్తి, వైరాగ్యాలను ప్రధానంగా బోధించే రచనలు?
    1) పురాణాలు 2) ఇతిహాసాలు
    3) శతకాలు 4) ఖండకావ్యాలు
12. శ్రీశ్రీ 18వ ఏట వెలువరించిన 'ప్రభవ' ఒక?
    1) అభ్యుదయ కవితా సంపుటి
    2) వచన కవితా సంపుటి
    3) విప్లవ కవితా సంపుటి
    4) భావ కవితా సంపుటి
13. చరమరాత్రి కథల ద్వారా చైతన్య స్రవంతి పద్ధతిని తెలుగు రచనలలో ప్రవేశ పెట్టిన వారు?
    1) సి. నారాయణ రెడ్డి(సినారె)
    2) శ్రీశ్రీ
    3) నార్ల వేంకటేశ్వరరావు
    4) త్రిపురనేని గోపీచంద్
14. కృష్ణాజిల్లా కవుతవరంలో జన్మించిన నార్ల వేంకటేశ్వరరావు ఒక గొప్ప?
    1) పత్రికా సంపాదకుడు
    2) కవి, విమర్శకుడు
    3) నాటక కర్త 4) పైవన్నీ
15. రష్యన్ కథలను తెలుగువారికి అందించిన రచయిత?
    1) సి. నారాయణ రెడ్డి(సినారె)
    2) సామల సదాశివ
    3) నార్ల వేంకటేశ్వర రావు
    4) నండూరి రామమోహనరావు
16. 'చతుర సాహిత్య లక్షణ చక్రవర్తి' అని ఎవరికి బిరుదు?
    1) గౌరన
    2) అయ్యలరాజు రామభద్రుడు
    3) కొరవి గోపరాజు
    4) శ్రీకృష్ణదేవరాయలు

సమాధానాలు

1) 2; 2) 4; 3) 1; 4) 2; 5) 3; 6) 1; 7) 2; 8) 3; 9) 4; 10) 1; 11) 3; 12) 4; 13) 2; 14) 4; 15) 3; 16) 1.

విద్య, ఉద్యోగ సమాచారం

డీఎస్‌హెచ్ కడప జిల్లాలో వివిధ ఉద్యోగాలు

కడప జిల్లాలోని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్(డీఎస్‌హెచ్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 09.
- **పోస్టుల వివరాలు:** బయో స్టాటిస్టియన్-01, రేడియోగ్రాఫర్-01, ల్యాబ్ టెక్నీషియన్-02, ల్యాబ్ అటెండెంట్-02, జీడీఏ/ఎమ్ఎన్‌వో/ఎఫ్ఎన్‌వో-03.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఏ, బీఎస్సీ, పదో తరగతి, డీఎంఎల్‌టీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 42 ఏళ్లు నిండి ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులక ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు బయో స్టాటిస్టియన్ పోస్టుకు రూ.18,500, రేడియోగ్రాఫర్ పోస్టుకు రూ.35,570, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు రూ.32,670, మిగతా పోస్టులకు 15,000.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఆఫీస్ ఆఫ్ ది డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీస్, డీఎస్‌హెచ్, కడప, ఓ బ్లాక్, న్యూ కలెక్టరేట్, కడప, వైఎస్సార్ జిల్లా చిరునామకు పంపించాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**16.04.2025
- **వెబ్‌సైట్:** https://kadapa.ap.gov.in

ఎన్‌సీఈఎస్ఎస్, తిరువనంతపురంలో 16 పోస్టులు

తిరువనంతపురం(కేరళ)లోని నేషనల్ సెంటర్ ఫర్ ఎర్త్ సైన్స్ స్టడీస్ (ఎన్‌సీఈఎస్ఎస్).. ప్రాజెక్ట్ సైంటిస్ట్, ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 16.
- **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ సైంటిస్ట్1-14, ప్రాజెక్ట్ అసోసియేట్2-02.
- **అర్హత:** మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. పని అనుభవం కూడా ఉండాలి.
- **వయసు:** 35 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** ప్రాజెక్ట్ సైంటిస్ట్1 పోస్టుకు రూ.56,000, ప్రాజెక్ట్ అసోసియేట్2 పోస్టుకు రూ.35,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.05.2025.
- **వెబ్‌సైట్:** www.ncess.gov.in

‘తెలుగు సాహిత్య చరిత్ర’ గ్రంథ రచయిత?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

తెలంగాణ వైతాళికులు

దేవులపల్లి రామానుజరావు



ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేంద్ర ప్రభుత్వం ఉస్మానియా విశ్వవిద్యాలయంపై దృష్టి సారించింది. ఓయూలో బోధనా భాష ఉర్దూ కావడం, అక్కడి పారిభాషిక పద రచనా శాఖ అద్వితీయంగా ఉండటంతో ఉస్మానియా వర్సిటీపై కేంద్రం దృష్టి పెట్టింది. పార్శీ లిపిని దేవనాగరి లిపిగా మార్చి, ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని హిందీ విశ్వవిద్యాలయంగా మార్చడానికి పూనుకుంది. ఈ పరిణామంతో తెలుగు నాట, ముఖ్యంగా తెలంగాణలో ఆందోళన చెలరేగింది. భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడితే మాతృ భాషయిన తెలుగు అభివృద్ధి చెందుతుందని ఇక్కడి ప్రజలు ఆశిస్తే, ఉన్న సంస్థే చేజారిపోయే పరిస్థితి తలెత్తింది. దీంతో హైదరాబాద్‌లోని ప్రముఖ పౌరులు ప్రతిఘటన సంఘం(సిటిజన్స్ కమిటీ) ఏర్పాటు చేశారు. ఈ సంఘానికి దేవులపల్లి రామానుజరావు నాయకత్వం వహించారు. ఆయన అంతకు ఆరేళ్ల ముందు నుంచే హైదరాబాద్ సారస్వత పరిషత్తు కార్యభారం వహించారు. తెలంగాణాలో మారుమూల పల్లెలను సైతం సందర్శించి సారస్వతోద్యమాన్ని వ్యాపింపజేశారు. హైదరాబాద్‌లో ఆంధ్ర సారస్వత పరిషత్తు శాశ్వత భవనాన్ని నిర్మించారు.

దేవులపల్లి రామానుజరావు 1917 ఆగస్టు 24న వరంగల్‌లోని సంపన్న కుటుంబంలో జన్మించారు. మెట్రిక్యులేషన్ వరకూ హనుమకొండలో చదివారు. తర్వాత హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో బి.ఎ. చదివి 1939లో పట్టా పొందారు. తర్వాత రెండేళ్లపాటు గ్రంథాలయోద్యమంలో, మరో రెండేళ్లపాటు యువజన కాంగ్రెస్‌లో పాల్గొన్నారు. దేవులపల్లి నాగపూర్‌లో ఎల్.ఎల్.బి. చదివి, న్యాయవాద వృత్తిలో చేరారు.

నాటి హైదరాబాద్ రాజకీయ వాతావరణం భయానకంగా ఉంది. హైదరాబాద్ స్వాతంత్ర్యం (ఆజాద్) నినాదాలు మిన్నంటాయి. వాటికి తోడు రజాకార్ల దురాగతాలను కళ్లారా చూసిన దేవులపల్లి చలించిపోయారు. ఈ దురాగతాలను ఎదుర్కోవాలని నిర్ణయించుకున్నారు. తాను నడుపుతున్న ‘శోభ’ సారస్వత మాస పత్రిక ద్వారా తన భావాలను ప్రకటించారు. అప్పటికే గోలకొండ పత్రిక దినపత్రికగా మారింది. దేవులపల్లి 1947 నుంచి నాలుగేళ్లపాటు దానికి సంపాదకుడిగా పని చేశారు. 1952–53లో ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్ష, ఉపాధ్యక్ష బాధ్యతలను నిర్వహించారు. నరోత్తమరెడ్డి, పులిజాల హనుమంతరావు, గడియారం రామకృష్ణశర్మ దేవులపల్లికి అనేక విధాలుగా సహాయ సహకారాలు అందించారు.

- నవ్యకవితా నీరాజనం, సారస్వత నవనీతం, వ్యాసమంజూష లాంటి సాహిత్య విమర్శ గ్రంథాలను; మనదేశం, ఆదిమవాసులు, తెనుగు దేశం, జవహర్‌లాల్ నెహ్రూ, గౌతమ బుద్ధుడు లాంటి బాలసారస్వతం; పచ్చతోరణం లాంటి పద్యకావ్యాలు; తెలుగు సీమలో సాంస్కృతిక పునరుజ్జీవనం లాంటి గ్రంథాలను దేవులపల్లి రామానుజరావు రచించారు.
- అయ్యదేవర కాళేశ్వరరావుతో కలిసి విశాలాంధ్ర నిర్మాణోద్యమాన్ని నడిపారు.
- హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమం, విశాలాంధ్ర రాష్ట్రం అనే గ్రంథాలను రచించారు. విశాలాంధ్ర వచ్చింది అనే పుస్తకం రాశారు.
- కొంతకాలం ఉస్మానియా విశ్వవిద్యాలయ సెనెట్‌లో, రాష్ట్ర ప్రభుత్వ విద్యాసలహా సంఘంలో, కేంద్ర పాఠ్యపుస్తక సంఘంలో, ఆలిండియా రేడియో సలహా సంఘంలో సభ్యులుగా పనిచేశారు. ఠాగూర్ శతవార్షిక జయంతి సంఘం కార్యదర్శిగా ఉన్నారు. ‘గురజాడ అప్పారావు శతవార్షిక జయంతి’ సంపుటికి సంపాదకులుగా పనిచేశారు.
- ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి కార్యదర్శిగా పనిచేశారు.
- కేంద్ర సాహిత్య అకాడమి కౌన్సిల్ సభ్యులుగా, సాహిత్య ప్రతినిధిగా, రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు.
- ఉర్దూలో ‘తెలుగు సాహిత్య చరిత్ర’ను ప్రచురించారు.
- గాలిబ్, మౌలానా షిబ్లీ, హాలీ లాంటి జాతీయోద్యమ ప్రముఖుల రచనలను తెలుగులో ప్రచురించారు.
- సృజనాత్మకశక్తి, దాన్ని మించిన దీక్షా దక్షత ఉన్న దేవులపల్లి రామానుజరావు తెలుగు సాహిత్యం, తెలుగువారి గొప్పదనాన్ని ఇతర భాషల వారికి ఒరవడి అయ్యేలా సారస్వత అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మహనీయుడు.

మఖ్దూం మొహియుద్దీన్

నిజాం నిరంకుశ పాలనలో, భూస్వాముల ఆగడాల్లో నలిగిపోతున్న తెలంగాణను జాగృతం చేసేందుకు, నవ తెలంగాణ నిర్మాణం కోసం కృషి చేసిన ప్రజానాయకుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి కామ్రేడ్ మఖ్దూం మొహియుద్దీన్. ఆయన 1908 ఫిబ్రవరి 4న మెదక్ జిల్లా ఆంథోల్‌లో జన్మించారు. వీరి పూర్వీకులు ఉత్తరప్రదేశ్‌లోని ‘అజంగఢ్’కు చెందినవారు. ఔరంగజేబు దక్కన్ దండయాత్ర సమయంలో మఖ్దూం పూర్వీకులు ఇక్కడికి వచ్చి మెదక్ జిల్లాలో స్థిరపడ్డారు.

విద్యాభ్యాసం

మఖ్దూం ఆంథోల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం, సంగారెడ్డిలో హైస్కూల్ విద్య పూర్తి చేశారు. ఆయన చదువంతా ఉర్దూ, పార్శీ భాషల్లోనే సాగింది. పార్శీలోని ‘గులిస్తాన్’ ‘బోస్తాన్’ గ్రంథాలను చదివారు. హైదరాబాద్‌లో ఇంటర్ వరకు చదివారు.

బాల్యం నుంచి ఆయన ఎన్నో కష్టాలను అనుభవించారు. పేదరికాన్ని భరించలేక కుటుంబాన్ని విడిచి కొంతకాలం పత్రికలు అమ్మారు, పత్రికల్లో పనిచేశారు. కొంత కాలం ప్రముఖ సినీతారల చిత్రాలు అమ్మి జీవనం సాగించారు. రాత్రిపూట సుల్తాన్ బజారులోని మసీదుల్లో ఉండేవారు. మఖ్దూం ఎన్ని కష్టాలు పడినా, జీవితంలో ఎన్నడూ నిరాశ చెందలేదు. ‘జమాలుద్దీన్’ పేరుతో విద్యార్థి దశలోనే పిట్టకథలు రచించారు. 1933లో తొలిసారిగా పచ్చశాలువ (పీలీ దుశాల్) అనే కవితా ఖండికను వెలువరించారు.

మఖ్దూం 1937లో ఉర్దూ నాటకాల మీద పరిశోధక వ్యాసం రాసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎ. పట్టా పొందారు, సిటీ కళాశాలలో ఉర్దూ లెక్చరర్‌గా పనిచేశారు.

జాతీయోద్యమంలో ప్రవేశం

విద్యార్థి దశ నుంచి మఖ్దూంకి జాతీయ ఉద్యమాల పట్ల ఆసక్తి ఎక్కువ. ఆంధ్ర మహాసభల్లో పాల్గొన్నారు. రావి నారాయణరెడ్డి, రాజ్ బహద్దూర్ గౌర్, సర్వదేవభట్ల రామనాథం మొదలైన కమ్యూనిస్టు నాయకులు ఆయనపై ప్రభావం చూపారు. 1939లో నాగపూర్‌లో హైదరాబాద్ విద్యార్థి యూనియన్ ఏర్పాటైంది. 1940లో గౌర్, మఖ్దూం కమ్యూనిస్టు పార్టీలో చేరారు. నాగ్‌పూర్‌లో అఖిల భారత విద్యార్థి మహాసభలు జరిగాయి. ఈ సభలోనే విద్యార్థి ఫెడరేషన్ (కమ్యూనిస్టు పార్టీ విద్యార్థి అనుబంధ సంస్థ) ఏర్పడింది. ఈ సభలకు మఖ్దూం హాజరయ్యారు. దీంతో ఆయనకు కార్మిక సంఘాలతో సంబంధాలు ఏర్పడ్డాయి. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాల ప్రాతిపదికపై హైదరాబాద్ సంస్థానంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని నిర్మించారు. నిజాం ఫ్యూడల్ విధానంలో గ్రామాల్లో జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు అత్యాచారాలు, అన్యాయాలు, దౌర్జన్యాలకు పాల్పడేవారు. తెలంగాణ గ్రామాల్లో బేగారి, వెట్టిచాకిరీ ఉండేది. మఖ్దూం గ్రామాల్లో పర్యటించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. నిజాం నవాబు విధి విధానాలను ఆయన నిశితంగా విమర్శించేవారు. బహిరంగ సభల్లో బ్రిటిష్ ప్రభుత్వాన్ని విమర్శించడంతో నిజాం నవాబు ఆయన్ను మూడు నెలలపాటు జైల్లో నిర్బంధించాడు. మఖ్దూంతో పాటు స్వామి రామానందతీర్థ, అచ్యుతాభాయి దేశ్‌పాండే, ఆర్.ఎస్.దివాన్, బిర్దీచంద్ చౌదరి తదితర నాయకులను నిర్బంధించారు.

- 1944–46 మధ్యకాలంలో హైదరాబాద్ సంస్థానంలో అనేక కార్మిక సంఘాలు స్థాపించారు. రైల్వే, విద్యుచ్ఛక్తి, పబ్లిక్ వర్క్స్, చేనేత, సిమెంట్ కార్మికుల సంఘాలకు అధ్యక్షుడిగా మఖ్దూం మొహియుద్దీన్ సేవలందించారు. బెల్లంపల్లి, కొత్తగూడెంలోని బొగ్గు గనుల కార్మికులను సంఘటితం చేశారు. వరంగల్ అజంజాహి మిల్లు కార్మికుల యూనియన్ స్థాపనకు విశేషంగా కృషి చేశారు. ఆయనతో పాటు రాజ్ బహద్దూర్ గౌర్, సర్వదేవభట్ల రామనాథం కమ్యూనిస్టు ట్రేడ్ ఉద్యమానికి తమ జీవితాలను ధారపోశారు.
- 1946లో హైదరాబాద్‌లో అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏర్పాటైంది. ఎస్.ఎం. జోషి భారత కమ్యూనిస్టు ట్రేడ్ యూనియన్‌ను ప్రారంభించారు.
- 1952లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ ‘పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్’ను నెలకొల్పింది.

సాహిత్య సేవ

- మఖ్దూం మహాకవి, రచయిత, సాహితీవేత్త, మానవతావాది. ఇంగ్లిష్, ఉర్దూ, పార్శీ, హిందీ భాషల్లో నిష్ణాతుడు, అనర్గళ వక్త. కళ కళ కోసమే కాదు ‘కళ’ మానవ కల్యాణానికి, అభ్యుదయానికి ఉపయోగపడాలని గట్టిగా విశ్వసించారు.
- ‘గులేతర్’ పేరుతో ఆయన రాసిన గేయాలన్నీ ప్రచురితమయ్యాయి.
- 1958లో ‘చాంద్ తారూంకాబన్’ అనే కవితా సంపుటిని ప్రచురించారు.
- అజాదెవతన్ (మాతృదేశ స్వాతంత్ర్యం) అనే గేయంలో భారతదేశ సౌభాగ్యం గురించి రాశారు.
- ‘హవేలీ’ కవితలో మూఢ విశ్వాసాలు, మూఢాచారాలు దేశాన్ని ఎలా నాశనం చేస్తున్నాయో తెలిపారు.
- ‘మృత్యుగీతం’ (మోత్-కా-గీత్) అనే కవితలో సమాజంలోని వికృత దౌర్జన్యాలను నాశనం చేయాలని ప్రబోధించారు.
- మఖ్దూం రాసిన ‘తెలంగన్’ ఎంతో ప్రసిద్ధి చెందింది.
- సిపాయి, అంధేరా(చీకటి), రాత్ కె బారాబజే, మార్టిన్ లూథర్ కింగ్, అప్నా షెహర్, ములాఖత్-కా-ములాఖత్, ఏక్ చమేలీకే మండ్వే తలే లాంటి అనేక కావ్య ఖండికలు, గేయాలను మఖ్దూం మొహియుద్దీన్ రచించారు.
- ఆయన మొదటి కవితా సంపుటి ‘సురఖ్ సవేరా’ 1944లో అచ్చయింది.
- 1966లో ‘బసాతెరక్స్’ అనే కవితా సంకలనాన్ని మఖ్దూం సన్మాన సంఘం ప్రచురించింది.
- శ్రమజీవులు, పీడిత వర్గాలు, సామాన్య ప్రజల ఉద్ధరణ కోసం జీవితాన్ని అర్పించిన మఖ్దూం మొహియుద్దీన్ 1969 ఆగస్టు 25న ఢిల్లీలో మరణించారు.

మాదిరి ప్రశ్నలు

1. ‘శోభ’ అనే సారస్వత మాసపత్రికను నడిపింది ఎవరు?
   ఎ) ముట్నూరి కృష్ణారావు
   బి) దేవులపల్లి రామానుజరావు
   సి) సురవరం ప్రతాపరెడ్డి
   డి) మందుముల నరసింగరావు
2. 1952–53లో హైదరాబాద్‌లోని ‘ఆంధ్ర సారస్వత పరిషత్తు’కు అధ్యక్షుడిగా పని చేసింది ఎవరు?
   ఎ) పులిజాల హనుమంతరావు
   బి) నరోత్తమ రెడ్డి
   సి) గడియారం రామకృష్ణ శర్మ
   డి) దేవులపల్లి రామానుజరావు
3. ఉర్దూ భాషలో ‘తెలుగు సాహిత్య చరిత్ర’ అనే గ్రంథాన్ని రచించింది?
   ఎ) దేవులపల్లి రామానుజరావు
   బి) మౌలానా షిబ్లీ సి) గాలిబ్
   డి) అయ్యదేవర కాళేశ్వరావు
4. 1939లో హైదరాబాద్ విద్యార్థి యూనియన్‌ను ఎక్కడ స్థాపించారు?
   ఎ) బొంబాయి బి) హైదరాబాద్
   సి) నాగపూర్ డి) నల్గొండ
5. హైదరాబాద్ రాజ్యంలో అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏర్పాటైన సంవత్సరం?
   ఎ) 1938 బి) 1946
   సి) 1952 డి) 1928
6. ‘ఏక్ చమేలీకే మండ్వే తలే’ అనే ప్రసిద్ధ గేయ రచయిత?
   ఎ) గాలిబ్
   బి) మఖ్దూం మొహియుద్దీన్
   సి) దాశరథి రంగాచార్య
   డి) గుల్జార్
7. బహుళ ప్రచారం పొందిన ‘తెలంగన్’ కావ్యఖండిక రచయిత ఎవరు?
   ఎ) మాడపాటి హనుమంతరావు
   బి) వట్టికోట ఆళ్వార్ స్వామి
   సి) మఖ్దూం మొహియుద్దీన్
   డి) గాలిబ్

సమాధానాలు

1) బి; 2) డి; 3) ఎ; 4) సి; 5) బి; 6) బి; 7) సి.

Clients are judging you by your?



Bank Exams

GENERAL ENGLISH

Directions (Q. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Each time Hemanth turns on his computer, he has (1)/ to wait for it to load, enter the special code, and then enters a password (2)/ to get into his workspace before (3) / he can begin working (4)/ No Error (5)

2. Because there is (1)/ two sets of cutlery, a couple napkins, and plates on each table, students do not have (2) / to set(3) / their own place settings. (4) / No Error (5)

3. The decision that has just been (1) / agreed with (2) / by the board members should serve as a basis for their (3) / other accomplishments in the years to come. (4)/ No Error(5)

4. People who dislike cats sometimes (1) /criticize them for being (2) /savvy and independent; whereas those who are fond of (3) / cats often admire them for the same qualities. (4) / No Error(5)

5. Even with (1) / a calculator, you must have a basic understanding of (2) / mathematics if one expects (3)/ to do decently on the Math section. (4) / No Error(5)

Directions: (Q. 6 -10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase under lined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. Godavari rises in a magnificent way above its tributaries during rainy season.
1) rises a magnificent way above
2) rises in a magnificent way, way above
3) rises magnificently above
4) rises magnificently way above
5) No correction required

7. During colonial days, a school room looked rather empty.
1) colonial days, a school room looks
2) colonial days, a schoolroom looked
3) colonial days; a schoolroom looked
4) colonial days; a school room looked
5) No correction required

8. The helium-filled balloon rose in the air.
1) rose on the air.
2) was rising in the air.
3) was in the air.
4) rose into the air.
5) No correction required

9. If I had the address, I would have delivered the package myself.
1) had address,
2) had seen the address
3) had had the address
4) had their address
5) No correction required

10. Vasantha claims that cats made the best pets.
1) will make the best pets
2) could be the best pets
3) are the best pets
4) make the best pets
5) No correction required

Directions (Q. 11-15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Tsunamis generally consist of a series of waves with periods ranging from minutes to hours, arriving in a so-called "wave train".
B) Wave heights of tens of meters can be generated by large events.
C) Rather than appearing as a breaking wave, a tsunami may instead initially resemble a rapidly rising tide, and for this reason they are often referred to as tidal waves.
D) A Tsunami is a series of waves in a water body caused by the displacement of a large volume of water, generally in an ocean or a large lake.
E) Although the impact of tsunamis is limited to coastal areas, their destructive power can be enormous and they can affect entire ocean basins.
F) Tsunami waves do not resemble normal sea waves, because their wavelength is far longer.

11. What is the LAST sentence after rearrangement?
1) C 2) B 3) D 4) E 5) F

12. What is the FIFTH sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) C

13. What is the THIRD sentence after rearrangement?
1) A 2) C 3) B 4) E 5) F

14. What is the FIRST sentence after rearrangement?
1) B 2) C 3) D 4) E 5) F

15. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. 16 - 20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. Japan's abundant rainfall and the ___ mild temperature throughout most of the country have produced a _____vegetation cover.
1) Typically, lush
2) Prominence, dry
3) Importantly, scarce
4) Average, green
5) General, prominent

17. Nobody knows ____ how many languages there are in the world, partly because of the difficulty in distinguishing between a language and the sub-languages or dialects ____ it.
1) Exclusively, from
2) Extend, among
3) Exactly, within
4) Extensively, Between
5) Precisely, with

18. The ______ of natural gas from Norway's Troil gas ________ is expected to increase annually.
1) Yield, field
2) Production, depot
3) Manufacture, ground
4) Assemble, bunk
5) Making, drivel

19. The results of the company's cost-cutting ______ are evident in its profits.
1) Events 2) Action
3) Dealings 4) Procedure
5) Measures

20. With cloning technology, scientists _______ what has long been the ultimate _____ of modern husbandry.
1) are approaching, goal
2) were approaching, aim
3) had approached, target
4) is approaching, mark
5) was approaching, set

Directions (Q. 21 - 30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Businesses spend a lot of time and money on choosing just the ___ (21) name for their enterprise. But, all too often choosing the right domain name is left for the end of the business naming process instead of at the _____ (22) where it belongs. Your future customers have to be able to ______ (23) you on the web. Your domain name may be sending the wrong message and ______ (24) you business. When people are given a website and then told it's .net or .biz, the first thing they think is, "Oh, somebody else got the .com, huh?" Some will even purposefully go and see what company secured .com, maybe they are the one that they should really be dealing with.

Even more damaging is the fact that .com is everyone's ____ (25) when typing. You may know someone's site ends in .net, but by default you probably often start to type .com. People are busy. Everyone is multitasking and managing a staggering amount of information. The ____ (26) you make someone work to find you the more likely they won't put in the effort.

While there are only so many .com addresses available, it is unlikely that anything else will ever take the place of .com as the default website ending for _____ (27) users.

In an effort to get a website ending in .com some business owners get cute and make up their own word. Sometimes service providers have reasonably used their own name as their website URL, but their name is tough for most people to spell.

The problem with both scenarios is that once someone has to ask how to spell your domain name they have already convinced themselves it is too hard to remember. If someone has to write down your domain name you are one lost piece of paper away from losing him or her as a ___ (28) forever.

People are not willing to put too much effort into finding your site. There are just ______ (29) many options on the web to be bothered by difficult to spell websites. Don't get too cute when thinking up a company name or domain name. Make it easy. If you want to use your own name, but your name is tough to spell, get a simple domain that will point to your other site. For example if your name is Christopher Zvynski, get another domain called askchris.com that will redirect customers to your site.

One company that has built its entire business around a premium domain name that's the obvious choice for its category is Hotels.com. One of their recent marketing campaigns even featured the tagline, "Hotels.com, the obvious choice". While the space is fiercely competitive, Hotels.com will likely always be an industry leader because it's name coincides perfectly with what people are likely to search for or enter into their browsers. How much value does this kind of premium domain name generate?

Beyond being easy to find, domain names like Cars.com or Hotels.com send a message to customers that this company understands the web and that they have been around a while. How else would they have gotten such a perfect name? Typical consumers are not thinking that the domain name was probably purchased as a business cost.

Customers and clients are judging you by your ______ (30). It may have nothing to do with your quality and abilities, but it is the way of the marketplace. Make it easy for people to find you and you will always have eager customers.

21. 1) exactly 2) right 3) precise 4) correctly 5) truth
22. 1) beginning 2) start 3) proceeding 4) preceding 5) recede
23. 1) identical 2) find 3) come 4) hit 5) draw
24. 1) costing 2) estimate 3) find 4) figure 5) quotation
25. 1) evasion 2) avoidance 3) dodging 4) default 5) internet
26. 1) hardly 2) hard 3) hardest 4) too hard 5) harder
27. 1) any 2) some 3) most 4) much 5) little
28. 1) friend 2) relative 3) foe 4) customer 5) neighbor
29. 1) few 2) many 3) much 4) little 5) too
30. 1) knowledge 2) expertise 3) skills 4) service 5) domain

Key:

1) 2	2) 1	3) 2	4) 5
5) 3	6) 3	7) 2	8) 4
9) 4	10) 4	11) 4	12) 2
13) 2	14) 3	15) 1	16) 1
17) 3	18) 1	19) 5	20) 1
21) 2	22) 1	23) 2	24) 1
25) 4	26) 5	27) 3	28) 4
29) 5	30) 5.		